భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జూలై 1960

సంపుటము 37 : : సంచిక 7

విడిపత్రిక వెల ఒక రూపాయి

భారతి ముప్పదియేడవ సంపుటము

అకారాది విషయసూచిక

ప్రథమ కర్తవ్యం



ఏమీ చెయ్యకుండా కూర్చుంటే భవిష్యత్తు ఎలాగ వుంటుందో ఎవ్వరికీ తెలియదు. అందువల్ల ప్రతివారు తమతమ కుటుంబాల భావి భద్రతకు ఆర్థిక రక్షణ కలిగించుకోవాలి. ఈ విషయంలో పనివారి మార్గం సుగమం చేయుటలో ప్రతి యజమాని సులభంగా వారికి సహాయము చేయగలడు. జీవిత భీమా ద్వారా వారు పొదుపు చేయుటలో వారికి సహాయపడి వారి ఆశయాలను సఫలీకృతం చేయవచ్చు.

తమ తమ కుటుంబాలకు జీవిత భీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించుకొనుటతోను, తమకు ఉద్యోగ విరమణ అనంతరం తగు ఆదాయం వచ్చుటకు చేసుకొనుటలోను మీ పనివారలకు సులభముగా నుండునట్లు ఎల్. ఐ. సి. సూక్ష్మమైన ఒక పథకమును తయారుచేసింది. అదే—వేతనాల పొదుపు పథకము.

మీ సిబ్బంది తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకొనుటలో సహాయపడుటకు ఉపకరించుటద్వారా యజమానికి పనివారలకు మధ్య సన్నిహిత సంబంధము ఏర్పడుటకు ఈ పథకము తోడ్పడును.

ఈ పథకము వివరముల కొరకు అడగండి. మనస్ఫూర్తిగా ఉత్సాహముతో పనిచేసే సిబ్బందిని సమకూర్చుటలో ఈ పథకము మీకు తోడ్పడుతుంది.

ఒక్క విషయం—

జీవిత భీమాకు ప్రతిగా మరొకటి లేదు

ఎల్.ఐ.సి. వేతనాల పొదుపు పథకము

లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

EP/LIC/SZ/12

విషయానుక్రమణిక

జూలై 1960

ఆగస్టు నెల సంచికలో

వార్తలు

మహారాష్ట్రంలో అజంతావంటి మరికొన్ని కొత్తగుహలు

భారతప్రభుత్వం పురాతత్వశాఖవారు అజంతావంటి శిల్పచిత్రాలున్న మరికొన్ని కొత్తగుహలు ఔరంగాబాదుకు 42 మైళ్ళలోవున్న పీతల్‌ఖోఢ అనేచోట కనుగొన్నారు. ఈ గుహలుకూడా అజంతా ఎల్లోరాగుహలకాలంనాటివట. అపూర్వమైన శిల్పాలు, కుడ్యచిత్రాలు ఉన్నవట. యాత్రికులు వీటిని సులభంగా దర్శించడానికి వీలుంగా మహారాష్ట్రప్రభుత్వం త్వరలో మంచిరోడ్లువేసి ప్రయాణసౌకర్యాలు కలిగించనున్నదని మహారాష్ట్రప్రభుత్వం యాత్రా, ప్రజారోగ్యశాఖామంత్రి శ్రీ తలయార్‌ఖాన్ తెలియజేశాడు.

కృష్ణా గోదావరీజలాల వినియోగం

మరొక ఇరవై సంవత్సరాలవరకు కృష్ణాగోదావరీ నదీజలాలను ఇతర రాష్ట్రాలకు తరలించేప్రసక్తే లేదని ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్యగారు శాసనసభలో స్పష్టపరిచారు. రాష్ట్ర మంత్రివర్గం ఇటీవలనే ఈ సమస్యను చర్చించి, రాష్ట్రం అవసరాలు తీరేవరకు నదీజలాలను ఇతరరాష్ట్రాలకు తరలించరాదని తీర్మానించిందనికూడా ఆయన తెలిపారు.

వంశధార రిజర్వాయరు: ఒరిస్సా సమ్మతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించదలచిన వంశధార ప్రాజెక్టును గొట్టవద్ద నిర్మించడానికి ఒరిస్సా ప్రభుత్వం అంగీకరించింది. ఈ సమ్మతిమేరకు సింగిడికి నాలుగుమైళ్ళ దూరంలోని నీరడివద్ద వంశధారపై బరాజ్, గొట్టవద్ద రిజర్వాయరు నెలకొల్పబడుతాయి. ఈ రిజర్వాయరుకింద ఆంధ్రప్రదేశ్‌లో 25 వేల యకరాలభూమి, ఒరిస్సాలో 350 యకరాలభూమి మునిగిపోతుంది. దీనికి ప్రభుత్వాలు పరిహారమిస్తాయి. ఈ రిజర్వాయరు నిర్మాణానికి దాదాపు 10 కోట్ల రూపాయలు వ్యయంకాగలదని అంచనా వేయబడింది. దీనివల్ల శ్రీకాకుళంజిల్లాలో మూడులక్షల యకరాలభూమి సాగవుతుంది.

రాష్ట్రపతి రష్యా పర్యటన

భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ పక్షం రోజులపాటు సోవియట్ యూనియన్‌లో పర్యటించడానికి సంకల్పించి జూన్ 20 వ తేదీన విమానంలో మాస్కోకు బయలుదేరారు. ఆయనవెంట రైల్వేశాఖా మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రాం, విదేశాంగ కార్యదర్శి శ్రీ ఎన్. దత్ కూడా వెళ్ళారు. మాస్కో విమానాశ్రయంలో, దారిలో ఆయన విమానం కొంతసేపు ఆగినప్పుడు తాష్కెంట్‌లోను, తర్వాత లెనిన్‌గ్రాడ్‌లోను ఆయనకు ఘన స్వాగత మివ్వబడింది. రాష్ట్రపతి లెనిన్‌గ్రాడ్‌కు వెళ్ళి అక్కడి ప్రాచ్యభాషా పరిశోధనాలయం చూచారు. అక్కడ ఆయనకు ప్రొఫెసర్ వ్లాడిమర్ కల్యనోవ్. సంస్కృతభాషలో సన్మానపత్రం సమర్పించాడు. 18 వ శతాబ్దం నుంచే రష్యాలో సంస్కృత భాషాధ్యయనంపట్ల ఆసక్తి కలిగిందని ఆయన అన్నాడు.

తృతీయ ప్రణాళిక

కేంద్ర మంత్రివర్గం తృతీయ ప్రణాళిక ముసాయిదాలో కొన్ని మార్పులు చేసింది. ఈ మార్పులవల్ల ప్రణాళిక మొత్తం ఖర్చు 11,250 కోట్లు అవుతుంది. దీనిలో ప్రభుత్వ రంగంలో 7,250 కోట్లు ఖర్చు కాగలదు. 10 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తిచేసే పద్ధతిలో కొత్త ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పడానికి 200 కోట్లు కేటాయించారు.

నాగ విద్రోహి ఫిజో

నాగజాతి ప్రాంతంలో తిరుగుబాటుజరిపి, పారిపోయిన నాగజాతి విద్రోహ నాయకుడు ఫిజో ఎల్‌సాల్వడార్ ప్రభుత్వం అనుమతి పత్రంపై జూన్ నెలలో లండన్ చేరాడు. ఇంతవరకు ఇతడు అజ్ఞాతవాసంలో ఉన్నాడు. ఇతడు ఎలా లండన్ చేరిందీ తెలియదు. ఇతడు అనారోగ్యంగా ఉన్నాడని, భారత ప్రభుత్వం కరుణించాలని బ్రిటిష్ క్వేకర్ల (శాంతివాదుల) ప్రతినిధివర్గం ఇండియా హైకమిషనర్‌ను కోరింది. కాని భారత ప్రభుత్వం ఇతనిని తనకు అప్పగించాలని పట్టుదల చూపుతుందని తెలుస్తున్నది. ఇది ఇలా ఉండగా నాగజాతి ప్రజల స్థితిగతుల నిజానిజాలు తెలుసుకొనడానికి ఒక కమీషన్ వేయాలని ఫిజో లండన్‌నుంచి సూచన చేశాడు.

విశ్వనాథమధ్యాక్కరలు: వేములవాడ శతకం

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

రమేను కర్పూర మట్లుగా హరియించి పోయెనను
స్వామి నీకైన నీరాజనముగ వెచ్చనిపోగ తావి
యేమాదిరానో నేను కలితీలేని దేందుండె నగాకు
హేమాంగ వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

స్వామి! నాలో నన్ను నిన్నుగా జూచి సహించికొనెను
నోముతో చకయున్న విల్లి నతము కన్నులు కార్చికొంచు
నీ మేను బరువుగా బ్రదికి నన్ను రానీవె నీ కడకు
హిమాద్రు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

నీవు నాలోఁ బ్రవేశించుటకు నెంచనేవలెఁ గాని
ప్రోవ లెన్నున్నవి కనులలో నుండి భ్రూరేఖనుండి
రావచ్చు శ్వాసనిచ్ఛిద్ర మీ శరీరమ్ము నీ జాలి
యే వలె వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

శ్రీ గళా! నిను నేను మేన సెంటికో స్త్రీ పయోధరము
గాగ భావించునంత చెడిపోలేదు కైవల్యనాథ
కాఁగలవాఁడు నంత చెడిపోయినంగాని రాదాయె
నే గతి వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

డగ్గుత్తికయును గన్నీళ్లు చూచి నే డక్కిలి నీకు
నగ్గమ్ముగా నని యెంచెద రమాయికాత్మలు నాది
దుగ్గాని మనసు శోభనపుఁ బెండ్లికూతు విధాన గమిడి
కిగ్గెద వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

అయ్యయ్యో చెడిపె నా మన సడవి వాగైనను నయము
కయ్యాలు కోసెను నెంత సేపును కామమ్ము దెసకె
దయ్యమ్మదో దీనిఁ బట్టుకొన్నది తలఁగించు దీని
నెయ్యెడ వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

ముక్కుమూసికొనంగ మూఁడు గీతాలు ముక్కు మూసికొని
పెక్కండ్లు గడపితిఁగాని మీ జాలి పిసికంత రాదు
ఎక్కడి కెక్కడి మాట నీ జాలి యెచట నా ఖాలి
యెక్కడ వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

ఒకదాని కొక్కటి లంగగందక యున్నది స్వామి
యక్కృశశిజ్యోత్స్నయు నవకమ్మును నైన నీ వెల్గు
నను నెండించు నెండి నోటు తేరిన నాధిమణి కల
యిక కల్ల వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

నీ త్రోవ యిది యేమొ దగ్గరనుకొని నీ వెంటఁబడితి
రాత్రి కాఁ గొలవి దయ్యాలు కలవన్న రావడి యెఱుఁగ
నీ త్రిసూమామావేళ దాఁట నపుడు దవ్వింక జీవిత వ
హిత్రక వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

ఉన్నది యున్నదన్నంత మాత్రాన నోకతృప్తిలేక
కొన్నింటిఁ గలిపించుకొంచుఁ గలిపించుకొన్న వస్తువులు
మన్నిక లేక యతృప్తిచే స్రుక్కి మరల దొల్లిటిదె
యెన్నుచు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

చెప్పగారానంత ప్రేమయున్నది చేసెడిదేమి
అప్ప! ప్రాణాలీయవచ్చుఁ బట్టరానంతకుఁ బ్రాణ
మెప్పుడో తనదారిఁ దాను పోయెడిదేనాయె వ్యర్థ
మిప్పాటు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

కనుపించునది యెల్ల నిక్కవంబుగాఁ గనిపించనట్టు
లనిపించుచున్నది స్వామి నాథ నీదైనట్టి కరుణ
వినుపించునది యెల్ల వినుచునుంటిని వినిపించనట్టు
లెనిపించు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

మధ్యాక్క అలకును నీకు నాకు సంబంధంబు బలిసి
సుధ్యాక్క అలు నేను నేఁడు పనిమీద మానివేసినను
నీ ధ్యాన మేమయ్యె నేమి యయ్యెద నేను కృపణ మ
హీంధ్యేయ వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

అప్పు డచ్చోటికిఁ బోవలయున యాపైన నెచటకొ
అప్పటి కాపని చేయవలయున యామీఁద నెదియొ
యెప్పు డిదే గోల యయ్యె విడుదల యీ మహాబాధ
కెప్పుడు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

కడుఁబైన శిరసులోపల జటాజూట కాంతారవీథి
నడపి కాచిన వెన్నెలయ్యెఁ బ్రతిపద్యచ్ఛవి బ్రదుకు
అడుగున నడుగులయందుఁ బ్రతిపదోద్యద్భావ యయ్యె
మృడ నాకు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

కనులు మూసికొనంగ నేదో లీలగా గనిపించుచుండి
కనిపించుచున్నది యిదనియొక స్ఫూర్తి కలుగకయుండి
మనసులో నొక్క యానందరేఖ సంపాదించుచుండె
నినదృశా! వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

ఒకవిధమైనట్టిమన్ను భూమిలోనుండి వేలేంచు
లోకశిలయో లోహమో యగునటంచు రోయి నా దేహ
మొకవిధమైనట్టి మన్ను నీలోననుండి యిన్నేంచు
లిక యెప్డు వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

లేకరయ్యొ స్వామీ! సదా కోటిలింగ లలోన
మా బోడిలింగమ్ము చూచితే యన్నమాదిరిగాక
నా బోటివా రెంతమంది గరళకంఠ! తుడిచికోరు
మీ బడి వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

ఒక్కప్డు నీవు నాలోన రాత్రివై యుందువు కదల
వొక్కప్పుడు చైతన్యమెల్ల నీవయి యుందువు స్వామి
దక్కితిగాని నాడింతు నీ చిత్తము వచ్చినట్లు
చిక్కితి వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

త్రవ్విన కొలది నసారమున నన్ను పట్టు కొలది
తవిలిన కొలది నీ మూగ జ్యోతి స్ఫురన్మదాభముగ
అవ్వలి నేమున్న దంతవన్నెల మైనచో దవ్వ
నివ్వల వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి.

శ్రీ దామోదరం సంజీవయ్య జాతకము

శ్రీ రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు

అఖిలభారత కాంగ్రెస్‌కు అధ్యక్షుడుగా మహత్తర గౌరవ స్థానమునకు దేశ నాయకులచే ఎన్నుకోబడిన కారణమున శ్రీ నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదమును వదలుకొనుటయు, శ్రీ దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 11-1-1960 వ తేదిన సాయంకాలము 5-15 PM (IST) గంటలవేళ ప్రమాణ స్వీకారముచేసి నూతన మంత్రివర్గము నేర్పరచుటయు, పాఠక మహాశయుల కిపుడు పరిచిత విషయములు. రాజకీయరంగములలో అపుడపుడు జరుగు ఆశ్చర్యావహములగు సంఘటనములలో శ్రీ సంజీవయ్యగారి ముఖ్యమంత్రిత్వ స్వీకార మొక్కటి. సరి రాష్ట్రములలో ఆంధ్ర దేశమునకు ఐకమత్యపు కీర్తిని సంపాదించి ఇచ్చిన మహత్తర సన్నివేశమది. వయస్సున పిన్న అయినా, అధికార వ్యామోహ పరాఙ్ముఖుడయినా, పెద్దల ఆదేశము శిరోధార్యమని భావించి, గురుతరమగు రాష్ట్ర పాలన భారమును వహించుటకు నడుముకట్టి, సిద్ధపడిన శ్రీ డి. సంజీవయ్య అనుభవము, యోగ్యత, వినీతత్వము కల విద్యావంతుడు. ఇతని యాజమాన్యమున ఆంధ్ర ప్రదేశము ఇతోధికముగా వికాసమును, అభివృద్ధిని సంపాదించి, లక్ష్యమును సాధించగలదని ఆశింతము.

ఇట్టి అసాధారణ గౌరవప్రాప్తికి శ్రీ సంజీవయ్య జాతకములో ఏమి విశేషయోగము లున్నవో కనుగొను కుతూహలము జ్యోతిష విద్యార్థులకు కలుగుట సహజము. ఇతడు 1921 వ సంవత్సరమున, ఫిబ్రవరి నెలలో, 14 వ తేదిన, కర్నూలు మండలమందలి పెద్దపాడు గ్రామములో. (15°-48' ఉత్తరాక్షాంశ, 78°-6' పూర్వ రేఖాంశ) జనించిన వ్యక్తియని వార్తా పత్రికల పుణ్యాన కనుగొనగల్గితిమి. అనగా, గత రౌద్రి సంవత్సరమున, మాఘ శుక్ల సప్తమీ సోమవారమున, భరణీ నక్షత్రములో ఇతడు జనించెననుట! అది 'రథసప్తమి' అనబడు శ్రేష్ఠమగు దినమని చదువరులు గమనించియుందురు. మనదేశమందలి పుణ్యక్షేత్రములలో గొప్ప ఉత్సవములు, పూజలు జరుగు సుదిన మది.

కాని, ఇతడు జనించిన కాలమేమో, తెలియదు. బహుశః, జన్మకాలము గ్రంథస్థము చేయలేదు కాబోలు! జన్మదినము తెలిసినా, జన్మకాలము తెలియనిదే జాతక సామగ్రి సమగ్రము కాదు. అదే రథసప్తమి నాడే, మన భారతదేశమునందే, నూర్లకొలది వ్యక్తులు జనించి యుండగలరు. వారందరు జీవితములో సమానఫలము ననుభవించగలుగుట అసంభవము గదా? వైయక్తికముగా, యోగ్యతను, శక్తి సామర్థ్యములను తెలుపగలుగుటేకాక, సాటిగ్రహశక్తిని మంచికో, చెడ్డకో, ఉపయోగించుకొను శక్తిగలది లగ్న మొక్కటే. లగ్నమనగా మేషమో, వృషభమో, మరి యొక్కటో, రాశిఅని నిర్ణయించుట కాదు. స్థూలముగా చెప్పినచో, జన్మకాలమున ఉదయించుచున్న రాశి యందలి 1800 కలలలో ఏదో ఒక్క కల మాత్రమే. అదే స్పష్టలగ్నము. కాని, జన్మకాలము నికరముగా తెలియని సందర్భములలో, ఇట్టి లగ్నము సాధించుట కాని పని. కనుక, ఇట్టి జాతకములు విద్యార్థులకు గొప్ప చిక్కు.

లగ్నము లేకున్న నేమి? నక్షత్రము భరణి కనుక, నిరయన మేషరాశినే లగ్నముగా భావించి ఫలాదేశము చేయవచ్చు ననువా రున్నారు. అనేక సందర్భములలో అట్లే చేయుచున్నారు కూడ. చంద్రరాశి లగ్నము వంటిదే అను సామాన్య సూత్రమునుండి వచ్చిన సంప్రదాయ మిది. లగ్నము సాధించలేని, సాధించుటకు వీలులేని, పరిస్థితులలో "గతి లేనమ్మకు, గంజే పానకము." అను సామెత చొప్పున, ఈ చంద్రరాశి పద్ధతికి కొంత ఫలము లేక పోలేదు. కాని, దానితోనే తృప్తిపడి, లగ్నమును నిరాదరించుట శాస్త్ర సమ్మతము కాదని మనవి.

వ్యక్తి జీవితమందలి విశేషము లన్నియు అతని జన్మలగ్నముపైన, అప్పటి స్పష్టగ్రహములపైన, ఆధారపడుచున్నవనుట జాతక శాస్త్ర నియమము.

"జ్యోతిశ్శాస్త్రఫలం సర్వం
లగ్నాధీనం బుధై స్స్మృతం,

శ్రీ దామోదరం సంజీవయ్య జాతకము

స్ఫుటఖేటాశ్రయం తత్తు
తస్మాత్ ప్రాధాన్య మేతయోః."

అని పితామహవాక్యము. గర్గుడు, నారదుడు, కాశ్య పుడు, లగ్నమునకే ప్రాధాన్యము నిచ్చినారు.

"లగ్న మేవ ప్రశంసంతి
గర్గనారద కాశ్యపాః."

అని ప్రాచీనులు చెప్పిరి. లగ్నములేని జాతకము 'కర్ణుడులేని భారత సంహిత' వంటిదనుట. కనుక, శ్రీ సంజీవయ్య జాతకమునకు లగ్నమును నిర్ధరించుట అవసరము. అతని జీవితమందలి విశేషానుభవముల ఆధారమున అతని జన్మకాలము నిర్ధరించుట సాధ్య మగునేమో, పరిశీలింతము.

జన్మదినమున (14-2-1921) సాయంకాలము 5-30 PM (I. S T.) గంటల వేళ ఆకాశరంగ మందలి గ్రహస్థితి ఇట్లుండినది:

బు 13-21 వ 5-3	శు 0-59 కు 11-57	కే 0-39 చ 9-22	
ర 25-16	(సాయనము) — జన్మదినమున గ్రహస్థితి —		య 7-1 (వ)
			ఇ 12-1 (వ)
	రా 0-39		గు 16-18(వ) శ 23-22 (వ)

సూర్యోదయము మొదలుకొని రమారమి ప్రతి నాల్గు నిమిషముల కాలములో ఒక్కొకభాగ (డిగ్రీ) వంతున పూర్వదిశాహరిజములో ఎక్కివచ్చుచుండు భచక్రములో ఈవ్యక్తి జన్మకాలక్షణమున ఏరాశిలో, ఏభాగ, (మరి, అందులో ఏకాల) ఉదయమగు చుండునో, కనుగొనవలసియున్నది. ఈ సమస్యా పూర్తికి మన కాధారము వ్యక్తి జీవితమందలి అనుభవ విశేషములే. వానిలో అతిముఖ్యమయినవి రెండు :—

(i) 10-4-1952 వ తేదీన తొలిసారిగా, రాజాజీ మంత్రివర్గమున జాతకుడు మంత్రియగుట;

(ii) 11-1-1960 వ తేదీనాడు ఆంధ్రప్రదేశ రాష్ట్రమునకె జాతకుడు ముఖ్యమంత్రియై, పరిపాలన భారమును వహించుట.

ఎన్ని యోగము లుండినా ఎంత దశాసౌకర్యము అబ్బినా, దేవమాన దశాపద్ధతిలో చలితచంద్రునికి అను భవమునకు తగిన గ్రహదృష్టివలని ఉత్తేజనము లభిం చనిచో, ఉత్కృష్టఫలములు, సాధారణగా, కలుగ నేరవు.

"సవితా దశాఫలానాం
సూచయితా చంద్రమాః ప్రపోషయితా."

అని పెద్దలు చెప్పిరి. కనుక, పైన సూచించిన కాలములలో చలిత చంద్రుడు సంపాదింపగల గ్రహ దృష్టుల ఆధారమున జన్మకాలము స్థూలముగా ఎచటికి తేలగలదో, గమనించుట మొదటిపని.

ఈ ప్రయోగము అనుబంధము I లో చూపబడి నది. దీనిఫలముగా, జన్మకాలము 7-5, లేక 7-40, PM (IST) ప్రాంతములో నుండునని ఊహించుటకు అవకాశ మేర్పడినదనుట. లగ్నము సాయన కన్యా రాశిలో నుండును. కాని, చలితచంద్రుని దృష్టి ఏనాటికి నికరముగా వచ్చునో, ఆనాడే ఫలానుభవము వచ్చుట అరుదు. కారణ మేమనగా, గోచారగ్రహస్థితి, దైనిక కేంద్రచారము, వర్ష జాతకదశలు, దినజాతక యోగములు, మున్నగువాని ప్రేరేపణమువలన, కొన్ని దినములు ముందో, తరువాతనో, దశాఫలములు అనుభవ మునకు వచ్చుచున్నవి. అగుటచే చలిత చంద్రుడు సూచించుకాలము స్థూలమని గ్రహించవలసి యుండును. పైన సూచించిన రెండుకాలములకును సన్నిహితముగా నుండురీతిగా, 7-22 PM (IST) అందాజుకాలముగా నుంచుకొని, సూక్ష్మ పరిశోధనము చేయవలసియున్నది. ఇది రెండవమెట్టు.

భూమండలమునకుగల చక్రభ్రమణగతికారణమున జాతక కేంద్రములు ఏడాదికొకమారు రాశిచక్రమును చుట్టివచ్చుచున్నవికదా! ఇట్టి కేంద్రములకు చారక్రమ మున తగిన గ్రహాదిసంయోగము రానిదినములలో జాతకులకు ప్రబల ఫలములు కలుగుట అసంభవము. కనుక మన మూహించిన 7-22 PM కాలపు ఉపపత్తిపై అను భవ విశేషములుకల దినములకు దైనిక కేంద్రములను

సాధించిమాత్రముగాక. 7-22 P M కాలమునకు సరియగు నాక్షత్రకాలాంతరము 7-3 అగుచున్నది. ఈ సామగ్రితో సాధించిన దైనిక కేంద్రము లిట్లువచ్చును:

(i) 10-4-1952 నాటికి:
దైనిక దశమ కేంద్రయ=$2\frac{1}{4}^\circ$ సింహము.
దైనికలగ్నము=$3\frac{1}{4}^\circ$ వృశ్చికము.

దైనికలగ్నము వృశ్చికరాశిలో $5\frac{1}{2}^\circ$లో నున్నచో జన్మవరుణుని శుభకోణదృష్టిని సమగ్రముగా అనుభవించుచున్న "మండలేశ్వర" సహమముతో ఆలగ్నము సంయోగము నొందగలదు. రాజకీయ పద ప్రాప్తికి ఈ దైనిక యోగమెంతో తగియుండును.

(ii) 11-1-1960 నాటికి:—
దైనిక దశమకేంద్రము=7° వృషభము.
దైనికలగ్నము=$7\frac{1}{2}$ సింహము.

జన్మ శుక్రునితో నిండుగా కోణదృష్టిలో అఘటనఘటనా ధురంధరుడు ఇంద్రు డున్నాడు. లాభాధిపతి చంద్రు డుచ్చస్థానములో భాగ్యములో నుండుట. రమారమి 3° భాగలు ముందుకు జరిగినచో, దైనికదశమము చంద్రునితో, దైనికలగ్నము ఇంద్రునితో, సంయోగములో నుండగలవు. అపూర్వ రాజయోగము నే కేంద్రములు సూచించగల్గుట వింతకాదు.

ఇప్పుడు తేలినదేమన జన్మనక్షత్ర కాలాంతరము మన మూహించినట్లు 7-3 కాక, రమారమి 7-13 గా నుండవలయుననుట. ఇందులో గమనించదగిన అంశమొక్కటి గ్రహకేంద్ర సంయోగము నికరముగా నుండవలయునని. ఏ రెండో, మూడో భాగలు దూరమున కేంద్రమునకు గ్రహమున్నదన్నచో, చాలదు. అట్టి సంయోగము నిరర్థకము.

"సంపూర్ణదృష్ట్యాతు దినే ఫలం స్యాత్
యోగస్తథై కాంశ సమాగమోక్తిః"

అని రుల్లుని సూత్రముకదా?

ఇట్లు సవరించుకొన్న నక్షత్రకాలాంతరమునకు సాయన కన్యారాశిలో $12\frac{3}{4}^\circ$ భాగ లగ్నమగుచున్నది. చంద్రస్థానము సాయన వృషభరాశిలో 10°-24' అగును. ఇంతఅయినా, లగ్నము శుద్ధ మనజాలము.

"జన్మలగ్నంతు సంశోధ్య
నిషేకం పరిశోధయేత్ "

అను నియమానుసారము, ఈ జననమునకు అధానారంభ కాలమును సాధించి, అప్పటి చంద్రస్థితి ఆధారమున శుద్ధలగ్నమును నిర్ధరించుట తరువాతిపని. ఇది మూడవ మెట్టు.

ఆధానకాల సాధనమునకు, శుద్ధజన్మకాల సాధనమునకును వలయు ప్రయోగము అనుబంధము II లో విశదీకరించబడి యున్నది.

ఆధానకాలపద్ధతివలన యీజాతకమునకు శుద్ధజన్మకాలము 7-28'-38'' P. M. (I. S. T) అనియు శుద్ధలగ్నము సాయనకన్యారాశిలో 12°-24' అనియు మనకిప్పుడు తెలిసినది. ఈ కాలమునకు సాధించిన జన్మకుండలి యీక్రింద కలదు.

బు 13-26 వ 5-3	కు 1-3 శు 12-2	కే 0-29 చ 10-24	X 13-14
ర 25-21-38	(సాయనము) — శుద్ధ జన్మకుండలి		య 7-1 (వ)
			ఇ 12-1 (వ)
రాజ్య 12-12	రా 0-39 మండలేశ్వర 6-2 పుణ్య27-26		I 12-24 గు 16-18(వ) శ 23-22 (వ)

తెలివి తేటలకు, విద్యా వివేకములకు, నయ వినయములకు పేరుగాంచిన కన్యారాశిలో నున్నది లగ్నము. లగ్నభాగకు అతిసన్నిహితుడుగా నున్నవాడు దేవగురువు. ఆగురువుతో పరివర్తనయోగమును పొందిన లగ్నాధిపతి బుధుడు లగ్నముపైన పూర్ణదృష్టిని సారించుచున్నాడు.

"హోరా స్వామి గురు జ్ఞ వీక్షిత యుతా
నాన్యైశ్చ, వీర్యోత్కటా"

అను వరాహమిహిరుని సూత్రము ఎంతరమ్యముగా యీ జాతకమునకు అన్వయించుచున్నదో గమనించుట కన్నులపండు వగును. భాగ్యభావమందున్న చంద్రుడు లాభాధిపతి, ఉచ్ఛగ్రహము. అన్యోన్యముగా శుభ 'మేళాపక'దృష్టితో నున్న ఇంద్రశుక్రుల పరిపూర్ణ ప్రత్యక్షమిత్రదృష్టి "రాజ్య"సహముపై నున్నది. అట్లే, పరస్పర సాహాయ్యసంపత్తితో నుండు యమ

శ్రీ దామోదరం సంజీవయ్య జాతకము

వరుణుల శుభకటాక్షవీక్షణము "మండలేశ్వర" సహామునకు కలదు. జాతకము ఉత్తమకక్ష్యకు చెందినదనుటకు పై యోగములు చాలు. ప్రచ్ఛన్నగుప్తమగు ప్రబల శక్తిని ఈ యోగములు చాటుచున్నవి.

ఒక్క మనవి. ఈ జాతకమునకు భావిఫలాదేశము చేయు కుతూహలముతో నేనీ వ్యాసము వ్రాయుటకు పూనుకొనలేదు. సాయనముగా, అథవా నిరయనముగా, అట్టి కార్యమునకు అందెవేసిన చేయిగల సమర్థులగు పండితు లనేకులున్నారు. అజ్ఞాత జన్మకాలమును జీవితానుభవ విశేషములద్వారా సాధించు మార్గము కలదని జ్యోతిష విద్యార్థులకు సోదాహరణముగా చూపుటకై మాత్రమే నాయీ ప్రయత్నము. కృతకృత్యత ఏపాటిదో, నిర్ణయించుట హోరాతంత్ర పారంగతుల అనుగ్రహమునకు చెందినని.

ఈ జాతకమందలి కొన్ని విశేషాంశములను - జన్మకాల సాధుత్వమును, యోగముల ప్రభావమును, సూచించునట్టివి—వ్రాసి చాలింతును.

(1) లగ్నములో నున్న గురువు వక్రి అగుటచే, బలవంతుడు. "వక్రసమాగమగాః పరిశేషాః." అని వరాహమిహిరుని సూత్రము. ఇట్టి గురువు వక్రచారము కారణమున లగ్న సంయోగమునే అభిలషించుచుండుట యోగప్రదమగు విశేషము. ఇది విశ్వసించని వారు **14-2-1921** వ తేదీకి తరువాత ఏనాడు చారవశమున గురువు కన్యారాశిలో **12°-24'** కు రాగలిగెనో గమనింతురుగాక ! **1921** మార్చినెల **17** వ తేదీనాడు గురువు నికరముగా జాతకుని జన్మలగ్నముపైన నిలిచినాడు. అనగా, జననము తరువాత 31 దినములకనుట ! దేవమానదశా సంప్రదాయములో, ఈ దశాయోగము **32** వ సంవత్సరపు వయస్సున అనుభవమునకు రాగలదు కదా ? **10-4-1952** వ తేదీన, 31 సంవత్సరముల చిన్న వయస్సులోనే, జాతకునికి మంత్రిపదము లభించినదని ఎరుగుదుము. గురువు యోగప్రదు డయ్యెనో, లేదో, చదువరు లూహించుకోగలరు. ఆ గురువునకు ఋజుగతి యుండినచో, ఇట్లు జరిగియుండదు.

(2) లగ్నదశమాధిపతియగు బుధుడు మీనములో నుండుటచే, నీచస్థానములో దుర్బలుడుగానున్నాడనుట వాస్తవము. కాని, లగ్నమందలి బృహస్పతితో ఇతనికి పరివర్తన యోగమున్నది. ఆ కారణమున, మహాత్తరమగు బృహస్పతి అనుగ్రహ మీ బుధునికి లభించి యోగము నిచ్చినది. ఆత్మశక్తికంటే, స్వప్రయత్నముకంటే, ముఖ్యముగా అభియుక్తుల సానుభూతి, ఆకస్మికసదవకాశములు అనునవే యోగమునకు కారణములగుచున్నవనుట. జాతకుని నిర్మల, నిరాడంబర, సంతుష్టజీవితమును, వచ్చిన అవకాశముల ఒత్తిడిని, గమనించినవారీ యోగస్వభావమును గుర్తించగలరు.

(3) ఉభయకేంద్రాధిపత్యము వచ్చుటచే పాపి అయిన గురువు హిత మెట్లు చేయగలడని సందేహించువారుందురు.

"కేంద్రాధిపత్య దోషస్తు
బలవాన్ గురు శుక్రయోః."

అను "జాతక చంద్రికా" వాక్యమువలన ఏర్పడిన అభిప్రాయమిది. ఈ సూత్రమువలన ఉభయకేంద్రాధిపతియగు గురువు 'పాపి' అయినాడనుట నాదృష్టిలో, మహాపాపము! గురువుయొక్క సహజ సౌమ్యగుణములు కేంద్రాధిపత్యమువలన నశించినవని ఆ సూత్రమువలన అర్థము చేయరాదు. అతని సహజ సుగుణములే ఒకప్పుడు దౌర్బల్యముగా ఏర్పడి ప్రాపంచిక దృష్టిలో దోషముగా పరిగణించబడుచున్నవని అర్థము.

ఒక్క చిన్న ఉదాహరణము చూడుడు. యుధిష్ఠిరుని శక్తి గొప్పది. (అత డతిరథుడు.) కాని, అతని క్షమాగుణము అంతకంటే గొప్పది. అర్ధరాజ్యమునకు మారు అయిదూళ్ళిచ్చిన చాలు, యుద్ధము వల దన్నాడతడు. సరేకాని అతని క్షమాగుణమును గూర్చి వీరపత్ని పాంచాలి ఇట్లు విమర్శించినదట.

"ఏకః క్షమావతాం దోషో
ద్వితీయో నాస్తి కశ్చన,
యదేనం క్షమయా యుక్తం
అశక్తం మన్యతే జనః"

కేంద్రాధిపత్యమువలన గురువునకు వచ్చుదోష మిట్టిదే. అంతేకాని అతనిని పాపి అనరాదు. క్రౌర్యమునకు పూనుకొనకుండుట, అపరాధములను క్షమించుట, శాంతినికోరుట, అనునవి కొన్ని సందర్భములలో దోషముగా భావించబడవచ్చును. ఎదటివారితో స్పర్ధవచ్చినపుడు, పౌరుషము చూపవలసినపుడు, శత్రువులతో పోరాడవలసియున్నప్పుడు "పోతేపోని"మ్మని గురువు ఊరకుండి కొంత కష్టపడవచ్చును. అంతేకాని అశక్తతవలనకాదు. ఈ వ్యత్యాసము గమనించినచో, గురువుపట్ల మనము మహాపరాధము చేసినవార మగుదుము. అధికార దుర్వ్యామోహముతో, దురాశావేశముతో,

పడుపాట్లుపడు అనేకులవలె జాతకుడు కష్టపడి అధికారమునకు రాలేదనియు, అదృష్టవశమున సదవకాశములు, అయాచితముగా, అతనికి లభించినవనియు మన మెరుగుదుము. ఇదే ఈ గురువు సూచించిన యోగములోని ఘనత.

(4) వక్రిఅయిన గురువు లగ్నమును చేరుకొనుట వలనమాత్రమే ఇట్టిగొప్పయోగము పట్టునా? అని సందేహించువా రుండకపోరు. వాస్తవము విచారించితిమేని, ఈ దశాయోగ మొక్కటే చాలదు. గురువు మిత్రుల సాహాయ్యమును, చక్కని అవకాశములను ఎదిగించి ఈయగలడు. ఈ సౌకర్యములు ఉన్నతస్థాయిలో ఉపయోగపడు వీలుకలిగించుటకు ప్రబలములగు ఇతర యోగములు కావలసియుండును. ఈ జాతకమున లగ్నరాజ్యాధిపతియై, గురువుతో పరివర్తన యోగమునుపొందిన బుధుడు సయితము వక్రచారము నాశ్రయించుకతమున దేవమానదశలో 1960 వ సంవత్సరమున చలితవరుణునితో సంయోగమును పొంది, లాభమందలి యమునితో నిండుత్రికోణ మిత్రదృష్టికి రాగలిగెను. రాజకీయాధికారముగల ప్రబల మిత్రులసాహాయ్యమును సూచించు దశాయోగ మిది. ఇట్లుండగా, మండలేశ్వర సహమమునకు ఆ గ్రహత్రయమునుండి ప్రత్యక్ష మిత్రదృష్టి అబ్బుట అదృష్టఫలము. మరియు చలిత మండలేశ్వర సహమమునకు రాజ్యస్థానములో జన్మగురువు నిలువగల్గుట, జన్మశుక్రుని శుభకోణ దృష్టి వచ్చుటసహా అప్పుడే! చలితచంద్రుడు జన్మరవితో నిండుగా శుభకోణదృష్టికి వచ్చుట 1960 జనవరిలోనే. ఈ సామగ్రిని ఉపయోగించుకొని గురువు తగిన అవకాశములను సమకూర్చినాడు. ఉన్నతస్థాన మేలరాదు?

(5) ఇంద్ర శుక్రులు పరస్పరముగా నికరమయిన కోణదృష్టిలో నున్నారు కదా? సాహిత్యశ్రద్ధ, కవితాశక్తి, లలితకళాసక్తి దీనిఫలము. అది యట్లుండె. రాజ్యసహమమునకు ఈ ఇంద్ర శుక్రులతో కోణస్థితి ఎంత స్పష్టముగా నున్నదో గమనింపుడు. శుక్రుడు ధనభాగ్యాధిపతి యగుటచే, యోగప్రదుడు కదా? ఇతనికి ఇంద్రుని సాహాయ్యమున్నది. ప్రయాసలేకుండ, ఇతరులు సాధారణముగా ఊహించరాని రీతిగా, రాజకీయోన్నతాధికారము రాగలదని సూచన. రాజ్యసహమాధిపతి గురువే. అతనికి లాభాధిపతియై, ప్రబలుడై, భాగ్యభావమందున్న చంద్రుని త్రికోణ వీక్షణ మున్నది. రాజ్యాధికారలాభము, జనాదరము మిత్రుల సన్నాహమువలన ఎల సిద్ధించదు? ఇంద్రుని కైవాటమున్న చోట జరుగు కార్యములు ఊహకు మించినవి.

(6) రాజ్యసహమమునకు ఇంద్రుడు,మండలేశ్వర సహమమునకు వరుణుడు తోడై, యోగముల కున్నతస్థాయిని కల్పించి, నాటక మాడుచున్నారని కనుగొన్నాము కదా? ఇంద్రావరుణులకు వాస్తవస్థితిలో లేని మహత్వము నేను ఆరోపించుచున్నానని భావింపకుడు. 11-1-1960 నాటి దైనిక లగ్నము సాక్షాత్తుగా ఇంద్రునిపై నుండెనని కనుగొంటిమి కదా! అదే దినమునకే తాజకవర్ష పద్ధతి ననుసరించి దినజాతకమును సాధించి చూతురుగాక! ముందునాడు రాత్రి 7-54'-50'' PM (IST) వేళలో దిన ప్రవేశము జరిగినది. అప్పటికి దిన జాతక లగ్నము సింహరాశిలో 15°-41' లో నుండును. ఆనాడు వరుణుడు సింహములో 20°-11' లో నుండుట. ఇంద్రుని చలితస్థానము సింహములో 11°-10'. ఈ గ్రహముల సమష్టి ఫలము నందుకొనుటకై ఆ రెండు స్థానముల సరిమధ్యబిందువు (సింహములో 15°-41')నందే ఆనాటి దినజాతలగ్నము భాగ, కలల వ్యత్యాసములేక, నిలిచియుండుట, ఏకాక తాళీయన్యాయ మనగలము ?

(7) గురు బుధులకు చక్కని పరస్పర సంబంధమున్నది. కావుననే, జాతకుడు న్యాయవాది పట్టమును సంపాదించుకొన్నాడు. కాని ఆగ్రహ ద్వయముతో గ్రహరాజగు రవికి సంబంధము కుదరలేదు. అగుటచే, న్యాయవాది వృత్తిలో జాతకుడు స్థిరపడకపోవుట. కాని, ఆగురు బుధులతో సప్తమ కేంద్రమందలి ప్రభావశాలి వరుణునికి సంబంధ మేర్పడినదని పాఠకమహాశయులు గుర్తించి యుందురు. ఆ కారణమున ఇతని వృత్తికి రాజకీయరంగ మాశ్రయ మిచ్చినది. మండలేశ్వర సహమముపై ఈ వరుణునికి దృష్టి యున్నదికదా! దశమాధిపతి బుధుడు చలిత జాతకములో ఆ వరుణుని చేరుకోగా, జాతకుడు ఆంధ్ర ప్రదేశమునకు ముఖ్యమంత్రి కాగలిగెను.

(8) ఈ జాతకమునకు ఆధానకాలము సాధించినాము కదా? ఇది ఏదో "తిలకాష్ఠ మహిష బంధనము" అని నిరాదరించరాదు. ఆ కాలమునకు సాధించిన కుండలి ఈ ప్రక్క పుటలో నున్నది.

చ 12-24 వ 5-21 పుణ్య 0-58	మండలేశ్వర 7-34	బు 7-20 శు 7-54 I 10-24 కే 18-21 ర 21-54	
X 1-20	(సాయనము) — ఆధానకాల చక్రము —		య 6-10
			ఇ 8-54 గు 10-21
	రా 15-21	రాజ్య 6-58 కు 23-40 (వ)	శ 4-50

లగ్నాధిపతియు, రాజ్యసహమాధిపతియు నగు శుక్రుడు స్వక్షేత్ర బలముతో లగ్నమందే కలడు. ధన పంచమాధిపతియగు బుధుడా శుక్రునితో సంయోగము నందియున్నాడు. ధర్మకర్మాధిపతి యగుటచే రాజ యోగకారకుడై పంచమకోణమందున్న శనినుండియు, లాభభావములో పుణ్యసహమమునకు ఆశ్రయమిచ్చుచున్న వరుణునినుండియు, విక్రమ స్థానములోని యమునినుండియు, ఆ బుధ శుక్రులకు సమృద్ధిగా మిత్ర దృష్టి సౌకర్య మబ్బుట పూర్వపుణ్యఫలము. ఈ ఆధానము నుపయోగించుకొని జనించబోవు జీవుని వైయక్తిక యోగ్యత ఉత్కృష్టమైనదని ఈయోగములు సూచించుచున్నవి. ప్రాపంచికముగా చక్కని సౌకర్యములు జీవితములో ఎదిగిరాగలవని చతుర్థ కేంద్రమందలి ఇంద్ర గురువులు వాగ్దాన మిచ్చుచున్నారు. మండలేశ్వర సహమము ఆ ఇంద్ర గురువుల కోణదృష్టి నభిలషించుచుండుట గమనించదగినది.

ఈ ఆధాన చక్రమునకే దేవమాన దశలు సాధించినచో, చలితపుణ్యసహమము జన్మ గురువులతో కోణ దృష్టికిరాగా, 1952 లో మంత్రిత్వ గౌరవము, చలిత దశమ కేంద్రము జన్మచంద్రుని సంయోగమునందు కొనగా, 1960 లో ముఖ్యమంత్రి పదము వచ్చినవని స్పష్ట మగును. ఆధాన చక్రపు విలువ కిది తార్కాణ.

ఇంతేకాదు. ఈ చక్రమునకే దైనిక జాతకములను గుణించినచో, అనుభవ విశేషముల దినములకు ఈ క్రింది కేంద్ర గ్రహయోగములు చూపట్టగలవు:-

(i) 10-4-1952 నాటికి:—

దైనిక లగ్నములో తాత్కాలిక శుక్రుడు మెరయుచుండును.

(ii) 11-1-1960 నాటికి:—

దైనిక సప్తమ కేంద్రమునకు చలిత శుక్ర సంయోగము వచ్చును. శుక్రునియోగప్రదత్వమున కివి ప్రబల నిదర్శనములు.

మరికొన్ని యోగములున్నవి. కాని ఇంతచాలును. గ్రంథము పెరిగినది.

సాధించిన జన్మలగ్నము సాధువనుటకు పైన చూపిన సాక్ష్యములు చాలుననుకొందును.

హోరా శాస్త్రవేత్తల అనుభవములో లగ్నశోధన పద్ధతు లనేకములు వాడుకలో నున్నవని ఎరుగుదును. వానిలో 'భృగునాడీ పద్ధతి' అనునది ఇపుడు కొంత ప్రచారమునకు వచ్చినది. సూర్యోదయాదిగా, ప్రతి 90 నిమిషముల కాలమును (పృథ్వికి 6, జలమునకు 12, తేజస్సునకు 18, వాయువునకు 24, ఆకాశమునకు 30 నిమిషముల వంతున) పంచభూతములకు పంచిపెట్టి జలవాయు తత్త్వకాలములలో స్త్రీలు, ఆకాశపృథ్వి తేజస్తత్త్వ కాలములలో పురుషులు జనింతురనుట ఈపద్ధతియందలి ముఖ్యసూత్రము. జన్మవారముతో, జన్మ నక్షత్రముతోసహా అతుకువచ్చుటకు కొన్ని పథకము లున్నవి. ఈపద్ధతి రుచికరముగా చూపట్టుచుండుట వాస్తవము. కాని స్త్రీ జననముల కనుకూలించు కాలముకంటే నూటికి ఏబది వంతుల హెచ్చు కాలమును పురుషజననములకై సృష్టికర్త సిద్ధపరచినాడని యీ పద్ధతివలన ఏర్పడుచున్నది. ప్రకృతి ధర్మములతో ఇది సమన్వయమగు టెట్లో, ఈ ఈపక్షపాతమున కేమిహేతువో బోధపడుట కష్టము.

పోనిత్తము, ప్రశంసలోనున్న జన్మమునకు ఈ పద్ధతి నన్వయించగా జన్మకాలము 7-16-38 PM (1ST) అని ఏర్పడును. లగ్నము సాయన కన్యారాశిలో $9\frac{1}{2}°$గా వచ్చును. ఏల కారాదు? అందురేమో? చలితజాతక, దినజాతక, దైనిక జాతకాదుల యొక్కయు, సహమాదులయొక్కయు సాక్ష్యము ఈ లగ్నమునకు లభించకున్నదనుటే నా బాధ. అనుభవములను చూపజాలని లగ్నమును నమ్మి భావి ఫలనిర్ణయము చేయచూచుట "పంటచేను విడిచి, పరిగె లేరినయట్లు" అగునని నాభయము. మరి, అనుభవములకు తగి

నది, సరియగు నిదర్శనముల నిచ్చునట్టిది వేరులగ్నము కలదని, సోపపత్తికముగా, తద్‌జ్ఞులెవరైన చూపువరకు, మనమిప్పుడు సాధించిన లగ్నమునే ఆశ్రయింతము.

శ్రీ సంజీవయ్యగారి యాజమాన్యమున ఆంధ్ర ప్రదేశము ఇతోధికముగా అభివృద్ధిగాంచుగాక! దేవమానదశలో రవికి, మండలేశ్వర నిహమమునకు, శుక్రునికిసహా రానున్నదశలు ఉత్కృష్టముగానున్నవి. ఇంతకంటే గౌరవస్థానము లతనికొరకై కాచుకొని యున్నవని సూచన. సర్వేశ్వరు డతనికి ఆయురారోగ్యాది భాగ్యము లొసంగుగాత! ఆంధ్రమాత సంతసించుగాక!

అనుబంధము I

(i) మంత్రిత్వ ప్రాప్తి

జాతకుడు మంత్రిఅయిన దినము		1952-4-10
జన్మదినము		1921-2-14
వయస్సు		31-1-26
దేవమాన దశాపద్ధతిలో ఈ వయస్సునకు సరిఅయిన కాలము		ది గం నిమి 31-3-44
ఈ వయస్సునకు సరిఅయిన దశా దినము		1921-3-17
ఆ దినమున గ్రీనిచ్ మధ్యాహ్నమున చంద్రస్థితి	0°-49' కర్కాటకము.	
జన్మ వరుణస్థానము		5-3 మీనము
ఆ వయస్సునకు చలిత బుధస్థానము		3-22 మీనము
ఈ గ్రహద్వయ సమష్టి కోణదృష్టి స్థానము		4-18 కర్కాటకము
ఈ స్థానమును చేరుకొనుటకు చంద్రుడు జరుగవలసిన దూరము		3-29
ఆనాటి చంద్రుని దినగతి		14-10
కనుక కర్కాటకములో 4°-18° చేరుటకు చంద్రునికి కావలసిన కాలము		5-54
అనగా	1921—మార్చి :	17-5-54
దేవమానదశా కాలము	0—0 :	31-3-44
పోగా, జన్మకాలము(G.M.T)	1921-ఫిబ్ర:	14-2-10
భారతకాల మానధ్రువము	0—0—	0-5-30
కనుక అందాజుగా జన్మకాలము		1921—ఫిబ్ర—14-7-40 P. M. (I S T)

(ii) ముఖ్యమంత్రి పదవి ప్రాప్తి

ముఖ్యమంత్రి అయిన దినము		1960—1—11
జన్మదినము		1921—2—14
వయస్సు		38-10—27
దేవమానదశాపద్ధతిలో		ది గం నిమి
ఈవయస్సునకు సరిఅగు కాలము		38—21—48
వయస్సునకు సరిఅగు దశాదినము		1921—మార్చి—25 0 1
ఆనాడు గ్రీనిచ్ మధ్యాహ్నమున చంద్రస్థితి		25°—43'—తుల
ఆనాడు చంద్రుని దినగతి		. 13—50
జన్మరవి స్థానము		25—22 కుంభము
జన్మరవి కోణదృష్టికై వెనుకకు చంద్రుడు జరుగవలసిన దూరము		0—21
దీనికి కావలసిన కాలము		0 - 37
అనగా, ...		19 1 మార్చి 25-11-23 A. M. (G. M. T.)
దేవమానదశా కాలము		0—0 : 38-21-48
పోగా, జన్మకాలము		1921 ఫిబ్రవరి 14-1-35 P. M. (G. M. T.)
భారత కాలమానధ్రువము	0—0	0-5-30
అందాజు జన్మకాలము	1921 ఫిబ్ర	14-7-5 P. M. (I. S. T.)

సారాంశమేమనగా, అందాజుగా జన్మకాలము 7-5 నుండి 7-40 P. M. (I. S. T) ప్రాంతములో ఉండుననుట.

అనుబంధము II

(i) ఆధాన కాల సాధనము

సామగ్రి ;

అందాజు జన్మలగ్నము	=	$12\frac{3}{4}$° కన్యారాశి
జన్మ చంద్రస్థానము	=	10°-24' వృషభము
చంద్రస్థితి	=	శుక్లపక్షములో దృశ్యార్ధ గోళము.

జన్మలగ్నము, జన్మ చంద్రుడు సహా, స్త్రీ లింగ ద్యోతక భచక్ర భాగలలో నుండు కారణమున, పురుష జన్మము కలుగుటకై, జననమునకు పూర్వము పది, పదు నొకండు నాక్షత్రమాసముల నడుమ, ఏ దినమున చంద్రుడు జన్మ సప్తమ భావములో సంచరించుచుం డెనో, ఆనాడు జన్మచంద్రస్థానము ఉదయమగు క్షణ మున, ఈ జననమునకు అధానారంభము జరిగియుండ వలయు ననుట యీ సంప్రదాయపు ముఖ్య సూత్రము.

ఈ కాలమును సాధించు ప్రయోగ మిది :—

జన్మదినము	14-2-1921
దీనికి పూర్వము పది నాక్షత్ర మాసములగు దినము.	16-5-1920
ఈ దినమునకు పూర్వము చంద్రుడు మీన రాశిలో $12\frac{3}{4}$° ప్రాంతమున సంచరిం చిన దినము	12-5-1920
ఆనాడు గ్రీనిచ్ మధ్యాహ్నమున చంద్ర స్థానము	6°-6' మీనము
ఆనాటి చంద్రుని దినగతి	12°-57'
15°-48' ఉత్తరాక్షాంశా ప్రదేశములో వృషభములో 10°-24' ఉదయమగు నాక్షత్ర కాలము	20-14-1
12-5-1921 వ తేదీ నాడు స్థానిక మధ్యా హ్నమునకు నాక్షత్రకాల భుక్తి	3-18-57
కనుక, నాక్షత్ర కాలాంతరము	16-55 4
మధ్యమ కాలము కొరకు సంస్కారము	0-2-49
స్థానిక మధ్యమ కాలము	16-52-15
స్థానిక రేఖాంశా కాలము	5-12-24
గ్రీనిచ్ మధ్యమ కాలము	11-39-51
	P. M. (G.M.T.)

ఈ కాలమునకు చంద్రుని చారము	6°-18'
కనుక, ఆధానారంభ కాలమున చంద్రస్థానము	12°-24' మీనము.

ఆధాన చంద్రుడు పుల్లింగ ద్యోతకభచక్ర భాగలో, ఆధాన లగ్నమునకు లాభభావములో ఉండు టచే, ఈ ఆధాన కాలము పురుష జననమునకు తగి యున్నది. కనుక, సాధువు.

"యథాచంద్రస్తథా లగ్నం
యథా లగ్నం తథా శశీ."

అను న్యాయమునను సరించి ఈ జాతకమునకు స్పష్ట లగ్నము సాయన కన్యారాశిలో 12°-34' గా ఉండ వలయుననుట సారాంశము.

(ii) శుద్ధజన్మకాల సాధనము

15°-48' ఉత్తరాక్షాంశలో కన్యారాశి 12-24 ఉదయమగు నాక్షత్రకాలము	4-47 13
జన్మదినమున గ్రీనిచ్ మధ్యాహ్న కాలభుక్తి	21-35-51
స్థానిక రేఖాంశకాలమునకు సంస్కారము	0- 0-52
స్థానిక మధ్యాహ్నమునకు నక్షత్రకాలభుక్తి	21-34-59
పోగా నక్షత్రకాలాంతరము	7-12-14
మధ్యమకాలమునకు సంస్కారము	0- 1-12
స్థానిక మధ్యమకాలము	7-11- 2
స్థానిక రేఖాంశా కాలము	5-12-24
గ్రీనిచ్ మధ్యమకాలము	1-58-38
	P. M. (GMT)
భారతకాలమాన ధ్రువము	5-30- 0
శుద్ధస్పష్ట జన్మకాలము	7-28-38
	P. M. (IST)

వనలక్ష్మి

శ్రీ పందరపు వేంకటేశ్వరరావు

ప్రకృతి సుందరి తన ముగ్ధ మోహన లావణ్యమంతా ఇక్కడే ఒలకబోస్తున్నట్టుంది చూడు మోహన్! ఆపొదలపై వెర్రిగా విరగబూసిన మల్లెల వాసనలు మత్తెక్కిస్తున్నాయి ఈ పక్క గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న రంగురంగుల గులాబీలు మలయానిలానికి మెల్ల మెల్లగా తల లూపుతూ స్వాగతం ఇస్తున్నట్టున్నాయి. అబ్బ! ఆ చెట్లకొమ్మల ఆకులను మరుగుపరుస్తూ కిలకిలమంటూ కూర్చున్న చిలకల ముక్కులు చూడు— చెట్లపై మిరపకాయలు దండలు దండలుగా వేలాడదీసినట్టు కనబడుతున్నాయి. అదుగో! ఆ తోపునుంచి కోకిలస్వామి 'కుహూ కుహూ' మంటుంటే ఈ వేపు నుంచి కోకిలస్వామిని తనస్వామిని వెక్కిరిస్తున్నట్టుంది. ఆ కొండ గుట్టను ఒరుసుకుపోతున్న ఆ చిన్న తెలిమబ్బుముక్క లేగదూడ పచ్చికబయళ్లో పరిగెత్తుతున్నట్టు లేదూ? ఇంత సౌందర్యంలోనే ఎంతో గాంభీర్యం! ఇంత కలకలంలోనే ఎంతో ప్రశాంతత! నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నాయి మోహన్! ఇన్నాళ్లుగా లేని మనశ్శాంతిని ఈ వనలక్ష్మి నాకు ప్రసాదిస్తున్నది. కలతలతో, కలహాలతో, ద్వేషాలతో, ద్రోహాలతో, బాధలతో, వ్యాధులతో, అంతా కృతకంగా, ఎంతో వికృతంగా కనబడే నగరవాసం కంటె ఈ వనసీమ నన్నలరిస్తున్నది మోహన్! ఇన్నాళ్లుగా కలలుగన్న ప్రశాంతత నన్ను పలకరించి పులకరింప జేస్తోందోయ్! ఇక్కడే ఎక్కడో చిన్నగుడిసె వేసుకొని, పళ్లు ఫలాలు తింటూ, హాయిగా, నిశ్చింతగా కాలం గడిపి వేస్తాను.—

విహారయాత్రకు వచ్చిన విద్యార్థి బృందాన్ని శిబిరాలవద్ద దిగవిడిచి ఎంతోదూరం జీపులోవచ్చిన ప్రొఫెసర్లు-మోహన్, మనోహర్ ఏటి ఒడ్డున కూర్చుని ప్రకృతిశోభను తిలకిస్తూ ఉండగా మనోహర్ తన అభిప్రాయం మోహన్‌కు తెలియజేశాడు.

"నీది వట్టి ఉద్రేక స్వభావం మనోహర్! ఎంత కవివైనా ప్రకృతి - సౌందర్యం నిన్నొక్కణ్ణే ముగ్ధుణ్ణి చేయడం లేదు. చూచి ఆనందించాం. కావాలంటే పదేపదే ఇటువచ్చిపోతూ ఉందాంలే! మన వాళ్లు ఎదురుచూస్తూ ఉంటారు." మోహన్ నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"లేదు, మోహన్! ఇక్కడున్న రెండుక్షణాలు నా మనస్సెంతో తేలికై పోయింది. పడినపాట్లు మరచిపోయాను. నా నిశ్చయానికి ఎదురులేదు."

"నీది వట్టి దుర్బల హృదయం."

"ఈ భూలోక స్వర్గంలో ఉండాలనుకొంటున్నందుకా?"

"ఎంతతోస్తే అంతేకాని, కాస్త నిదానంగా ఆలోచించవ్."

"నిజమే మోహన్. నేను తొందరపడేవాడినే- అయినా, నా తొందరపాటువల్ల ఇంతవరకు ఎవరినీ బాధపెట్టలేదనే అనుకొంటున్నాను."

"ఇదివరకు బాధపెట్టిందీ లేనిదీ నాకు తెలియదు. ఇప్పుడుమాత్రం బాధ కలిగిస్తున్నావ్."

"ఎవరికీ...?నీకా?" మోహన్ మొహంలోకి చూస్తూ ప్రశ్నించాడు మనోహర్.

"నన్నే కాదు మనోహర్, నీమీద గంపెడాశ పెట్టుకుకూర్చున్న సరళను, ఆమె తలిదండ్రుల్నికూడా బాధపెటినవాడి వౌతావు. కాస్త ఆలోచుంచు మనోహర్." దీనంగా ప్రాధేయపడ్డాడు మోహన్.

"నువ్వు బాధపడతావని నాకు తెలుసు మోహన్! నువ్వు లేకపోతే నేనెప్పుడో విరాగినై పోయేవాణ్ణి. అయినా నన్ను మన్నించు; నాకు మనశ్శాంతి కలగడంకంటె నీకుమాత్రం కావలసిం దేముంది చెప్పు? సరళ—వాళ్ళమాట అంటావా, ఒక్క సంవత్సరంలో తిరిగివస్తాననీ, ఇచ్చినమాట తప్పక చెల్లించుకొని పెళ్లి చేసుకొంటాననీ నచ్చజెప్పు."

"నువ్వు పిచ్చివాడివై పోతున్నావ్."

"అది నిజంగా గొప్ప కాంప్లిమెంట్ మోహన్! పిచ్చివాడికంటె మంచివా డెవడున్నాడు! తల్లిని, తండ్రిని, చెల్లెల్ని—అందర్నీ ఒక్కసంవత్సరంలో పోగొట్టుకొన్న నాకు ఎప్పుడో మతిపోయింది." పొంగుకువచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు మనోహర్ బరువుగా.

"సరే నడు. ఈ నడిఅడివిలో ఒక్కడివీ ఉండడం అసాధ్యం. అదుగో ఆ కాలిబాట ఏ కొండవాళ్ళ నివాసాలకైనా తీసుకు వెళ్లుతుందేమో చూద్దాం. ఉండేవాడివి నలుగురిమధ్య ఉండడం మంచిది."

వనలక్ష్మి

కాలిబాట వెంబడే నడవసాగాడు మోహన్. మనోహర్ అతన్ని అనుసరించాడు. స్నేహితులిద్దరూ మెల మెల్లగా ముందుకు సాగుతున్నారు. దూరంనుంచి అస్పష్టధ్వనులు వినవస్తున్నాయి. "మనఊహ సరియైనదే మనోహర్, ఇక్కడ దగ్గరలోనే జనపదం ఉన్నట్టుంది." అన్నాడు మోహన్. ఆ అస్పష్టధ్వనులు క్రమక్రమంగా స్పష్టంగా బిగ్గరగా వినబడుతున్నాయి. పాడుతూ, ఆడుతూ తందనాలాడుతున్న గుంపు మంటల వెలుగులో స్పష్టంగా కనబడింది. పాటలు చక్కగా వినబడుతున్నాయి. మొలలకు తోలుగుడ్డలు చుట్టుకొన్నారు. తలలపై రంగురంగుల పాగాలు, పాగాలపై తెల్లని కుచ్చులు, మెడలో పూసలపేర్లు, చేతికి ఎముకల కడియాలు, చేతులలో వింత వింత వాద్యాలు, విచిత్రమైన పాటలు, అర్థంకాని మాటలు-ప్రొఫెసర్లకు అపూర్వ అనుభూతిని కలిగిస్తున్నాయి. కొబ్బరి దొన్నెలలోని పానీయాన్ని మధ్య మధ్య జుర్రుతున్నారు, గ్రుసన తేన్చుతున్నారు, మంటచుట్టూ గిరగిరా తిరుగుతున్నారు, పాట పాడుతున్నారు-ఆ వింత మనుషులు విచిత్రమైన భాషలో :

ఓయ్ హెయ్, ఓయ్ హెయ్
ఓయ్ హెయ్, జం ఝు ఝూం
జం ఝు ఝూం, జాం ఘు ఘోం
గలా బలా జలా ఢాం ఢాం
మిలా కలా నలా ధూం ధాం
బాడబాం, బాడబాం, బాడబాం హెయ్
ఆ డ నాం, ఆడనాం ఆడ నాం జోయ్ !

ఈ ఆగంతకు లిద్దర్నీ చూడడంతోటే ఆటపాటలు ఆగిపోయాయి. అందరూ బిలబిలమంటూ ఒక ప్రక్కకు చేరారు. అందరికళ్లూ ఆగంతకులవైపుకు మళ్లాయి. ఒక వృద్ధుడు కర్ర ఊతగాలేచి వీరివైపుకు నెమ్మదిగా అడుగులువేసుకు వచ్చాడు. ఇద్దర్నీ తేరి పార జూచాడు. దారి కడ్డంగా చేతికర్ర పడవేసి రెండు చేతులు పైకెత్తి ఎలుగెత్తి ప్రశ్నించాడు :

"ఓయ్ హెయ్? కాహెకోయ్?"

ప్రొఫెసర్లు ఒకరి మొహం ఒకరు చూసుకొన్నారు. "తెలుగు, తెలుగు" అన్నాడు మోహన్, మీ భాష అర్థంకావడంలేదని సంకేతాలతో సూచిస్తూ.

"హోయ్, తెలు-హెయ్ జాండుడాయ్" గుంపు వైపుకు తిరిగి కేకవేశాడు ఆ ముసలివాడు.

పాతికేళ్ళ యువకుడొకడు ముందుకువచ్చి ముసలివాడితో ఒక్కక్షణం ఏదో మాట్లాడి, వీరిని చూసి తెలుగులో ప్రశ్నించాడు.

"మీరెవరు? ఏమి పని?"

ఇంతలో ఆ కొండవాళ్ళందరూ కిరిమట్టాయూగి వింతగా చూస్తూ నిలు మండిపోయారు.

మోహన్ మనోహర్‌ను చూపిస్తూ జాండుడాయ్‌కి చెప్పాడు: "ఈయన కొన్నికష్టాలలోపడి మనశ్శాంతి పోగొట్టుకొన్నాడు. ఈ అడవి అందం, మీ అమాయకత చూచి మీతో కొన్నాళ్లు గడిపి వెడదామనుకొంటున్నాడు. గొప్ప గొప్ప చదువులు చదివిన ఈయన ఉండడం మీకుకూడా లాభిస్తుంది; మీరు అంగీకరిస్తే మీతో కలిసి మెలసి ఉంటాడు." సైగలతో, సంకేతాలతో మాట్లాడిన తెలుగు వారిలో కొంతమందికి కొద్దికొద్దిగా అర్థమయింది. జాండుడాయ్ మోహన్ చెప్పిన విషయం ముసలివాడికి వినిపించాడు. ముసలివాడి కళ్లు మెరిసాయి, అనురాగాన్ని కురిసాయి. మనోహర్ చేతులను తన చేతులలోకి తీసుకొని "ఆందా హోయ్, జిందోబోయ్!" అని అరిచాడు. గుంపులోని వారందరూ ఎలుగెత్తి "ఆందా హోయ్, జిందోబోయ్!" అని అరిచారు—ఒక్కొక్కరే వచ్చి మనోహర్ చేతులు అందుకొని పైకెత్తుతూ, మనోహర్‌ను నడిపించుకు వెళ్ళి, కర్రతో కట్టిన తిన్నెమీద కూర్చోబెట్టారు. మోహన్ మనోహర్ ప్రక్కనే నిలబడి అడవిమనుషుల ఆదరణకు ఆనందిస్తున్నాడు. "వీళ్లు నిన్ను రాజును చేస్తున్నట్టున్నారు" అన్నాడు నవ్వుతూ మనోహర్‌ని చూసి.

"ఇంత కర్కశమైన ఆకృతి ఎంత మృదువైన హృదయాన్ని దాస్తున్నదో చూడు మోహన్!" అన్నాడు మనోహర్.

"అవును మనోహర్, హృదయంలోని అమృతాన్ని మాటల్లో, చేష్టల్లో వర్షిస్తున్నారు."

"నాగరికత బలిసిన మనం ఇందుకు పూర్తిగా భిన్నంకదూ మోహన్. హృదయంలో విషం పెట్టుకొని తేనేపూత కబుర్లు చెప్పడం నాగరికత స్వభావం అనిపిస్తుంది." అన్నాడు మనోహర్.

"వీరిని నాగరికులను చేయడానికి ప్రయత్నించకు. ఈ అమాయకులు అమాయకులుగానే ఉండిపోనీ." అన్నాడు మోహన్, మనోహర్‌ను చూస్తూ.

రెండు దొన్నెలనిండా పానీయం తీసుకువచ్చిన ఒక పడుచుపిల్ల వీరి మాటలు వింటూ నివ్వెరపడి నిలిచిపోయింది. మనోహర్ ఆ పడుచునుచూసి "మాకా?" అని సైగతో అడిగాడు. పడుచు తల ఊపి తలకొక దొన్నె అందించింది.

"ఇదేం పానీయమో ఏమిటో మోహన్?" అన్నాడు మనోహర్, కొంత అసహ్యం కనబరుచుతూ.

"తాజా పండురసం, మంచి పానకం" అంది ఆ పడుచు తెలుగులోనే; అయినా ఒక రకం యాసతో.

"వాసన బాగానే ఉంది, తీసుకుందాం." అన్నాడు మోహన్.

కొండ మనుషుల ఆతిథ్యం లాగా ఆ పానీయం మధురాతి మధురమై రుచించింది.

పానీయం తీసుకుంటూ, పడుచునుచూసి మనోహర్ ప్రశ్నించాడు: "నీకు తెలుగు తెలుసునన్న మాట."

"ఓ బాగా తెలుసు." ఉత్సాహంతో చెప్పింది పడుచు.

"ఓహో!-అయితే నీపేరు ఏమిటమ్మాయ్?" అని ప్రశ్నించాడు మనోహర్.

ఆ ప్రశ్నకే ఎదురు చూస్తున్నదా అన్నట్టు చటుక్కున సమాధానం చెప్పింది. "బాణోలక్కి."

"బాణోలక్కి!-విచిత్రమైన పేరు, 'వనలక్ష్మి' అన్నట్టు ధ్వనిస్తున్నది కదూ మోహన్?" అన్నాడు మనోహర్.

"నువ్వు వనలక్ష్మి అని పిలిచినా అభ్యంతరం ఉండదులే" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"అవును, నేను 'వనలక్ష్మి' అనే పిలుస్తా" అన్నాడు మనోహర్, బాణోలక్కి వైపుచూస్తూ.

ఇంతలో జాంకుడాయ్ ఇప్పపువ్వు, కొబ్బరిపువ్వు, బుర్రగుంజు రెండు ఆకులలో తెచ్చి అందిచ్చాడు అతిథులకు. "తీసుకోండి"అన్నాడు ఆదరంగా. అయిదు నిముషాల్లో ఆకులు ఖాళీ అయిపోయాయి.

చెట్టు క్రింద ఎత్తుగా కట్టి ఉన్న మంచె మీద ఆకు అలంవేసి మెత్తగా ముఖమల్ పరుపులా తయారు చేశారు. మంచె ఎక్కడానికి కొయ్య మెట్లున్నాయి. "దాని మీద పండుకోండి బాబా, ఈ రాత్రికి. రేపు మీకు వేరే గుడిసె ఏర్పాటవుద్ది." అన్నాడు జాంకుడాయ్. అడవిలో తిరిగి తిరిగి అలసిపోయిన స్నేహితులకు కళ్లు బరువు లెక్కపోతున్నాయి. మంచె ఎక్కి అందరికీ చేయెత్తి నమస్కరించారు. "అందాహోయ్, జిందోబోయ్" అని ఆటవికులు అరిచి ఒక్కొక్కరే విడిపోయారు.

తెలతెలవారుతూ ఉండగా మోహన్‌లేచి మనోహర్‌ను లేపి అడిగాడు: "నువ్వు పట్టిన కుందేలుకు నాలో కాలు కనబడిందా భాయ్?"

"నేను పట్టే కుందేలుకు ఎప్పుడూ మూడుకాళ్లే కనిపిస్తాయి మీకు; నాల్గోకాలు నా కొక్కడికి మాత్రమే కనిపిస్తూ ఉంటుంది." అని సమాధానం చెప్పాడు మనోహర్ ఆవులిస్తూ.

"అదే! నీకైనా కనబడుతున్నదా అనే నేనడుగుతున్నాను." అన్నాడు మోహన్.

"కనబడవలసింది నీకు." అన్నాడు మనోహర్ నవ్వుతూ.

"ఇక నీకు చెప్పి లాభంలేదు. అందులో పడుచు పిల్ల తెచ్చిన పానీయం రుచి మరిగావారి. ఇంతలో ఈ అడవి వదలిపెట్టవ్. అయితే నేను వెళ్లిపోతున్నాను. ఆ ఏటిఒడ్డున వదిలిన జీపు ఏమయిందో! మనం ఏ పులికో ఫలహారమై ఉంటామని మనవాళ్లు కంగారు పడుతుంటారు. త్వరలో తిరిగి వస్తావని ఆశిస్తున్నాను. నీ మీద ఆశపెట్టుకు కూర్చున్న సరళ తలిదండ్రులు ఎంత ఇదవుతారో ఏమో! వాళ్ల ఆనందం కోసమైనా త్వరగా తిరిగివచ్చెయ్ మనోహర్!" అనునయిస్తూ చెప్పాడు మోహన్.

"ఒక్క సంవత్సరం ఓపిక పట్టమను మోహన్." అంటూ మనోహర్ మోహన్‌తో కరస్పర్శ చేసి వీడ్కోలు చెప్పాడు. ఇంకా మగతగాఉంటే మళ్లీ మంచెమీద వాలిపోయాడు.

"బాబా, లేవండి – పాలు వస్తున్నాయ్."

ఈ పిలుపుకు ఉలిక్కిపడి లేచాడు మనోహర్. ఒయ్యారంగా, ఓరగా చూస్తూ బాణోలక్కి మంచె అంచున నిలబడిఉంది.

"నువ్వా?"

"లేవండి బాబా, జాంకుడాయ్ పళ్లు, పాలు తెస్తున్నాడు. అప్పుడే బారెడు పొద్దెక్కింది." అంది బాణోలక్కి!

చెట్ల గుబుర్ల మధ్య సూర్యబింబం ఎర్ర ఎర్రగా తెల్ల తెల్లగా కనబడుతోంది. పక్షుల కలకలం పెచ్చు పెరిగింది. మనోహర్ లేచి సంచినుంచి టూత్ పేస్టు, బ్రష్ తీసి దంతధావనానికి ఉపక్రమించాడు. బాణోలక్కి ఆశ్చర్యంగా చూస్తోంది.

"ఇదేంటి? ఇదినొక్కితే తెల్లతాచు పిల్లలాగ వొస్తోందే ముద్దు!" అంటూ టూత్‌పేస్టు ట్యూబ్ నొక్కుతూ ఆనందిస్తోంది బాణోలక్కి.

"అముదను మెల్లగా ఆ గొట్టంలోకి ఎక్కించు." అన్నాడు మనోహర్.

మనోహర్ దంతధావనం చేసుకొని లేచేసరికి జాంకుడాయ్ పళ్లు, పాలగిన్నె పట్టుకవచ్చాడు.

"బాబా ముద్ద లోపలి కెక్కడం లేదు." అంది, బాణోలక్కి మనోహర్‌ని చూస్తూ.

"ఎందుకు ఎక్కుతుంది? పైకి తీసేముందు ఈ సంగతి ఆలోచించావా నువ్వు? లేదుకదూ! అనాలోచితంగా చేసిన పొరపాటును సరిచేసుకోవడం ఎంత కష్టమో దీనినిబట్టి తెలుసుకోవాలి." అన్నాడు నవ్వుతూ.

వనలక్ష్మి

బాణోలక్కి బొమముడివేసి ఒక్క క్షణం ఆలోచిస్తూ నిలుచుండి పోయింది. "నిజమే బాబా, మీరన్నమాట." అంది మనోహర్‌ను చూస్తూ, గొప్ప విషయం సులభంగా అర్థమైన ఆనందంతో.

"పళ్లు తీసుకోండి బాబా!" అన్నాడు జాండు డాయ్.

పళ్లు, పాలు తీసుకొంటూ ఉండగా, మనోహర్‌తో జాండుడాయ్ మెల్లగా, వినయంగా చెప్పాడు : "మా పెద్ద మిమ్మల్ని తోడుక రమ్మన్నాడు బాబా."అని.

ఫలహారం ముగించి, "సరే, అలాగే వెడదాం." అని బయలుదేరాడు మనోహర్. "బాణోలక్కి నువ్వు బాబాగారి సంచి మెడకు తగిలించుకో." అని హుకుం జారీచేశాడు జాండుడాయ్. "ఓ వస్తున్నా జాండూ!" అంటూ ఆనంద పారవశ్యంతో బయలుదేరింది బాణో లక్కి.

ముగ్గురూ కలిసి తండా పెద్ద వద్దకు వచ్చారు. మనోహర్‌ను చూడగానే అతను లేచి చేతులు పైకెత్తి "ఆందాహోయ్ జిందో బోయ్" అని గట్టిగా అన్నాడు. ఆమాటల అర్థం తెలియకపోయినా మనోహర్‌కూడా చేతులెత్తి "ఆందా హోయ్ జిందో బోయ్!" అన్నాడు. గత రాత్రి తనను ఆహ్వానించిన ముసలి వాడే ఆపెద్ద. జాండుడాయ్‌ని పిలిచి తమ భాషలో మాట్లాడాడు. జాండుడాయ్‌ని చూపిస్తూ 'వినండి' అని సైగతో చెప్పాడు పెద్ద. "ఏమిటి జాండుడాయ్?" అని అడిగాడు మనోహర్. "మా ఆసారాలను, కట్టు బాట్లను మీకు తెలియసెప్పాలి బాబా. మా పెద్ద చెప్పిం దేమిటంటే—" అని గొంతుక సవరించుకొని ప్రారంభించాడు జాండుడాయ్:

"మీ గెవరో మాకు తెలవదు. మేం ఎవరమో మీకు తెలవదు. మీ ఆసారాలు మాకు, మా ఆసారాలు మీకు తెలవ్వు. ఈ అడవిపై మా తండాది అధికారం. మా సట్టదిట్టాలకు తిరుగులేదు; ఎదురులేదు. ఇక్కడ ఉన్నన్నాళ్ళు మీరు మా ఆసారాలను మన్నించాల. మా కట్టుబాట్లకు లోబడి నడుచుకోవాల. మీరు మాలో ఒకరిగా తిరగండి. జాండుడాయ్, బాణోలక్కిలను మీసేవకు నియమిస్తున్నాను. మీకు ఏలోపం రానివ్వకుండా ఆళ్లు సూసుకుంటారు. మీరు గొప్ప చదువులు చదివిన మంచి వోరు. మీ గేనంతో మాకు లాభం కలిగించండి."

"సరే" అన్నట్టు తల ఊపుతూ పెద్ద మొహంలోకి చూశాడు మనోహర్. పెద్ద చిరునవ్వుతో అభినందించాడు.

మనోహర్ రాకతో ఆ అడవిమనుషుల పల్లె పట్టులో నిరాడంబరమైన విప్లవం ప్రారంభమయింది. అడవి మనుషులను మనుషులనుగా చేయడానికి మనోహర్ పడిన శ్రమ వర్ణించరానిది. వారికి శుచి శుభ్రతలు అలవడ్డాయి; చదువు సంస్కారాలు అబ్బసాగాయి; మురికి కూపాలుగా ఉండే గుడిసెలు కడిగిన ముత్యాల్లా తయారయాయి. ప్రతి గుడిసెకు ముందు, వెనక చిన్న చిన్న పూలతోటలు వెలిశాయి; ఆధి వ్యాధులు ప్రకృతి వైపరీత్యాలు భగవంతుని కోపంగా శాపంగా భావించే వారు వాటిని ఎదిరించి నిర్జించడం నేర్చుకొంటున్నారు. మనోహర్ వారి మనసు నొవ్వకుండా వారి మూఢాచారాలను మాన్పడానికి ప్రయత్నిస్తున్నాడు. వారితో నడక అసిధారావ్రతం లాంటిది. వారెంత సహనశీలురో అంత రౌద్రమూర్తులు. ఎంత అసహాయ శూరులో అంత అమాయకులు. ఎంత సాధుస్వభావులో అంతే కిరాతకులు. ఆదరించిన వాణ్ణి ఆరాధిస్తారు, ఆగ్రహించిన వాణ్ణి అంతంచేస్తారు. మనోహర్ నిరంతర కృషివల్ల వారిలోని పశు ప్రవృత్తులు దైవిక శక్తులకు లోబడుతున్నాయి.

బాణోలక్కి, జాండుడాయ్‌లు మనోహర్‌ను కంటికి రెప్పలాగ చూస్తున్నారు. అతన్ని ఒక్క క్షణంవిడిచి ఉండరు. అతని సపర్యలలో తమజీవితం సార్థక మౌతుందని వారిభావం. బాణోలక్కిని మనోహర్ 'వనలక్ష్మి' అని పిలుస్తాడు. బాణోలక్కి మనోహర్‌ను మనోబాబా అంటుంది; అందరూ బాబా అని మాత్రం అంటారు. బాణోలక్కిది పాదరసం లాంటి చురుకయిన బుద్ధి. మనోహర్ చెప్పిన అనేక విషయాలను తేలికగా అర్థం చేసుకొంటుంది. మనోహర్‌కు పువ్వులంటే ప్రాణం. అడవిలోని ఎక్కడెక్కడి పూలమొక్కలను పెళ్ళగించుకొని వచ్చి ఒక పూలవనం తయారుచేశాడు. అక్కడి పూలు ప్రతి ఉదయం కోసుకువచ్చి దండలుకట్టి మనోహర్ మెడలో వేస్తుంది బాణోలక్కి. కుటీరం గుమ్మానికి, గోడలకు దండలు వ్రేలాడదీస్తుంది. అతని పక్కపై మల్లెమొగ్గలు గుమ్మరిస్తుంది.

మనోహర్ చెప్పే కథలంటే చెవి కోసుకుంటుంది బాణోలక్కి. అతని నిరంతర సాహచర్యం వల్ల ఆమె వేషభాషలలో గొప్పమార్పులు వచ్చాయి.

"మనోబాబా, మీరు కథాసాగరులు." అంటుంది.

"లక్ష్మి, నువ్వుకూడా కవివై పోయావు." అంటాడు.

"మీ సేవ చేస్తున్నందుకు ఆమాత్రం భాగ్యం అబ్బవద్దా?" అంటుంది.

"అయితే మనం జంటకవులమై పాటలు పాడుకొందాం." అంటాడు.

"అదుగో అక్కడ 'కో' అంటే ఇక్కడ 'కో' అని వెక్కిరించుకుంటున్న కోకిల్లలాగా?" అంటుంది.

"కోకిల బిరుదుకు నువ్వే తగినదానివి." అంటాడు చిలిపిగా.

"ఏం? నల్లగా ఉన్నాననా?" అంటుంది దొంగ కోపం అభినయిస్తూ.

"గ్రహించావు, గడుసుతనం నేర్చావు వనలక్ష్మీ!" అంటాడు నవ్వుతూ.

కిలకిలా నవ్వుకొంటారు. చెట్లమీది చిలకలు బిలబిలమని ఎగురుతూ కిలకిలమంటాయి. గువ్వలు కువకువమంటాయి. నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తాయి. చెట్ల ఆకులు జలజల రాలుతాయి. ఈ దృశ్యాలకు పులకించి పోతాడు మనోహర్.

"ఏంటే బాబాగారితో సరాగాలాడుతున్నావ్!" అని అడుగుతాడు జాండుడాయ్.

"సరాగాలేంటి, బాబా సరదాగా మాట్లాడతారు. అలా మాట్లాడ్డం నేర్చుకోవాలి నువ్వు; వొట్టి మొద్దు అవతారం." అంటుంది బాణోలక్కి.

"నేను మొద్దునే లేవే ముద్దులగుమ్మా అంటాడు." జాండుడాయ్.

"అబ్బో జాండుడాయ్ కవిస్వరుడైపోతున్నాడం డోయ్, ఇంక బతకలేం." అంటుంది వేళాకోళంగా.

"నామాటంటే ఇంత ఎక్కిరింపుగా ఉందటే సిలకా?" అంటాడు జాండుడాయ్, దగ్గరకు వెడుతూ.

"బాబా లోపల ఉన్నారు." అంటుంది బాణోలక్కి. నాలిక కరుచుకు వెళ్లిపోతాడు జాండుడాయ్.

*　　*　　*　　*

ఆకాశం నిర్మలంగా ఉంది. పున్నమ చంద్రుడు వలలవంటి చెట్లకొమ్మలను తప్పించుకొని నడి ఆకాశాన ప్రకాశిస్తున్నాడు. తనకుటీరం వెలుపల పచ్చిక పరుపు మీద తలక్రింద చెయి పెట్టుకొని వెల్లకిలా పడుకొని వెన్నెల వానలో తడుస్తూ చంద్రుణ్ణి చూస్తున్నాడు మనోహర్. చల్లని పిల్లగాలులు పూలవాసనల బరువుతో పడుతూ లేస్తూ అతన్ని ఆసరా చేసుకొని లేచి, దాటి వెళ్లిపోతున్నాయి. కాళ్లమీద మెత్తని చల్లని స్పర్శకు ఉలిక్కిపడి లేచాడు మనోహర్. ఎదర బాణోలక్కి నిలబడి నవ్వుతూ ఉంది. తెల్లని బట్టలలో ఆ నల్లపిల్ల వెన్నెలలో నిగనిగలాడుతోంది. జడలో ముడిచిన దండలో మడిచిన వేనవేల మల్లె మొగ్గలు ఉక్కిరిబిక్కిరై వాసనల ఉచ్ఛ్వాస నిశ్వాసాలను వదులుతున్నాయి. దోసిలితో తెచ్చిన మల్లె మొగ్గలు మనోహర్ పాదాలపై పోసింది. ఆ స్పర్శకే మనోహర్ ఉలిక్కిపడిలేచాడు.

"ఓ—నువ్వా వనలక్ష్మీ?"అన్నాడు మనోహర్.

"పువ్వులు మనోబాబా, పువ్వులకే ఇంత భయమా?" అంది చిరునవ్వుతో బాణోలక్కి.

"అయితే ఇంత రాత్రి నువ్వు ఎందుకు వచ్చావ్?"

"మనోబాబా! మీరు, నేను వేసిన మల్లెమొక్క మొగ్గదొడిగింది. తెచ్చి మీకిద్దామని వచ్చాను." అంది బాణోలక్కి.

"అందుకని పనిగట్టుకొని ఇప్పుడు రావాలా?" అన్నాడు మనోహర్.

"అవును మనోబాబా, తెల్లారితే పువ్వులు వాడిపోతాయో! రాలిపోతాయో!" అంటూ మనోహర్ సరసనే కూర్చుంది బాణోలక్కి. విచ్చుతున్న మల్లె మొగ్గలాంటి అరమోడ్పు కనులతో మనోహర్‌ను చూస్తూ కూర్చుంది.

"సరే ఇక వెళ్లు." అన్నాడు మనోహర్ బాణోలక్కి కళ్ళలోకి చూస్తూ.

చూస్తూనే ఈ పిల్లకళ్ళు ఎంత అందంగా ఉన్నాయ్ అనుకొన్నాడు.

"మంత్రం వేస్తున్నారా మనోబాబా!" అని కిల కిలా నవ్వింది.

మనోహర్ అలాగ చూస్తునే ఉన్నాడు.

"కళ్లలోకి గుచ్చి గుచ్చి చూస్తుంటే మంత్రం వేస్తున్నారనుకున్నాను." అంది బాణోలక్కి.

"నీకళ్లు బాగుంటాయ్, నవ్వుతున్నట్టు." అన్నాడు మనోహర్, తేరుకొని.

"మిమ్మల్ని చూస్తే వాటికి నవ్వు వస్తున్నదేమో! మీ చూపుల్ని పంపి అడగమనండి." అని నవ్వుతూ, "మరి మీ వేళ్లో ఈ వెన్నెల్లో బంగారపు కనికల్లాగ ఎలా మెరిసిపోతున్నాయో!" అంది బాణోలక్కి, మనోహర్ అరచేయి పట్టి ఎత్తుతూ.

నల్లపిల్ల చొరవకు మనోహర్ చకితుడయ్యాడు. తనకు అంతదూరాన ఉండి సపర్యలుచేసే వనలక్ష్మిలోని ఈ వింత పరివర్తనకు, ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ బాణోలక్కి మొహం పరకాయించిచూశాడు. బాణోలక్కి కళ్లు నవ్వుతున్నట్టు, పలకరిస్తున్నట్టు ఉన్నాయి. "నిజమే, ఈ పిల్ల అందం కళ్ళలో ఉంది." అనుఅంటూ ఆ కళ్ల శోభను అలాగే తనివితీరా చూస్తూ ఉండిపోయాడు. బాణోలక్కి మనోబాబా కళ్లలో కళ్లు కలిపింది. మొహానికి మొహం చేర్చింది. "లక్ష్మీ, ఏమిటిది?" అనాలని ఎంత ప్రయత్నించినా మనో

హర్ నోరు పెగలలేదు. ఈ ఆకస్మికపరిణామం అతన్ని అచేతనుణ్ణి చేసింది. నల్లపిల్ల చేతులు అతన్ని కదల నివ్వలేదు. పెదవులు పలకనివ్వలేదు. ఆమెచేతి కీలు బొమ్మ అయిపోయాడు మనోహర్.

అడవికాచిన వెన్నెల ఆనాడు వృధాకాలేదు.

“పూలచెండు పడిపోయింది.” అని పిలిచిన పిలుపు వినిపించుకోకుండా తుర్రున ఎగిరిపోయింది బాణోలక్కి.

* * * *

మర్నాడు మనోహర్ స్నానంచేసి తిరిగివచ్చే సరికి ఎప్పటిలాగా తాజా పూలదండలు, రోజాగుత్తులు కుటీరానికి వ్రేలాడడంలేదు. జాండుడాయ్ కుటీర ప్రాంగణంలోని మొక్కలకు నీరు పోస్తున్నాడు. “వనలక్ష్మి రాలేదా జాండుడాయ్?” అని కొంత బిగ్గరగా అడిగాడు మనోహర్.

“పువ్వులు తేడానికి ఇందాకనగా సచ్చింది బాబా.” అన్నాడు జాండుడాయ్, గడ్డిమీదపడి నలిగి ఉన్న పూలదండను అవలికి విసరివేస్తూ.

“నేను చూసివస్తా ఉండు.” అంటూ మనోహర్ పూలవనానికి వెళ్ళాడు. కొమ్మల్ని రెమ్మల్ని వంచి లతల్ని మొక్కల్ని కూర్చి ఆ పూల వనంలో అతను ఎన్నో లతాగృహాలు తయారుచేశాడు. ఒక పొందరింట్లో కూర్చుని బాణోలక్కి వెక్కి వెక్కి ఏడుస్తోంది. మనోహర్‌ని చూసి అదరిపడి లేచింది. దుఃఖం కట్టలు త్రెంచుకువచ్చింది. వలవలమని ఏడుస్తూ మనోహర్ కాళ్లు పట్టుకొని “నన్ను మన్నించు మనోబాబా!” అంది.

“నాకు ఎంతవిచారం కలిగిందో నీకు తెలియదు లక్ష్మీ! అయిపోయినదానికి విచారించి ప్రయోజనం లేదు. క్షణిక దౌర్బల్యం శాశ్వత కళంకాన్ని తేకుండా ఉంటే అదృష్టవంతులమే ఇద్దరమూ.” అన్నాడు మనోహర్.

“మీరు నడిచినదారికూడా తొక్కే అర్హత లేని దాన్ని మీకు అపచారం చేశాను బాబూ.” ఏడుపు ఆపుకుంటూ అంది బాణోలక్కి.

“అపచారం చేసింది నేను లక్ష్మీ! అదంతా ఒక పీడకలగా మరిచిపోదాం.” అన్నాడు అనునయిస్తూ.

“మనోబాబూ, మీరు ఆరోజున-అంటే ఈ అడవికి వచ్చిన మర్నాటి ప్రొద్దుట మొహం కడుక్కుంటూ ఒకమాట అన్నారు జ్ఞాపకం ఉందా?” అని ప్రశ్నించింది బరువుగా బాణోలక్కి.

“ఏం అన్నాను?” జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగాడు మనోహర్.

“పళ్లు తోముకొనే ముద్దను గొట్టంనొక్కి నేను పైకితీసినప్పుడు, ఆ ముద్దను లోపలికి ఎక్కించమన్నారు. ఎక్కడంలేదని నేను చెబితే పైకితీసేముందు ఈ సంగతి ఆలోచించావా? ఆలోచించకుండా చేసిన పొరపాటును సరిచేసుకోవడం ఎంత కష్టమో దీనినిబట్టి తెలుసుకోవాలి అన్నారు” అంది బాణోలక్కి.

“అవును లక్ష్మీ, జ్ఞాపకం వచ్చింది.”

“ఆ మాటలు ఎన్నిసార్లో మననం చేసుకొనే దాన్ని మనోబాబా. అయినా కాలుజారింది. ఇంక ఈ పొరపాటును ఎవరూ సరిదిద్దలేరు. మా కులదేవత బాణోలక్కిదేవికూడా ఏమీ చేయలేదు.” మళ్ళీ దుఃఖంతో కంఠం రుద్ధమైపోయింది బాణోలక్కికి.

“ఆ రోజున యధాలాపంగా అన్నమాట ఇప్పుడు మన కన్వయిస్తున్నది. నిజంగా నువ్వన్నట్టు ఇటువంటి పొరపాట్లు ముందు జరగకుండా జాగ్రత్త పడడం ఇకనైనా నేర్చుకోవాలిగాని, ఏడుస్తూకూర్చుంటే ఏం ప్రయోజనం లక్ష్మీ!” అన్నాడు మనోహర్.

“నాకిక ఏడుపే బాబా.” అని లోపల అనుకొని కళ్లుతుడుచుకు లేచింది.

“నేను కూడా సాయం చేస్తాను రా, పూలు కోద్దాం.” అన్నాడు మనోహర్.

ఇద్దరూ పూలుకోసుకు వచ్చేసరికి జాండుడాయ్ పులుకు పులుకుమని చూస్తున్నాడు. “లాకోబాయాకు జ్వరం ఎలాగ ఉందో చూసివస్తాను. ఈలోగా దండలు గుచ్చుతుండు లక్ష్మీ.” అనిచెప్పి వెళ్ళిపోయాడు మనోహర్.

మనోహర్ దూరం వెళ్లేవరకు చూస్తూఉన్న జాండుడాయ్ కుటీరంలో ప్రవేశిస్తూ “ఏం లక్కీ ఏం చేశావ్? పండగ దగ్గరపడింది.” అని అడిగాడు.

బాణోలక్కి పలకలేదు.

“నిన్నే, ఈ రాత్రి కెడదామా పూలవనానికి?”

బాణోలక్కి పలకలేదు.

“లంగేసుకు తీసుకుపోతేగాని లొంగవ్. ఏడాది నుండి రేపుమాపు అని దాటేస్తున్నావ్.” జాండుడాయ్ కొంత తీవ్రంగానే అన్నాడు.

బాణోలక్కి తలవంచుకొని పూలు గుచ్చుతోంది. జాండుడాయ్ గుచ్చి గుచ్చి అడుగుతున్నాడు:

“ఎంకా ఎన్నాళ్లు ఇట్టా దాటేస్తావే? నీమీదే ఆశలెట్టుకున్నానే! ఏమే, లక్కీ! ఇవ్వాళ వస్తావు గదూ?” అనునయంగా, అనురాగం గుమ్మరిస్తూ అడిగాడు జాండుడాయ్.

బాణోలక్కి వెక్కి వెక్కి ఏడవడం విని అదిరి పడి లేచాడు జాండుడాయ్; దగ్గిరికివెళ్ళి గడ్డంపట్టుకొని తలపైకెత్తుతూ దీనంగా ప్రశ్నించాడు:

"ఏం లక్కీ, నేను ఇష్టంలేనా?"

"జాండూ, నన్ను మరిచిపో." గొంతుక సవరించుకొని చెప్పలేక చెప్పింది బాణోలక్కి.

"అయితే నీ మనసు ఎవరిమీదో వాలిందన్న మాట?" నిరాశా నిస్పృహలతో, కించిదుద్వేగంతో అడిగాడు జాండుడాయ్.

"అవన్నీ తరచకు. ఇంక నీకు దక్కను." అంది బాణోలక్కి.

"నాగుండెల్లోనిప్పులుపోసిన ఆ మగధీరు డెవడే?" ఉద్రేకం పొంగుకు వస్తుండగా తీవ్రస్వరంతో ప్రశ్నించాడు.

"జాండు, తప్పునాది. నీకు ఆసచూపి, బాసచేసి, మాట తప్పాను. తలవని తలంపుగా కాలుజారిపోయింది. నన్ను మరిచిపో జాండూ!-నిన్ను వేడుకొంటున్నాను."

"పేరు చెప్పవా?" మరింత ఉద్రేకంగా అడిగాడు.

"తప్పు నాదైనప్పుడు, ఎవరైతే ఏం జాండూ. బాణోలక్కి దేవిముందు రే పెలాగా చెప్పక తప్పదు. దేవి ముందుకూడా నిజం దాస్తానా జాండు? నువ్వు కోపం తెచ్చుకొంటే ఏం వస్తుంది చెప్పు అంతా అయిపోయిన తర్వాత?"

"నన్ను దగాచేస్తివిగదే పిసాళీ!" అంటూ కుప్పలా కూలబడ్డాడు. కాస్సేపటికి తెప్పరిల్లి లేచాడు. గొణుక్కుంటూ, సణుక్కుంటూ పెద్ద పెద్ద అంగలువేసుకొని బైటకు వెళ్ళిపోయాడు.

"లక్ష్మీ, మీరు కీచులాడుకున్నారా ఏవిటి? పిలిచినా వినిపించుకోకుండా వెళ్ళిపోతున్నాడు జాండుడాయ్ కోపంగా." అంటూ కుటీరంలోకి అడుగు పెట్టాడు మనోహర్.

మనోహర్ మాట వింటూనే కళ్ళు తుడుచుకొని పూలు గుచ్చడం ప్రారంభించింది మళ్ళీ బాణోలక్కి.

"ఇంతసేపు ఈ కాస్త దండా గుచ్చావ్? నీ మనస్సు బాగాలేదు ఇవ్వాళ." అన్నాడు మనోహర్.

"లేదు మనోబాబా, ఇదుగో అయిదు నిమషాల్లో అయిపోతాది." అంటూ వడివడిగా గుచ్చుతూ, తలవంచుకొనే నెమ్మదిగా ప్రశ్నించింది:

"మీరు మీ ఊరు వెళ్ళిపోవడానికి నిశ్చయం చేసుకొన్నట్టేనా మనోబాబా?"

"నిశ్చయానికి ఏముంది లక్ష్మీ! వెళ్ళాలని గట్టిగా బుద్ధిపుడితే, ఎంత ఆకస్మికంగా ఇక్కడకు వచ్చానో అలాగే బిచానా ఎత్తివేస్తాను. జీవితంలో అనేక కష్టాలు—ఒకదాని వెంబడి ఒకటి చుట్టుకొనేసరికి మనశ్శాంతి పోయింది. ఈ వనశోభ నన్ను ఆనందపరచింది. అంతే, మోహన్‌ని పంపి నేను మీలో కలిసిపోయాను. ఈ ప్రకృతి సౌందర్యం, మీవాళ్ళ ఆదరణ—ముఖ్యంగా నువ్వు, జాండుడాయ్ చూపిన ఆత్మీయత నన్ను మళ్లీ మనిషిని చేశాయి లక్ష్మీ." అన్నాడు మనోహర్.

"ఎన్నాళ్ళని చెట్ల వెంట పుట్లవెంట తిరుగుతారు మనోబాబా! వెళ్లి పెళ్లి చేసుకొంటే మాఅక్క అన్ని కష్టాల్నీ మరిపించేస్తుంది." అని తల పైకెత్తి మనోహర్ మొహంలోకి చూస్తూ ఉండిపోయింది.

మనోహర్ మాట్లాడకుండా పరధ్యానంగా ఉండిపోయాడు. బాణోలక్కి నవ్వుతూ అడిగింది.

"మనోబాబా, మాఅక్కని ఇంకా ఎన్నాళ్లు కని పెట్టుకు కూర్చోమంటారు?"

మనోహర్ ఉలికిపడి బాణోలక్కివైపు చూశాడు, బాణోలక్కి నవ్వుతూ లేచి నిలబడింది.

"నీకెప్పుడు చెప్పాను లక్ష్మీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మనోహర్.

"ఎప్పుడో నా? ఇప్పుడే! మీరు దాచినా, మీ మొహం దాచలేదు."

"నువ్వు అవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలవు లక్ష్మీ! నిజమే, సరళ నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఏడాదిలో తిరిగివస్తా నన్నాను. నేనువచ్చి ఏడాది అయిందికాదూ లక్ష్మీ?"

"'బరోబరణ్' పండగ అయిన మర్నాటిరాత్రి 'అగ్గిపూజ' జరుగుతున్నప్పుడు వచ్చారు. రేపు 'బరోబరణ్' పండగ. రేపటికి సరిగ్గా సంవత్సరం అవుతుంది మనోబాబా! సరళ అక్కను ఎక్కడ విడిచివచ్చారు?"

"ఈసారిమాత్రం నువ్వు ఓడిపోయావు లక్ష్మీ! నాకు, సరళకు ఇంకా పెళ్ళికాలేదు." అన్నాడు నవ్వుతూ మనోహర్.

"మాట ఇచ్చి వచ్చారు కదా? మాటఇస్తే అయినట్టుకాదా మనోబాబా. మీరు అన్నమాట తప్పడం అంటూవుండదు."

"నిజమే లక్ష్మీ! తప్పుదామన్నా తప్పడానికి వీలులేదు. సరళ తండ్రికి మానాన్నగారు వాగ్దానం చేశారు, సరళను కోడలిని చేసుకొంటానని. ఆముచ్చట తీరకుండానే, వెళ్ళిపోయారు నాన్నగారు. ఆయన

వనలక్ష్మి

ఆఖరికోరిక కూడా అదే లక్ష్మీ! ఆయన కోరిక తీర్చడానికైనా సరళను చేసుకోవాలి."

"అదేం మాటలు మనోబాబా? మీనాన్నగారి కోరిక తీర్చడంకోసమేనా మీరు సరళ అక్కను చేసుకొనేది; అయితే అక్క అంటే ఇష్టం లేదా?"

"ఇష్టమూలేదు. అయిష్టములేదు. అయినా, సరళను చేసుకోవడం ఖాయం."

"బాబా! మీరు పెళ్ళి చేసుకొని సరళ అక్కను తీసుకొచ్చి మా అందరికీ చూపించండి."

"మీ అందరూ రాకుండా నా పెళ్ళి అవుతుందా లక్ష్మీ!" అన్నాడు మనోహర్.

పెళ్లి ప్రసక్తి మనోహర్ దృష్టిని గత స్మృతి వీధులలోకి తీసుకు వెళ్ళింది. తండ్రి మరణించేముందు తన చేయి నొసలమీద వేసుకొని "నాయనా! సరళను కోడల్ని చేసుకోవాలని ఉవ్విళ్లూరాను. నా చేతుల మీదుగా మీ పెళ్ళి చేసే భాగ్యం నా కిక లేదు. నా ఈ ఆఖరి కోరికను తీర్చు నాయనా! సరళ నీ కన్ని విధాల తగిన భార్య." అన్నారు తండ్రి. "అలాగే నాన్నగారూ! మీ కోరిక ఎలాఉంటే అలాగే జరుగుతుంది. ఈ విషయంలో మీరు బెంగపెట్టుకోనక్కర్లేదు" అని వాగ్దానం చేశాడు తను. ఆదృశ్యం మనోనేత్రాలముందు లీలగా కనబడేసరికి మనోహర్ నేత్రాలు చెమర్చాయి. రెండు కన్నీటిబొట్లు రాలిపడ్డాయి.

"మనోబాబా! అన్నీ తెలిసిన మీరే ఇలాగ ఇదవుతున్నా రేవిటి? లేవండి, దండలు గుచ్చడంలో నాకు కొంచెం సాయంచేయండి." అంది బాణోలక్కి.

మనోహర్ తేరుకొని, "లక్ష్మీ ఇక దండలు కట్టిపెట్టు, పొద్దెక్కింది. జాండుడాయ్ ఎక్కడికి వెళ్లాడో ఏమో నువ్వు వెళ్లి పాలు తీసుకురా." అన్నాడు.

"తెస్తున్నా బాబా!" అంటు పాలగిన్నెతో అడుగుపెట్టాడు జాండుడాయ్, బైట పొంచి వారి మాటలు వింటున్నాడో ఏమో!

* * * *

బరోబరణ్ ఉత్సవం ఏడాదికొకసారి వస్తుంది. వరవగణం జరిగే ఉత్సవం అన్నమాట. పెళ్లికూతుళ్ళ పండుగ అని కూడా అంటారు. యుక్త వయస్సు వచ్చిన ఆడపిల్లలను ఒక సంవత్సరం గడువిచ్చి వరుణ్ణి ఎన్నుకొనమంటారు. ఈ ఉత్సవం సందర్భంలో, వారి కులదేవత బాణోలక్కి దేవి ఆలయంలో దేవి సాక్షిగా పెద్దల సమక్షంలో ఆ ఆడపిల్లలు తమ కన్నె చెర విడిపించిన మగవాడి పేరు చెప్పాలి. పేరు చెప్పిన వాడే భర్త అవుతాడు. తొలుదొల్త కన్నెచెర విడిపించిన వాడే భర్త అవుతాడు కాబట్టి పెళ్లిని గురించి ఒక ఒప్పందానికి వచ్చిన తర్వాతనే ఆడపడుచు ఒడబడుతుంది.

బాణోలక్కి దేవి ఆలయం స్త్రీలతో, పురుషులతో, పిన్నలతో, పెద్దలతో క్రిక్కిరిసి ఉంది. దేవిని పూలతోను, పూసలతోను అలంకరించారు. దేవీ పీఠానికి ఈవల ప్రక్కగా ఎత్తైన ఆసనంమీద పూజారి కూర్చున్నాడు.

ఆనాటి వరణానికి ఆరుమంది పడుచులు నిరుడే నిర్దేశించబడ్డారు. వారిలో బాణోలక్కి ఒకతె. మిగతా అయిదుగురు పడుచులు నిండుగా ముస్తాబై, తుప్పున తూలుతూ, సంతోషం పట్టలేక నవ్వులు గుమ్మరిస్తూ పిలుపుకోసం క్షణమొక యుగంగా గడుపుతున్నారు. గుంపులోని తమ వరుడిపై ముసిముసి నవ్వులు విసరుతున్నారు. బాణోలక్కిలో ఈ ఆనంద చిహ్నాలు కనబడడంలేదు. దిగులుగా, దీనంగా తలవంచుకొని కూర్చొని ఉంది. ఆమెను చూచినవారికి ఆశ్చర్యం కలుగుతోంది!

పూజారి బిగ్గరగా ఒకొక్క పడుచుకో పేరుపెట్టి పిలుస్తున్నాడు. ఒయ్యారంగా వచ్చి, అలవోకగా శపథంచేసి, ఆనందంగా కన్నె చెరవిడిపించిన వరుడి పేరు చెబుతుంది. గుంపులోని వరులు ముందుకు తోసుకు వచ్చి వధువుల చేయిపట్టుకొని బాణోలక్కి దేవికి మ్రొక్కి, ప్రేక్షకుల కోలాహలం మధ్య బైటకు వెళ్ళిపోతారు భార్యా భర్తలుగా—ఈ కర్మకాండ యావత్తు చకచకా జరిగి పోతున్నది.

పూజారి గొంతుక సవరించుకొని, నిలిచి, చేయి పైకెత్తి గంభీరంగా "బాణోలక్కి! బాణోలక్కి! బాణోలక్కి!" అని ముమ్మారు పిలిచి బాణోలక్కి వైపుచూసి కూర్చున్నాడు.

బాణోలక్కి మెల్లగా లేచింది. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్లి బాణోలక్కి దేవికి ముమ్మారు ప్రదక్షిణం చేసింది. పూజారి పాదాలు కళ్లకు అద్దుకుంది. ప్రేక్షకులలోని పెద్దలకు వంగి నమస్కరించింది. ముళ్లతో చేసిన ధర్మకిరీటం బాణోలక్కి తలపై ఉంచాడు పూజారి.

బరువుగా తల ఎత్తి పూజారి మొహంలోకి చూసింది బాణోలక్కి.

"బాణోలక్ష్మీ! శపథం చెయ్యి." అన్నాడు పూజారి. పూజారి ఒకొక్కమాట చెప్పుతుండగా తల వంచుకొని మెలమెల్లగా ఉచ్చరిస్తోంది బాణోలక్ష్మి:

"బాణోలక్ష్మీదేవి సాక్షిగా—ఇక్కడ కూడిన పెద్దల, పిన్నల, స్త్రీల, పురుషుల సమక్షంలో—గాలి దేవుడిమీద, అగ్నిదేవుడిమీద, వానదేవుడిమీద బాస చేసి, నా కన్నెచెర విడిపించిన వన్నెకాడి పేరు చెప్పుతాను. నన్నేలుకొనడానికి నా ఏలిక అంగీకరిస్తే అతనితోనే నా మనుగడ గడిపివేస్తాను. కష్టంలో, సుఖంలో, కలిమిలో, లేమిలో, రోగంలో, ఆరోగ్యంలో అతని అండనే ఉంటాను."

శపథం పూర్తిచేసి ఏకధారగా కన్నీళ్లు కార్చుతూ స్థాణువులాగా నిలబడింది. ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలతో రెప్ప వేయక బాణోలక్ష్మిని చూస్తున్నారు. చీమ చిటుక్కుమంటే వినబడే నిశ్శబ్దం ఆలయంలో ఆవరించింది. అందరికీ ఏదో ఆతురత, అవ్యక్తమయినభయం, ఎవరిపేరు చెబుతుందో అనే ఉత్కంఠ, ఏ వైపరీత్యం జరుగుతుందో అనే ఆశంక! ఒక్కరూ నోరు మెదల్పడం లేదు. ఒక్కరూ రెప్ప వేయడంలేదు.

"బాణోలక్ష్మీ చెప్పవమ్మా నీ వరుని పేరు?" పూజారి మళ్ళీ హెచ్చరించాడు. బాణోలక్ష్మీ ఒక అడుగు ముందుకువేసింది. బాణోలక్ష్మీదేవికి తిరిగి నమస్కరించింది. 'నన్ను మన్నించండి' అన్నట్టు అందర్నీ ఒకసారి కలయజూచింది. కంపిస్తున్న కంఠంతో మెల్లగానే అయినా స్పష్టంగా చెప్పింది:

"మ-నో-హ-ర్-బా-బా."

ప్రేక్షకులు ప్రూన్పడిపోయారు. బాణోలక్ష్మీ తల వంచుకుంది. ఆలయం కోలాహలంతో మారుమ్రోగింది. గుడి గంట భయానకంగా మ్రోగింది. తీతువు పిట్ట అరుస్తూ ఎగిరిపోయింది. కొండవెనకనుంచి ఆడుపులి దీనంగావేసిన కేక మెల్లగా వినబడింది. "బాబా ఎక్కడ?" "రాలేదా?" ఆయన దీనిని ఏలుకోవడమేమిటి?" "నక్క ఎక్కడ నాకలోక మెక్కడ?" "ఆయనను పడగొట్టిందేం పొయ్యేకాలం!" "ఆయనది మాత్రం తప్పుకాదా?" "దీనికి బ్రహ్మచర్యం తప్పదు." అనే విమర్శ ప్రతివిమర్శలతో ఆలయం ప్రతిధ్వనించింది. "ఆగండి!" అని చేయి పైకిఎత్తాడు పూజారి. మళ్ళీ నిశ్శబ్దం అలముకొంది భయంకరంగా!

"బాణోలక్ష్మీ! నీవరుడు రాలేదు, కారణం?" అని ప్రశ్నించాడు పూజారి.

"నేను బ్రహ్మచారిణిగా ఉండిపోతాను." పొంగుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ సమాధానం చెప్పింది బాణోలక్ష్మి.

"అంటే—నీ వరుడు నిన్నేలుకోడన్నమాట?" గంభీరంగా ప్రశ్నించాడు పూజారి.

"నేను బ్రహ్మచారిణిగా ఉండిపోతాను; నన్ను మన్నించి, తరచి తరచి అడగకండి." దుఃఖంతోనే అయినా దృఢంగా చెప్పింది బాణోలక్ష్మి.

'కన్నెచెర విడిపించిన వన్నెకాడు' ఏలుకొనక పోతే తను ముందు నడుచుకొనవలసిన నడతను గురించి, మర్నాటి రాత్రి జరిగే 'అగ్నిపూజ' సమయంలో అగ్ని సాక్షిగా ఆ పడుచు రెండవ శపథం చేయాలి. ఈ విషమస్థితిని ఇదివరకెప్పుడూ ఎదుర్కొనని పూజారి తికమకపడ్డాడు. ఇటువంటి ఘటన తన తాత తండ్రుల హయాములో కూడా జరిగినట్టు వినలేదు. వరుడు రాకపోవడం అతని అనంగీకారంగా తీసుకోవాలో, అతని ముఖతః విన్న తర్వాత తర్వాతి కర్మకాండ జరిపించాలో అతనికి పాలుపోలేదు. మనోహర్ బాబా దగ్గరకు తాను వెళ్లి అడగలేడు. అతనంటే అకారణ భయం! "మిగతా కర్మకాండ యథాప్రకారంగా రేపటి అగ్నిపూజ దగ్గర జరుగుతుంది." అని ప్రకటించి అందరినీ వెళ్ళిపొమ్మన్నాడు. జాండుడాయ్‌ని దగ్గరకు పిలిచాడు. జాండుడాయ్ నిప్పులు గ్రక్కుతున్నాడు. పూజారి మరీ దగ్గరకు పిలిచి నెమ్మదిగా అడిగాడు. "జాండుడాయ్, నీకు బాబా దగ్గర చనువు ఎక్కువ. ఆయన అభిప్రాయం తెలుసుకు వస్తావా?"

"ఆయన దీన్ని ఏలుకోవడమేమిటి?" అన్నాడు జాండుడాయ్ కోపంగా, వెక్కిరింపుగా.

"అదికాదు జాండు! బాబా అభిప్రాయం తెలుసుకొనకుండా మనం తర్వాతి కర్మకాండ ఎలా జరిపిస్తాం చెప్పు? ఏలుకోనిమాట నిజమని నాకూ తెలుసు." అన్నాడు పూజారి.

"అయితే దీన్ని ఎందుకు చెఱిచాడు?" కోపం వెళ్లగక్కుతూ అన్నాడు జాండుడాయ్.

"అదంతా మన కనవసరం జాండు! రేపు సాయంత్రంలోగా ఆయన అభిప్రాయం తెలుసుకు రావాలి నువ్వు." అన్నాడు పూజారి.

జాండుడాయ్ తటపటాయించి, "సరే!" అని బైటకు వెళ్లిపోయాడు.

వనలక్ష్మి

కాలరుద్రుడులాగా శైటకువచ్చిన జాండుడాయ్‌ని వేపచెట్టు చాటున పొంచిఉన్న బాణోలక్కి చూచింది. నిప్పులు గ్రక్కుతున్న అతని కళ్లుచూసి అదరిపోయింది. పుచ్చపువ్వులాంటి వెన్నెలలో, మసి బొగ్గులాంటి జాండుడాయ్ కళ్లు చింతనిప్పుల్లాగ వెలిగి పోతున్నాయి.

"జాండుడాయ్!" ఎంతోమృదువుగా పిలిచింది బాణోలక్కి.

అదరిపడి వెనుదిరిగిచూశాడు జాండుడాయ్. "ఛీ పోవే గరాస!" తుప్పున ఊసి ముందుకు సాగిపోతున్నాడు జాండుడాయ్.

బాణోలక్కి వెంటబడి జాండుడాయ్‌ని నిలబెట్ట గలిగింది.

"ఎవరిమీద కోపం? పోనీ నన్ను చంపెయ్." వెక్కివెక్కి ఏడుస్తూ అంది బాణోలక్కి.

"నిన్నా?—నిన్నెందుకు?" నేలను తన్నుతూ అడిగాడు జాండుడాయ్.

"నీకు మాట ఇచ్చి మోసంచేశాను కాబట్టి."

"నువ్వుకాదు మోసం చేసింది."

"మరెవ్వరు?"

"ఎవరో నీకే తెలుసు."

"మనోబాబామీదా నీ కోపం?" గాద్గదికంగా ప్రశ్నించింది బాణోలక్కి.

జాండుడాయ్ సమాధానం చెప్పలేదు.

"నిన్ను అంత ఆప్యాయంగా చూస్తున్న మనోబాబా మీదా నీ కోపం జాండుడాయ్?" ఏడుస్తూ అడిగింది బాణోలక్కి. జాండుడాయ్ కళ్ళెత్తి బాణోలక్కి మొహంచూపి ఉస్సురని నిట్టూర్చి ఉండిపోయాడు.

"నామాట నమ్మ జాండు. తప్పంతా నాది. బాబా దేవుడిలాంటివాడు. పాపచింతలేని పసిపాపలాంటివాడు. మన కట్టుబాట్లు తెలియని బాబాను అక్రమంగా, ఆకస్మికంగా, లొంగదీశాను. అలాగ చేస్తానని నేను కూడా అనుకోలేదు జాండు, నిజంగా. జరిగినదానికి నేను అనుభవిస్తానంటున్నానుగా."

"నువ్వు నాకు కావాలి."

"ఎలాగ? ఎలా చెప్పు? కట్టుబాట్లు తప్పితే తల నరికివేస్తారే! నాకోసం ప్రాణం పోగొట్టుకుంటావా పిచ్చివాడా? పోనీ, నీకోసం నేను చచ్చిపోతా, చంపెయ్ నన్ను?"

"బాబా నిన్నేలుకొంటాడా?"

"నా తప్పుకు ఆయనను ఫలితం అనుభవించనిస్తానా జాండు! మన ఆచార వ్యవహారాలు తెలియని ఆయన్ని ఈ ఉచ్చులో ఇరికించి నాశనం చెయ్యలేను. ఈ సంగతి బాబాకు తెలియడం కూడా మంచిది కాదు. ఆయన స్వభావం నువ్వు ఎరుగుదువు. ఆయన సుఖంగాఉంటే నాకు సంతోషమే జాండు. బాబా కోసం ఎదురుచూసే పెళ్లికూతురు ఉంది. వారి జీవితం ధ్వంసంచెయ్యను." ఉద్వేగంతో చెప్పింది బాణోలక్కి.

"నీ పడుచుదనం ఈ అడవిపాలుచేసి, తాను హాయిగా పెళ్లిచేసుకోడాని కెళ్లిపోతా డన్నమాట."

"మళ్ళీ మొదలుకు వస్తున్నావు జాండు. ఆయనదేం తప్పంది చెప్పు?"

తల పంకించి ఊరుకున్నాడు జాండుడాయ్.

"బాబాకు అపకారం తలపెట్టనని ఒట్టు వెయ్యి జాండు." దీనంగా ప్రాధేయపడింది బాణోలక్కి.

"బాబా తప్పులేదంటున్నావుగా. ఆయన జోలికి వెళ్ళడం ఎందుకులే!" అన్నాడు జాండుడాయ్.

"నువ్వు మంచివాడివి జాండు. 'రాగోజాయ్' కూతురు వచ్చే యేడు పేరుచెప్పుతుంది. నిన్ను కోరుకోమని చెప్పుతాను." అంది బాణోలక్కి.

"అదంతా ఇప్పు డెందుకులే!" అని వెకిలినవ్వు నవ్వుతూ వెళ్లిపోయాడు జాండుడాయ్.

మనోబాబా కుటీరంవైపుకు కాక, తన కుటీరం వైపుకు వెళ్లిపోతున్న జాండుడాయ్‌ని చూసి తేలికపడిన హృదయంతో బాణోలక్కి తనయింటికి వెళ్లిపోయింది.

* * * *

నాటిరాత్రి జరిగిన ఆకస్మిక ఘటన మనోహర్‌కు బాధాకరమయింది. అనుక్షణం హృదయాన్ని కెలుకుతున్నది. ఆదరించి, గౌరవించినవారికి అనాలోచితంగా అపచారం చేశానని బాధపడుతున్నాడు. నలుగురితో కలిసిమెలిసి తిరగడానికి ఇదివరకులాగ మనస్కరించడం లేదు. బరోబరణ్ ఉత్సవానికి రమ్మని కబురు వచ్చినా కదలకుండా కుటీరంలోనే పడుకొని గత చరిత్రను మననం చేసుకొంటున్నాడు. శైట వెన్నెల పుచ్చపువ్వులా కాస్తోంది. వనలక్ష్మి చెప్పినట్టు సరళ నా జీవితంలో వెన్నెలలు కురిపించి కష్టాల్ని మరిపిస్తుందేమో అనుకుంటూ ఆలోచనా ప్రవాహంలో కొట్టుకు

పోతున్న మనోహర్‌కు కుటీర ద్వారం దగ్గర నల్లనినీడ కనబడింది. ఆ విచిత్ర రూపాన్ని క్రీగంట చూస్తూ ఏం జరుగుతుందో చూద్దామని అలాగే పడుకొని ఉన్నాడు. ఒక వ్యక్తి నల్లని ముసుగుతో మెల్ల మెల్లగా అడుగులు వేసుకొని లోపలికి వచ్చాడు. చేతిలో పెద్ద రాయి ఉంది. ఆగంతకునిచూసి మనోహర్ ఆశ్చర్యపడ్డాడు. ఆ నడకలో, ఒడుపులో కీడు శంకించాడు. తటాలున లేచి "ఎవరది?" అని బిగ్గరగా అరిచాడు. 'ఎవరది?' అని కొండ కోన ప్రతిధ్వనించింది. ఆగంతకుడు భయపడి, రాయి క్రిందపార వేసి వెనుదిరిగి పారిపోతున్నాడు. రెండు అంగలలో వెళ్లి మనోహర్ అతని చేయిపట్టి నిలబెట్టాడు. మొహం మీది ముసుగు తొలగించి మనోహర్ నిశ్చేష్టుడైపోయాడు. ఆ వ్యక్తిమొహం వెన్నెలలో వెలవెలబోతూ కనబడింది.

"జాండుడాయ్ నువ్వా?" దిగ్భ్రమతో ప్రశ్నించాడు, మనోహర్.

జాండుడాయ్ కొయ్యబారిపోయాడు. తల వంచుకు నిలబడిపోయాడు.

"ఏం జాండుడాయ్?" తీవ్రంగా ప్రశ్నించాడు మనోహర్.

"బాబా! మన్నించండి, బాబా! మన్నించండి!" అని ఏడుస్తూ మనోహర్ కాళ్లమీద పడిపోయాడు జాండుడాయ్.

మనోహర్‌కు అంతా అగమ్యగోచరంగా ఉంది. తనను చంపడానికి జాండుడాయ్ ఎందుకు వచ్చినట్టు? తానేం చేశాడని!

జాండుడాయ్ తల బాదుకొంటున్నాడు. ఏడుస్తున్నాడు. మనోహర్ పాదాలు కన్నీళ్లతో కడిగి వేస్తున్నాడు. రెక్క పుచ్చుకొని లేవదీశాడు మనోహర్. "ఒరేఁ నువ్వు ముందు ఆ ఏడుపు కట్టిపెట్టు." అని గద్దించాడు. కళ్లు తుడుచుకొని నిలబడ్డాడు జాండుడాయ్.

"నీ ఉద్దేశం ఏవిటి—ఎందుకు వచ్చావ్?" అని ప్రశ్నించాడు మనోహర్.

"మన్నిస్తానని చెప్పు బాబా!" మళ్లీ ఏడుస్తూ అన్నాడు, జాండుడాయ్.

"మనఃపూర్తిగా నిన్ను మన్నిస్తున్నాను. భయం లేదు. ఉన్నది ఉన్నట్టు చెప్పు?"

జాండుడాయ్ చతికిలబడ్డాడు. కళ్లు తుడుచుకొని, భయపడుతూ నెమ్మదిగా అడిగాడు:

"బాబా మీరు బాణోలక్కితో కలిసారంట గదా?"

ఈ ప్రశ్నకు మనోహర్ తయారుగా లేడు. అయినా, తేరుకొని, అసహ్యం కనబరుచుతూ అడిగాడు: "ఎవరు చెప్పారు?"

"అదే సెప్పింది బాబా!"

"చెప్పిందా? నా పగువు తీసిందా?"

"బరోబరణ్‌లో, బాణోలక్కి దేవి ఎదట చెప్పింది బాబా, దాని కన్నెచెర విడిపించింది మీరే అని."

"అందరిలో నన్ను అవమానం చేసిందీ?" ఉద్వేగంతో గట్టిగా అరిచాడు మనోహర్.

"అవమానం కాదు బాబా! మా ఆసారమే అంత! కన్నెచెర విడిపించిన మగోడిపేరు చెప్పితే దాన్ని ఆడు పెళ్లిచేసుకోవాల బాబా." అన్నాడు జాండుడాయ్.

తలపై పిడుగుపడినట్టయి అదరిపోయాడు మనోహర్. "నన్ను చంపరావడానికీ దానికీ ఏం సంబంధం?" అని ప్రశ్నించాడు మనోహర్.

"మీరు ఉండగా దాన్ని మరోడు కన్నెత్తి సూడగూడదు బాబా."

"ఓహో! అందుకా నన్ను చంపవచ్చావ్?"

"దానికోసం, మీ పేణాలు తీయాలని వొచ్చేను బాబా." వలవల ఏడుస్తూ చెప్పాడు జాండుడాయ్.

"నా మూలంగా మీ ఇద్దరి పెళ్లికి ఆటంకం కలిగింది కదూ జాండుడాయ్?"

"ఇంక నేను దీనికోసం ఏపనీ తలపెట్టను బాబా, మన్నించండి."

"అది సరేలే! నా ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పు?—మీ ఇద్దరూ పెళ్లిచేసుకోవాలనుకొన్నారు గదా అని అడుగుతున్నాను."

"నిజమే బాబా."

"నేను రావడం మూలంగా - అంటే నేను ఆమెను మొదట అనుభవించడం మూలంగా నీకు పెళ్ళి చేసుకొనే అర్హత పోయిందన్న మాట-అంతేనా?"

"అంతే బాబా."

"అంటే - నేను బ్రతికిఉంటే నువ్వు వనలక్ష్మిని చేసుకోవడానికి వీలు లేదన్నమాట మీ ఆచారం ప్రకారం."

"అవును బాబా..." అని ఏదో చెప్పబోయాడు జాండుడాయ్.

అతని మాట పూర్తిచేయనివ్వకుండా మళ్లీ ప్రశ్నించాడు మనోహర్.

"అందుకని నన్ను చంపాలని వచ్చావ్."

"మన్నించండి, బాబా." కాళ్లు పట్టుకొంటూ సమాధానం చెప్పాడు, జాండుడాయ్. మనోహర్ ఒక్క క్షణం ఆలోచిస్తూ నిలబడి, "వనలక్ష్మికి నువ్వంటే ఇష్టమే కదూ! నిన్ను చేసుకొంటుందిగా?" అని అడిగాడు మనోహర్.

"వనలక్ష్మి బ్రహ్మచారిణిగా ఉండిపోతుంది మనోబాబా!" ప్రక్కనున్న పొదరింటి చాటునుంచి వస్తూ అంది బాణోలక్కి.

"ఓహో - ఇద్దరూ ఆలోచించుకొని వచ్చారన్న మాట!" వనలక్ష్మివైపు అసహ్యం కనబరచుతూ చూసి అడిగాడు మనోహర్.

"లేదు, బాబా! లేదు! మా బాణోలక్కిదేవి తోడు! నన్ను అనుమానిస్తున్నారా మనోబాబా! గుడిలో మీ పేరు చెప్పినప్పటినుంచీ వీడు నిప్పులు క్రక్కుతున్నాడు. నాకోసం మిమ్మల్ని కడతేర్చివేస్తాడని భయపడిపోయాను. బతిమాలి గుడిసెకు పంపి ఇంటికి వెళ్లాను. నిద్దర రాలేదు. ఏదో ఆందోళన నన్ను కలచివేసింది. లేచి వెళ్లి చూస్తే జాండుడాయ్ గుడిసెలో లేడు. భయపడి ఇక్కడకు పరుగు పరుగున వచ్చాను. మొహంమీది ముసుగు తొలగిస్తూ మీరు కనబడ్డారు. ఈ పొదచాటున దాగి మీ మాటలు వింటున్నాను. వీడు మళ్లీ ఏ అఘాయిత్యమైనా చేస్తే ఇక్కడినుంచే వీడిపని పట్టించి ఉందును దీనితో." తళతళ మెరిసే కత్తి ఎత్తి చూపింది బాణోలక్కి. "మీరు నన్ను అనుమానిస్తే ఇక్కడే ఈ కత్తితో పొడుచుకు చస్తాను మనోబాబా! మీకు ఇప్పుడుకాదు; ఎప్పుడూ ద్రోహం తలపెట్టను మనోబాబా! అందుకే నేను బ్రహ్మచారిణిగా ఉండడానికి నిర్ణయం చేసుకొన్నాను. ఇంక దీనికి తిరుగులేదు. మీకు, సరళ అక్కకు ద్రోహం తలపెట్టను బాబా! చెప్పండి, ఇంకా నన్ను అనుమానిస్తున్నారా?" పొంగుకు వస్తున్న దుఃఖం ఆపుకొంటూ ఉద్వేగంతో అడిగింది బాణోలక్కి.

"నీ మనసు నాకు తెలుసు వనలక్ష్మి! మిమ్మల్ని విడదీసి పాపానికి ఒడిగట్టుకొన్నాను."

"విడదీసుకొన్నదాన్ని నేను, మీరుకాదు; అందుకే బ్రహ్మచర్యం అవలంబిస్తున్నాను." అంది బాణోలక్కి.

"బ్రహ్మచర్యం అవలంబిస్తే ఏమైనట్టు?" అని అడిగాడు మనోహర్ జాండుడాయ్‌ని చూస్తూ.

"మొదటి మొగోడు చేసుకోకపోతే ఆడది బెమ్మసారిగా ఉండిపోవాలి బాబా." అన్నాడు జాండుడాయ్.

"మీ కట్టుబాట్లు ఏవిటో సవిస్తరంగా చెప్పు జాండుడాయ్." అన్నాడు మనోహర్, ఆసక్తితో.

"మగోడు బతికిఉండి ఇంకొకత్తెను పెళ్ళాడితే ఆడది బెమ్మసారిగా ఉండిపోవాలి. మగోడు సచ్చిపోయినా, పెళ్ళాడకుండా ఉండిపోయినా ఆడది ఇంకోణ్ణి కట్టుకోవచ్చు బాబా." జాండుడాయ్ వివరణ మనోహర్‌కు ఆనందం కలిగించింది.

"ఏదీ, ఇంకొకసారి చెప్పు." అని అడిగాడు. జాండుడాయ్ మళ్లీ చెప్పాడు.

"శభాష్ జాండుడాయ్! వనలక్ష్మిని నీకు పెళ్లి చేస్తాను." అన్నాడు మనోహర్ జాండుడాయ్ భుజం చరుస్తూ.

బాణోలక్కి మనోహర్ మొహం చూస్తూ అడిగింది: "మనో బాబా! మీ ఉద్దేశం ఏవిటి?"

"ఏముంది లక్ష్మి! సమస్య అతిసులభంగా పరిష్కారమైపోయింది. నేను బ్రహ్మచారిగా ఉండిపోతే జాండుడాయ్ నిన్ను పెళ్ళాడవచ్చునుగా నిరభ్యంతరంగా?"

"బాబా..." ఏదో చెప్పబోయింది బాణోలక్కి.

"లక్ష్మి నీకు నేనంటే గౌరవం ఉందిగదా? ఇంతవరకు నామాటకు ఎదురుచెప్పలేదు నువ్వు. జాండుడాయ్ నిన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నాడో నాకు తెలుసు. మీ ఇద్దరూ భార్యాభర్తలు కావడం నా అభిమతం. మనోబాబా మాట మన్నిస్తావనే అనుకొంటున్నాను." అన్నాడు ఆవేశంతో మనోహర్.

బాణోలక్కి తలఎత్తి మనోహర్‌ను చూసింది. 'ఇంక మనోబాబా ఏమాటా వినడు' అని అనుకొంది. తలవంచుకు నిలబడింది. జాండుడాయ్ వెర్రివాడిలా ఆ ఇద్దరి మొహాలు చూస్తూ నిలబడిపోయాడు. "లక్ష్మి! నువ్వు ఇంటికి వెళ్లు. రేపు నా నిర్ణయం మీ పెద్దలకు

తెలియజేస్తాను." అని బాణోలక్కిని పంపివేశాడు. వెళ్లిపోతూ, మనోబాబాను మరొక్కమారు తేరిపార జూచింది వనలక్ష్మి. బరువైన గుండెతో, భారంగా అడుగులు వేసుకొంటూ వెళ్లిపోయింది.

"జాంకుడాయ్, ఈరాత్రి ఇక్కడే నిద్రపో! రేపు పెళ్లికొడుకువు అవుతావు - నిశ్చింతగా పడుకో." అని ఆజ్ఞాపించి మనోహర్ మేను వాల్చాడు.

*   *   *   *

మనోహర్ స్నానంచేసి తిరిగి వచ్చేసరికి "మనో బాబా! మనోబాబా!" అని పలకరించింది పంజరంలోని చిలక. జాంకుడాయ్ మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు. వాడిపోయిన పూలదండలు అసహ్యంగా కనబడుతున్నాయి.

"ఏం-జాండుడాయ్ వనలక్ష్మి ఇంకా రాలేదు?" అని అడిగాడు మహోహర్.

"పొద్దుటినుంచీ జాడలేదు బాబా!" అన్నాడు జాండుడాయ్.

"సగం రాత్రివరకూ ఇక్కడే అయిపోయిందిగా. నిద్రపోతున్నదేమో చూసిరా! పూలవనంలో ఉందేమో చూసివస్తాను నేను." అని మనోహర్ పూలవనానికి వెళ్ళాడు.

జాండుడాయ్ బాణోలక్కి ఇంటికి వెళ్లాడు.

పూలవనంలో వనలక్ష్మి లేదు; ఈసరికి వచ్చి ఉంటుందని తిరిగి వచ్చాడు మనోహర్. ఇంట్లో బాణోలక్కి లేదు; ఈసరికి తిరిగి వచ్చిఉంటుందని తిరిగి వచ్చాడు జాండుడాయ్. లేదని మనోహర్ అన్నాడు. 'లేదు బాబా' అని జాంకుడాయ్ అన్నాడు. ఊరు, వాడ వెదికాడు జాండుడాయ్. పుట్ట, గుట్ట వెదికాడు మనోహర్.

ఒకరోజు, రెండురోజులు - రెండునెలలు గడిచి పోయాయి. వనలక్ష్మి జాడలేదు. "నా బ్రహ్మచర్యం తప్పించడానికి వనలక్ష్మి వనంలో కలిసిపోయింది. జాండుడాయ్." అన్నాడు మనోహర్ దీనంగా. "అది దేవత బాబా!" అన్నాడు జాంకుడాయ్. "మనోబాబా! మనోబాబా!" అనే కీచుగొంతుక వినిపించింది. మనోహర్ అదరిపడి "జాంకు, అదిగో వనలక్ష్మి పిలుస్తోంది." అన్నాడు సంభ్రమంతో. "కాదు బాబా! సిలక పిలుపు." అన్నాడు జాండుడాయ్.

"ఈ బంధాలు త్రెంపుకొని వనలక్ష్మి పక్షిలాగ వెళ్లిపోయింది జాంకు! ఆమె పెంచిన ఈ పక్షిని ఈ పంజరంలో బంధించడం ఎందుకు? 'కీరకుమారిని' వదలి వేసెయ్." అన్నాడు మనోహర్.

జాండుడాయ్ పంజరంలోని చిలకను వదలివేశాడు. "మనోబాబా! మనోబాబా!" అని అరుస్తూ ఎగిరిపోయింది స్వేచ్ఛాప్రపంచంలోకి రామచిలుక.

చెమర్చిన కళ్ళతో అందరివద్ద 'సెలవుతీసుకొని బయలుదేరాడు మనోహర్. "ఆందాహోయ్, జిందో బోయ్!" అని ఎలుగెత్తి అభివాదం చేశారు అందరూ. వనలక్ష్మి కంఠం కలియని ఆ అభివాదం అంతా వెలితిగా, ఎంతో కలతగా తోచింది మనోహర్‌కు. చేయెత్తి అందరికీ నమస్కరించాడు. ఏటి ఒడ్డున ఏడాదిక్రితం తాను, మోహన్ కూర్చున్న చోటునుంచి బయలుదేరాడు. 'బాబా' దగ్గర సెలవుతీసుకుని అడవి మనుషులు బరువెక్కిన గుండెలతో వెనక్కు తిరిగారు. మావిడిచెట్టుమీద చిలక "మనోబాబా! మనోబాబా!" అని పలకరించింది.

"కీరకుమారీ! వెళ్లిపోతున్నా." అన్నాడు కళ్లు తుడుచుకుంటూ మనోహర్.

బరువుగా అడుగులువేస్తూ బయలుదేరాడు మనోహర్. సంచి భుజాన తగిలించుకొని 'బాబా'ను అనుసరించాడు జాండుడాయ్.

ఎఱ్ఱన ఆరణ్య రచన ఎప్పుడు?

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

ఇటు నన్నయకూ అటు తిక్కనకూ నడుమనున్న అరణ్యంలో పూర్తిదారి వేసినవాడు ఎఱ్ఱాప్రెగడ. ఈయన నివాసం గుడ్లూరు. ఇది నీలకంఠేశ్వరస్వామి కిన్నీ నివాసం. ఇది నెల్లూరుజిల్లాలోని కందుకూరుకు దగ్గరగా ఉన్నది. (ఈ గుడ్లూరు రావూరి రాఘవరెడ్డికి ముఖ్యపట్నంగా ఉన్నట్లు పెన్నేలకంటి సూరన్న చెప్పాడు. అయితే అది 1480–1500 నడుమ.) ఎఱ్ఱాప్రెగడది చేదలువాడ అని ఎఱ్ఱయ మునిమనుమడు మల్లయ్య విప్రనారాయణచరిత్రలో వ్రాస్తాడు. వేమారెడ్డి చదలువాడను రెడ్డిమల్లవరంగా మార్చాడు. ఒకవేళ దానిని ఎఱ్ఱయ కిచ్చాడేమో! ఈ వంశంవా రక్కడికి మారిఉండాలి. మల్లవరం మళ్ళా చదలువాడైనట్లు వినికిడి. ఓరుగంటి చక్రవర్తి ప్రతాపరుద్రుణ్ణి డిల్లీచక్రవర్తి చెఱపట్టి ఆంధ్రదేశాన్నంతా అతలాకుతలం చేశాడు. అప్పుడు ఢిల్లీసైనికులు చేసిన దారుణం ఎంతవంటే తెలుగుదేశంలో ఉండే ప్రతివాడూ ప్రాణాలు దక్కించుకోవడాని కెంతపెరికిపందయినా ఎదురు తిరుగవలసి వచ్చినంతది. అయితే వీరికి ఒక నాయకుడు కావాలి. అతడు ప్రోలారెడ్డి అనే మహావీరుడు. ఒకటి రెండేండ్లలోనే అతడా విప్లవాన్ని నెనుకకునెట్టి గతించాడు. పిదప అతనికొడుకు వేమారెడ్డి ఆతండ్రికి కొడుకై పగపురు గేరి పూంగిదేశానికీ క్రమక్రమంగా వేంగీదేశానికి రాజయినాడు. అద్దంకిలో గద్దెయెక్కాడు. వేమారెడ్డిని గద్దెయెక్కించినవాడు అతని తమ్ముడు సేనాపతి మల్లారెడ్డి.

పంట రెడ్లయిన ఈ కుటుంబంవారు కాకతి రాజులకు సామంతులు. ప్రోలారెడ్డి భద్రాచల ప్రాంతంలో రేకపల్లిదుర్గానికిన్నీ కొడుకు మల్లారెడ్డి కడప దగ్గర కురుములూరు దుర్గానికిన్నీ అధ్యక్షులుగా ఉండేవారు. ఈ కురుములూరి మీదికి లకుమయ దండెత్తివస్తే తిక్కసిద్ధి తరిమి కొట్టాడని తిక్కన చెప్పాడు. అంతకు పూర్వం ఈ దుర్గం గోనగన్నారెడ్డికింద ఉన్నట్లు ఒక శాసనంలో వుంది. కురుములూరినాయకుడైన మల్లారెడ్డి, ఇంత సిరి సంపద లిచ్చి మన ఎఱ్ఱాప్రెగడగారిని దగ్గర ఉంచుకొన్నాడు. 1323 లగాయతు చెలరేగినయుద్ధాలలో జయంపొంది వేమారెడ్డి అద్దంకికి ప్రభువైనప్పుడు మల్లారెడ్డి కురుములూరు వదిలేసి అద్దంకికి వచ్చి ఎఱ్ఱయను అన్నగారి చేతులలో పెట్టాడు. వేమారెడ్డి రామాయణమూ, భారతానికి ఖిలం, శేషమూ ఐన హరివంశమూ, తెలుగులో చెప్పించి రోజూ వింటూ వుండేవాడు.

'ఎఱ్ఱయ్యగారు అరణ్యం ఎప్పుడు వ్రాశారు?' దీనికి సమాధానం రావడానికి ఎఱ్ఱాప్రెగడగారి ఆద్యంతాలతో సంబంధం తెలియాలి. ఈయన జాతకం మనదగ్గర లేదు. 1323 తరువాత హరివంశ రచన. వేమారెడ్డి చేసిన గొప్పపనులలో శ్రీశైలానికీ అహోబలానికీ మెట్లు కట్టించడం ఒకటి. ఈమాట హరివంశంలో లేదు. హరివంశంలో ఉదాహరింపదగినంత గొప్పదా యిదని అంటారేమో! ఇంచుమించు ఆ కాలంలోనే శ్రీశైల కుమారపర్వతానికి రెంటాలమల్లినాథుడు మెట్లు కట్టించాడని సోమనాథుడు బసవపురాణంలో వ్రాశాడు. పిదప శ్రీనాథుడు వేమారెడ్డి కట్టించిన సోపానాలను స్వర్గానికి నిచ్చెనలని ఉత్ప్రేక్షించాడు. ఇంతగొప్పవిషయాన్ని ఎఱ్ఱన చెప్పకపోవడాన ఆ మెట్లుకుముందే ఎఱ్ఱన లేడని ఊహించకపోవడం ఎట్లా?

కొందఱు మల్లవరపు శాసనంలో సోపానాల ముచ్చట ఉన్నది. అది 1325 నాటి శాసనం. కాబట్టి 1325 కు వెనుకనే ఎఱ్ఱయ్యలేడు అని అంటారు. కాని ఆ శాసనం 1345 నాటిది. ఈ మెట్లమాట 1335 చీమకుర్తి శాసనంలో ముందరస్తిగా కనబడుతుంది. కాబట్టి 1335 కి పూర్వమే ఈయన లేడు. ఇతడు నృసింహ హరివంశపురాణాలలో తిక్కన భారతాన్నీ తిక్కన్ననూ ప్రశంసించాడు. తాను అరణ్యశేషం చెప్పినట్లు నృసింహపురాణంలో వ్రాసుకొన్నాడు. కురుములూరు మొదలుగా అద్దంకివరకూగల ఈ ముచ్చటలన్నీ ముందరవేసికొని చూస్తే—80 ఏండ్లు జీవించాడని ఉజ్జాయిస్తే 1355లో

పుట్టి 30 ఏండ్లు వచ్చినాక గ్రంథరచన సాగింది. 1285 ప్రాంతాలలో కురుములూరిలో మల్లారెడ్డివద్ద ప్రవేశం సంపాదించుకున్నాడని అనుకోవాలి. ఐతే యీ 50 ఏండ్లలో ఈ కాసిని పుస్తకాలేనా వ్రాసేది? కాబట్టి 60 ఏండ్లే బ్రదికాడని అందాం. అదైతే 1275 లో పుట్టాడని అనాలి. ఇక మల్లారెడ్డికేమీ కృతి యీయక పోవడమూ ఇతరత్రా ఈయన అలికిడి వినబడక పోవడమూ చూచి 1300-1310 నడుమ ఎఱ్ఱయ కురుములూరువెళ్ళి, వెళ్ళిన కొద్దిరోజులకే వేమారెడ్డి అద్దంకి ఆస్థానకవియైనాడని అనుకోవాలి. ఇదైతే 1275, 85 నడుమపుట్టి 1335 ప్రాంతాల అంతర్ధానమైనాడని ఊహించాలి.

ఇప్పుడు: ఆరణ్యరచన ఎప్పుడు? దీనికి సమాధానం నృసింహపురాణంలో 'నన్నయ తిక్కనలమీద నీకు చాలాభక్తివుంది. అంగువల్ల ఆరణ్యశేషం నిర్వహించావు. ప్రబంధపరమేశ్వరుడవని అనిపించుకున్నావు' అని తనతాత ఎఱపోతన్న తన్నుగూర్చి అన్నట్లు ఉంది. దీనివల్ల తిక్కన భారతం చేసినాక దాన్ని పఠనంచేసి అరణ్యశేషం నిర్వహించి ప్రబంధపరమేశుడైపోయి నృసింహపురాణం వ్రాస్తున్న ఎఱ్ఱన్న మనయెదుట కనబడుతున్నాడు.

అరణ్యంశేషంకాక ఎఱ్ఱయచేసిన ఇతరగ్రంథాలు ఇవి—రామాయణం, హరివంశం, నృసింహపురాణం. నీలకంఠేశ్వర శతకంకూడా చెప్పాడేమో!

ఈయనతండ్రి సూరకవి. సూరకవిచేసిన సంక్షేపరామాయణం ఒకటి సంస్కృతంలో ఉంది. అతడూ ఇతడూ ఒకడో కాడో! తెలుగు సంక్షేప రామాయణం ఎఱ్ఱయరచనగా లక్షణగ్రంథాలలో కనబడుతుంది. ఆ సంస్కృత—ఈ తెలుగు సంక్షేప రామాయణాల సంబంధం చూదామని అనుకుంటే తెలుగు సంక్షేపం లేదు.

ఎఱ్ఱయ యీ అరణ్యశేషం మల్లారెడ్డికిగాని వేమారెడ్డికిగాని కృతి యివ్వలేదు. ఆశ్చర్యమేమిటంటే నన్నయ్యమీద తనకుగల భక్తివల్ల ఆయన రచనగానే రాజరాజుకు కృతియిచ్చాడు. నన్నయ రచనగానే ఎపుడు సాగాడో అపుడు రాజరాజుకే కృతి యిచ్చి తీరాలి. 'కౌంతికాయవు; నీ విధి చేయగలవా?' అని అంటారేమో అని అనుకున్నాడేమో—'నన్నయభట్ట మహాకవీంద్ర సరస సారస్వతాంశ ప్రశస్తి దన్నుగ జెందుటయు' అని—ఆయనది ఆయనకే ఇస్తే బాగున్నట్లు—'తద్రచనయ కా నారణ్య పర్వశేషము పూరించె గవీంద్ర కర్ణపుటపేయముగన్' అని వ్రాసికొన్నాడు.

'...నన్నయ
లాగు చెప్పియు రాజరాజుకె
యీగి యిచ్చిన యోగిరన్నా!'

గాలిపంట

తిక్కన్నగారున్నూ, వారిశిష్యుడు మారన్నగారున్నూ, అప్పయ్యగారున్నూ—'నన్నయ్య మూడు పర్వాలు వ్రాశారని అన్నారు. కాబట్టి నన్నయ్య మూడాశ్వాసాలమీద నూట నలభై రెండు పద్యాలే కాక ఆరణ్యం సమగ్రంగానే వ్రాసిఉండాలి. నూట నలభై మూటినుండీ కడవరకూ చెదలు తినడంవల్లనో, పురుగులు కొట్టడంవల్లనో, ప్రతులన్నీ ప్రాతగిల్లి చిల్లులు పడడంవల్లనో, కొన్నిచోట్ల పద్యాలూ, కొన్నిచోట్ల గద్యాలూ, కొన్నిచోట్ల పదాలూ పోయిఉండాలి. పోయినచోట్ల ఎఱ్ఱయ్య అతుకులు పెట్టాడేకాని అది పూర్తిగా ఎఱ్ఱయరచనకాదు.' అని సుమారు 50 ఏండ్లక్రితం ఒక గాలివార్త బయలుదేరి ఇప్పటికి గాలిపంట అయింది. ఒకరు ఔనంటే ఇంకొకరు కాదంటూ ఆవాదాన్ని లాగుకుంటూ వస్తున్నారు. అప్పయ్య అప్పకవీయంలో స్ఫురదరుణాంశు-పద్యానికి అక్షరమైత్రి చూపి అక్కడినుండి ఎఱ్ఱయ సొంత అల్లికయే అని తానుభారీగా చెప్పిన 'మూడుపర్వాలు' అనేమాటకు ఇంచుమించుగా మూడుపర్వాలనే అర్థం తానే చెప్పకొన్నాడు.

ఇక 'ఎఱ్ఱయ సొంత అల్లికయే' అని అనే వారలలో కొందరు—'తిక్కన భారతానికి ముందే ఆరణ్యం ముగించి ఎఱ్ఱయ నన్నయరచనగా రాజరాజుకే కృతి యిచ్చాడుకాబట్టి తిక్కయ మారయ అప్పయలకు అసత్యదోషంలేదు.' అని అంటారు. అనగా ఎఱ్ఱయ ఆశ్వాసాంతాలలో నన్నయ వ్రాసినట్లే గద్య వ్రాశాడు.

కొందరు—'ఆరణ్యమంతా నన్నయసొమ్మే. ఆ సొమ్ము తుప్పతిన్ని కొంతరాలిపోతే ఎఱ్ఱయ్య తన బంగారం కొంత అతికాడు! ఆ అతుకులు అతుకులుగానే కనబడుతున్నవి. చూడండి నన్నయగారి రయ

ఎఱ్ఱన అరణ్య రచన ఎప్పుడు ?

విచలత్తురంగమానికి తనపాదాలు రెండతికించి ఎఱ్ఱయ బయటపడ్డాడు. నన్నయ సీసాల-అక్కఱల నియమాలు నిలుపలేక పోయాడు.' అని అంటారు.

ఎఱ్ఱయ అల్లికయే అని అనేవారు—'ఆ గయ విచలత్తురంగమం నన్నయదా? నన్నయ్యకూ మరి కొందరకూ ఇంకొకళ్ళ కబ్బాలలోని జాతి రత్నాలను తీసుకునే అలవాటు. అలాగే ఎఱ్ఱనా తీసుకుని ఉండచ్చు. అదీగాక నన్నయ రచన గా సాగే తీగులో నన్నయ్య పాదములే గ్రహించి ఉండవచ్చు. చూడండి ఎఱ్ఱయ్య;

క. సనకుఁడు సనందనుండును
సనత్ కుమారుఁడు సనత్ సుజాతుం డనఁగా

అనే ఆనుశాసనికంలోని (౧-౩౧౬) తిక్కనగారి కందపాదాలు రెండూ నృసింహపురాణంలో పెట్టుకొన్నాడు. ఇక బిగిలేని వెనుకదళాలు ముందు దళాలూ కల చంపకాలూ ఉత్పలాలూ నన్నయ్యవీ ఉన్నవి. సీసాలలోనూ అక్కఱలలోనూ తిక్కన్నను చూచి ఎఱ్ఱన్న నియమాలను వదులు చేశాడు. తిక్కన అక్కఱలతో అక్కర పెట్టుకోలేదనుకొండి. మిగిలిన గ్రంథాలలో ఎఱ్ఱనా పెట్టుకోలేదు.' అని అంటారు.

కొందరు—'తిక్కనరచనకు ముందే ఎఱ్ఱయ ఆరణ్య రచన కాబట్టి తిక్కనే ఎఱ్ఱన ననుకరించాడని అంటారు.

కొందరు—'ఈ పేర్లు కందంలో ఎవరు ఇముడ్చ దలచినా ఈ క్రమంగానే సరిగ్గా ఇల్లాగే ఇమిడిపోతవి. కాబట్టి ఇది ఒకళ్ళనొ మ్మింకొకళ్ళు పెట్టుకోడం కాదు' అని అంటారు.

కొందరు ఆరణ్యం నన్నయదే అయితే దానిలోని-'వెలుగుపడె (౭-౧౫౯)అనే కందమూకందమూ ఎఱ్ఱయ నృసింహ పురాణంలో పాతుకుంటాడా?' అని అంటారు.

కొందరు—'ఆరణ్యంలో ఈ కందమంతా ఎఱ్ఱయ అతుకే. తన పద్యమంతా తాను తీసుకోవడంలో తప్పేమిటి?' అని అంటారు.

ఇట్లా ఖండనమూ మండనమూ జరుగుతూ వున్నది. ఈ రీతిగా సాధకబాధక ప్రమాణాలతో నిజం కనిపట్టడం మేతే—'శేషం కోపేన పూరయేత్తు'గా ఉండకుండా ఉంటే. నృసింహపురాణం లోని,—

'ఉన్నత సంస్కృతాది చతు
రోక్తిపదంబులఁ గావ్యకర్తవై
యొన్నికమైఁ బ్రబంధ పర
మేశుఁడనంగ నరణ్యపర్వశే
షోన్నయ, మాంధ్రభాష సుజ
నోత్సవమొప్పఁగ నిర్వహించి తా
నన్నయభట్ట తిక్కకవి
నాథుల కెక్కినభక్తి పెంపునన్.'

ఈ పద్యంలో — ఆరణ్యపర్వశేషోన్నయము నిర్వహించితివి, ప్రబంధ పరమేశు డనంగ నిర్వహించితివి, ఆంధ్రభాష నిర్వహించితివి గమనించండి. ఈ మాసికలకు తానూ తనతాతా ప్రబంధ పరమేశ్వరు డని అనుకుంటే మంచిరోజు చూచి మహాకవి అని బిరుదువేసికున్నటు లుండదూ? జక్కన అనవద్దూ? శ్రీనాథుడనవద్దూ? లోకు లనవద్దూ?

ఇంకొకటి—తిక్కన రచనకు ముందే ఎఱ్ఱయ ఆరణ్యరచన అని ఈ పద్యము నాలుగవ చరణంవల్ల తేలిపోలేదూ ?

గాలిబ్ గీతాలు

శ్రీ దాశరథి కృష్ణమాచార్యులు

[ఉర్దూ సాహిత్యంలో అగ్రశ్రేణికి చెందిన కవి గాలిబ్. ఈయన 19 వ శతాబ్దివాడు. ఫారసీ భాషలోను, ఉరుదూలోను కవితలు కురిపించాడు. ఉపమానాలకు,ఉదాహరణలకు ఉరుదూ కవితాప్రపంచంలో ఈయన కాళిదాసు. ఈయన రచనలో అడుగడుగునా వ్యంగ్యం, ధ్వని స్ఫురిస్తుంటాయి. విప్రలంభశృంగారం ఈయన కవితలో అధికంగా కనిపిస్తుంది. గజల్ ఉరుదూ కవితలో ఒక రచనాప్రక్రియ. ప్రతి పద్యానికి రెండుపాదాలు. వస్తువులో, భావంలో ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్రం. అయితే గజల్‌లోని పద్యాలన్నిటికీ అంత్యనియమం ఉంటుంది.

కరెన్సీ నోట్లు కాగితంతో చేసినవే అయినా వట్టి కాగితం కంటె వాటి విలువ ఎన్నో రెట్లు ఎక్కువైనట్లు గాలిబ్ కవితలో కనిపించే ప్రతిశబ్దం సాధారణమైనదే అయినా అతివిశాలమైన భావాన్ని స్ఫురింపజేస్తుంది.

మూలార్థం చెడకుండాను, తేలికగా అర్థమయ్యేలాగునను గాలిబ్ గజళ్ళను అనువదించాను.]

వంపువాన బ్రతుకు బహురుచ్యమైనది,
ఎదద తీయదనము బడయ జొచ్చె-
బాధ కౌషధమ్ము బడసియు డొందంబు
మందు లేని బాధ నందె మరల.

ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్మ
నరుడు నరుడౌటయెంతో దుష్కరము సుమ్ము.

ప్రేయసీకోపవహ్ని తప్పించుకొనగ
చత్తమన్నను నన్నామె చావనీదు.

ఏమి వచియింతు దౌర్భాగ్య మింతకన్న?
చచ్చిపోవుద మన్నను చావు రాదు.

ఎంతకని వ్రాతు నాగుండె వంత? నింక
ఆమెకే చూపెదను రక్తిలాంగుళులను.

స్వర్గమున నీవు జ్ఞప్తికివత్తువేని
స్వర్గపాలునితో పోరి వత్తు తిరిగి.

చిత్రగుప్తుడు వ్రాసిన మాత్ర మనము
పట్టుబడిపోవుదుము పాపవర్తను లటు-
కాని ఎవడైన మనవాడు కలడె సాక్షి
అతడు వ్రాయునప్పుడు చూచినట్టివాడు?

గజముపట్టులేక కర్మ నేమోగాని
వెలదిమెడద జేరి పికిలిపోయె.

ఆమె నూర్వశితో పోల్చినంత, నుంత
కోపగింపక తానూరకొన్నను గాని
కినుకబూనిన, నా తప్పి యనును జగము;
ఆమె యెక్కడ? ఊర్వశి యనగ నేడ!

మలిగిన ప్రదీపమున పొగ మలసినట్లు
నా పిదప ప్రేమకీలిక నైల్యముండు.

ఉదయ మగువాక దివ్వె వెల్గొందినట్లు
మృతివరకు జీవయాత్ర సాగించవలెను.

ఎవని బుజమున నీ కురు లవతరించె
అతనిదె అదృష్ట మతనిదె హాయి సుమ్మ!

గుండె దొంగిలించుకొని పోయె ధీరయై,
పెదవి సంగిలింప వెరచు నామె.

నేను మరణింప నామె దుఃఖాన కుమిలె-
ఎంత తొందరగా కరుణించె నన్ను!

నా యెదద చీల్చి రక్తమండలము సేసి,
నేను వేదనతో మరణించినాడ;
ఇపుడు తనగోళ్ళ కెరుపురం గెట్టు లెక్కు-
వెండి తాను గోరంటాకు పెట్టుకున్న ?

"గాలి బెవ్వ" డంచు కాంత ప్రశ్నించిన
నేమి ఉత్తరమ్ము నిత్తు చెపుము?

ద్రావిడ భాషాతత్త్వానికి దారిచూపిన ఎల్లిస్

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

డాక్టరు కారే తన సంస్కృత వ్యాకరణమునకు పీఠిక వ్రాయుచు భారతీయ భాషలనుగురించి యిట్లు పేర్కొనెను: "హిందూస్తానీ, తమిళము, గుజరాతీ, మలయాళము మున్నగునవి సంస్కృతభాషా జన్యము లనుట స్పష్టము. కాని హిందూస్తానీ తమిళములందు అన్యభాషాశబ్దము లనేకములు కానవచ్చుచున్నవి. బెంగాలీ, ఒరియా, మహారాష్ట్రము, కన్నడము, తెలుగు మొదలగు భాషలలోని శబ్దములలో ముక్కాలు మువ్వీసము సంస్కృతభాషాశబ్దములే." డాక్టరు కారే ఒక తెలుగు వ్యాకరణమును కూడా ప్రకటించెను. అందలి పీఠికలో "భారతీయభాష లన్నియు సంస్కృతభాషా జన్యములే" అని తన యభిప్రాయమును పునరుద్ఘాటించెను. ఏతావతా, భారతీయభాషలకును సంస్కృతమునకును జన్యజనకసంబంధ మున్నట్లు అతడు విశ్వసించెను. ఆనాటి పాశ్చాత్య పండితులలో పలువురీ యభిప్రాయమునే సమర్థించినట్లు తెలియవచ్చుచున్నది. డాక్టరు విల్కిన్స్ అను మరియొక పండితుడు సంస్కృత వ్యాకరణ మొకటి వ్రాసెను. అందులో ఆయన "మహారాష్ట్ర గుజరాతీ భాషలలోవలె, తమిళము తెలుగు కన్నడము మలయాళము మొదలగు భాషలందును సంస్కృతశబ్దములు కోకొల్లలు. తెలుగునగాని తమిళమునగాని సంస్కృతభాషా సాహాయ్యము నపేక్షింపక ఒక్క వాక్యమైనను వ్రాయుటకు వీలుపడదు." అనెను. సంస్కృత ప్రాకృతములను గూర్చి అమూల్యమగు వ్యాసమొకటి వ్రాసిన కోల్‌బ్రూక్ అనునతడు కూడ దాక్షిణాత్యభాషలు ప్రాకృతభాషలకు చెందినవై యుండనోపునని అభిప్రాయపడెను. కనుక భాషాతత్త్వ శాస్త్రమున పరిశ్రమించిన ఆనాటి పాశ్చాత్య పండితు లెల్లరును సంస్కృతమునకును దక్షిణదేశ భాషలకును సన్నిహితసంబంధము గలదని విశ్వసించిరనుట నిశ్చయము.

ఏకాలమందైనను, సమకాలికుల యభిప్రాయములను త్రోసిరాజని ఒక క్రొత్తసిద్ధాంతమును స్థాపింపదలచుట ప్రయాసతో కూడిన పని. ఇందులకు సాహసముతోపాటు ప్రత్యర్థులను సమ్మతింపజేయు పాండిత్యము కూడ నుండవలెను. అప్పుడుగాని ఆ నూతన సిద్ధాంతము ప్రచారములోనికి రాజాలదు.

ద్రావిడభాషాతత్త్వశాస్త్ర విషయమై తన సమకాలికులతో ఏకీభవింపక ఒక నూతనసిద్ధాంతమును స్థాపించిన యశస్సు ఆనాళ్ళలో ఒక ఎల్లిస్ దొరకు చెందుచున్నది. ద్రావిడభాషాతత్త్వ శాస్త్రమనగానే డాక్టరు కాల్డ్‌వెల్ పేరు స్ఫురణకు వచ్చుట పరిపాటి. నిజమున కాయన రచించిన ద్రావిడభాషల తులనాత్మకపరిశీలన గ్రంథము భాషాతత్త్వ శాస్త్రము నధ్యయనము కావించువారికి పరమప్రమాణమగు గ్రంథము. కొందరు కాల్డ్‌వెల్‌ను ఏతచ్ఛాస్త్ర పితామహునిగా అభివర్ణింతురు. కాని యీ విశేషగౌరవము ఎల్లిస్ దొరకే సంక్రమింపవలెననుట సమంజసము.

"తమిళముగాని, తెలుగుగాని, వానితో బుట్టు భాషలుగాని సంస్కృతభాషాజన్యములు కావు. కాని వీనికి మెరుగులు పెట్టుటకు సంస్కృతము తోడ్పడగలదు. అంతమాత్రమున ఈ భాషల మనుగడకు సంస్కృత మావశ్యక మనరాదు. తమిళము, తెలుగు మొదలగునవి ఒక ప్రత్యేక భాషాకుటుంబమునకు చెందినవి. తరువాతి కాలముననే సంస్కృతభాషాశబ్దములు వీనిలో ప్రవేశించి, కలసిమెలసిపోయినవి. అంతేకాని సంస్కృతమునకును, వీనికిని దగ్గరిచుట్టరికము లేదు." అని 1816 నకు పూర్వమే ఎల్లిస్ పేర్కొనెను. ఇట్లు పేర్కొనినవారిలో అతడే ఆద్యుడు. అతడు మరణించునాటికి కాల్డ్‌వెల్ ఐదేండ్ల బాలుడు. కాగా ద్రావిడభాషాతత్త్వశాస్త్రమున కాల్డ్‌వెల్ కావించిన మహత్తర మగుకృషికి ఎల్లిస్ సిద్ధాంతము ప్రాతిపదిక అనుట సముచితము.

ఎల్లిస్ సిద్ధాంతముతో ఏకీభవింపనివారు కొందరుండవచ్చును. కాని అతడు పేర్కొనినట్లు తెలుగు ద్రావిడ కుటుంబమునకు చెందిన భాష; కాని కాలక్రమముగ సంస్కృతమునుండి జిగిని బిగిని సంతరించుకొని పరిపుష్టను చెందెను. సమస్తభాషలకును సంస్కృ

తమే జనని యని విశ్వసింపబడుచున్న యీనాళ్ళలో దక్షిణదేశభాష లొక ప్రత్యేక కుటుంబమునకు చెందిన వను విషయమును పండితలోకమునకు తొలిసారిగా తెలియజేసిన ఎల్లిస్ సంస్మరణీయుడు. అతని పూర్తి పేరు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్.

1796 లో సివిల్ ఉద్యోగిగా ఎల్లిస్ మనదేశమున కేతెంచెను. తదాదిగా అతడు సంస్కృతాది భారతీయ భాషాధ్యయనమునకును, ప్రాచీన భారతదేశ చరిత్ర పరిశీలనమునకును తనజీవితకాలమును వినియోగించెను. తెలుగు తమిళము మలయాళము మొదలగు వానిని నేర్చుటయేకాక అతడు ఆయాభాషలను గురించి ప్రశస్తములగువ్యాసములు కూడ సంతరించెను. తద్రచనము లాతని బహుముఖ ప్రతిభను వ్యక్తము చేయుచున్నవి.

1816 లో వెలుగులోనికి వచ్చిన ఎ.డి.కాంబెల్ తెలుగువ్యాకరణములో ఎల్లిస్ తెలుగుభాషను గురించి వ్రాసిన వ్యాసము తొలుదొలుత ప్రకటింపబడెను. అందది 31 పుట లాక్రమించెను. ధాతుమాలకు తాను వ్రాసిన వివరణమునందు క్రౌనుదొర యీ ప్రశస్తరచనమును గురించి ప్రస్తావించియుండుట గమనింపదగు నంశము. ఈనడుమ శ్రీ నిడుదవోలు వేంకటరావుగారీ వ్యాసమును మదరాసు విశ్వవిద్యాలయమువారి ప్రాచ్యభాషాపరిశోధన పత్రికలో ప్రకటించిరి.1

సంస్కృతాద్యార్యభాషలనుండి దక్షిణదేశ భాష లెట్లు భిన్నము లగుచున్నవో ఆ విషయమును ఉదాహరణ పూర్వకముగా ఎల్లిస్ పై వ్యాసమున వివరించెను. తెలుగుధాతువుల స్వభావమును కూడ వివరించెను. పట్టాభిరామశాస్త్రిగారు సంకలితం చేసిన తెలుగు ధాతు మాలనుండి కొన్ని ధాతువులను గ్రహించి వానిని సంస్కృతధాతువులతో సరిపోల్చి సంస్కృతాంధ్ర ధాతువులు విభిన్నములని విపులముగ వివరించెను. అంతే కాక వాక్యనిర్మాణమున కూడ సంస్కృతమునందలి సంప్రదాయమునకును దక్షిణదేశభాషలందలి వాక్య రచనావిధానమునకును పోలికలు లేవని నిరూపించెను. ఎల్లిస్ వ్యాసమునం దుదాహృతము లయిన కొన్ని తెలుగు వాక్యముల నిట నుదాహరించుచున్నాను.

"కుమారులు స్వేచ్ఛగా నిద్రించుచున్నారు. నరకములో నుండేవారున్ను, మిక్కిలి యేడుచుచున్నారు. గాయకులు -మిక్కిలి పాడుచున్నారు, రోగముచేత కొట్టబట్టవారున్ను బాగా చచ్చుచున్నారు."

"వానికి బహు ధనము ఉన్నది."

"ఎవనిగురించి గొల్ల ఆడవారి గుంపు తమకము వెళ్ళ, లేనితప్పులు ఎంచెనో, అలిగెనో, ఓర్చక పోయెనో, ఇంపాయెనో, చేదోర్చెనో, కాచియుండెనో, బొంకెనో, పొగడెనో, కోరెనో, తిట్టెనో, ఆ హరి పెద్దలకు హాయినిచ్చుగాక!"

తమిళభాషను గురించి కూడ ఎల్లిస్ ఒకవ్యాసము వ్రాసెను. నేడిది అలభ్యము. కాని తమిళ ఛందస్సును గూర్చి అతడు వ్రాసిన వ్యాసము మాత్రము లభించినది. ఇది వ్రాతలో నూరుపుటలరచన. మలయాళభాషను గూర్చి అతడు రచించిన వ్యాసము ఇండియన్ ఆంటిక్వరీ 7 వ సంపుటములో ముద్రితము. కన్నడభాషను గురించి కూడా ఎల్లిస్ వ్రాసెనేమో తెలియవచ్చుట లేదు. ఈ వ్యాసము లన్నియు ద్రావిడభాషా తత్త్వశాస్త్రము నభ్యసించువారికి శిరోధార్యము లనదగును.

పై వ్యాసములనే కాక ఎల్లిస్ భూస్వామ్యమును గురించి అమూల్యమగురచన మొకటి చేసెను. అందలి ప్రాశస్త్యమును గుర్తించి అప్పటి మదరాసు ప్రభుత్వమువారు దానిని 1818 లో ప్రకటించిరి. నాటి నుండియు నేటివరకు అది ప్రామాణిక రచనముగానే పరిగణింపబడుచున్నదని పేర్కొనదగును.

తమిళవేద మని ప్రస్తుతింపబడు తిరుక్కురళును ఆంగ్లములోని కనువదించిన తొలి యూరోపీయుడు ఎల్లిస్ దొరే. తొలుత పద్యానువాదమును పిమ్మట పరిమేళగర్ అను ప్రాచీన పండితుడు రచించిన వ్యాఖ్యానమును, అటుపిమ్మట సంగకాలపు తమిళకావ్యముల నుండియు మరియితర ప్రాచీనకావ్యములనుండియు ఉదాహరణముల నొసగుచు ఎల్లిస్ తిరుక్కురళును ఆంగ్లము చేసెను. కురళునందలి ధర్మఖండములోని తొలి పదునెనిమిది అధ్యాయములను మాత్రమే అతడిటుల అనువదింపగలిగెను. వానిలో పదుమూడు అధ్యాయములను ఒకగ్రంథముగ మదరాసు విశ్వవిద్యాలయము

1. చూడుడు : Annals of oriental Research of the University of Madras, Volum XII-1954-55

వారు ప్రకటించిరి. అటనట కొన్ని శబ్దములకు ఎల్లిస్ ఒసగిన వివరణయు, అతడు చేసిన సూచనలును ప్రశంసార్హములు. అతని తమిళ పాండిత్యమునకీ యనువాదము నికషోపల మనదగును.

తమిళములో ఎల్లిస్ కవిత్వము చెప్పెననియు విదితమగుచున్నది. 'నమశ్శివాయ' యను మకుటముతో అతడు రచించిన పద్యములుమాత్రమే నేడు లభించినవి. ఒక పద్యమునందలి భావమును పరికింపుడు.

"సర్వశక్తి సంపన్నుడ వీవు! సర్వలోకాధిపతి వీవు! ఆనందము రూపుగట్టిన పరబ్రహ్మమవునీవు! భువి నేలెడి యీరాజులు తమ ప్రజలనుండి బలిమిమై కప్పము గొనుచున్నారు. మరి నీవో! రాజాధిరాజవు! అయినను కప్పమడుగవు. అందువలన మాటలతో కాక, నాహృదయమునందు ప్రభవించి పొంగి పొరలుచున్న భక్తిని నీ పవిత్ర చరణసన్నిధిని కానుకగా సమర్పించుచున్నాడను."

సాహిత్యరంగమున ఎల్లిస్ కావించిన కృషి అనల్పము. అతడనేక రచనలు చేసియుండనోపును. కాని అవి వెలుగులోనికి రాలేదు. దురదృష్టవశమున ఎల్లిస్ రచనలన్నియు అగ్నిహోత్రునిపాలయ్యెను. నెలలతరబడిగా నిప్పుచేయుటకును, కోళ్ళు మొదలగువానిని కమర్చుటకును తుదకా కాగితము లుపయోగపడెను. తమిళ వాఙ్మయమును పెంచి పెద్దచేసిన మధురానగరమునందీ విషాదఘటన జరగుట అత్యంతశోచనీయము. కాని యీ ఘటనద్వారా అతని రచనావ్యాసంగ మెట్టిదో లోకమునకు తెలియవచ్చెను.

ఇక దిఙ్మాత్రముగ ఎల్లిస్ జీవితవిశేషాదికమును పరిశీలింతము.

ఎల్లిస్ 1780 వ సంవత్సరప్రాంతమున జన్మించెను. మనదేశమునకు వచ్చునప్పటి కాతడు పదునారేండ్ల యువకుడు. 1806 లో అతడు మచిలీపట్నం జిల్లా జడ్జిగా నియమితుడయ్యెను. అటుపిమ్మట—అనగా—1809 లో మదరాసు రాజధాని లాండ్‌కస్టమ్స్ కలెక్టరుగా నియమింపబడెను. 1810 లో మదరాసుకలెక్టరు పదవి నలంకరించెను. నాటినుండియు అతడు రమారమి ఇరువదేండ్లు సంస్కృతాదిభాషాధ్యయనము చేసెను. ఒకవైపు ఔద్యోగికధర్మములను నిర్వర్తించుచు మరొకవైపు ఎల్లిస్ విద్యారంగమునకూడ ప్రముఖపాత్ర వహించెను. 1816 లో అతడు మదరాసునందలి ఫోర్టుసెంటుజార్జి కళాశాల పర్యవేక్షణమండలి అధ్యక్షుడుగా నియమితుడయ్యెను. ఈమండలి 1812 లో ఏర్పడెను. మదరాసురాష్ట్రమునందలి ప్రధానభాషలలో సివిల్ ఉద్యోగులకు తర్ఫీదుఇచ్చుట, న్యాయస్థానములందు నియమింపబడు అధికారులకు (మున్షీలు) శిక్షణ ఇచ్చుట మొదలగునవి ఈమండలి నిర్వహింపవలసిన కార్యములు. దీనిని స్థాపించుటకు కృషిచేసినవారిలో ఎల్లిస్ స్మరణీయుడని విదితమగుచున్నది. ఎల్లిస్ కృషిని కొనియాడుచు నొక సహృదయుడిట్లు పేర్కొనెను. "చులకనగా చూడబడుచున్న సంస్కృతము, తెలుగు, మలయాళము మున్నగు నీదేశభాషల నభ్యసించెను. తమిళ లక్ష్య లక్షణశాస్త్రముల నభ్యసించెను. మదరాసులో విద్యాసంఘమును స్థాపించుటకు కృషిచేసి యాసంఘమును నెలకొల్పి, ఆసంఘమును పాంథ్యునివలె ఎల్లిస్ సంరక్షించెను."

ఏవిషయమునైనను ఎల్లిస్ క్షుణ్ణముగా తెలిసికొనుచుండెడివాడు. దక్షిణదేశభాషలను గురించి అతడనేక విషయములు సేకరించెను. వానిని గ్రంథరూపమున ముద్రించుటకు మునుపు తనకుగల సంశయములను తీర్చుకొన నభిలషించి మధురానగరమునకు పయనమై వెడలెను.

మధురజిల్లా కలెక్టరగు ఆర్. పీటరు నివాసమున ఎల్లిస్ బస యేర్పరచుకొనెను. ఒకనాడతడు రామనాథపురమునకు పోయెను. అట పొరపాటున ఎల్లిస్ దొరగ విషము మ్రింగి దుర్మరణము చెందెను. అది పదియవ తేదీ మార్చి; 1819 వ సంవత్సరము,

బహుభాషాభిజ్ఞుడుగా, భాషాతత్త్వశాస్త్రవేత్తగా ఎల్లిస్ దొర చిరస్మరణీయుడు. తెలుగుభాషాతత్త్వమును ప్రప్రథమముగా పాశ్చాత్యపండితలోకమునకు పరిచయము కావించిన ఎల్లిస్ దొర చిరస్మరణీయుడనుట చర్వితచర్వణమే కాగలదు!

ఖనిజంలో నిజం

శ్రీ వి. భావనారాయణరావు

అతని మనసు వెనుక దాగియున్న విపరీత కాముకుడు,
అతని చేతుల నాదేశిస్తున్న వృద్ధ ధార్మికుడు,
నిరంతర ఘర్షణలో బడి
అతని క్షోభపాలు చేస్తున్నారు తలపడి—
అతని మనస్సుకే జుగుప్స కలిగించి అతన్నసహ్యపరిచే భావాల,
నలుగురి మెప్పు తెచ్చి సన్మార్గంలో ఉన్న అన్ని కృత్యాల,
సమము దాగిన సంఘర్షణకు
ఆనవాలు లేకుండా నలుగురికీ కడకు—

లోక మెరుగని దాహం,
లోప లల్లుకుంటున్న పద్మవ్యూహం,
కర్మేంద్రియాలకు ప్రసారం కాక
కుమార్గంలో ప్రవర్తన చొరవక
ఏ శక్తికి కట్టుబడి
నిశ్శక్తులైనవో, నిస్సడి—

మనసు ననుగమించే చేతలు,
చేతల మెరుగుపొందే భావాలు,
పరస్పర ప్రభావాను
మరచుటొక అపూర్వమౌ వింత!
కలువనే లేదు వీటి క్రీనీడలు
ఒకటొకటిని రవ్వంత!!

కాని ఒకనాటికి ప్రమాదం నిశ్చయం
కత్తి మొనపై మనుగడ అస్థిరం
జరుగునో కడకు ప్రాణసంచయం
తరుగునో సర్వగౌరవ నిచయం.

కవులు: హిరణ్యగర్భోపాసన

శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

కవి క్రాంతదర్శి. క్రాంతదర్శి యనగా [1] త్రైకాలిక జ్ఞానము గలవాడు. వైదిక వాఙ్మయమునందంతటను కవులనగా జ్ఞానులు. లోకమున రాను రాను ఈ యర్థమునకు ఛాయ మారినది. కవిత్వము చెప్పువాడు లేదా కావ్యమల్లువాడని రూఢియైనది. ఒక్కొక్కప్పుడు ఊహ పోహ పటువుగా బలుకు వానిని గూడ కవి యనుట కద్దు. మరి జ్ఞానులును కవులును ఒక్కటి కారా? కావలసియే యున్నది. ఒక్కటిగ నున్నారా అనునది వేరు ప్రశ్న. జ్ఞానులును కవులును ఒక్కటిగానున్నప్పటి పరిస్థితి యెట్లుండెనో, ఇప్పు డెట్లుండవలయునో, ముందెట్లుండవచ్చునో కొంచె మాలోచింతము. వేదాంతము వారికి కాకపోయినను కవులకు కవిత్వమునకు ఇది ముఖ్యమగు విషయము.

వేదాంతమునకు కవిత్వమునకు మధ్య విరిసినపొర చాల పలుచనిది. వేదాంతము శాస్త్రము. మేధామతి మనీషాద్యుపలబ్ధము. కవిత్వము కళ. సంజ్ఞాన పాకము నందినది కళ. సంజ్ఞాన మనగా అంతఃకరణ వ్యాప్తమైన ఆత్మచేతనభావము. పాక మనగా తైజస సంయోగము. వేదాంతము ప్రజ్ఞానమునకు దారి, కవిత్వములోని 'కళ' నేరుగా ఆత్మ 'కల'కే దారి. వేదాంతమునకు కవిత్వమునకు ఇట్లు భేదము మార్గమునందు, 'దృష్టి' యందే కాని పరాయణ మొక్కటే. మన మున్నాము. అనంతమైన విశ్వసృష్టి యున్నది. తన్ను గురించి, తన కావలనున్న విశ్వసృష్టినిగురించి మానవు డనాదిగా ఆలోచించుచునేయున్నాడు. కొందరీ సృష్టియంతయు నెట్లు పుట్టినదని యోచించి భగవత్సంకల్పమని తృప్తిపడినారు. మరికొందరీ సృష్టికి కాలమే కారణ మని తేల్చుకొన్నారు. ఇంక కొందరీ సృష్టి యంతయు భగవంతుని భోగార్థము, క్రీడార్థము కలిగినదని తలపోసినారు. ఆప్తకాముడైన భగవంతునికి మరల ఈ భోగము, క్రీడ ఎక్కడిదని ఆక్షేపించుకొని ఆయనకు నైసర్గికమైన మాయచేతనే ఈ సృష్టి సమస్తమును నిర్మింపబడినదని ఉపనిషత్తు చెప్పుచున్నది.

'ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టి రితి సృష్టౌ వినిశ్చితాః,
కాలాత్ప్రసూతిం భూతానాం మన్యన్తే కాలచింతకాః.
భోగార్థం సృష్టి రిత్యన్యే క్రీడార్థ మితి చాపరే
దేవస్యైష స్వభావోయ మాప్తకామస్య కా స్పృహా.'

2

సృష్టిలోని మాయావరణమును బట్టి తత్త్వమును గూర్చి వివేచనచేయువారు రెండు తెగలుగా నున్నారు. ఇది యంతయు స్వప్నమనియు, మాయ యనియు వికల్పించెడువా రొక తెగ. అస లొక విధముగా నుండగా మరొక విధముగా గ్రహించుట స్వప్నము. తత్త్వము తెలియకపోవుటయే నిద్ర. 'అన్యథాగృహ్ణతః స్వప్నో నిద్రాతత్త్వ మజానతః.' ఈ పై తెగవారిని మనము సామాన్యముగా వేదాంతు లనవచ్చును. ఇక రెండవ తెగవా రున్నారు. వీరు సృష్టి యంతయు భగవద్విభూతి యని తలచువారు. వీరికి ప్రపంచమునం దాదరభావమున్నది. కనుకనే అందలి భగవద్విభూతిని గుర్చిన పర్యాలోచనమును ఉన్నది. వీరిని 'సృష్టిచింతకు'లన్నారు. మనము సామాన్యముగా కవులనువారి నెల్ల ఈ రెండవ తెగకు చేర్చవచ్చును. 'విభూతిం ప్రసవం త్వన్యే మన్యన్తే సృష్టిచింతకాః.' తత్త్వసాధనలో సృష్టిచింతకుడుగాక సృష్టి యంతయు స్వప్నమనియో మాయ యనియో తలపగలుగుట చాలమందికి సాధ్యముకానిపని. కాగా సృష్టిచింతనలో తత్త్వమును వెదుకాడు కవి ప్రచ్ఛన్న వేదాంతి; కవిత్వము గూడ తత్త్వసంగ్రహమో తత్త్వార్థస్ఫురణము గలదో అగును. కర్తయైన కవి యోగ్యతను బట్టియు పాఠకుని అధికారమును బట్టియు ఈ తత్త్వస్ఫూర్తి భాసించుట జరుగుచుండును.

ఇంతకును ఈ సృష్టిచింతకుల తత్త్వసాధన మార్గమేది? అక్షర పరబ్రహ్మోపాసనము. సాలెపురుగు తనలోనుండి దారములల్లి లోనికితీసుకొన్నట్లు, నేలలో ఓషధులు (వ్రీహియవాదులు) పండినట్లు, మగవాని యొడలిపై కేశలోమములు మొలచినట్లు అక్షరుని నుండి విశ్వము పుట్టుచున్నదని ఉపనిషత్తు:

'యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ
యథా పృథివ్యా మోషధయ స్సంభవన్తి,
యథా సతః పురుషాత్ కేశలోమాని
తథాక్షరా త్సంభతీహ విశ్వమ్.'

---

1 'అతీతానాగత విప్రకృష్ట విషయకం యుగపద్ జ్ఞానం క్రాంత దర్శనమ్'—యువ్వట నిర్వచనము.

ఆదిత్యవర్ణుడని రుక్మవర్ణుడని కీర్తింపబడు పరమపురుషుడు సగుణుడై సృష్టి పర్యాప్తుడైనపుడు హిరణ్యగర్భు డనబడుచున్నాడు. సృష్టిచింతకులీ హిరణ్యగర్భునే ఉపాసించుచున్నారు. ఈ సృష్టిచింతకులలో కార్మికులని తదితరులని మరల రెండు తెగలవారున్నారు. సృష్టి నాదరించుట ఇరుతెగలవారికిని సమానమే. కాని కార్మికులు కేవలము యజ్ఞయాగాది కర్మాచరణమే పుణ్యలోకావాప్తికి మార్గమని తలచువారు. ఉపనిషత్తు కూడ వారిని కర్మచేయుడనియే యుద్బోధించుచున్నది.

'తదేత త్సత్యం। మంత్రేషు కర్మాణి కవయో యా న్యపశ్యం స్తాని త్రేతాయాం బహుధా సన్తతాని। తా న్యాచరథ నియతం సత్యకామా ఏష వః పన్థా స్సుకృతస్య లోకే।'

అంతమాత్రమే కాదు. వారు వ్రేల్చిన ఆహుతులు సూర్యకిరణములై యజమానుని రమ్ము రమ్మని పిలచి స్తుతించి మీ పుణ్యఫలమైన బ్రహ్మలోక మిదిగో యని చూపించుచు అతని కాఫలము పొందించునట!

'ఏహ్యేహీతి త మాహుతయ స్సువర్చసః
సూర్యస్య రశ్మిభి ర్యజమానం వహన్తి,
ప్రియాం వాచ మభివదన్త్యోఽర్చయన్త్య
ఏష వః పుణ్య స్సుకృతో బ్రహ్మలోకః।'

ఇంక కవులమాట. లోకమున సామాన్యముగా కవులు కర్మిష్ఠత కించుక దూరులైనట్లు కనబడుచుందురు. కర్మిష్ఠతవలన ప్రయోజనము లేదని భావించినట్లు ప్రవర్తింతురు. కర్మిష్ఠియైనవాడు విహిత కర్మల నాచరించిన పిదప తానెట్టివాడై గురువును వెదుకుకొనుచు బోవలెనో గురువెట్టి శిష్యునికి అక్షరతత్త్వము నుపదేశింపవలెనో ఈ క్రిందివిధముగా చెప్పబడినది.

'పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేద మాయా న్నా స్త్యకృతః కృతేన,
తద్విజ్ఞానార్థం స గురు మేవాభిగచ్ఛేత్
సమిత్పాణిం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్.'

బ్రాహ్మణుడు కర్మచేత వృద్ధి పొందింపబడిన లోకముల బరీక్షించి ఈ సంసారమున నిత్యమగు పదార్థము లేదు కర్మతో నేమి ప్రయోజనమని వైరాగ్యమును బొంది అక్షర స్వరూపమును చక్కగా నెఱుగుటకు చేత సమిత్తులు బూని అధ్యయనసంపన్నుడు బ్రహ్మనిష్ఠుడు నగు గురువును గూర్చి పోవలెనని పైదాని కర్థము.

'తస్మై స విద్వా నుపపన్నాయ సమ్యక్
ప్రశాన్తచిత్తాయ శమాన్వితాయ,
యేనాక్షరం పురుషం వేద సత్యం
ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్.'

బ్రహ్మవేత్తయగు గురువు ప్రశాంతచిత్తుడై, బాహ్యేంద్రియ శమము బూని వచ్చిన ఆ శిష్యునికొరకు సత్యస్వరూపమైన అక్షరస్వరూపమును దేనిచే నెఱుగునో ఆ బ్రహ్మవిద్యను యథార్థముగా చెప్పవలెను.

సత్కవి స్థితి సరిగా నీ గురుశిష్య సంబంధమున జెప్పిన శిష్యుని స్థితివంటిది. అప్పకవి 'ధరణీసురుడు ప్రశాంతు' డిత్యాదిగా గల పద్యమున జెప్పిన సత్కవి లక్షణ మిట్టిదే అనుకొందును. కాగా కవులు కర్మిష్ఠుల కంటె నొక మెట్టు ముందున్న వారుగా కనబడుచున్నారు. కాగా కవులు కర్మిష్ఠులు గాకపోయినను కర్మసన్యాసులును గారు. ప్రవృత్తి మార్గమున నున్నవారు. స్వాశ్రమ విహిత ప్రవర్తనులు. తిప్పక శాంతచిత్తులు. హిరణ్య గర్భోపాసకులు. ఆ హిరణ్యగర్భోపాసనకు ఫల మిట్లు చెప్పబడినది:

'తపశ్శ్రద్ధే యే హ్యుపవస న్త్యరణ్యే
శాన్తా విద్వాంసో భైక్షచర్యాం చరన్తః,
సూర్యద్వారేణ తే విరజాః ప్రయాన్తి
యత్రామృత స్స పురుషో హ్యవ్యయాత్మా.'

వారు విరజులై అమృతుడు అవ్యయాత్ముడునైన పురుషుని జేరుదురట.

హిరణ్యగర్భుడే సమస్త సృష్టి. అతని వలననే దేవతలు సాధ్యులు మనుష్యులు పశుపక్ష్యాదులు పుట్టెను. అంతేకాదు ప్రాణాపానములు, వ్రీహియవలు, శ్రద్ధాసత్యములు, తపస్సు, విధి బ్రహ్మచర్యము కూడ పుట్టినవట.

'తస్మాచ్చ దేవా బహుధా సంప్రసూతాః
సాధ్యా మనుష్యాః పశవో వయాంసి,
ప్రాణాపానే వ్రీహి యవౌ తపశ్చ
శ్రద్ధా సత్యం బ్రహ్మచర్యం విధిశ్చ.'

మరియు సముద్రములు, గిరులు, నదీనదములు, ఓషధులు, రసములు, చివరకు ఏ రసముచే జీవాత్మ పృథివ్యాది పంచభూతములచే నావరించ బడినదై ఉండుచున్నదో అదియును హిరణ్యగర్భుని వలన గలిగినదే.

'అత స్సముద్రా గిరయ శ్చ సర్వే
అస్మా త్స్యన్దన్తే సిన్ధవ స్సర్వ రూపాః,
అతశ్చ సర్వా ఓషధయో రసశ్చ
యేనైష భూతై స్తిష్ఠతే హ్యన్తరాత్మా.'

కవు లీసమస్తమును భగవద్విభూతిగా జూతురు. ఆ దానియనుభవమున కన్నులు చాతురు. తక్కినమాటలు

విడిచిపెట్టి అక్షర పురుషునే జీవుడుగా నెఱుగుదురు. ఆత్మజ్ఞానముతో అమృతత్వమునకు సేతువుగట్ట నిచ్ఛయింతురు. ఉపనిషదృషి ఏమనుచున్నాడో చూడుడు:

'యస్మిన్ ద్యౌః పృథివీ చాన్తరిక్ష
మోతం మన స్సహ ప్రాణైశ్చ సర్వైః,
తమేవైకం జానథాత్మాన మన్యా
వాచో విముఞ్చత అమృత స్యైష సేతుః.'

తేజోవంతము అతిసూక్ష్మము నైన దేనియందు ద్యౌః పృథివ్యాకాశములు కూడుకొనియున్నవో, ఇంద్రియ సహమైన మనస్సుకూడియున్నదో ఆ అద్వితీయమైన అక్షరపురుషునే జీవుడుగా నెఱుగుడు. తక్కిన మాటలు విడిచిపెట్టుడు. ఈ ఆత్మజ్ఞానము అమృతత్వమునకు సేతువు—అని దీని యర్థము.

కవుల లక్ష్య మిట్లుండును. వారి కనుభవములోని దివ్య విభూతియందు తాత్పర్యము. విషయములయందపేక్షలేని యుపేక్ష. ఇది యసిధారాత్రవతమైన చర్య. భౌతికవిజ్ఞానమున ప్రయోగము చేయువానివలెనే కవియును నిర్మమత్వముతో తన యనుభూతి విశేషమును విశ్లేషించి చూచుకొనుచు దానిలో భగవద్విభూతికై వెదుకాడును. దివ్యవిభూతిచే నావిష్టుడై చెప్పిన కవిత నురుగులు గ్రక్కు రసస్రోతస్వినిగా నుండును. అందలి ప్రతిశబ్దమును ఆ విభూతి పరివేష్టము; అవశము. కాని కవికి తనలోని ఆత్మవిభూతి గాని సృష్టిలోని దివ్య విభూతిగాని తెలియుట ఎట్లు? ఆత్మజ్ఞాన మధ్యయనమువలనగాని మేధవలనగాని వినికిడి వలనగానీ రాదు. 'నాయ మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా బహునా శ్రుతేన.' మరి దానికి సాధన కావలెను. 'దృష్టి' కావలెను. 'దృష్టి' యనగా ఇంద్రియ మార్గమున తెలియుట.

3

సాధకు డాత్మజ్ఞానము నంతరంగ బహిరంగముల రెంటను సాధింపవలసియుండును. తనకంటె వెలుపలి సమస్త సృష్టిని భగవద్విభూతిగా జూడగలుగుటకు మునుపు తన స్వరూప మెట్టిదో స్వభావ మెట్టిదో తెలియవలెనుగదా? అన్నిటికంటె కష్టమైనదియు పరమార్థమైనదియు నీ సాధన. ఈ సాధన స్వరూపమునుగూర్చి యాలోచించుటకుముందు మన మాత్మ, బుద్ధి, మనస్సు, మొదలగు పేర్లతో వ్యవహరించువానిని గూర్చియు పాంచభౌతికమైన పృథివ్యాది సృష్టి ప్రపంచ విస్తరమును గూర్చియు నిష్కర్షగా నెఱుగవలసియున్నది. ఈ సందర్భమున తార్కికులు శాస్త్రమార్గమున నాయా వానిని గూర్చి ఏమని నిర్వచించిరో సంగ్రహముగా చూతము. జ్ఞానాధికరణమాత్మ. ఆ యాత్మ పరమాత్మయనియు జీవాత్మయనియు రెండు విధములు. పరమాత్మ ఈశ్వరుడు, సర్వజ్ఞుడు. ఒక్కడే. జీవాత్మ ప్రతి శరీర భిన్నుడు. విభుడు. సర్వమూర్త ద్రవ్య సంయోగిత్వము విభుత్వము.

సర్వవ్యవహారహేతువైన జ్ఞానము బుద్ధి. అది స్మృతి యని అనుభవమని రెండు తెరగులు. సంస్కారమాత్రముచేత బుట్టు జ్ఞానము స్మృతి. సంస్కారము (Faculty) వేగ, భావనా, స్థితిస్థాపకత్వములని మూడు రకములుగా నుండును. వేగము పృథివ్యాది చతుష్టయ మనోవృత్తి. అనుభవజన్యమైన స్మృతికి హేతువైనది భావనాత్మమాత్రవృత్తి గెంపవది. అన్యథాకృతమైనదానిని మరల తొంటి యవస్థను బొందించునది స్థితిస్థాపకత్వము. కటాది పృథివీవృత్తి గలది. ఈ స్మృతి కంటె భిన్నమైన జ్ఞాన మనుభవము. ఇది మరల యథార్థానుభవమని అయథార్థానుభవమని రెండు విధములు. వెండిని జూచి వెండి యనుకొనుట యథార్థజ్ఞానము. ముత్తెపుచిప్పను జూచి వెండి యనుకొనుట అయథార్థజ్ఞానము. యథార్థ జ్ఞానమును ప్రమ యందురు. అయథార్థజ్ఞానము అప్రమ. భ్రమయని వ్యవహారము. యథార్థానుభవము (జ్ఞానము) ప్రత్యక్షము (Direct Apprehention), అనుమితి (Inference), ఉపమితి (Comparison), శబ్దము (వేదముగాని, ఆప్తవాక్యముగాని) అని నాలుగు విధములు. సుఖాద్యుపలబ్ధి సాధనమైన ఇంద్రియము మనస్సు. ప్రత్యాత్మ నియతత్వముచేత ఇది అనంతము. పరమాణురూపము. నిత్యము.

ఇంక పంచభూతముల గుణము లెవ్వియో అని యెట్లు విస్తరిల్లియున్నవో ఆయావాని కెక్కడెక్కడ వృత్తియో చూతము. పృథివి గంధవతి. అది పరమాణురూపమై నిత్యము. కార్యరూపమై అనిత్యము. కార్యరూపమైన పృథివి శరీరము, ఇంద్రియము, విషయము నను భేదములచే ముత్త్రివిధము. శరీరము మత శరీరాదులవంటిది. ఇంద్రియము గంధగ్రాహకమై ముక్కు చివర నున్నది. విషయము మృత్పాషాణాదులు.

నీరు శీతస్పర్శగలది. అది నిత్యమనియు అనిత్యమనియు రెండు విధములు. నిత్యము పరమాణురూపము. అనిత్యము కార్యరూపము. ఇది మరల శరీరేంద్రియ విషయ భేదముచే ముత్తెఱగు. శరీరము వరుణలోకమునందలిది. ఇంద్రియము రసగ్రాహకమైన నాలుక చివర నుండునది. విషయము సరిత్సముద్రాదులు.

తేజస్సు ఉష్ణస్పర్శగలది. అది నిత్య మనిత్యమని రెండు విధములు. నిత్యము పరమాణురూపము. అనిత్యము కార్యరూపము. మనల నిది శరీరేంద్రియ

విషయ భేదముచే ముబ్విధము. శరీరమాదిత్యలోకము నందు. ఇంద్రియము రూపగ్రాహకమైన చక్షువు. కంటి నల్లగ్రుడ్డు ముందుభాగమున నుండునది. విషయము నాల్గు తెఱగులు. భౌమము దివ్యము ఔదర్యము ఆకర జము అని. వహ్న్యాదికము భౌమము. అబింధనము దివ్యము విద్యుదాది. భుజించినదాని పరిణామమునకు హేతువు ఔదర్యము, ఆకరజము సువర్ణాది.

రూపము లేకుండ స్పర్శగలది వాయువు. అది నిత్య మనిత్య మని రెండు విధములు. నిత్యము పరమాణు రూపము. అనిత్యము కార్యరూపము. ఇది మరల ముబ్విధము — శరీరేంద్రియ విషయ భేదముచేత — శరీరము వాయులోకమునందు. ఇంద్రియము స్పర్శ గ్రాహకమైన చర్మము సర్వశరీరవర్తి. విషయము వృక్షాదుల కంపనహేతువైనది.

శరీరాంతస్సంచారియైన వాయువు ప్రాణము. అది ఒక్కటేయైనను ఉపాధిభేదముచే ప్రాణాపానాది సంజ్ఞ పొందుచున్నది.

శబ్దగుణక మాకాశము. అది ఒక్కటి, నిత్యము. విభుత్వముగలది. సర్వమూర్తద్రవ్యసంయోగిత్వము విభు త్వము. పరిచ్ఛిన్న పరిమాణవత్త్వముగాని క్రియా వత్త్వముగాని మూర్తత్వ మనబడును.

ఇంక ఈ పంచభూతముల గుణము లెట్టివో చూతము. చక్షుర్మాత్ర గ్రాహ్యమైన గుణము రూపము, అది శుక్ల నీల పీత రక్త హరిత కపిశ చిత్రభేదముచే ఏడు విధములుగానుండును. ఈ రూపము పృథివీ జల జస్తైస వృత్తి. పృథివియం దేడువిధములుగానుండును. జలమునందు అభాస్వర శుక్లముగానుండును. తెజస్సు నందు భాస్వర శుక్లముగా నుండును.

రసనగ్రాహ్యమైన గుణము రసము. అది మధుర, ఆమ్ల, లవణ, కటు, కషాయ, తిక్త భేదముచే ఆరువిధ ములు. ఈ రసము పృథివీజల వృత్తి. పృథివియం దారు విధములు నుండును. జలమునందు మాధుర్యముమాత్రము.

ఘ్రాణగ్రాహ్యమైన గుణము గంధము. అది రెండువిధములు. సురభి యని అసురభి యని. పృథివీ మాత్ర వృత్తి యిది.

త్వగింద్రియ మాత్రగ్రాహ్యమైన గుణము స్పర్శ, ఇది మూడువిధములు. శీతోష్ణ, అనుష్ణా, శీత భేదముచేత. పృథివ్యప్తేజో వాయువృత్తి. నీటిలో శీతము. తేజస్సున ఉష్ణము. పృథివీవాయువులందు అనుష్ణా శీతము (Tepid).

శ్రోత్రగ్రాహ్యగుణము శబ్దము. ఆకాశమాత్ర వృత్తిగలది. అది ధ్వన్యాత్మకమని వర్ణాత్మకమని రెండు విధములు. భేరీమొదలగు వానియందు ధ్వన్యాత్మకము సంస్కృతభాషాది రూపమైనది వర్ణాత్మకము.

ఇంతేకాదు. తార్కికులు ద్రవ్య. గుణ, కర్మ. సామాన్య, విశేష, సమవాయ, అభావములని ఏడు పదార్థముల నెన్నినారు. పంచభూతములు కాలము దిక్కు ఆత్మ మనస్సు చేరి తొమ్మిదిద్రవ్యములన్నారు. రూపరసగంధ స్పర్శసంఖ్యా పరిమాణ పృథక్త్వ సంయోగ విభాగపరత్వ గురుత్వ ద్రవత్వ స్నేహశబ్ద బుద్ధి సుఖ దుఃఖ ఇచ్ఛా ద్వేష ప్రయత్న ధర్మ అధర్మ సంస్కారములని ఇరువది నాలుగు గుణము లన్నారు. ఉత్క్షేపణ, అవక్షేపణ, ఆకుంచన, ప్రసారణ, గమనములని ఐదు కర్మలు చెప్పినారు.

లోకమును, మన అనుభవమును పై చెప్పిన విధ ముగా నెంతయో సంకీర్ణముగా నున్నది.

4

లోకమున మనకు నిత్యమును విషయానుభవ మున్నది. పంచేంద్రియములు రూపరసగంధాదులందు ప్రవర్తించుచున్నవి. సరేకాని ఈ విషయజ్ఞాన మెవని వలన మనకు గలుగుచున్నది? మనకీ విషయజ్ఞానము గలిగించెడి వాడును మన మాత్మ యొకడు యున్నా డనుచు ఉపాసించువాడును ఒక్కడేనా? వేరా? ఇది సాధకునికి గలుగు సందేహములు. ఋషులును ఇట్లే యోచించినారు. 'కోఽయ మాత్మేతి వయ ముపా స్మహే. కతరః స ఆత్మా యేన వా రూపం పశ్యతి. యేనవా శబ్దం శృణోతి యేలనవా గన్ధా నాజిఘ్రతి. యేన వా వాచం వ్యాకరోతి. యేన వా స్వాదు చాస్వాదుచ విజానాతి.'

ఇది సంస్కారమువలన గలిగిన సందేహము. దానికి సమాధానముగా విషయానుభవమును పొందించుచున్న జీవుని ఆత్మయని ఇదన్ద్రుడని అన్నారు. ఈ 'ఇదన్ద్రు'డు అపరోక్షముగానున్న ఆత్మ. పరోక్షప్రియులైన దేవతలు ఈ ఇదన్ద్రుడు అపరోక్షముగానుండి సర్వము ననుభవించుటచే అతని పేరులో వర్ణలోపముచేసి ఇన్ద్రు డన్నారట!

'తస్మా దిదన్ద్రోనా మేదన్ద్రో హవై నామ త మిదన్ద్రం సన్త మిన్ద్రమి త్యాచక్షతే పరోక్షేణ పరోక్ష ప్రియా ఇవహి దేవాః పరోక్షప్రియా ఇవహి దేవాః' ఆ ఇంద్రుడే ఆత్మ. బ్రహ్మ.

ఇంక అతని విభూతి ఎట్టిది? ప్రజ్ఞానాత్మక మైన దని చెప్పినారు. ప్రజ్ఞాన మనగా నేమి? అంతఃకరణ రూపమైన మనోహృదయములు, సంజ్ఞానము, ఆజ్ఞానము విజ్ఞానము, ప్రజ్ఞానము, మేధ, దృష్టి, ధృతి, మతి,

మనీష, జూతి, స్మృతి, సంకల్పము, క్రతువు, అసువు, కామము, వశము అను యీ అన్నియు ప్రజ్ఞానమని చెప్పబడుచున్నవి. మనస్సు రేతోరూపము. ఈ మనస్సును హృదయము చేరి అంతఃకరణ మనబడుచున్నది. సంజ్ఞాన మనగా అంతఃకరణమునందు ప్రతిబింబించిన ఆత్మయొక్క చేతనభావము. సర్వశరీరమందు ఎల్లపుడు వ్యాపించియుండెడు అంతఃకరణ వృత్తివిశేషము సంజ్ఞాన మనబడుచున్నది. ఆ జ్ఞానమనగా ఈశ్వరత్వము. విజ్ఞాన మనగా కలాది పరిజ్ఞానము. తత్కాలమందైన ప్రతిభ ప్రజ్ఞానము. మేధయనగా గ్రంథధారణ సామర్థ్యము. ఇంద్రియములద్వారమున సమస్తవిషయములను పొందుట దృష్టి. శరీరేంద్రియములు కృశించినపుడు శరీరమును ధరించెడి ధైర్యవృత్తి ధృతి. మననమే మతి. మనస్సునందలి స్వాతంత్ర్యము మనీష. మనస్సునకు రోగాది దుఃఖితత్వము జూతి. స్మరణము స్మృతి. రూపముల శుక్లకృష్ణాదిభావముల సంకల్పించుట సంకల్పము. నిశ్చయముచేయుట క్రతువు. సమీపమున లేనిదానిని కోరుట కామము. స్త్రీసంబంధమైన వ్యసనాదులయందు అభిలాష వశము. ఇవియన్నియు అంతఃకరణ వృత్తులు. చక్షురాదీంద్రియముల ద్వారమున రూపాదులకు ద్రష్టయైన ఏకస్వరూపమైన ప్రజ్ఞానమునకు పేర్లు.

భోగాత్ముడైన ఆ ఇంద్రుడే ప్రజ్ఞానాత్ముడనబడుచున్నాడు. ఇక్కడ ఒకవిషయము గమనింపవలసి యున్నది. ప్రజ్ఞానమునకు పేర్లుగా చెప్పబడిన సంజ్ఞానాజ్ఞానాదులలోను మేధా ధృతి మతి మనీషాదులలోను ఒక అతిశయిత ఉన్నది. పైగా వానికి ప్రజ్ఞానాత్మతో అభేదము చెప్పబడినది. కాగా అంతఃకరణ వృత్తులగు యీ సంజ్ఞానాదులలోని అతిశయాంశ ఆత్మవిభూతియే అనుచున్నది. సృష్టిలోని సర్వపదార్థములందును జీవరాసులందును ఒక్కొక్కదానిలో నీ ప్రజ్ఞానవిశేష మొక్కొకటి కనబడుచున్నది. వైశేషికులు పదార్థములలో విశేషము నొకపదార్థముగా చెప్పినారు. 'నిత్యద్రవ్య వృత్తియో విశేషాస్త్వనంతా ఏవ.' కవులు సృష్టిలో ఆయావానిలోని ప్రజ్ఞానలక్షణమును విశేషమును వెదుకాడుదురు.

5

అవునుగాని వ్యక్తికీ విషయానుభవము గలుగుచున్న క్రమ మెట్టిది? ఆత్మ అని, జీవు డని, ఇంద్రుడని చెప్పబడుచున్న వాడు ఇదియంతయు నెట్లు భుజించుచున్నాడు? అనుప్రశ్న లున్నవి. ఉపనిషద్ద్రష్ట లిట్లు చెప్పినారు: అగ్నికేడు జిహ్వలున్నవి. కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి. మనుష్యునకు ఏడు ప్రాణములున్నవి. రెండు కండ్లు, చెవులు, ముక్కులు, నోరును చేరి మొత్త మేడుచోట్లు. ఈ యేడుచోట్ల ముందుచెప్పిన ఆ సప్తజిహ్వలు నిలిచి చక్షురాదుల ఏడు విషయములను ప్రకాశింపజేయును. విషయములు సమిధలు. చక్షురాదులకు విషయములైన రూపాదుల నెఱుగుటయే హోమము చేయుటలు. హృదయ గుహయందు శయనించియుండెడు ప్రాణములు చక్షురాది గోళములయందు స్థాపింపబడి చరించుచున్నవి. ఆ యేడు ఇంద్రియస్థానములును ఏడేడుగా అక్షరునివలన పుట్టుచున్నవి.

'సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మా
త్సప్తార్చిష స్సమిధ స్సప్త హోమాః,
సప్త ఇమేలోకా యేషు చరన్తి ప్రాణా
గుహాశయా నిహితా స్సప్త సప్త.'

మరి ఆత్మపరముగా నీ విషయానుభవ మెట్లు నడచుచున్నది? ఆత్మయే సర్వ విషయములు భుజించుచున్నది. ఆ యనుభవ మంతయు జాగ్రత్, స్వప్న, సుషుప్త్యాత్మకముగా నున్నది. ఈ దృష్టితో అనుభవమును పరిశీలించి ప్రాచీనులు ఆత్మను నాలుగు పొరలుగా నెన్నినారు. వ్యవహారమునకు ఒక్కొక్క పొరను ఒక్కొక్క పేరుతో పిలచినారు. కాని చైతన్య రూపమైన ఆయాత్మ ఒక్కటే. ఆ పొరలేవనగా విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు, తురీయాత్మ. వీరిలో మొదటివాడు విశ్వాత్మ. బహిఃప్రజ్ఞకు అనగా జాగ్రదవస్థకు ప్రభు వితడు. స్థూలమైనవాని నితడనుభవించి తృప్తిపడును. ఇతడు కుడికంటి చివర నుండునట. రెండవవాడు తైజసుడు. వీడంతఃప్రజ్ఞుడు. మనస్సులో నుండును. ఇతడు ప్రవివిక్త భుక్కు. దానిచే తృప్తిపడును. స్వప్నానుభవ మంతయు నీతనిది. మూడవవాడు ప్రాజ్ఞుడు. జాగ్రత్స్వప్నముల ప్రజ్ఞ లేకీ భవించి ఇతరము లేమియు లేకపోవుటచే సమస్త వ్యాపారోపరమము గలిగిన ఘనప్రజ్ఞుడితడు. వీడు హృదయాకాశమున నుండును: ఇతడానంద భుక్కు.

నిద్రానుభవ మీతనిది. నాల్గవవాడు తురీయాత్మ. ఇతని కేవియు లేవు.

వీరిలో విశ్వుడు, తైజసుడు అనువారి—అనగా జాగ్రత్, స్వప్న సంబంధములైన—అనుభవములు కార్య కారణ బద్ధములుగా నుండును. అనగా ఫలభావ బీజ భావ బద్ధములు. ప్రాజ్ఞుడు కారణబద్ధుడు మాత్రమే. తురీయాత్మకి ఫలభావ బీజభావములే లేవు. ఇచట బీజ భావ మనగా స్వప్నము. స్వప్నమనగా అన్యథాగ్రహ ణము. మరి, ఫలభావ మనగా నిద్ర. నిద్రయనగా తత్త్వము తెలియక పోవుట. తురీయాత్మకి స్వప్న నిద్రలు లేవని తాత్పర్యము. ప్రాజ్ఞాత్మ తన్నుతా నెఱు గడు. ఇతరమును ఎఱుగడు. అనృతమును అనగా శుక్తి రజతాది భావమును ఎఱుగడు. ఇంక తురీయా త్మయో సదా సర్వదృక్. కాగా విశ్వ తైజసుల కిద్ద రకు స్వప్న నిద్ర లున్నవి. ప్రాజ్ఞునికి స్వప్నములేని నిద్ర. తురీయాత్మకి స్వప్నముగాని నిద్రగాని లేదం దురు. వ్యష్టియొక్క అనుభవ మీ మార్గమునుబట్టి నడచు చుండును.

ప్రజ్ఞానము ఆత్మవిభూతి. అది తనలో నేకాదు. సృష్టియంతయు నదియేయని సాధకు డెఱుగవలెను. దానికి లోకమును జూడవలెను. సృష్టి సర్వస్వమున ఆయా వానిలోని విశేషముల నరయవలెను. దానిని ప్రజ్ఞానముగా భావింపవలెను. సర్వసృష్టిని పరిశీలించి సర్వప్రాణులను గమనించి ఋషు లిట్లన్నారు:

'సఏష బ్రహ్మ ఏష ఇన్ద్ర ఏషప్రజాపతి రేతే సర్వే దేవా ఇమానిచ పంచ మహాభూతాని పృథివీ వాయు రాకాశ ఆపోజ్యోతీం షీత్యేతానీమానిచక్షుద్ర మిశ్రా ణీవ బీజానీత రాణి చేత రాణి చాండజానిచ జారుజాని చ స్వేదజానిచోద్భిజ్జాని చాశ్వాగావః పురుషాహ స్తినో యత్కించేదం ప్రాణి జంగమం చ పతత్రి చ యచ్చ స్థావరం తత్ ప్రజ్ఞానేత్రం ప్రజ్ఞానే ప్రతిష్ఠితం. ప్రజ్ఞా నేత్రేలోకః. ప్రజ్ఞాప్రతిష్ఠా. ప్రజ్ఞానం బ్రహ్మ.' సృష్టిలోని పంచభూతములు, మనుష్యులు పక్షులు వృక్షములు, గుఱ్ఱములు, ఆవులు, ఏనుగులు, దోమలు ప్రాణముగల భూచరఖేచరములు, స్థావరములు సర్వమును ప్రజ్ఞానమే నేత్రముగాగలది. ప్రజ్ఞానమునందే లోకము ప్రతిష్ఠింపబడియున్నది. ప్రజ్ఞానము సర్వజగత్తుకు స్థితి యైనది. ప్రజ్ఞానమే బ్రహ్మ.

• సాధకుడి ట్లంతరంగ బహిరంగములయందు ప్రజ్ఞా నము బడయవలసియున్నది. వైదికకవు లట్లే చూచినారు.

6

కవియైనవాడు హృషీకతర్పణముగా విషయాను భవమును భావించి దానిలోని అతిశయాంశను పరిశీలనగా నెఱుగవచ్చును. అది ప్రజ్ఞానమునకు దారి. కాని సాధకు డైన కవికి విషయానుభవములోని ప్రజ్ఞానసంబంధమైన విభూతియే లక్ష్యముగాని విషయము లెన్నటికిని కావు. అట్లు జరిగినచో డతడు పతితుడగును. అందుకే శాంతచిత్తుడుగనుండుట కవికి మొదటి అవసరము. ఈ సాధనయంతయు కర్మయోగ జ్ఞానయోగములు కలిసిన మార్గము. మహాకవులందఱు సాధారణముగా అంతఃకరణ వాదులు. వారి కావ్యములలోని వైషయికత నాస్వా దించి లోకము వారిని విషయలోలుపులుగా నెన్నుట అజ్ఞాన కృతమగు అపచారము.

అయినచో ఇంద్రియానుభవ మంతయు రాగము కదా? దానిచే ఆత్మజ్ఞానమెట్లు కలుగుననను సామాన్య మైన సందేహ మొకటి కలుగును. అన్నిటికిని మనస్సే ప్రధానము. మహోపనిషత్తు ఈమనస్సే అన్నియునని ఇట్లు చెప్పుచున్నది:

'క్వచి న్మనః క్వచి ద్బుద్ధిః
క్వచిత్ జ్ఞానం క్వచిత్ క్రియా,
క్వచి దేత దహంకారః
క్వచిత్ చిత్త మితి స్మృతమ్.
క్వచిత్ ప్రకృతి రిత్యుక్తం
క్వచి న్మాయేతి కల్పితమ్,
క్వచి న్మల మితిప్రోక్తం
క్వచిత్ కర్మేతి సంస్మృతమ్.
క్వచిత్ బంధమితి ఖ్యాతం
క్వచిత్ పుర్యష్టకం స్మృతమ్,
ప్రోక్తం క్వచి ద్విద్యేతి
క్వచి దిచ్ఛేతి సమ్మతమ్.'

వాయుపురాణముగూడ మనస్సును మహాన్, మతిః, బ్రహ్మ, పూః, బుద్ధిః, ఖ్యాతిః, ఈశ్వరః, ప్రజ్ఞా, చితిః, స్మృతిః, సంవిత్, విపురమ్, భవః, కః, పురుషః, స్వయంభూః—అను పర్యాయపదములతో వ్యవహ రించుచున్నది.

ఈ మనస్సు శుద్ధమని అశుద్ధమని రెండురకములు గావచ్చును. కామసంపర్కరమువలన అశుద్ధము. కామ విసర్జితమగుటచేత శుద్ధము.

'మనో హి ద్వివిధం ప్రోక్తం
శుద్ధం చాశుద్ధ మేవచ,
అశుద్ధం కామ సంపర్కాత్
శుద్ధం కామవివర్జితమ్.

(పంచదశి)

కనుకనే శుచియైన వాడు స్థూల, ప్రవివిక్త, ఆనంద రూపముల నున్నను ఒక్కటియైన భోజ్యమును, విశ్వ, తైజస, ప్రాజ్ఞ నామములతో వాని ననుభవించు భోక్తను తెలిసికొన్నచో వాడాయావాని ననుభవించు వాడైనను వానివలన కలిగెడి ఉపచయాపచయములు కలుగవనియు విలక్షణుడై అవికారిగా నుండుననియు ఉపనిషత్తు చెప్పుచున్నది.

'త్రిషుధామసు యద్భోజ్యం భోక్తా యచ్చ ప్రకీర్తితః,
వేదైత దుభయం యస్తు సభుంజానో నలిప్యతే.'

7

సాధారణముగా కవులు ఈ హిరణ్య గర్భోపాసనకు పూనుకొనుటకే క్రింది యుపనిషత్తు అథవా అట్టి దృష్టి చోదకశక్తి యనవచ్చును.

'హరిః ఓం! ఆవి స్సన్నిహితం బుద్ధిగుహాచరం నామ మహత్పద మత్రైత త్సమర్పితం ఏజత్ప్రాణ న్నిమిషచ్చ యదేత జ్జానథ సదసద్వరేణ్యం పరం విజ్ఞానా ద్య ద్వరిష్ఠం ప్రజానాం.'

ప్రకాశ రూపముగు ఏ పరబ్రహ్మము అన్నిటి కంటె మహత్తరమైనదై సర్వమునకు స్థానమైనదో, మనుష్య పశు పక్షి దేవాత్మకముగా నున్న సర్వమును దేనియందున్నదో, సదసత్స్వరూపమైన, జనుల విజ్ఞానముకంటె వేరైన, ప్రార్థించదగిన, ఆత్మ స్వరూపమైన ఈ పరబ్రహ్మమును తెలుసికొనుడని యర్థము— కవి కావ్యమున ఆత్మజ్ఞానమునకు, సృష్టి జ్ఞానమునకు, సృష్టి జ్ఞానమునకు, సామాన్యమైన విజ్ఞానమునకు చోటున్నది. విజ్ఞానవ్యాప్తి చేయుచునే కవి యమృతత్వమునకు సాధన చేయవచ్చును. కవికా బోధ ఏ కొంచెము కలిగినను దానికి గొప్ప ఫలమే ఉన్నది.

'స్వల్పాపి దీపకళికా బహుళం నాశయేత్తమః.
స్వల్పోపి బోధో మహతీ బహుళం నాశయేత్తమః'

అని ఆత్మ బోధోపనిషత్తు. అజ్ఞానము చీకటివంటిది. ఇంద్రియోద్భవమైన జ్ఞానము దీపము వంటిది. జ్ఞానము సూర్యుని వంటిది. ఈ సాధనకు పరమార్థము

'హిరణ్మయే పరే కోశే
విరజం బ్రహ్మ నిష్కలం,
తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతి
స్తద్య దాత్మవిదోవిదుః.'

అన్నట్లాత్మ జ్ఞానియై పరబ్రహ్మము నెఱుగుట. దానికి ఫలము

'భిద్యతే హృదయ గ్రన్థి
శ్ఛిద్యన్తే సర్వ సంశయాః.
క్షీయంతే చాస్య కర్మాణి
తస్మిన్ దృష్టే పరావరే.'

ఆ దర్శనమున హృదయగ్రంథి విచ్ఛిన్నమై, అవిద్య పోయి, సంశయములు నశించి జన్మ కారణములైన సర్వ కర్మలు నశించునని ఉపనిషత్తు.

హిరణ్యము తేజోరూపము. విషయ రూపమున నున్న నాలుగు రకములలో ఆకరజ మనునది హిరణ్యము. భౌతిక ప్రపంచమునకు మూలకారణమైన ఆ బ్రహ్మను హిరణ్యగర్భుడన్నారు. పోలిక వచ్చినపుడెల్ల బంగారముతోనో సూర్యునితోనో పోల్చినారు. హిరణ్యవర్ణుడు, రుక్మవర్ణుడు, ఆదిత్యవర్ణుడు, విద్యుల్లేఖ వంటి వాడని కీర్తించినారు.

తెలుగుకవిత్వమున ఈ హిరణ్యగర్భోపాసనము మొదటినుండియు నున్నదే. పూర్వకవులను స్తుతించునపుడు గాని, తక్కిన సమయములందు గాని తెలుగు కవు లూరక బ్రహ్మపదము వాడుట కాన్పింపదు. కాంచనగర్భ, హిరణ్యగర్భ, హాటకగర్భ, తపనీయ గర్భ శబ్దములే వాడుదురు. దీనికి కారణము మన కవులు ఉపనిషద్వాదా'ము నవలంబించుట; హిరణ్యగర్భోపాసనము చేయుట. మన మహాకవు లందఱు నిట్టివారే. నన్నిచోడుని వస్తుకవిత ఈ హిరణ్యగర్భోపాసనమే కాని వేరుకాదు.

'అకారాదిక్షకారాంత వర్ణ భేద వ్యవస్థితః,
పురాణ పురుషోఽనాదిః శబ్ద బ్రహ్మేతి గీయతే'

అని బృహన్నారద పురాణము—శబ్దబ్రహ్మ నుపాసించు మనకవు లీ దృష్టినించుక మనసున నిలుపుదురు గాక!

ఎవరు శిక్షకుడు?

శ్రీ బి. పురుషోత్తం

ప్రొద్దున యేసు దేవళము వోయి సుధర్మము సెప్పుచుండఁగాఁ
పెద్దలు శాస్త్రులున్ దఱలి నేగిరిపాటున వారి వెంబడిన్
ముద్దియ నొర్తు సిగ్గఱిని నుద్దయిపోయిన దాని నీడ్చుచున్
దద్దయు ఱొమ్ములన్ పొడిచి నవ్వుచు వచ్చిరి పెద్ద మూఁకతోన్.

వచ్చి యాయన యెదుట నా వనితన్ నిలిపి ధర్మశాస్త్రము నెరపునో, దయదలఁచునో
ఇప్పుడైనను వీనిఁ శిక్షింప వలయు ననెడు తలఁపుతో ననిరి యాయనను జూచి.

"ఉపదేశీ! వ్యభిచారకార్యమున నీ యోషన్ గనుగొంటిమి; మీ
యుపకార్యంబునఁ బట్టఁగాఁబడిన ప్రోయాలింక జీవింపరా:
దుపలాఘాతము చేతఁ జంపఁబడుటే యొప్పంచు మోషేయనెన్,
కృపతో మా కెఱిఁగింపఁగా వలయు నింకేదైన తీర్పున్నచో."

ఇది విని యేసు వారి పలుకే విననట్టు నటించి వ్రేలితో
నేదియొ లిఖించుచుండెను మహీతలమందు; మఱింత పట్టుతో
వదలక మాటిమాటికిని ప్రశ్నలు వేయఁగ శీర్షమెత్తి "మం
చిది, తొలిరాయి వేయఁదగు ఛిద్రము సేయని మానవుం" డనెన్.

అని దా నింకను నేలపై నెదియొ వ్రాయంబూనె; నీలోన నా
ఘనులొక్కొక్కరె వాసి రా తలము శంకాకీర్ణ చేతస్కులై
పెను నాగుల్ నరుఁ జూచి జాఱుపగిదిన్ విద్వేషపుంజూడ్కులన్,
వనబోడిం దలపెట్టలే దెవరు ప్రాణాంబంటు దస్యుంబలెన్.

వంచిన మోము నెత్తియట పైకొని యొక్కతె నిల్చియుండుటన్
గాంచి ప్రభుండు పల్కె నిటు, "కానఁగ రారెటు వోయిరమ్మ, ని
న్నెంచిన వారలందఱును? ఏ యొకఁడైనను నీకు శిక్ష గా
వించఁగఁజాలకుండె నొకో?" ఇంతి కరంబులు మోడ్చి యిట్లనెన్.

"లేదు నా ప్రభూ! శిక్షింపలే దెవరును" అప్పు డామెతో నీరీతి ననియె యేసు:
"ఏను గూడను నిన్ను శిక్షింపనమ్మ; సేమమునఁ బొమ్ము, పాపము సేయకు మిఁక."

రెండు లక్షణదీపికలలో ఏది గౌరనకృతము?

శ్రీ బులుసు వేకటరమణయ్య

ఆంధ్రలక్షణ గ్రంథములలో లక్షణదీపిక యొకటి. సుప్రసిద్ధాంధ్ర విద్వత్కవియు, హరిశ్చంద్ర చరిత్ర, నవనాథ చరిత్రల కృతికర్తయు నగు గౌరనామాత్యుడు దీనిని రచియించెనని ప్రసిద్ధి. అందువలననే నేటివఱకు నియ్యది ముద్రణభాగ్యము నంపడకున్నను, లక్షణగ్రంథములలో ముఖ్యమైనదిగా బరిగణింపబడుచున్నది.

వంశవర్ణనాదికమునుబట్టియు, గ్రంథత్రయమునందలి గ్రంథకర్తృ వివరణమునుబట్టియు హరిశ్చంద్ర, నవనాథ చరిత్రములను రచించిన యాతడే 'లక్షణ దీపిక'ను రచించినట్లు తెలియుచున్నది.

గౌరన తన హరిశ్చంద్ర చరిత్ర ప్రారంభమున—

'సరస సాహిత్యలక్షణ విచక్షణుడ'

ననియు, గ్రంథము చివఱ—

'భ్రమరా ప్రసాద సంప్రాప్త కవిత్వ
సుమహిత సామ్రాజ్య సుఖపరాయణుడ
చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి'

ననియు వచించియున్నాడు.

నవనాథ చరిత్రమునందును—

'ఇప్పుడు గల సుకవీంద్రులలోన
సరస సాహిత్య లక్షణ వివేకముల
సురుచిర మధురవచో విలాసముల
....
నలవడ్డవాఁ డెవ్వ డని విచారించి'

శాంతవృత్తి భిక్షారాయయతి తనను రావించెనని యితడు చెప్పియున్నాడు. ఇట్లు చెప్పుటవలన ద్విపద కావ్యద్వయ కర్త గొప్ప లక్షణవేత్తయని స్పష్టమగుచున్నది.

'లక్షణ దీపిక' వ్రాతప్రతులు చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున రెండు గలవు. ఆ రెండును, తక్కిన మఱికొన్ని గ్రంథములతోపాటు D 1291 సంఖ్యగల సంపుటిలో గలవు. రెండును సంస్కృతముననే కలవు. కాని యొకదానిలో నెడనెడ తెలుగు లక్షణ గ్రంథములనుండి గ్రహింపబడిన పద్యము లున్నవి. వేఱొకదానిలో అవి లేవు.

అంతేకాదు. కేవల సంస్కృత మయముగనే ఉన్న ప్రతి "పదార్థ దీపిక"గా బేర్కొనబడినది కాని, తొలిప్రకాశము చివఱ "ఇతి లక్షణ దీపికాయాం కావ్య స్వరూప నిరూపణం నామ ప్రథమః ప్రకాశః" అనియు, మిగిలిన కొన్ని స్థలములలో "ప్రబంధ దీపికాయాం చతుర్థః ప్రకాశః", "ఇతి శ్రీ ప్రబంధ దీపికాయాం ఉదాహరణ భేద నిరూపణం నామ పంచమః ప్రకాశః" అనియు గ్రంథనామము భిన్నరీతుల బేర్కొన బడినది. మిగిలిన ప్రకాశములలో 'లక్షణ దీపిక' యనియే కలదు.

గ్రంథము 'పదార్థదీపిక' యని ఏల పేర్కొనఁబడినదా, యని పరికింపఁగా — తొలిపుటలో నొక శ్లోకము కానవచ్చినది. అది—

"పాత్రస్నేహదశాలోక
ప్రదోషతిమిరాపహా,
పదార్థదీపికా సేయం
భాతి లక్షణ దీపికా."

అనునది. దీనినిజూచి సరిగా అర్థముచేసికొనక వ్రాయసకాడు గ్రంథనామమును 'పదార్థదీపిక'గా బేర్కొనియుండును. కొన్ని గద్యములలో 'ప్రబంధ దీపిక' అని యుండుటకును వ్రాయసకాని ప్రమాదమే కారణము!

తెలుగు పద్యములతో గూడియున్న ప్రతి సమగ్రముగా లేదు. కొంతభాగమైనపిదప "అక్షరపదపారిజాత" మందలి చివఱిభాగము కలదు. వ్రాయసకాడు కలగాపులగముగా ఉన్న తాటియాకులను చూచి వ్రాయుటచే ఇట్లు గ్రంథసంకరము జరిగియుండవలెను.

పిదప ప్రత్యంతరములకొఱకై ప్రయత్నింపగా, శ్రీ వావిళ్ళసంస్థవారి "లక్షణదీపిక" ప్రతిని గాకినాడ-ఆంధ్రసాహిత్య పరిషత్తువారి గ్రంథాలయమునుండి వ్రాయించి తెప్పించినట్లు తెలిసినది. వారిని ప్రార్థింపగా తాము వ్రాయించి తెప్పించిన రెండుప్రతులను చూచుట కిచ్చిరి. చెన్నపురి ప్రాచ్యలిఖితగ్రంథాలయపు ప్రతులవలెనే ఇవియును రెండురీతులు—అనగా ఒకటి సంస్కృతాంధ్రమిశ్రముగను, వేఱొకటి కేవల

సంస్కృతగ్రంథముగను ఉన్నవి. వీనిలో ఏవి దేనికి మాతృకలో తెలియదు గాని,ఒకదానిం జూచి యింకొకటి వ్రాయబడిన ట్లూహింప నవకాశ మున్నది. ప్రతులన్నిటి యందును తప్పు లున్నవి. కాని, పరిషత్తువారి ప్రతులలో మాత్రము తప్పులు తక్కువగా గానవచ్చుచున్నవి.

'లక్షణదీపిక' ఛందోలక్షణవిషయకమగు గ్రంథ మైనట్లు తెలియుచున్నది. తెలుగు పద్యములతో గూడి యున్న పుస్తకములో [1]"అస్యపద్యప్రబంధానాం ఛందోలక్షణనియామకస్య గ్రంథస్య..." అని చెప్పబడి యుండుటయు, కేవలసంస్కృతరూపమగు ప్రతియందు

'సోఽహం సోమకళామౌళి
ప్రసాదా ద్గతకల్మషః,
ప్రణమ్య పింగళం నామ
కవిపుంగవ సంస్తుతమ్.
ఉదాహరణ రత్నాని
లక్షణ గ్రంథసింధుషు,
సమాకృష్య సతాం భూత్యై
వక్ష్యే లక్షణ దీపికామ్."

అని యుండుటయు నీ యభిప్రాయమునకు సాధక ములు. పింగళుడు ఛందోలక్షణమునకు మూలపురుషుడని యెల్లరకు దెలియును.

సంస్కృతాంధ్రమిశ్రమగు ప్రతియందలి భాగ ములు పరిచ్ఛేదములుగా విభజంపబడినవి. అందు అయిదు పరిచ్ఛేదములు కలవు. మొదటి పరిచ్ఛేదమున గ్రంథా ద్యక్షరచర్చ, నాయక, కవి నిరూపణము కలవు. ద్వితీయపరిచ్ఛేదమున గణములు, వాని గుణావ గుణములు, గణజాతులు, స్వరములు మున్నగునవి వివరింప బడినవి. తృతీయ పరిచ్ఛేదమునందు గణముల శుభాశుభ ఫలనిర్ణయము కలదు. నాల్గవ పరిచ్ఛేదములో గణ నక్షత్ర శుభా శుభ వివేచనము, అక్షర శుభా శుభ వివే చనమును కలవు. పంచమ పరిచ్ఛేదమున మాతృకా పూజన విధానము వివరింపబడినది. దీనితో గ్రంథము పరిసమాప్తమగుచున్నది.

కేవల సంస్కృతమున నున్న ప్రతిలోని భాగ ములకు ప్రకాశములని పేరు. ఇందు పండ్రెండు ప్రకా శములు కలవు. ప్రథమ ప్రకాశమున కావ్య స్వరూ పము నిరూపింపబడినది. దానితోపాటు—కవి, నాయక వివరణము, అక్షర బీజాది వివరణము, గణ, గణదోషాది వివరణము, మాతృకాపూజ మున్నగు విషయములును కలవు. ఇందలి ప్రకాశములలో నిదియే పెద్దది. 31 పుటల గ్రంథమున 19 పుటల విషయ మీ తొలి ప్రకా శమున గలదు.

ద్వితీయ ప్రకాశము పరిభాషా ప్రకరణము. మూడవ ప్రకాశమున ముక్తక, యుగళాదికములు చెప్ప బడినవి. చతుర్థ ప్రకాశమున ఉదాహరణ స్వరూపము, పంచమ ప్రకాశమున ఉదాహరణ భేదములగు ఉదా హరణ మంజరి, ఉత్కళికము, పద్ధళి, సద్ధళి - మున్నగు ఉదాహరణ భేదముల లక్షణములు చెప్పబడినవి. షష్ఠ ప్రకాశమునందు చక్రవాళ లక్షణము, సప్తమ ప్రకాశ మున చతురోత్తర, చతుర్భద్రముల లక్షణములు కలవు. అష్టమ ప్రకాశమున భోగావళియు, నవమ ప్రకాశ మున బిరుదావళియు, దశమ ప్రకాశమున గుణావళియు, ఏకాదశ ప్రకాశమున జయఘోషణయు, ద్వాదశ ప్రకాశమునందు రంగ ఘోషణయు వివరింపబడినవి. గ్రంథాంతమున గావ్యరచనకు అనుకూలములగు నక్షత్ర ములు, ముహూర్తములు వివరింపబడినవి. ఇంతతో గ్రంథము సమాప్తమయ్యెను.

ఈ 'లక్షణ దీపిక' ప్రతులు రెండింటను చివఱ -

"ఏషా లక్షణ దీపికా విజయతే
విద్వజ్జనానన్దినీ
ఛందోఽలంకరణాద్యనేక వివిధ
గ్రంథ ప్రయోగాన్వితా,
గర్వాఖర్వకుతర్కకర్కశ కవి
గ్రీవా సదా సంశ్రిత
వ్యాళీ సత్కవిరాజ కల్ప లతికా
కల్పాంతర స్థాయినీ."

అను శ్లోకమున్నది.

ఇట్లీ రెండును గౌరనకృతులనియే చెప్పుట కవ కాశ మున్నది. కాని, వీనిలో నేదో యొకటియే గౌరన రచన కావలసియున్నది. ఒక కవియే యొక్క గ్రంథ మునే రెండు విధములుగా వ్రాసెనని చెప్పుటమాత్రము యుక్తిసహము కానేఱదు.

తాను "సాహిత్యలక్షణచక్రవర్తి"నని చెప్పికొన్న గౌరన వ్రాసిన గ్రంథము కొంతవఱకైనను ఉపయోగ

---

1 ప్రాచ్యలిఖితగ్రంథాలయప్రతిలో "అస్య గద్య పద్య ప్రబంధానాం ఛందోలక్షణ నియామకస్య" అనియు, ఆంధ్రసాహిత్యపరిషద్గ్రంథాలయప్రతిలో "అస్య గద్య ప్రబంధానాం ఛందోలక్షణ నియామకస్య" అనియు గలదు. ఈ రెండిటిని పరిశీలించినమీదట 'పద్యప్రబంధానాం' అనుటయే యుచితమని తోచినది.

రెండు లక్షణదీపికలలో ఏది గౌరనకృతము?

కారికయై యుండవలెనుగదా! సంస్కృతాంధ్రమిశ్రమగు ప్రతిలో తొలిపరిచ్ఛేదమే కొంతవఱ కుపయుక్తముగా ఉన్నది. తరువాతిపరిచ్ఛేదములలోని గణ గుణావగుణ, జాతి, శుభాశుభ ఫలనిర్ణయాదులవలనను, మాతృకా పూజావిధానమువలనను ఎక్కువ ప్రయోజనము లేదు. కేవల సంస్కృతమునను్న ప్రతిలో పలువిషయము లన్నియు నొకప్రకాశములో స్వల్పముగావివరింపబడి, మిగిలినభాగములలో (ప్రకాశములలో) ఉదాహరణము, తద్భేదములు మున్నగు క్షుద్రప్రబంధములనుగూర్చిన విపులవిషయము కలదు. ఉదాహరణాదులంగూర్చి యింత విపులముగా దెలిపిన గ్రంథము—సంస్కృతమున రచింపబడినది నే నెఱిగినంతవఱకును లేదు.

ఈ రెండవగ్రంథమునందే గౌరన తన్నుగూర్చి చెప్పుకొన్న విషయము కొంత క్రిందరీతిని కలదు.

"అస్తి ప్రశస్తావని పాలమౌళి
రత్నావళీ రంజితపాదపీఠః,
రేచర్ల వంశార్ణవ పూర్ణచంద్రో
మహాబలః సింగ మమాధ వేంద్రః.
ఆసీ త్తస్య మహామాత్యః
స్వామికార్య ధురంధరః,
పోతరాజ ఇతిఖ్యాతో
రాజనీతి యుగంధరః.
మంత్రిచూడామణే స్తస్య
సోదర స్త్వయ్యలుప్రభోః,
గౌరనార్య ఇతిఖ్యాత
స్తనయో నయకోవిదః.
సోఽహం చంద్రకళామౌళి
ప్రసాదా ల్లబ్ధకల్మషః,
.................."

దీనినిబట్టి గౌరనమంత్రి పెదతండ్రి పోతరాజు రేచర్ల మాధవనృపాలునియొద్ద మంత్రిగానుండెననియు, గౌరన గొప్ప శివభక్తుడనియు, ఇతనితండ్రి అయ్యలు మంత్రియనియు దెలియుచున్నది. పోతరాజు మాధవ నృపాలునివద్ద క్రీ॥ శ॥ 1376 ప్రాంతమున మంత్రిగా నుండెను. కావున గౌరన 14 వ శతాబ్దిచివఱను, 15 వ శతాబ్ది ప్రారంభమునను ఉండవచ్చును. గౌరన తన

నవనాథచరిత్రమును శ్రీశైలమల్లికార్జునదేవస్థాన ధర్మకర్తయగు శాంతవృత్తిభిక్షారాయనికోరికపై శ్రీశైలమల్లికార్జునదేవునకే అంకితము చేసెను.

విషయ మిట్లున్నను, గ్రంథాదినిమాత్రము శివస్తుతికి బదులు

"జానకీముఖపద్మార్కం
జానకీకుచభూషణమ్,
జానకీరమణం వందే
జగతాం మంగళప్రదమ్"

అని శ్రీరామస్తుతియే కానవచ్చుచున్నది. సంస్కృతాంధ్రమిశ్రప్రతిలోమాత్రము—

"ప్రణమ్య విద్వజ్జనపారిజాతం
కవీంద్ర విప్రార్జిత పాదపంకజమ్,
విభుం ప్రభుం విశ్వసృజం మహేశం
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్."

అను శివస్తుతి కానవచ్చుచున్నది. ఇయ్యదియే రెండవ ప్రతిప్రారంభమునందును ఉండదగినది. రామభక్తుడగు వ్రాయసకాడు శివస్తుతి శ్లోకమునకు బదులుగా, తనకు నచ్చిన యీ రామస్తుతి శ్లోకమును వ్రాసి యుండవచ్చును. వ్రాయసకాండ్రు తమకుదోచినట్లు వ్రాయుదురనుట పరిపాటి. దానికిందే ఒక్క ఉదాహరణము. కవి లక్షణమును చెప్పు సందర్భమున సంస్కృత రూపమున నున్న ప్రతిలో ఇట్లున్నది:

"కవిలక్షణం సాహిత్య చూడామణౌ—
శుచిర్దక్షశ్శాంతః సుజన వినుతః సూనృతరతః
కళావేదీ విద్వాన్ కలమృదువచః కావ్య చతురః,
కృతజ్ఞో దైవజ్ఞః సదయ హృదయః సత్కులభవః
శుభాకార శ్ఛందో గణగుణ వివేకీ సహి కవిః."

సంస్కృతాంధ్ర మిశ్రప్రతిలో "కవిలక్షణం సింగభూపాలీయే—" అని పయిశ్లోకమే యుదాహరింపబడినది. సింగభూపాలీయములో నీ శ్లోకము కానరాదు. కావున నియ్యది సింగభూపాలీయములోని దనుటకు లేఖకుని ప్రమాదమే కారణమని చెప్పవలెను.

ఇంతే కాదు. సింగభూపాలీయములోనివని యుదాహరింపబడిన శ్లోకము లా గ్రంథములో గానరాకున్నవి. ఉదాహృతములగు గ్రంథాంతరములు చాలవఱకు అనుపలబ్ధములును, అముద్రితములును. కావున ఉదాహృత శ్లోకములు గాని, పద్యములుగాని, ఆ యా గ్రంథములలో ఉన్నవో, లేవో కూడ నిర్ణయించుట కష్టము.

ఈ రెండువిధముల ప్రతులలో కేవల సంస్కృత రూపమున నున్నదే విషయ వివేచనమును బట్టియు మేలైనట్లు తోఁచుచున్నది. మిశ్రప్రతిలోని విషయము ఛందో లక్షణములోని యత్యల్పమును ప్రతిపాదించునదే! గౌరన వంటి విద్వత్కవి గణ విషయమును మాత్రము కొంత ప్రతిపాదించి తాను 'ఛందో లక్షణము'ను చెప్పినట్లు తృప్తిపడి యుండుననుట యుచితము కాదు. కావున, సంస్కృతమున నున్న ప్రతియే గౌరన కృతి యని చెప్ప నవకాశమున్నది.

'లక్షణ దీపిక' అను పేర లక్షణ గ్రంథము లనేకము లుండి యుండవచ్చును. వానిలో సుప్రసిద్ధ విద్వత్కవియగు గౌరన మంత్రికృతమగు 'లక్షణ దీపిక' కొంత పేరుపొంది యుండవచ్చును. గౌరన కృతికంటె విభిన్నముగా నున్న 'లక్షణ దీపిక' నే గౌరన రచనగా భ్రాంతి పడిన లేఖకులు దాని ప్రకరణముల చివర గౌరనకు సంబంధించిన పద్యములను చేర్చి యుండవచ్చును. అందువల్లనే గౌరన రచనలుగా పేర్కొనబడిన 'లక్షణ దీపిక' ప్రతులు విభిన్నములుగా నుండుట సంభవించి యుండును.

గౌరన, తాను ఛందోలక్షణ నియామక గ్రంథమును రచింప బూనినట్లు గ్రంథాదిని చెప్పియున్నాడు. ఈ 'లక్షణదీపిక' లో ఛందశ్శాస్త్రమున ముఖ్యములగు వృత్తాది లక్షణములు కానరాకున్నవి. అవి లేనిదే గ్రంథము సమగ్ర చ్ఛందోలక్షణ ప్రతిపాదకమని చెప్పవలనుపడదు. కాని గౌరన ఛందస్సులోని ఏ విషయములను వివరింపఁ దలచెనో, ఉపలబ్ధమగు 'లక్షణ దీపిక' సమగ్రమైన దగునో, నడుమ నేవయిన భాగములు లోపించెనేమో తెలియదు. గ్రంథాంతమున గానవచ్చు శ్లోకమునందలి

"ఛందో ఽలంకరణా ద్యనేక వివిధ
గ్రంథ ప్రయోగాన్వితా."

అను పాదమునుబట్టి ఇందలంకార శాస్త్ర విషయములను గూడ గ్రంథకర్త చెప్పదలచినట్లు స్పష్టము. కావ్య భేదములగు క్షుద్ర ప్రబంధములు—ఉదాహరణము మున్నగునవి ఛందశ్శాస్త్రమునకు సంబంధించినవే!

పై విషయముల నన్నింటిని పరిశీలించిన యెడల 'లక్షణ దీపిక'కు గల విభిన్నములగు రెండు ప్రతులలో కేవల సంస్కృత రూపమున నున్నదే గౌరన కృతియని యూహింప నవకాశ మున్నది. ఈ గ్రంథమునకు ప్రత్యంతరము లభించువరకు నియ్యది సమగ్రముగనే యున్నదని భావింపవలసి యున్నది. సంస్కృతాంధ్ర మిశ్రమగు ప్రతి గౌరన కృతియనుట సరికాదేమో అని తోచుచున్నది. ఏ విషయమును దృఢముగా నిర్ణయించుటకును దీని ప్రతులు—వివిధ ప్రాంతము లందలివి లభింపవలసి యున్నది. అందుకై భాషాభిమానులు ప్రయత్నింపవలెను.

పరాజితులు

శ్రీ 'నవ్యశ్రీ'

పాత్రలు

శాస్త్రి — రామం
శర్మ — రామనాథయ్య.

[స్థలము : శర్మగృహము. కాలము: రాత్రి ఒంటి గంట రెండు మధ్య. తెఱఎత్తగానే ఎదుట అధునాతన పద్ధతులలో అలంకరించబడిన గది. గోడలనిండా రకరకాలైన చిత్రపటాలు. ఒకమూల టేబిలుమీద కొన్ని పుస్తకాలు, టేబిల్ లైటు, ఫ్లాస్కు, గాజుగ్లాసు. ఎదురుగానున్న గదిగోడకు ఒకకిటికీ. కుడిచేతిప్రక్క గోడకు ఒక ద్వారము. గదిలో ఒక జీరోవాట్ బల్బు వెలుగుతుంటుంది. గదిబయట గాఢాంధకారము.

శర్మవయసు రమారమి 35 సంవత్సరాలు. షరాయి, చొక్కా ధరించియుంటాడు. తల రేగి జుత్తు చిందవందరగా ముఖంమీద పడుతుంటుంది. శాస్త్రివయసు సుమారు 22-23 సంవత్సరాల మధ్య. హుషారుగా వుంటాడు. పేంటు, చొక్కా ధరించియుంటాడు. ముఖంమీదకు మాటిమాటికి పడే జుత్తును చేత్తో సవరించుకుంటుంటాడు. శాస్త్రి మునిగాళ్ళమీద నడుస్తూపోయి కిటికీతలుపులు తెఱచి బయటికి తొంగిచూస్తాడు. భారంగా నిట్టూర్చి గుండెమీద చేత్తో రాసుకుంటూ వెనక్కి తిరిగి కుర్చీలోకూర్చుని ఒక్కసారి వాసాలు లెక్కిస్తున్న శర్మను చూస్తాడు.]

శాస్త్రి : అంతా ప్యూర్ ఇమేజినేషన్! (ఒక్కసారి కిటికీవంక చూసి తిరిగి శర్మనుచూసి) అంతా మనభ్రమ! ఆకైనా కదలడంలేదు. చీమకూడా చిటుక్కు మనడంలేదు. (శరీరం ముడుచుకుంటూ) అబ్బబ్బ!! శరీరాన్ని కొంకర్లెత్తిం చేస్తున్నది చలి. స్వెట్టరు మర్చిపోవడం చాలా చికాకు పెడుతున్నది.

శర్మ : (కంగారుగా) నీ స్వెట్టరుమాటకేం? ముందా తల్పులు మూసెయ్యి. చలికన్న మనపాలిట తగలడ్డ పులిగాడిమాట వింటుంటే వణకు పుడుతున్నది.

శాస్త్రి : అమ్మమ్మ! నువ్వే మూసేద్దు. ఇపుడే కాస్త నడుంవాల్చాను.

శర్మ : (చిరాకుగా) ముందు తల్పులు ముయ్యవోయి జిడ్డోడక! నడుం వాల్చాడుట నడుం!! ముందా పులిగాడి అంతుతేల్చుకున్నాక ఇద్దరం ఏకంగా ఒక్కసారే నడుంవాలుద్దాంలే! (శాస్త్రి విసుగ్గా లేచిపోయి తల్పులుమూస్తాడు. ఆ కుర్చీలో శర్మ కూర్చుంటాడు.)

శాస్త్రి : (వెనుకకి తిరిగొచ్చి) హారి నీ అసాధ్యం కూల! ఇందుకా నాకీ పని పురమాయించావు? కానీకానీ! (వాచీచూసుకుని) అపుడే ఒంటిగంట దాటింది. సరిగ్గా ఇదేవేళ! (శర్మనుచూసి) మన కుఱ్ఱకుంకలు సరిగ్గా దాన్నిదే వేళకు గదూ చూశామన్నారు?

శర్మ : (తన వాచీచూసుకుని కంగారుగా) అవును! ఇదేటైము! సరిగ్గా ఇదేవేళ!! అయినా ఏఅలికిడీ లేదే! ఓరేయ్ శాస్త్రీ! నువ్వన్నట్లు ఇది వుత్త భ్రమేనేమోరా? (జేబులోనుండి సిగరెట్టొకటి తీసి నోట్లోపెట్టుకుని ముట్టించి) ఇది అనుమానించాల్సిన విషయమేరా?

శాస్త్రి : (కుడికి వెళ్ళబోయి సడెన్‌గా ఆగిపోయి ఏదో వింటున్నట్లు నటిస్తాడు) అరే! ఆ చప్పుడేమిటి? (కంగారుగా శర్మనుచూసి) ఏమిటా శబ్దం? నాకు చాలా భయంగావుందిరా! రివాల్వరు రెడీగా వుందా?

శర్మ : (చిన్న చిరునవ్వు నవ్వి టేబిల్ వద్దకు పోయి) సొరుగు లాగి చూసి) ఓ! రెడీగానే వుంది. ఫుల్‌గా లోడ్ చేసి సిద్ధంగా వుంచాను. (దానిని బయటకుతీసి ఇటూ అటూ త్రిప్పిచూసి శాస్త్రి కందిస్తాడు.

శాస్త్రి: (దాన్ని సంతృప్తిగా పరికించి) గుడ్! ఎక్సలెంట్! దొంగా దెయ్యమూ చివరకు ఆదేముడు దిగొచ్చినా సరే డొక్క చీరేస్తాను. (ప్రక్కరూములో గడియారం అర గంట కొడుతుంది.)

శాస్త్రి: అప్పుడే ఒంటి గంటన్నర (కంగారుగా చెవులు కిటికీవంక పెట్టి వింటూ) అరే బావా! అదుగో మళ్ళీ అదే శబ్దం. ఈసారి నిజంగానే (కంగారుగా కిటికీవంక రెండడుగు లేస్తాడు. బయట అడుగుల సవ్వడి వినిపిస్తుంది.) భయంగా విన్నావా అడుగుల చప్పుడు?

శర్మ: (కంగారుగా) విన్నాను. (మెల్లిగా కిటికీని సమీపించి బయటకు తొంగిచూసి) శాస్త్రీ! కొంప మునిగిందిరా! దొంగ ఇంట్లో జొరబడినట్లున్నాడు. తలుపులన్నీ మూసి, గెడలుపెట్టి, తాళాలు బిగించిన ఇంట్లోకి వాడెట్లా జొరబడ్డాడురా? అసాధ్యుడి లాగున్నాడు?

శాస్త్రి: (చేతితో వారించి మెల్లిగా) ష్! మాట్లాడకు. (ద్వారం వంక సంజ్ఞ చేస్తాడు. శర్మ ద్వారం వంక భయం భయంగా చూస్తాడు. తలుపులు మెల్లిగా తెరుచుకుంటాయి. ఒక తల ఇవతలకి తొంగిచూస్తుంది. భయంగా 'అన్నయ్యా!' అంటుంది. ఇద్దరూ ఆశ్చర్యపోతారు. కాని శర్మ ఇంత కోపాన్ని కూడా ముఖం మీద పులుముకుని)

శర్మ: హోరి దౌర్భాగ్యుడా! ఎంత హడలు కొట్టించావురా? హాయిగా పడుకొని నిద్రపోక నిన్నెవడు రమ్మన్నాడురా ఇక్కడికి? (రామం గబగబా లోపలికి వచ్చేస్తాడు. నిక్కరు, చొక్కా తొడుక్కుంటాడు. రేగిన జుత్తు. వయస్సు సుమారు 13 సంవత్సరాలు.)

రామం: (భయం భయంగా శర్మవంక చూసి) మేడ మీద నిద్ర పట్టడం లేదన్నయ్యా! మళ్ళీ పెరట్లోకి 'అది' ఒచ్చినట్లుం దన్నయ్యా? చెల్లాయి దాన్ని కళ్ళారా చూసిం దిటన్నయ్యా? కొగ చెట్టుక్రింద బంఢమీద కాసేపు కూర్చుందిట కూడానూ?

శర్మ: (ధీమాగా తన జబ్బ ఒకమారు చరుచుకుని రామం భుజం తట్టి) నీకేం భయం లేదురా బ్రదరూ? ఈ నాడు ఇంతరాత్రి వగకూ ఇట్లా మేలుకోవడ మెందుకు అనుకున్నావు? దాని అంతుకనుక్కోడానికే! దాని డొక్క చించి డోలు కట్టించి...

రాము: అదేమో అన్నయ్యా? ఏం కట్టిస్తావోగాని నాకు మాత్రం చాలా భయంగావుంది! చాలా భయంకరంగావుందిటన్నయ్యా 'అది'? పెద్ద కోరలు, కోలముఖం, నల్లటి నిక్క బొడిచిన వెంట్రుకలూ, బండి చక్రాలంత కండ్లూ! అన్నయ్యా! అది దయ్యమేమోనురా? దయ్యాలు అట్లాగే వుంటాయని మా కామయ్య మాష్టారన్నారు!

శర్మ: (నిర్లక్ష్యంగా) ఏడ్చాడు లేవోయ్! పాతచింతకాయ పచ్చడి కబుర్లూ వీడూనూ? దయ్యాలూ లేవు. భూతాలూ లేవు. ఎంత దయ్యమైనా దెబ్బకు లొంగాల్సిందేరా బ్రదరూ? శాస్త్రిగాడిదగ్గర ఏముందో తెలుసా? లోడెడ్ రివాల్వరు! ట్రిగ్గర్ నొక్కానంటేసరి దయ్యమైనా, దేముడైనాసరే పలాయనమంత్రం పఠించాల్సిందే!

శాస్త్రి: (పకాలున నవ్వి) అంతేలేరా బావా! నువ్వు ట్రిగ్గర్ నొక్కావంటే చచ్చినవి కూడా బ్రతికి మీద పడేట్లున్నయ్యి! (సీరియస్‌గా) అయినా ఈ రామిగాడేమిట్రా మనకి రామాయణంలో పిడకలవేటలాగ? (రాముడ్ని చూసి) ఓరేయ్ రాముడూ! పోయి పడుకో! మేడమీద పాపం చెల్లాయొక్కత్తే వుంది.

రామం: ఊహూఁ! నాకు భయమేస్తున్నది. మీరు దాన్ని చూడలేదుకాబట్టి ఎన్ని సారకాయ కోతలైనా కోస్తారు. ఒక్కసారిచూస్తే తెలుస్తుంది దాని తడాఖా! (భయంగా) అమ్మ బాబోయ్! తల్చుకుంటేనే వణుకు పుడుతుంటేనూ! అన్నయ్యా! ఒక్క దూకులో ఆకాశుచెట్టుకొమ్మందుకుందిరా! ఒకే ఒక జంపుతో మన కిటికీ దగ్గరకు వచ్చేసిందిరా! తలుపుతట్టి.చూసిందిరా! నాకు భలే భయంవేసి చెల్లిని గట్టిగా కౌగిలించుకుని శాలువా ముసుగు తన్నేశానురా! అయ్యా బాబోయ్! ఒంటరిగా నేను పోను బాబూ ఆ మేడమీదకు.

శర్మ: (శాస్త్రి చేతిలోని రివాల్వరు లాక్కుని ఇటూ నటూ త్రిప్పిచూసి ధైర్యంగా) భయం బుడుగుమ వత్సా! ఇదే ఆఖరు రోజనుకో!

రామం: (త్రుళ్ళిపడి) ఎవరికి? మన కా?

శర్మ: (కోపంగా) మనకు కాదోయి చవటా? ఆ దయ్యానికి! కాకపోతే ఆ పిశాచానికి! నువ్వు పోయి హాయిగా నీ హంసతూలికా తల్పముపై నిశ్చింతగా నిద్రించు!

రామం : ఊహూఁ! నేను పడుకోను. నాకు చాలా భయంగావుంది!

శాస్త్రి : (రామం వీపునిమిరి బుజ్జగింపుగా) మా నాయనవు కదూ? మా బంగారుకొండవు కదూ? నీకు భయమైతే నేను సాయంవస్తాను గదా! గట్టిగా గడియ బిగించుకుని శాలువా ముసుగుతన్ని బజ్జోండి నువ్వూ, చెల్లాయీనూ! చెల్లాయికాని ఈలోపున లేచిందంటే దగ్గర ఎవరూ లేరని ఏడుస్తుంది. అది ఏడిస్తే ఆ ఏడుపువిని దయ్యం పారిపోతుంది. అందుకోసం ఆ దయ్యం దొరకాలంటే చెల్లాయి ఏడవకూడదు. చెల్లాయి ఏడవకుండా వుండాలంటే నువ్వు చెల్లాయిదగ్గర పడుకోవాలి. నువ్వు తెల్లారిలేచేసరికి మేమిద్దరం ఆ దెయ్యాన్ని పీకి పాకంపెట్టి వీపువాయగొట్టి కట్టిపడేస్తాంగా? పదమ్మా పద! (శర్మనుచూసి) ఒరేయ్ జంకేవుసుమా! జాగ్రత్త! ఈ రివాల్వర్ ధరించి అందాకా ఇక్కడుండు. అలికిడయితే 'ధన్' మనిపించు. ఒరేయ్ జంకేవు సుమా! వాడసాధ్యుడిలా గున్నాడు. డొక్కచీల్చేస్తాడు. (రివాల్వర్ శర్మకిస్తాడు.)

శర్మ : (రివాల్వర్‌ను అటూ ఇటూ త్రిప్పిచూసి ధీమాగా కాలరెత్తి) మరేం బాధలేదోయి! నువు మాత్రం వేగిరం వచ్చెయ్యి!

శాస్త్రి : క్షణంలో రానూ! ఇక్కడున్నట్లే వచ్చేస్తాను (కుడివైపుకి పోతాడు రామంతోసహా. శర్మ ఒక్కక్షణం నిశ్శబ్దంగా, నిశ్చలంగా నిల్చుంటాడు. మెల్లిగా మునివేళ్ళమీద నడుస్తూ కిటికీవద్దకుపోయి బయటకు తొంగిచూసి ఏమీ భయంలేదని నిర్ధారణ చేసుకుంటాడు. చిన్న చిరునవ్వు నవ్వుకుని రివాల్వరువంక చూస్తాడు. దానిని టేబిల్ మీదవుంచి కిటికీవద్దకుపోయి బయటికి చెవిపెట్టి వింటాడు. టేబిల్ వద్దకు తిరిగివచ్చి ప్లాస్కులో కాఫీ గ్లాసులో పోసుకుని త్రాగబోతాడు. అంతే! ఎత్తినచెయ్యి గ్లాసుతోసహా గాలిలో స్తంభించిపోతుంది. కిటికీవంక భయంగా చూస్తాడు. బయటనుండి అడుగుల చప్పుడు వినిపిస్తుంది. ఎత్తినగ్లాసు అట్లాగే మెల్లిగాదించి బల్లమీదపెట్టి గోడకు అంటుకపోతాడు. బల్లమీద రివాల్వరు చేతిలోకి తీసుకుంటాడు. గోడవారగా జరుగుతూ కిటికీ సమీపిస్తాడు. శాస్త్రి ఇంతలో ప్రవేశిస్తాడు. ఏదో మాట్లాడబోతాడు. శర్మ అతన్ని చేతితోనే వారిస్తాడు.)

శాస్త్రి : (కంగారుగా) ఏమిటి? ఏమయింది? (శర్మను సమీపిస్తాడు.)

శర్మ : (కోపంగా) ఫూల్! షటప్!! (మెల్లిగా) అలికిడయితే పిట్ట ఎగిరిపోతుంది! (శాస్త్రి ఠక్కున ఉన్నచోటనే ఆగిపోతాడు. తాను కూడ మెల్లిగా గోడవారగా నక్కి ద్వారంవంక చూస్తుంటాడు. బయటినుండి ఒక ఆకారం కిటికీలోనుండి తొంగిచూసి మాయమైపోతుంది. ముఖంమీద నల్లటిముసుగు ధరించియుంటుంది. శర్మ, శాస్త్రి ఊపిరిబిగబట్టి దృష్టులను ద్వారంవంక కేంద్రీకరించిచూస్తూ నిల్చుంటారు. కుడిచేతిప్రక్క తలుపు తెరుచుకుంటుంది మెల్లిగా)

శాస్త్రి : (శర్మవంక భయంగా చూసి) ఇంట్లోనే జొరబడ్డాడురోయి! అసాధ్యుడు. మన గదిలోకే వస్తున్నాడు.

శర్మ : (గబాలున శాస్త్రి నోరు మూసి) ష్! మాట్లాడకు. (ముసుగు మనిషి లోపలికి ప్రవేశిస్తాడు.)

శర్మ : (రివాల్వరు అతనికి గురిపెట్టి కోపంగా) కదలకు! కదిలావా కాల్చేస్తా!! (ఆ ఆకారం నిశ్చలంగా నిల్చుటుంది) ముందా ముసుగు తియ్యి! పారిపోవడానికి ప్రయత్నించావో శరీరంతూట్లు పడుతుంది. (రివాల్వరును చూపిస్తూ) ఇది లోడ్ చేసిన రివాల్వరు తెలుసునా? (ఆకారం మాట్లాడదు. కదలక మెదలక నిశ్చలంగా నిల్చుంటుంది.) ఏయ్! నిన్నే! ఏమి టాధీమా? ముందా ముసుగు తియ్యవోయి! (ముసుగు మనిషి తల ఆడించి రెండడుగులు ముందుకేస్తాడు. శర్మను చూసి పకాలుమని నవ్వుతాడు) ఏమిటా సాహసం? అడుగు కదిపితే ప్రాణాలుపోతాయి! నీకేం మతిపోయిందా? ప్రాణాల మీద తీపిలేదా? ఏయ్! మూడంకెలు లెక్కపెట్టేలోగా ముసుగు తియ్యి! లేదా అనుభవిస్తావు. చూసుకో. శర్మంటే లాకాయి లూకాయిగాడు కాదు. (శాస్త్రిని చూసి) శాస్త్రీ! ముందాతలుపు మూసెయ్యి! (శాస్త్రిపోయి రెండుతలుపులు మూస్తాడు) ఏయ్ ముసుగూ! ఇదుగో లెక్కెడుతున్నా! వన్......టూ...... (నీరసంగా) త్రీ......

(రివాల్వరు కాల్చాడు. చెయ్యి వణకుతుంది. నిశ్చలంగా నిల్చున్న ఆకారాన్ని చూసి ఆశ్చర్యపోతాడు శర్మ. ఆ ఆకారం మళ్ళీ ఒక్కసారి ఫెళ ఫెళా నవ్వుతుంది.)

ముసుగుమనిషి : (నవ్వుతూ చొక్కా గుండీలు విడదీసి ఛాతీ చూపుతూ) ఊ! కానీ!! కాల్చవయ్యా!! కాల్చు!!! (రెండడుగులు ముందుకొస్తాడు.)

శాస్త్రి: (కంగారుపడి తమాయించుకుని కోపంతో గబగబా ముందుకొచ్చి) ఏమయ్యా! నీకు ప్రాణాల మీద తీపిలేదూ? చెప్పినట్లు చెయ్యమంటుంటే ఈ నవ్వులూ, శివాలు, చిందులూ ఏమిటి?

ముసుగు: (శాస్త్రిని గబాలున ప్రక్కకు నెట్టి శర్మను చూసి) ఊఁ! కాల్చవయ్యా! కాల్చు. కాల్చమంటుంటే కంగారుపడతావేమయ్యా? ఇంకా మంచి ముహూర్తం కుదరలేదా? ఎంతసేపు నన్నిట్లా నిలబెడతావు? ఊఁ! కానీ. ట్రిగ్గర్ నొక్కు. క్షణంలో ఈ నరకకూపంనుండి విడుదలై పోతాను.

శాస్త్రి : (ఆశ్చర్యంగా) ఇంతకీ ఎవరు నువ్వు? దొంగవా దొరవా? ఇంత అర్థ రాత్రిపూట చావడానికా ఇట్లా అఘోరించావు?

ముసుగు: (విసుగ్గా) నేనెవరినైతే నేమోయి? ఓ వల్లకాట్లో రామనాథాయను. పేరుపేని పెద్దన్నను. పేరు లేకపోతే కాల్చవేమిటయ్యా నన్ను? పోనీ మనిషిని చూసైనా కాల్చండి! నా రూపం చూసైనా నీకు నన్ను చంప బుద్ధిపుడుతుందేమో? (ముసుగు మనిషి ముసుగు మెల్లిగా తొలిగిస్తాడు. వయస్సు సుమారు ముప్పై మించక పోయినా ముఖంలో చాలా ముసలితనం కనిపిస్తుంది. మాసినగడ్డం. ప్రపంచంలో బాధలన్నీ ఆ ముఖంలో నే వున్నాయా అనిపిస్తుంది.)

శాస్త్రి : (ఆశ్చర్యంతో) ఎవరు నువ్వు?

దొంగ : (నిర్లక్ష్యంగా) నే నెవరినైతే నేమోయి? ఓ రామనాథాయను! కాదు కాదు!...ఒక దొంగను. ఒక ఆకలిదొంగను. కడుపు కక్కుర్తి కోసం మీ యింటికి కన్నం వెయ్యడానికొచ్చిన నీచుణ్ణి. కాల్చండయ్యా! కాల్చండి (శాస్త్రి, శర్మ దిగాలుపడి చూస్తుంటారు. ఇద్దరినీ ఒక్కసారి పరికించి నిట్టూర్చి) హారి భగవాన్! నేను చచ్చిపోవడానికిగూడ అర్హుణ్ణి కానన్నమాట! (ఇద్దరిని చూసి కాస్త కోపంగా) చంపండయ్యా! చంపండి!! ట్రిగ్గర్ నొక్కండి. మీరెంత వేగిరం ట్రిగ్గర్ నొక్కితే అంత వేగం ఈ బాధలనుండి, నరకాన్నుండి విముక్తుణ్ణవుతాను. ఊఁ! కానీయండి. ఆలోచించకండి!! (ముందు కడుగేస్తాడు.)

శర్మ : (కంగారుగా, భయంగా) ఏయ్! ఆగు. ఏమిటా దూకుడు? ఎందుకా సాహసం? (శాస్త్రిని చూసి) శాస్త్రీ! ఆ టేబిల్ లైటు వెలిగించు. (శాస్త్రిపోయి టేబిల్ లైటు వెలిగిస్తాడు.)

దొంగ : (కొంచెం మృదువుగా) అబ్బాయిలూ! కాల్చమంటుంటే బెల్లంకొట్టిన రాళ్ళలా అట్లా వూరుకుంటారేం? ఓహోహో! సజీవంగా పోలీసులకు అప్పగిద్దామనుకుంటున్నారా? ప్చ! ప్చ! చాలా శ్రమపడాలి నాయనలారా! పోలీసు స్టేషను చాలాదూరము పాపం! ఒక మైలుంటుందనుకుంటాను. ఇంట్లో టెలిఫోనైనా లేనట్టుందే? (నాల్గు దిక్కులా కలయజూస్తాడు.)

శర్మ : (కఠినంగా) లేదు! ఏం?

దొంగ : (వ్యంగ్యంగా) అయితే చాలా చిక్కేనే? (విచారంగా) అయ్యయ్యో! మీకు చాలా శ్రమ కల్గిస్తున్నాను. అర్ధరాత్రి! అమావాస్య!! శరీరం కొంకర్లెత్తించే చలి. (ఇద్దరివంక చూసి సంతృప్తిగా నిట్టూర్చి) పోనీలెండి! ఇద్దరున్నారు. గుడ్డిలో మెల్ల. ఒకరు నన్ను కాపలా కాయొచ్చు! రెండవవారు పోయి పోలీసులను పిల్చుకరావచ్చు.

శర్మ : (వ్యంగ్యంగా) తమరు కాస్త అల్లరి చేయకుండా మసులుకుంటే అన్ని పనులూ వాటంతటవే జరిగిపోతాయి!

దొంగ: అమ్మమ్మా! తప్పు తప్పు! అల్లరిచేయడం మా యింటా వంటా లేదు. నావల్ల మీ ఏర్పాట్లకు ఎట్టి ఆటంకాలు కల్గవు. ఏదో కాలం వెళ్ళబుచ్చడానికిట్లా వాగుతున్నాను. మీకు అ...(తల పట్టుకుని 'అమ్మా' అని అరచి తూలిపోబోయి ప్రక్కనేవున్న కుర్చీపట్టుకుని నిలద్రొక్కుకుంటాడు. శాస్త్రి, శర్మ ఇద్దరూ అతనివంక ఆశ్చర్యంగా చూస్తారు. ఇదరినిచూసి భారంగా నిట్టూరుస్తాడు 'దొంగ' వురఫ్ 'రామనాథాయ.' ఇటూ అటూ కలయజూస్తాడు. ఎదురుగావున్న

కాఫీ ఫ్లాస్కు మీద, (ప్రక్కనేవున్న బిస్కట్ల ప్యాకెట్ మీద దృష్టిపడుతుంది.)

రామనాథాయ : (ఆశగా) ఆకలేస్తోంది! మొన్ననగా తిన్న తిండి! నాచొరవకు క్షమిస్తారనుకుంటాను. (గబగబా డ్రాయరుకేసి నడుస్తాడు.)

శర్మ : (గబాలున ముందుకుపోయి అడ్డగించి) ఏయ్! ఆగు. అడుగుముందుకేశావా శరీరం తూట్లుపడుతుంది. అడగడం, ఏ అర్ధాన్నం లేదా? (ఆగిపోయి జాలిగా, నిస్సహాయంగా చూస్తాడు శర్మ కండ్లలోకి రామనాథాయ. అతన్ని చూసి జాలిపడి శర్మ) శాస్త్రీ! నువ్వే ఓ రెండు బిస్కట్లు యియ్యి ప్యాకెట్ విప్పి. (శాస్త్రీ పొట్లంవిప్పి నాలుగు బిస్కట్లు తీసి అందిస్తాడు రామనాథాయకు.)

రామనాథాయ : (బిస్కట్లు తిని చేతులు దులుపుకుంటూ) అమ్మయ్య! కాస్త కుదుటబడ్డది. మీ పుణ్యముండేను! అరవ వాళ్లకు 'ఇడ్లీ—సాంబారు'లాగ సీమదొరలకు 'బిస్కట్లు—కాఫీ!' అన్నారు పెద్దలు! (ఫ్లాస్కువంక ఆశగా చూస్తూ) కాస్త కాఫీకూడా పోయించుకున్నారంటే...

శర్మ : (హేళనగా) ప్రభువుల వారు దయచేస్తున్నట్లు కాకిచేత కబుర్లంపించుంటే కాఫీ ఏం ఖర్మ? ఏకంగా డిన్నరే ఏర్పాటుచేసేవాళ్లము! పాపం! తమరక్కడే పప్పులో కాలేసి ఈ ముప్పు తెచ్చుకున్నారు.

రామనా : (విచారంగా) మీ మనస్సులను చాలాకష్టపెట్టినట్లున్నాను. నాచొరవకు క్షమించండి! (భారంగా నిట్టూర్చి) అయినా నేను ఈయింట ఆతిథ్యానికి తగను. నేనెవరిని ఒక పరమకేడీని! అక్రమంగా మీయింట్లో జొరబడిన నీచుడిని! ఒకదొంగను. ఆకలిదొంగను! ఛీ! అట్లాఅనుకోవటంగూడా ఎంతోబాధకరంగావుంది నాకు. గుండెల్లో గునపాలతో పొడుచుకున్నట్లుంది. (గంభీరంగా) నేనిట్లాజరుగుతుందనికలలోకూడా ఊహించలేదు. ఊహించియుంటే ఇక్కడికొచ్చేవాడిని కూడాగాదు. ఇటువంటి పరిస్థితులలో చిక్కుకు నేవాడిని కూడాగాదు. ఇట్లాంటి పరిస్థితులలో ఇరుక్కోవడం ఇదే మొదటిసారి నా జీవితంలో. (ఆగి)బహుశా ఆఖరుసారికూడానేమో? (భారంగా నిట్టూరుస్తాడు. శర్మ కనుసైగచేస్తాడు. శాస్త్రీపోయి కాఫీగ్లాసు తెచ్చి రామనాథాయ కిస్తాడు. దానిని అందుకుని కాఫీ గడగడా త్రాగేస్తాడు.) అబ్బ! అమృతంలాగుంది!! ఎన్నాళ్ళయిందో ఈ జిహ్వ కాఫీ రుచిచూసి? దయచేసి మరి కొంచెము...(శాస్త్రీ గబగబా ఫ్లాస్కు తెచ్చి అందిస్తాడు. అతడు ఫ్లాస్కునే ఎత్తి గడగడా త్రాగేస్తాడు. త్రాగి మూతిచేతితో తుడుచుకుని) థాంక్స్! చాలు!! (ఇద్దరిని చూసి చిరునవ్వు నవ్వి) అహహ! మార్వెలస్!! కన్నంవేయడానికొచ్చి కాఫీత్రాగడం ఎంతవింతగావుంది? అంతా భగవచ్ఛిద్విలాసము!!!

శర్మ : (శాస్త్రీనిచూసి) అయితే ఇంతకీ ఏం చేదామంటావు? స్టేషన్కు నువ్వు వెళతావా? నన్ను వెళ్ళమంటావా?

శాస్త్రీ : నీయిష్టమే! నువ్వెట్లాగంటే అట్లాగే! ఇక్కడవుండమన్నా వుంటాను. లేదూ! నన్నే వెళ్ళమంటావా, నిరభ్యంతరంగా వెడతాను.

రామనా : (గట్టిగా త్రేన్చి) అబ్బాయిలూ! ఏదోఒకటి తేల్చుకోండి! ఏవిషయమూ తేలేదాకా ఇక్కడే నిశ్చింతంగా కూర్చుంటాను.

శర్మ : (చిరునవ్వుతో) నీకోపరేషన్కి చాలా చాలా థాంక్స్! కోడలు కొడుకును కంటానంటే అత్తగారు వద్దంటుందా?

రామనా : (ఫెళఫెళానవ్వి) రైటో! నే నీ కుర్చీలో కూర్చుంటే మీకేం అభ్యంతరమా?

శర్మ : అబ్బే! మాకేం అభ్యంతరంలేదు. నువ్వుమాకు ట్రబుల్ ఇవ్వనంతకాలం నువ్వెక్కడ కూర్చున్నా ఫరవాలేదు.

రామనా : థాంక్స్! (కుర్చీలో కూర్చుంటాడు).

శా : శర్మా! స్టేషన్కి ఏదారి దగ్గరంటావు? నాటు దారిదగ్గరా? రోడమ్మట వెళితే దగ్గరా?

శర్మ : (అనుమానంగా) నాటుదారి దగ్గరే అనుకో! కాని ఆ దారంట బాగాఎగిరినవాళ్లు తప్ప మిగతావారు సులభంగా పోలేరేమో? అందులో ఇట్లాంటి భయంకరమైనచీకట్లో! నాకు బాగా తెలుసనుకో ఆదారి!

శా : ఆమాత్రం నాకూ తెలుసులేవోయి!

శ : (ఆశ్చర్యంగా) నిజంగా?!

శా : అక్షరాలా! అబద్ధమనుకున్నావా? అబద్ధాలాడడం మా యింటావంటా లేదు.

శ : ఓరేయ్ అబ్బాయ్! నువ్వెవడివో తెలుసా? చుట్టపుచూపుగా వచ్చినవాడివి. నాకు గెస్టువి! అదీగాక నాకన్నా చిన్నవాడివి! మర్యాదగా నేను అడిగినదానికి సూటిగా సమాధానం చెప్పు! నువ్వు వెళతావా? నన్ను వెళ్ళమంటావా?

రామనా : (ఇద్దరినీ చూసి) అయ్యా! మీలో మీరిట్లా వాదించుకోకపోతే 'బొమ్మ - బొరుసూ' వేసుకుంటే సమస్యలు సులభంగా పరిష్కారమై పోతాయే! ఈ సంగతి మీకేమిటి? పెద్ద పెద్ద ప్రజానాయకులమని, పరిపాలకులమని చెప్పుకొని మీసాలు మెలివేసుకుంటూ తిరిగే మహామహులకే తెలియదు. లేకపోతే ఇన్ని సమస్యలు ఇట్లా పరిష్కారం కాకుండా నిల్చిపోయేఖర్మ ఎట్లా పట్టింది మనకి? (జేబులో నుండి అర్ధణాకాసు పైకితీసి గాలిలోకి విసిరి చేతితో పట్టుకుని వారికి చూపిస్తూ) ఇదేమిటి? అర్ధణాకాసు! ఈ ప్రపంచంలో మిగిలివున్న నాది అనదగిన ఆస్తి! నా జీవిత సర్వస్వము! ఒక అర్ధణాకాసు! ఇది తీసుకొని 'బొమ్మ - బొరుసూ' వెయ్యండి! తరువాత నాది నాకిచ్చేయండి స్మీ! అదే నా సర్వస్వమని చెప్పానుగా?

శ : (శాస్త్రిని చూసి చిరునవ్వునవ్వి రామనాథాయ భుజంతట్టి) భేష్! ఉపాయాల పుట్టవయ్యా నువ్వు! (అర్ధణా తీసుకుని) శాస్త్రీ! కానీ. బొమ్మ? బొరుసా?

శా : బొరుసు! ఊఁ! కానీ! టాస్ వెయ్యి. (శాస్త్రి చిన్న టేబుల్ కి కుడిప్రక్క, శర్మ ఎడమ ప్రక్క నిల్చుంటారు. రామనాథాయ కుర్చీలో కూర్చుని వీరిద్దరినీ తిలకిస్తుంటాడు. శర్మ అర్ధణా కాసుమీదకు విసురుతాడు.)

రామనా : (గబాలున దానినందుకుని) అయ్యా! ఇద్దరు కాస్త ఆగండి. ఇంతకన్నా మంచి అయిడియా తట్టింది. అయినా ఇదంతా కాఫీ మహిమలెండి! ఆహాహాఁ! కాఫీలో ఏం మాహాత్మ్యముందో గాని అమోఘమైన అయిడియాలు కుప్పలుకుప్పలుగా పుడుతున్నాయి నామస్తిష్కంలో! ఏకంగా ముగ్గురం కలసిపోతే ఏతంటా వుండదుగా? ఎవ్వరూ ఒంటరిగా నాతో, అంటే ఒకదొంగ వెధవతో ఈ గదిలో ఈ చీకటిరాత్రి గడపా అక్కర్లేదు. ఒంటరిగా స్టేషనుదాకా ఈదురోమంటూ నడిచిపోనూ అక్కరలేదు. నన్నక్కడ దిగవిడిచి ఇద్దరూ హాయిగా కలిసే ఇంటికి రావచ్చు!

శర్మ : (సంతోషంతో) రైటో! ఎక్సలెంట్ అయిడియా!!

రామనా : (గర్వంగా) అసలు నా అయిడియాలే అంతలెండి! (వ్యంగ్యంగా) అందుకే నా గతిట్లా వుంది. అయ్యా! ఒక చిన్న మనవి. ఒక చిన్న సిగరెట్ ఇప్పించుకున్నారంటే కాసేపు హాయిగా దమ్ముకొట్టుకుంటూ కూర్చుంటాను. (నిరాశగా) తరువాత కావాలన్నా వుండవు సిగరెట్లు! ఎన్ని రోజులయిందో కుర్చీలో చేరబడి సిగరెట్ దమ్ములాగి.

శా : (హేళనగా) అంచనాలు తారుమారవగానే మతిగతులు తప్పినట్లుంది అయ్యవారికి. శ్రుతి మించి రాగాన పడుతున్నది. మొదట బిస్కట్లు! తరువాత వేడి వేడి కాఫీ!! ఇపుడు సిగరెట్లు!! ఇంకా సేపటికి ఇంకొకటి...ఏమయ్యా! నువ్వెవ్వరివో, ఏ కెపాసిటీతో ఇక్కడి కొచ్చావో తెలుసుకొనే మాట్లాడుతున్నావా?

రామనా : (ఫెళ ఫెళానవ్వి అంతలోనే గంభీరంగా) నేనే కాదు. ఆ మాటకొస్తే ఎవరెవరో ఇక్కడున్నవారు ఎవరు తెలుసుకున్నారు? (ఆవేశంతో బల్లమీద గ్రుద్ది శర్మను చూపించి) నిజం చెప్పు! నువ్వెరివో నీకు తెలుసునా అంట? (గట్టిగా) తెలుసునా? లేదా?...తెలీదు...... నాకు తెలుసు (ఒక్కసారి గట్టిగా నిట్టూర్చి కుర్చీలో కూలబడి నీరసంగా తలెత్తి ఇద్దరిని చూసి) క్షమించండి! ఆవేశంలో ఏమేమో అన్నాను. అనవసరంగా మీకాలం వృధాచేస్తున్నాను. ఈ వాదోపవాదాలులేకుండా ఎవరో ఒకరు బయల్దేరుంటే అన్నిపనులూ చక్కబడేవి ఈపాటికి! (జుత్తులోకి వ్రేళ్లు పోనిచ్చి కూర్చుని ఇద్దరినీ జాలిగా చూస్తాడు. అతనివాలకం గమనించి శాస్త్రికి జాలేసి సిగరెట్ ఆఫర్ చేస్తాడు. దాన్ని తీసుకుని నోట్లో పెట్టుకుంటాడు. శాస్త్రి తన అగ్గిపెట్టె అందిస్తాడు. సిగరెట్

పుట్టించి పొగ లోపలికి లాగి బయటికివదిలి) థాంక్స్! (చిరునవ్వు నవ్వుతాడు.)

శర్మ : (చిరునవ్వు నవ్వి ఆగంతుకుని భుజంతట్టి) ఇంకా ఏమైనా వున్నాయా తమకి చెయ్యావలసిన పరిచర్యలు?

శాస్త్రి : (మెల్లిగా శర్మ చెవిలో) దురదృష్టవంతుడు! అంతా పీడకలలా వుంది నాకు.

రామ : (ఆశ్చర్యంగా) పీడకలా?!......(గంభీరంగా) కాదు! పీడకల కాదు!! చాలా చక్కని వాస్తవము!!! నేను సదా కోరుకునేది ఇట్లాంటి దాన్నే! ఎంత హాయిగా, ప్రశాంతంగా వుంది ఈ గది! (నాల్గు దిక్కులూ కలయజూసి) మైగాడ్! రవివర్మ చిత్రాలే?! ఆహాహా! ఎంత సుందరమైన ప్రకృతి దృశ్యాలు! (నేలమీదకు చూసి) ఎంత మెత్తగా వుంది ఈ తివాసీ?! ఈ తివాసి ఈ గదికి వన్నె తెచ్చింది. బంగారానికి తావి అబ్బినట్లుగా వుంది. ఆహాహా! అందమైన ప్రకృతి దృశ్యాలు! మెత్తని ఈ తివాసీ! ఈ ప్రశాంతత!! స్వర్గంలో వున్నట్లుంది. (ఇటూ అటూ నడుస్తూ) నిజంగా స్వర్గంలో వున్నట్లే వుంది ఈ తివాసీమీద నడుస్తుంటే. (మెల్లిగా పోయి మూలగా వున్న టేబిల్ ని సమీపించి ఫ్లాస్కు మూత తీస్తాడు.)

శర్మ : (రివాల్వరును డ్రాయరుమీద పెట్టి ఆగంతుకుని చూసి) ఏమయ్యోయి! వ్రేలు చూపితే మండ మింగేట్లున్నావే!అందులో ఒక్క చుక్కైనా లేదు కాఫీ! అయినా అంత చొరవతీసుకోవడం నాకేమీ నచ్చలేదు.

రామనా: (గభాలున వెనక్కి తిరిగి) వెరీ సారీ! క్షమించండి (డ్రాయరు మీదున్న రివాల్వరును లిప్తకాలం పరికించి గబగబాపోయి గోడలకు కొట్టిన ఫోటోలు తిలకిస్తూ ఒక ఫోటోవద్ద ఆగి వెనుకకి తిరిగి) కాలేజీ గ్రూపు ఫోటోలాగుందే?

శాస్త్రి : అవును! మాశర్మ బావ చదువుకుంటున్న రోజుల్లోని ఫోటో!

రామనా: అహా......అన్నట్టు మీరు?

శాస్త్రి: (గర్వంగా) నేనూ అక్కడే చదువుతున్నాను.

రామనా : (సంతోషంతో) నిజంగా! మీరూ అక్కడే చదువుకుంటున్నారు? (విచారంగా) నేనూ అక్కడే చదువుకున్నాను. (శర్మ, శాస్త్రి ఆశ్చర్యంగా అతనిని చూస్తారు.) ఎందు కట్లా ఆశ్చర్యంగా చూస్తారు? .... అవును లెండి. మీరు నమ్మరు. మహామహులను, మహా మేధావులనూ తయారుచేసిన కాలేజీ నాలాంటి దొంగలనూ, చీడపురుగులనూకూడా తయారు చేసిందంటే మీరు నమ్మరులెండి! నాకు తెలుసు. (విచారంగా) ఆ రోజులు తల్చుకుంటే నా హృదయంలో దేనితోనో కెలికినట్లుగావుంటుంది. మళ్లీ ఆనాటి తియ్యనిదినాలు తిరిగివస్తే బాగుండుననిపిస్తుంది... (ఏదో స్ఫురించగా) అన్నట్లు రాయుడు మేష్టారు, రాజారావుగారు, శేషగిరి రావు ... ఇత్యాదులంతా ఇంకా వున్నారా? రిటైరు అయ్యారా? రిటైరయ్యే వుంటారులెండి!

శాస్త్రి : రాయుడుగారుతప్ప అంతా రిటైరయ్యారు!

రామనా : (సంతోషంగా) రాయుడుగారింకా సర్వీసులోనే వున్నారన్నమాట? పాపం ఇంకా ట్యూటరుగానే వుంటున్నారా? లెక్చరరుగా ప్రమోటు అయ్యారా? చాలా మంచి మేష్టారు!

శాస్త్రి : లేదు. ఇంకా ఆయన ట్యూటరుగానే వుంటున్నారు!

రామనా : (విచారంగా) పాపం! (కోపంగా) అయినా ఈ పాడు ప్రపంచంలో మంచికీ, నిజాయితీకీ తావులేదు. చీడపురుగులతో, విశ్వాసఘాతకులతో పాపాత్ములతో పంకిలమై పోయిందీ ప్రపంచము. నీతి నిజాయితీ మంటగలిసి పోయాయి! అవినీతి, అధర్మం చెట్టాపట్టా లేసుకుని స్వైర విహారం చేస్తున్నాయి. (గంభీరంగా) అన్నట్లు మీ రక్కడేం చదువుతున్నారు?

శాస్త్రి : ఫోర్తియర్!

శర్మ : (విసుగ్గా) మీ యిద్దరి కాలేజీ కబుర్లకూ అంతుండె దేమిటి? బయల్దేరండి! దారిలో మాట్లాడుకోవచ్చు. పదండి.

శాస్త్రి : (ప్రాధేయ పూర్వకంగా) బావా! కానీ పాగు బావా! ఇంకా బోలెడు టైముంది. (సిగరెట్టుపెట్టె ఆగంతకుని కందించి) మరోటి కాల్చు! ఊఁ! కానీండి! (శర్మ శాస్త్రివైపు కోపంగా చూస్తాడు. శాస్త్రి పాటుపాటుకు నాలి

కరుచుకుంటాడు. ఆగంతకుడు సిగరెట్ తీసుకుంటాడు. శాస్త్రి తడబడుతూ) అడగడం బా... బా...గుండదనుకో. అయినా కుతూహలంకొద్దీ అడుగుతున్నాను. మరో......చెడ్డభావంతో కాదు. అసలింతకీ నువ్వెందుకిక్కడికొచ్చావు. నువ్వెవరివి? పైకి దొంగలాగున్నావు! హృదయం, మనస్సు దొంగవిలా లేవు!

రామనా : (ఫెళఫెళా నవ్వి) దొర హృదయం! దొంగ హృదయం!! చాలా బాగుంది! అద్భుతం!! (గంభీరంగా) దొర ఎవరు? దొంగ ఎవరు? అబ్బాయి! నువు చాలా చిన్నవాడివి. అనుభవం లేదు నీకు. కొన్నాళ్లుపోతేనేకాని దొంగెవరో, దొరెవరో నువ్వు తెలుసుకోలేవు! నాకు తెలుసు. నిజం చెప్పాలంటే ఈ కాలంలో అంతా దొరలే! అంతా దొంగలే!......ఇక నేనిక్కడికెందు కొచ్చానంటావు? నే నెవరినంటావు? అదంతా పెద్ద కథ! చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. అయినా నా సొదంతా వెళ్లబోసుకుని మీ విలువైన కాలాన్ని వృథా చెయ్యడం నా కిష్టంలేదు. (శర్మనుచూసి) ఊఁ! పదండి! ముందు దారి తియ్యండి! (లేస్తాడు).

శాస్త్రి : (వారించి కూర్చోబెట్టి శర్మనుచూసి) బావా! ఒక్క అరగంట ఆగు. ఇంతసేపు ఆగాం! ఒక్క అరగంట ఆగలేమూ? ప్లీజ్! (ఆగంతకుని చూసి) ప్లీజ్! మిమ్మల్ని చూస్తుంటే నాకు గౌరవభావం పుడుతున్నది. మీ కథ వినాలని బుద్ధి పుడుతున్నది. మా కాలమేం వృథాగాదు. ప్లీజ్! కానియ్యండి!

రామనా : సరే! కానియ్యండి. మీరంతలా ప్రాధేయపడుతుంటే ఇంకేమనగలను. అందులోనూ కన్నం వేయడానికొచ్చి ఆతిథ్యం పుచ్చుకుంటున్నాను. చెప్పక తప్పుతుందా? (నిస్పృహగా) అయినా ఏమిటో ఆ రోజులు తల్చుకుంటుంటే మనసులో ఏమిటో 'ఇది'గా వుంటుంది.

శాస్త్రి : (విచారంగా) పోనీలే! నీకంత చెప్పాలని లేకపోతే మానేయ్యి.

రామనా : అబ్బెబ్బే! పరవాలేదండి. నాకేం విచారం లేదు. నాగోడు మీలాంటి నల్గురితో వెళ్ళబోసుకుంటేనే నాకూ తృప్తివుంటుంది. అనవసరంగా మీకాలం వృథాచేశాను. ఇంక ఎంతమాత్రమూ వృథాచేయదలచుకోలేదు. అయితే వినండి చెపుతున్నాను.

శాస్త్రి : (వుషారుగా) అయితేకానియ్యండి వింటాను.

రామనా : (గొంతు సవరించుకుని) ఆనాడు నేను బస్ స్టాండు ప్రక్కసందులో పచ్చమేడలో అద్దెకుండే వాడిని.

శాస్త్రి : (ఆశ్చర్యంగా) బస్సు స్టాండు ప్రక్కసందా? పాతబస్ స్టాండు ప్రక్కనా? ఈమధ్య క్రొత్తగా కట్టిన బస్ స్టాండు ప్రక్కనా?

రామనా : పాతబస్ స్టాండు ప్రక్కనే! అవి నేను చదువుకుంటున్న రోజులు. బి. ఏ. ఆఖరు సంవత్సరము చదివేవాడిని. రోజులు చాలా వుషారుగా గడుస్తున్నాయి. ఎప్పుడూ ఇట్లాగే గడవాలి అని కోరుకునేవాడిని భగవంతుని. ఎప్పుడూ జీవితం వడ్డించిన విస్తరిలా వుండాలని వాంఛించేవాడిని. (భారంగా) కాని రోజులు ఒక్కలాగుండవు. మనం తలచేదొకటి జరిగేదొకటి. ఆనాడు ఆటలాడుకుని భోంచేసి వుషారుగా లాడ్జిచేరుకునేసరికి రెండు త్తరాలు కనిపించాయి. ఒకటి నాకథ తమపత్రికలో ప్రచురించ నిశ్చయించామని సంపాదకుల నుండి; మా నాన్నగారు దివాలాస్థితిలో వున్నారని రెండవది. ఒకవంక వెలుగు ఒకవంక చీకటి. ఎన్నో రోజులనుండి కలలుకంటున్న ఆశయము నెరవేరేసూచన లొకవైపు, ఏం చేయాలో, ఎటు పోవాల్లో తెలియని అయోమయావస్థ మరొకవైపు. అన్నిటికీ దేవుడే వున్నాడని నిశ్చయించుకున్నాను చివరకు. పరమాత్మమీద భారంవేసి ముందు కుపక్రమించాను. ఎవరికీ తెలియచేయకుండా మద్రాసుకు కేంపు ఎత్తేశాను. భగీరథ ప్రయత్నంమీద అక్కడొక గుమస్తాగిరీ సంపాదించాను. అదీ ఒక ప్రయివేటు కంపెనీలో. పని చాలా తక్కువ. చాలా తీరిక వుండేది. స్వతహాగా నాలోవున్న కల్పనాశక్తికి పరిసరాలు తోడయ్యాయి. నాలో అంతర్భూతమైయున్న కథకుడు బయటకొచ్చాడు. ఎన్నెన్నో భావగీతాలు, వ్యాసాలు, కథలూ వ్రాశాను. పత్రికలకు పంపించాను. నిజంగా అప్పటిజీవితమంతా స్వర్ణాక్షరాలలో లిఖింప తగినదేమో? నా రచన ప్రచురించని పత్రికలేదు ఆంధ్రావనిలో. ఆదాయానికి ఆదాయము కీర్తికి కీర్తి! అన్ని

వచ్చాయి అనతికాలంలోనే! ఒక నాటకం వ్రాశాను. దాన్ని సినిమా కంపెనీకి పంపించాను. దాన్ని చూసి వాళ్ళు చాలా మెచ్చుకున్నారు. దాన్ని సినీమా తీస్తామన్నారు. ఆనాడు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం! కాని...... (భారంగా నిట్టూర్చి మౌనం దాలుస్తాడు.)

శాస్త్రి: (కుతూహలంతో) 'కాని' అని ఆపేశారేం! తరువాతేమయింది? మీ నాటకం సినీమాతీశారా?

రామనా: (నిట్టూర్చి) లేదు! ఆ ఆనందం ఎంతోకాలం నిల్వలేదు. ప్రశాంతంగా నడుస్తూన్న నాజీవిత నౌక సుడిగుండంలో పడిపోయింది.ఒక అమ్మాయి-ముక్కూ మొగమెరుగని ఒక అమాయకురాలు నా జీవితంలో అడుగెట్టింది. ఎన్నో ఆశలతో, ఎంతో ఉత్సాహంతో నా జీవితంలో ప్రవేశించింది. కాని ఆమె పొందిన ఫలితం?...(విచారంగా) తన జీవితం సర్వనాశనం చేసుకుంది... కాదు కాదు...(కోపంగా) ఈ దుర్మార్గుడు ఆమె జీవితాన్ని సర్వనాశనంచేశాడు. వికసిస్తున్న ఆమె జీవిత కుసుమాన్ని తనక్రూర కఠోర పదఘట్టనలక్రింద నలిపి నాశనంచేశాడు ఈ దౌర్భాగ్యుడు!. మీ ఎదురుగా కూర్చున్న ఈ కన్నపు దొంగ! ఆమె గాలిమేడలు కూలిపోయాయి. ఆమె నిండుప్రాణాలు ఈ దౌర్భాగ్యుడికోసం బలి అయిపోయాయి. (ఆయాసంగా కూలబడతాడు కుర్చీలో.)

శర్మ: (ఒకసారి రామనాధాయను చూసి) సరిగ్గా నేనూహించినట్లే అయింది. మానవుడు నీస్థాయికి దిగజారిపోవడం కేవలం తాను తనచేతులారా చేసుకున్న తప్పువల్ల నే అనిమాత్రం మర్చిపోకు. నిన్ను నువ్వు మలినపరచుకోవాలంటే ముందు అడుసులో తెలిసో తెలియకో కాలువెయ్యాలి తెలుసా?

రామనా: (వచ్చే ఆవేశం అణచుకుని నిశ్చలంగా) కాదు! ముమ్మాటికీ కాదు. కన్నూ మిన్నూ కానక కార్లలో తిరిగే స్వార్థపరులు నిర్భాగ్యులమీద బురద త్రుళ్లించి 'అబ్బాయీ! నువ్వు మలినమైపోయావు. దేనికీ పనికిరావు' అని మమ్మల్ని సంఘంనుండి వెలివేశారు. సంకుచిత స్వభావులతో, స్వార్థపరులతో నిండిన ఈసంఘం దీనికి కారణం!...కాదు కాదు...సంఘం కాదు. సంఘంలో వ్యక్తులు కారణం! ఇట్లాంటివ్యక్తులు పోతేనేకాని సంఘం బాగుపడదు.

శర్మ: (విసుగ్గా) సర్లే! సంఘంగూర్చి, వ్యక్తులగూర్చి తర్వాత మాట్లాడుకోవచ్చు. ముందు నువ్వుచెప్పే దేదోకానీ! అనవసరంగా కాలం వృధా అవుతున్నది.

రామనా: క్షమించండి! అనవసరంగా ఏదేదో వాగుతూ చాలాకాలం వృధాచేశాను.. (శాస్త్రినిచూసి) అన్నట్టు ఎంతవరకూచెప్పాను.

శాస్త్రి: మీరు ప్రేమించిన అమ్మాయి జీవితం...

రామనా: (అందుకుని) నాశనంచేశాను. చేతులారా నాశనంచేశాను. (నిట్టూర్చి) అయినా అది పూర్తిగా నాతప్పుకాదు.మాఇద్దరిలో వుందేమో? మేమిద్దరమూ ఒకరినొకరం ప్రేమించుకున్నాము. ఒకరినొదిలిఒకరం ఒకక్షణం వుండలేకపోయేవారము. ఎడబాటుఅన్న పదం తల్చుకుంటేనే మా శరీరాలు గగుర్పొడిచేవి. 'విరహము' అన్నపదమే మా డిక్షనరీలోనుండి తొలగించాలనుకున్నాము. చివరకు ఇద్దరమూ పెండ్లి కూడ చేసుకున్నాము ... (విచారంగా). కాని మా యిద్దరి జీవితాల నాశనానికి మూల కారణం అదే! నేను దూరమాలోచించి ప్రక్కకు తప్పుకొనివుంటే ఈ ప్రమాదం జరిగేది గాదు. అధమం ఆమైనా క్షేమంగా వుండేదేమో? కాని విధి!...దానిని దాటలేము. మా యిద్దరిజీవితాలు ఇట్లా అధః పతనమై పోవాలని ఆ విధాత లిఖించాక తప్పుతుందా?

శర్మ: (నిర్లక్ష్యంగా) ప్చ్! నమ్మలేకుండా వున్నాను. అంతా నాటకంలా గుంది.

రామనా: (కోపంగా) అవును! నమ్మలేరు. మీరే కాదు. ఈ ప్రపంచంలో చాలామంది నమ్మరు: నాలాంటి కొందరు దురదృష్టవంతు లున్నారు ఈ ప్రపంచంలో.. వారేం చెప్పినా లోకం నమ్మదు నిజమైనా, అబద్ధమైనా కూడా!

శర్మ: జీవితంలో ఓడిపోయినవారు తమ ఓటమిని కప్పిపుచ్చుకోటానికి అనేకమైన సాకులు వెదుకుతుంటారు.

రామన: (విచారంగా) అవును. నేను ఓడిపోయాను. అసమర్థుడిని. ధర్మయుద్ధం చేసి ఈగతి తెచ్చుకున్నాను. (ఆవేశంతో) నే నెందుకోడి

పోయాను? నా ఓటమికి కారణం ఎవరు? అంతా మీరే! నేను గెల్చినా ఓడిపోయానంటుంది ఈ స్వార్థపరుల కూటమి. నే నోడిపోలేదు. ముమ్మాటికీ ఇది సత్యం. లోకం దృష్టిలో ఓడిపోయాను. కాని నా దృష్టిలో నేను ఓడిపోలేదు. నేను విజయుణ్ణి! మీరు ఓడిపోయారు. మీలాంటివారితో నిండిన ఈ సంఘం ఓడిపోయింది. మీకు అంతరాత్మలు లేవు. అవి శాసించిన విధంగా మీరు నడువలేరు. కాని నా అంతరాత్మ శాసించినట్లు నేను నడిచాను. నా స్వబుద్ధితో ఆలోచించాను. నా ఆదర్శాలు కార్యరూపంలో పెట్టడానికి చాలా ప్రయత్నించాను. ప్రేమలోని మాధుర్యము, స్నేహంలోని సౌహార్దము నేను మీకన్నా బాగా అనుభవించాను. కాని నేనూ కొన్ని తప్పులు చెయ్యక పోలేదు. అందరూ చేసిన తప్పులే నేనూ చేశాను. కాని నేను మాత్రం ఓడిపోయ్యానని ఒప్పుకోను. కాని మేమేం చేసినా ప్రపంచం హర్షించదు. సంఘం మాకు బ్రహ్మరథం పట్టదు. ఎందువల్ల? పాపాన్ని పుణ్యంగా, అన్యాయాన్ని న్యాయంగా, అసత్యాన్ని సత్యంగా మార్చి ప్రపంచాన్ని శాసించే డబ్బు మా దగ్గర లేదు. ధనవంతుడు ఓడినా గెల్చాడనే అంటాము. మాలాంటి వాళ్లు గెల్చినా ఒప్పుకోదు ప్రపంచం. ఒక్కసారి ప్రపంచ స్థితిగతులను సింహావలోకనం చేసుకోండి. ప్రపంచం నైతికంగా ఎంత దిగజారి పోయిందో?! (ఆవేశంతో) తననల్పు తానే ఎరుగని ఈ గురిచిందగింజలోకం పతనమైపోతున్న తనతోపాటు పురోగమించలేక పోతున్నామని మాలాంటివారిని పరాజితుల క్రింద, అసమర్థుల క్రింద, బలహీనుల క్రింద జమచేసింది. హు!... అంతకన్నా ఏం చెయ్యగలుగులెండి ఈ లోకం? (పండ్లు కొరుకుతూ కోపంతో) సాకులట! సాకులు!! మేము కాదు సాకులు చెప్పేది. తాను చేసే అన్యాయాలను సమర్థించుకోడానికి ఈ పాడులోకం వెదుకుతుంది సాకులు! (భారంగా నిట్టూర్చి కుర్చీలో కూలబడతాడు.)

శాస్త్రి : (విచారంగా) ప్చ్! పాపం!...అయితే ఇంతకీ నువ్వు వ్రాసిన నాటకం మాట?

రామనా : (చిరునవ్వు నవ్వి) ఇంకేం నాటకం? అది ఆనాడే బుట్టదాఖలా అయిపోయింది. దానిని చదివిన ప్రొడ్యూసర్ 'ఇది చాలా ఎబ్బెట్టుగా వుంది. బాక్సాఫీసు హంగులు కథలో లోపించాయి. మా కొద్దీ నాటకం' అని త్రిప్పగొట్టేశాడు. నా రచనలు కొన్నింటిలో గవర్నమెంటు పాలసీల వ్యతిరేకమైన వుద్దేశ్యాలున్నాయని నన్ను పనిలోనుండి తొలగించారు. నా ఆదర్శాలు లోకానికి నచ్చకో, పత్రికా సంపాదకులకు నచ్చకో నా రచనలుకూడా అచ్చువడం మానేశాయి. అక్కడనుండే నా జీవితంలో గడ్డుదినాలు ఆరంభమయ్యాయి. 'దినదిన గండం నూరేండ్లాయుస్సు' అయింది మా బ్రతుకు. చివరకు దిగులుతో, ఆకలితో, రోగంతో నా భార్య...(విచారంతో మౌనం ధరిస్తాడు.)

శాస్త్రి : (ఆత్రుతగా) ఏమైంది నీ భార్య?

రామనా: (నిర్లక్ష్యంగా) ప్చ్! చనిపోయింది. (విచారంగా) ఎన్నాళ్లు ఆహారం, విశ్రాంతి, మందులు లేకుండా రోగిష్టిది బ్రతుకగలదు? (ఒక్కసారి ఏదో జ్ఞప్తికి రాగా విచారంతో.) ఆ దుర్గంధభూయిష్ఠమైన మురికిపేటలో, గాలి వెల్తురూ చొరని ఆ చిన్న మురికికూపంలో, దోమలూ, ఈగలూ, చీమలూ దేహంమీద ప్రాకుతూంటే, చలిబారినుండి తప్పించుకోడానికి చిన్నదుప్పటి గుడ్డకూడ కరువై జ్వరంతో మూల్గుతూ మరణవేదన పడుతూన్న ఆ......(బాధగా) అబ్బా! తల్చుకుంటేనే నాకీ జీవితంమీద విరక్తి పుడుతున్నది. అట్లాంటి పరిస్థితులలో రోడ్డమ్మట దొర్లుతున్న ముష్టివెధవను చూస్తేనే హృదయం విలవిలాడుతుందే! అందులో ఆ వ్యక్తి తన జీవిత సహధర్మచారిణి, అర్థాంగి, తాళిగట్టిన భార్యే... (గొంతుక పూడుకపోతుంది. మాటలు రావు. కంటివెంట నీళ్లు కారుతాయి. వాటిని తుడుచుకుని)...అంతే...అట్లా జరగాల్సింది. జరిగిపోయింది...నా జీవితం ఇట్లా అధోగతి పాలు అయింది.

శాస్త్రి: (విచారంగా) ప్చ్! పాపం!...తరువాత?!

రామనా: (చిరాకుగా) ఎందుకు నన్నిట్లా ప్రశ్నలతో వేధిస్తావు? కాసేపు ప్రశాంతంగా వుండనీయవా ఏం? తీరికగా కూర్చుని ఆ విషాదమయమైన గతాన్నంతా నీకు చెప్పడమే పననుకున్నావా?

శాస్త్రి: క్షమించండి. మీ గతాన్ని బయటకు లాగి మిమ్మల్ని బాధపెట్టాలని నాకే కోశానా లేదు. కాని అదేమిట్లో మీకథ వినాలని ఏదో శక్తి నన్ను ప్రేరేపిస్తున్నది. మీకంత కష్టం గలిగితే చెప్పొద్దులెండి.

రామనా: (విచారంగా) క్షమించండి. ఆ విచారంలో ఏమేమో చిరాకుగా మాట్లాడాను. మీ వుత్సా

హోన్నెందుకు నేను భంగం చెయ్యాలి? (వ్యంగ్యంగా) ఎప్పుడైనా మిత్రులకు నా కథ చెప్తూ "ఇది రాత్రి రెండు గంటలవేళ ఒక గజదొంగ నోటినుండి వెలువడిన అతని జీవిత గాథ" అని గొప్పగా చెప్పుకోవచ్చు. ఏమంటావు?

శాస్త్రి: (సిగుపడి తలవంచుకుని) అ...బ్బే!...... అదికాదు.

రామనా: సర్లెండి. దానికేమిటి? నాకథ వినండి. ఆమెతోనే పోయాయి నాలో వుత్సాహమూ, చైతన్యమూను. ఉల్లాసంతో, ఉత్సాహంతో కేరింతాలుకొడుతూ తిరిగే యువతీయువకుల జంటలు నాహృదయంలో బడబాగ్ని జ్వాలలు రగుల్కొల్పేవి. నన్నూ నాభార్యనూ వేరుచేసిన ఈ ప్రపంచానికి దూరంగా పోయాను. ప్రకృతి నన్ను ఆదరించి లాలించింది. చెట్ల నీడల్లో పచ్చని పొదరిండ్లలో, పొలాల్లో కాలం గడిపాను. చాలా ప్రశాంతంగా గడిచింది. కాని ఆ ప్రశాంతతకూడా ఎంతో కాలం నిలువలేదు. ఈ ప్రపంచం నేను ప్రశాంతజీవితం అనుభవించడంకూడా భరించలేకపోయింది. గాలిపట్టి తిరుగుతున్నానని, సంఘానికి చాలా న్యూసెన్సుగా వున్నానని పోలీసులు నామీద న్యూసెన్సుకేసు పెట్టారు. మేజస్ట్రేటు నన్ను 'సంఘానికి చీడపురుగు' అన్నాడు. కొన్నాళ్ళు జెయిలు జీవితం గడిపి విడుదలై యొచ్చాను. పగల సెగలు రగిలాయి నాహృదయంలో ఈ మానవాళిమీద, ప్రపంచం మీద. దొంగతనాలు మొదలెట్టాను. నాదికాని వస్తువునల్లా సర్వనాశనం చెయ్యాలని దీక్షపూనాను. ముఖ్యంగా ఈ ప్రపంచాన్ని శాసించే, సర్వానర్థాలకు మూలకారణమైన డబ్బును సర్వనాశనం చెయ్యాలని నాదీక్ష. చూశారా ఈముసుగు? (వికటంగా నవ్వి దాన్ని మెడనుండి బయటకు లాగి చేతితో బట్టుకుని) ఈ ముసుగులోనే నేను అసంఖ్యాకమైన దొంగతనాలు చేశాను. కొన్ని వేల రూపాయలను ఈ నాచేతిమీదుగా గంగపాలుచేశాను. ఈ మహాయజ్ఞంలో ఇదే నాకు హోత! (దానిని విసరుగా బల్లమీదకు గిరాటేస్తాడు. అదిపోయి టేబిల్ మీదున్న రివాల్వరుమీదపడుతుంది. ఒక్క లిప్తలో రివాల్వరును కూడా చూస్తాడు. శాస్త్రి నేల చూపులు చూస్తుంటాడు. శర్మ కిటికీలో నుండి బయటకు చూస్తుంటాడు. అదే సమయంలో రామనాథాయ ఒక్క దూకుతో టేబిలును సమీపించి ముసుగు క్రిందనున్న రివాల్వరును బయటకులాగి పట్టుకుని రెండడుగులు వెనుకకు వేసి శర్మవంక గురిచూసి పగలబడినవ్వి చిక్కాయి పిట్టలు! మంచితరుణం! మించిన దొరకదు!! హేండ్సప్!!! (కంగారుగా శర్మ వెనుకకి తిరుగుతాడు. శాస్త్రి త్రుళ్లిపడి రామనాథాయవంక చూస్తాడు. ఇద్దరూ రామనాథాయ చేతులో రివాల్వరు చూసి ఆశ్చర్యంతో, కంగారుగా, భయంగా అచేతనులై నిల్చుండిపోతారు.)

శాస్త్రి: (కొద్దిగా తేరుకుని కంగారుగా) ఏమిటీ అన్యాయం?

రామనా: (గట్టిగానవ్వి) అన్యాయంకాదు బ్రదర్! అవకాశం!! 'అవకాశం దొరికినపుడు ఆలసించక వినియోగించుకో' అని దొంగతనం విద్య నేర్పేముందు మా గురువుగారు చెప్పే మొదటి వాక్యము. (శర్మనుచూసి) ఏం బ్రదరూ? ఏమంటావు? పోలీసులను పిలుస్తావా?

శ: (పండ్లు పటపట కొరుకుతూ కోపంతో) దుర్మార్గుడా! తిన్నింటివాసాలు లెక్కిస్తావురా దొంగముండాకొడకా? ముందు రివాల్వరు అక్కడ పెట్టు!

రామనా: (గట్టిగా నవ్వి) హ హ్హ హ్హా! తాటాకు చప్పుళ్లకు కుందేళ్లు బెదరవు! (శాస్త్రిని చూసి) ఏం బ్రదరూ?

శాస్త్రి: (కంగారుగా) నాకంతా అయోమయంగా వుంది? ఏదో నాటకంలా వుంది?

రామనా: అవును బ్రదర్! అక్షరాలా నాటకమే బ్రదర్! ఇంతవరకూ జరిగింది, నే నాడింది అక్షరాలా నాటకమే బ్రదరూ! ఇంక జరుగబోయేది నూటికి నూరుపాళ్లూ యథార్థము. 'దీపముండగా ఇల్లు చక్కపెట్టుకోరా' అన్నారు పెద్దలు. తమ్ముడూ! నీ రిస్టువాచీ చాలా బాగుందే! అది తీసి ఇట్లాగియ్యమ్మా! (శాస్త్రి దిగాలుపడి చూస్తుంటాడు. రామనాథాయం కోపంగా) ఏం ఇయ్యవేం? (భయం భయంగా రిస్టువాచీ విప్పి నామనాథాయకిస్తాడు. దాని నాతడు తీసుకుని చిరునవ్వునవ్వి శర్మను చూసి) భాయీ! ఇంక నీ వంతు! మా మంచి వాడివిగానీ గబగబాపోయి దాచిపెట్టినడబ్బా దస్కం పట్రా! అపుడే చాలా వేళయింది. అయిదు నిముషాలే టైమిస్తున్నాను. (రివాల్వరు శాస్త్రివంక గురిపెట్టి) ఈ అయిదునిముషాల్లో రాకపోయానో ఇతన్ని 'ఠా' మనిపిస్తాను.

శ : (భయం భయంగా చూస్తుంటాడు).

రామనా : (గట్టిగా కోపంగా) ఊఁ! కదలవేం? కదులూ! నాకూ టైంలేదు. (శర్మ భయంగా లోనికిపోతాడు. దొంగ టైంవంక చూస్తుంటాడు రివాల్వరు శాస్త్రివంక గురిపెట్టి.)

శా : (భయంగా) అయ్యా రామనాథయ్యగారూ?

రామనా : (తలపైకెత్తి) ఏం?

శా : (కంగారుగా) మీకిది న్యాయమేనా చెప్పండి?

రామనా : (వికటంగానవ్వి) న్యాయంట? న్యాయం! నాకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఎవ్వరూ అది అన్యాయమని అడ్డుపడలేక పోయారు. ఆ నాడే నాకు జరిగే అన్యాయాలని ఎదుర్కొని ఆపగలిగివుంటే నేనిట్లా అధఃపతనమై పోయేవాడిని గానేమో? నేనూ మీలాగే గౌరవప్రదమైన జీవితం గడిపేవాడిని.

శా : (భయంగా) పోనీ ఒక్కమాటయ్యా!

రామనా : ఏమిటది?

శా : మీరూ ఒక్కసారి ప్రేమించబడ్డారు. ప్రేమించారు. ప్రేమలోని మాధుర్యమూ, అనురాగములోని ఆనందమూ, ఎడబాటులోని బాధ మీకు తెలుసు.

రామనా : (ఆశ్చర్యంగా) అయితే?

శా : (వాచీనిచూసి) అది నాప్రేయసి మనసుపడి కొనియిచ్చిన వాచీ! మాయిద్దరి మనసులనూ, హృదయాలను పెనవేసుకొన్న పవిత్రబంధం! అదినాకు ప్రాణంకన్నా ఎక్కువ! నాప్రియురాలు ఎదుటలేనపుడు ఆవాచీఃయలులో ఆమె ప్రతిబింబాన్ని వూహించుకుని ఉపశమనం పొందుతుంటాను. ఏలాంటి వేళలందైనా ఆ వాచీని వదలనని ప్రేయసిమీద ప్రమాణం చేశాను. వాచీ కనిపించకపోతే ఆమె నొచ్చుకుంటుంది. ఆమె హృదయం గాయపడుతుంది. అసలే సున్నితమైన హృదయం. గాయాని కోర్వలేదు. మనసు విరిగినా విరగొచ్చు. ప్రేమించిన ప్రేయసి నిరాకరిస్తే వాడుపడే బాధ నేను మీకు వేరే చెప్పనవసరంలేదు. మీరు దయతలచి ఇస్తే ఆ వాచీ ఇవ్వండి. లేకపోతే ఆ వాచీతోపాటు నాప్రాణాన్ని కూడా తీసుకపొండి. ఏదో ఒకటి కానియ్యండి. వాచీ లేకుండా నేనుమాత్రం ప్రేయసి నిక చూడలేను. ప్రేయసిని చూడకుండా ఒక్కక్షణం జీవించలేను. కానియ్యండి. నన్ను చంపడమో, నావాచీ నాకియ్యడమో ఏదో ఒకటి చెయ్యండి. (ఛాతీముందుకు చాచుతాడు.)

రామనా : (చిరునవ్వునవ్వి శాస్త్రిని సమీపించి భుజం తట్టి) సెభాష్ ప్రేమికా! నిజమైన ప్రేమికుడివి నువ్వూ! (గంభీరంగా) నీ వాచీ నువ్వేతీసుకో. విరహంలోని బాధ, ఎడబాటులోని ఆవేదన, ప్రేయసీ ప్రియుల హృదయాలూ నాకూ తెలుసు. హేభగవాన్! ఆ బాధా, ఆ వేదనా పగవాడికి కూడ వద్దురా! (శాస్త్రినిచూసి) ఇంద నీవాచీ నువ్వే తీసుకో! మీరిద్దరూ కలకాలం చిలకా గోరువంకల్లా సుఖంగా వుండండి. (వాచి తిరిగి శాస్త్రికి ఇచ్చేస్తాడు. శాస్త్రి వాచీ తిరిగి పెట్టుకుంటుండగా శర్మ ప్రవేశిస్తాడు.)

శర్మ : (నోట్లు లెక్కపెట్టి రామనాథాయ చేతిలో పెడుతూ గాద్గదికంగా) తీసుకో! ఒకటీ రెండూ కాదు ఏడువందల రూపాయిలు మా శ్రీమతికి నెక్లెస్ చేయిద్దామని కష్టపడి కూడబెట్టిన డబ్బు! శోభనంనాడు రాత్రి మనసువిప్పి అడిగింది. బాలసారెనాడు ఇస్తానన్నాను. కానీ విధి ఇట్లావుంది. తరువాత దానికోరిక్క తీరుస్తాను. బ్రతికుంటే బలుసాకు తినొచ్చు.

రామనా : (గట్టిగా నిట్టూర్చి వాటిని తిరిగి శర్మకే ఇచ్చేస్తూ) అబ్బాయి! ఇంద నీడబ్బు నీదగ్గరే వుంచు. నేను నువ్వనుకున్నంత కఠినుడిని గాను. నాకథంతా విన్నారుగా. నేనుకూడ ఒకప్పుడు నీలాగ భార్య, సంసారము వున్నవాడినే! అడిగిన కోరిక్క భర్త తీర్చకపోతే అర్ధాంగిపడే బాధ నాకు అనుభవమే! దానివల్ల కలిగే దుష్ఫలితాలు నాకు తెలుసు. నాయనా! హాయిగా ఆడబ్బుతో మా చెల్లెలుకు నెక్లెస్ చేయించి అమె ముద్దు చెల్లించు. (ఇద్దరి వంకచూసి) మీడబ్బు చిల్లిగవ్వకూడ నాకు వద్దు. మీ యిద్దరినీ చూడగానే నామనసు మారిపోయింది. నా రాతిగుండె కరిగిపోయింది. ఈ నా జన్మలో ఇట్లా జరగడం ఇదే మొదటిసారి. ఇదే ఆఖరుసారి కూడా నేమో... ఈనాటి ఈ సంఘటన చిహ్నంగా ఈరివాల్వరు మాత్రము నేనుంచుకుంటా! గుడ్ బై! టా టా. (మెల్లగా కుడివైపు నిష్క్రమిస్తాడు.)

శాస్త్రి : (దిగాలుపడి అతనువెళ్ళిన దిక్కేచూస్తూ) పరాజితుడు!!

శర్మ : (త్రుళ్లిపడి తనచేతిలో నోట్లనుచూస్తూ) వాడు కాదు. మనమూ పరాజితులము!!!

(తెరపడుతుంది.)

చోరశాస్త్రకర్త కంసుడా?

శ్రీ దువ్వూరి జగన్నాథశర్మ

కాంచీపురము పురాతనకాలమునుండియు నాగర జనావాసముగాఁ బ్రసిద్ధిఁజెందినది. ప్రాచీన నగరరాజములగు కాశి - అవంతి - అయోధ్య - మధుర - మాయాపురి (హరిద్వార్) మున్నగు వానితోఁబాటు ప్రశస్తి సెనసినది. ఆ కాంచీపురము నిజరాజధానిగా సింహాసనాధిష్ఠితుఁడై—మహేంద్ర విక్రమవర్మ పల్లవ సామ్రాజ్యమును బలిపాలించి యుండెను. కవిరాజునాఁ గీర్తిఁగాంచెను; క్రీ. శ. 600–625 ప్రాంతకాలమునం దుండిన భారవి కవీంద్రునికిఁ జిరపరిచితుఁడు. సంస్కృత ప్రహసన శ్రేణిలో అతిప్రాముఖ్యమున్న మత్తవిలాసకాపాలికమును ఈ మహేంద్ర విక్రమవర్మ రచించి యుండెను. ఆ ప్రహసనము నందలి యితివృత్తమునకు సంబంధించిన వారిలోఁ గాపాలికుఁ డొకరుఁడుండెను. జైనమతమున్ ప్రబలించి యున్న ఆ కాలమునందుండెడి కాపాలికు లనఁగాఁ దాంత్రిక రహస్యముల నన్నిటిని జక్కఁగాఁ దెలిసినవారు. చిరకాల సపర్య నుండిన శిష్యగణమునకుఁ దప్ప తదితరులకు వారినుండి తంత్రరహస్యము లంత సులభముగా లభింపవు.

మత్తవిలాస కాపాలికుఁడు తప్పఁద్రావినపుడెల్ల ఒడలు మఱచి తాంత్రిక రహస్యముల నెన్నిటినో యేకరువు బెట్టుచుండువాఁడు. ఈతనికి సహచారిణి యొకయోగిని గలదు. సురాపాన వైఖరిలో ఈమె ఆ కాపాలికుని కెంతమాత్రమును తీసికట్టు గాదు. ఏతాదృశ భిక్షుకగణములోనివాఁడే—పాశుపత జంగ మొక్కఁడు భిక్షాటనము శివపూజ మున్నగు తన నిత్యకృత్యములు ముగియఁగా ఆయాయీవేళలందు వారినో వీరినో ఎవరినో చేరి డబుడక్క - కబురులతో సాయిలా బాయిలాగాఁ గాలక్షేపించుచుండువాఁడు. జైన భిక్షుకులకుఁ బ్రాయికముగా శంఖము నిత్యావసర వస్తువు. ఇట్టిసందర్భములో అందొకని శంఖము ఎవనివల్లనో తస్కరింపఁబడినది. "నమః ఖర్పటాయై - తస్కరాణాం పతయే నమోనమః"—ఈ మంత్రము మీఁదుగా అంజనతంత్రము ప్రయోగముంపఁబడినది. ఆ భిక్షుకశ్రేణివారిలో వారికే వాగ్వివాదముకూడ చెలరేఁగినది. రాసభరభసం బనఁదగిన యీ సందడిం జూడ జనులెందరో సమిగూడిరి. వా రెల్లరికిని ప్రహసనలాభ మేర్పడినది. తుదకా చోరీవస్తు వొక పిచ్చివానివద్ద పట్టుబడినది. ఇట్టి కథాఘట్టమున—

"...నమః ఖర్పటాయేతి వక్తవ్యం
యేన చోరశాస్త్రమ్—ప్రణీతమ్."

అని మత్తవిలాసకాపాలిక ఒకానొక చారిత్రకవాక్యము నుగ్గడించినది. దీనింబట్టి ఇప్పటికి రమారమి పదమూఁడు వందలయేండ్ల క్రిందటి సంస్కృత వాఙ్మయమునందు చోరశాస్త్రము అనఁబడిన గ్రంథ ముండినట్లు విస్పష్ట పడుచున్నది. దానికి రచయిత ఖర్పటుఁడు అనికూడ తెలియుచున్నది. ఈ పయి శ్లోకభాగము నిట్లాంధ్రీకరింపవచ్చును.

"చోరశాస్త్ర మొనర్చి ప్రస్తుతులుగొన్న
ఘనుఁడు—ఖర్పటునికి నమస్కారశతము."

ఇయ్యెడలఁ జర్చనీయాంశములు — 1. చోరశాస్త్రము. 2. దానికిం గర్తఖర్పటుఁడు. ఇందు చోరశాస్త్ర సందర్భము-గోణికాపుత్రుని పారదారికముం దలపించునది; సోమదత్తి విటవృత్తమువంటిది తంత్ర వాఙ్మయమునందలి కామశాస్త్ర - దుర్గోదర - ధాతువాద - జలస్తంభ-కాలవంచన - పరకాయ ప్రవేశ - ఐంద్రజాలిక-సర్వవంచన - అదృశ్యకరణ - మృషావాద-గజకర్ణ - హస్తచాలన -భేతాళమత-దూరశ్రవణాది ప్రక్రియల ననుసరింపఁ గలది. ఏతాదృశబహుకళాధురంధరుఁడగు చోరునికి ముఖ్యసామగ్రి నిట్లు పేర్కొనవచ్చును.

సీ. భవన దీపాహిత భ్రమర పేటిక
వాలుకా భస్త్రి
తలముళ్లు
గద్ద గోళ్లు
ములుదోరణము
బట్ట మొలత్రాటి కురువాడికై దువు
దేసకట్టు కావిబొట్టు

జిలుగుఁ గన్నపుఁ గత్తి
బలపంబు
మొగమాయమందు=
=తాలపుటాకు
మైల గోచి
మశుపుటాకులు
పోక పొడికాయ
మోఁగచ్చు చెప్పులు
భుజగవృశ్చిక చికిత్స
స్తుప్తివృద్ధికరౌషధులు-ఇత్యాదులు.

మఱి : చోరునియొక్క అహార్యప్రక్రియ నిట్లు వివరింపఁదగియుండును.

సీ. మందుల ముడితాటమలిచివేసిన సిగ
పొల్పుఁగానఁగనీని బొమిడికంబు
పరులకుఁ దాను గన్పడకుండ ఫాలభా
గమునఁ బెట్టిన యట్టికావిబొట్టు
నెడవంక బచ్చుతాపిడివంకి బొంకించి
సాచికట్టిన నీలిచాయ ఘట్టి
వలకేలఁ బిడెము డా పలికేలఁ గేడెంబు
నంగంబునందు వజ్రాంగి జోడు
* * కుఱుచ కన్నెపుఁగత్తి
సాక్కు పొడి భరణి-మూలికల్-మణుల్

వాకట్టు మొదల్ గాఁగ చోరసంగ్రహణీయవస్తువులు—సంచికట్టుగా ఇత్యాది.

ఇంక—చోరశాస్త్ర ప్రవర్తకుఁడన్నట్టి యుద్దేశమున ఖర్పటశబ్దము మిగిలియున్నది. ఇందులకని శబ్దతత్త్వము మీఁదుగా నరయుదుమేని—

౧. పటచ్చరమ్=జీర్ణవస్త్రమ్=పట్ అని చినిఁగినది.

౨. పాటచ్చరః=జీర్ణ వస్త్రధారి=తస్కరుఁడు.

౩. సమా న క్తక-కర్పటౌ=చినిగిపోయినగుడ్డ—లజ్జాయై కల్పతే కర్పటః=సిగ్గుఁ జేయుబట్ట.

౪. పటో స్త్రీ కర్పట శ్చాటః సిచయః పోత నక్తకౌ=ఇతి రభసః.

౫. స్యాత్ కర్పరః కపాలో స్త్రీ కీకసం కుల్య మస్థిచ-ఇతి అమరః.

౬. కర్పర స్స్యాత్ కపాలేచ-ఇతి మేదినీ.

౭. కర్పటేన=కాషాయవస్త్రేణ చరతి ఇతి కార్పటికః.

౮. కర్పటికస్య = తీర్థయాత్రోద్యతస్య - ఇతి పారార్థ చంద్రికాయాం.

౯. ఖర్పర స్తస్కరే - ఇతి త్రికాండశేషః.

౧౦. ఖర్పర స్తస్కరే ధూర్తే భిక్షా ఖాండక పాలయోః - ఇతి మేదినీ.

ఇట్టి నిర్ణీతార్థములివి చాలును: కర్పర—ఖర్పర-కర్పట—ఖర్పట—ఈ శబ్దములు పాటచ్చరార్థకములు-తస్కర స్ఫోరకములు. ఇట్లే కార్పటిక—కార్పాటిక-ఖార్పారిక — ఖార్పాటికాది పదములు కాపాలిక క్షపణకాద్యనాథుల పరముగా సమన్వయింపఁ జెల్లును. ఈ యర్థమునంజేసి ఖర్పటుఁడనఁబడియున్న వ్యక్తియే కార్పాటికుఁడని కూడ అనఁబడి యుండవచ్చునేమో గదా!

శీతే నోద్ధృషితస్య మాషశిమి వ
చ్చింతార్ణవే మజ్జతః
శాంతాగ్ని స్ఫుటితా ధరస్య ధమతః
క్షుత్ క్షామ కంఠస్య మే,
నిద్రా క్వా ప్యవమాని తేవ దయితా
సంత్యజ్య దూరంగతా
సత్పాత్ర ప్రతిపాదితేవ వసుధా
న క్షీయతే శర్వరీ.

క్రీ. త 1029-1064 ప్రాంతకాలమందుండిన మహాకవి క్షేమేంద్రుఁడు—ఔచిత్యవిచారచర్చ అను తన గ్రంథమందు ఈ పయి శ్లోకము నుగ్గడించినాఁడు. దీనిని కార్పాటికుఁడు రచించి యుండినట్లు పేర్కొన్నాఁడు. క్రీ. త పదునైదవ శతాబ్దియందున్న వల్లభదేవుఁడు—సుభాషితావళిలో మాతృగుప్తుడీ శ్లోకకర్త యని ఉల్లేఖించి యున్నాఁడు. దీనింబట్టి కార్పాటికుఁడన్న ప్రసిద్ధినెనసినాతఁడు—మాతృగుప్తుఁడు నాఁడగు. ఏతాదృశ పరిశీలనలో చోర శాస్త్రమునకుఁ గర్త ఖర్పటుఁడు గదా! అందువల్ల చోర స్ఫోరకముగాఁ గవి యొకరుఁ డుండెనని విదిత మగుచున్నది. ఆసుభారలందు:—

"కవి రమరుః కవి రమరః
చోర మయూరౌ—కవయః"

చోరుఁడను పేరుగల కవి యొకరుఁడు సంస్కృత వాఙ్మయమందు సుప్రసిద్ధుఁడే! ఆంధ్రకవి జక్కన విక్రమార్క చరిత్రమునందు ఈ చోరకవిని బ్రస్తుతించి యున్నాఁడు. ప్రాచీన సారస్వతమున చోర కావ్యము,

చోరశాస్త్రకర్త కంసుడా?

చోర పంచాశిక అను గ్రంథములు — విస్తృత వ్యాప్తినంది యున్నవి. ఇందలి చోర పంచాశికను రచించి నాతఁడు బిల్హణుఁడని కొందఱందురు. చోర కవి యనఁగా బిల్హణుఁడే యనుకొనువారున్నారు. ఈ యమ రామరు చోర మయూరాదులు బిల్హణుని కంటెఁ జాల ప్రాచీనులని నిర్ణయించిన వారలును— గలరు. ఇందేది యెట్లయినను చోర శాస్త్రము అన్న ప్రసంగములోను, దానికిం గర్త ఖర్పటుఁడనుటలోను చోర బిల్హణాదుల సందర్భము బొత్తుగా అప్రస్తుతమని తేలును.

పూర్వ కాలమునందు హైందవ రాజ్యాంగ ధర్మములలో చారసముద్దేశము ముఖ్యమయి యుండెడిది. అప్పటి సీఐడీలకు బహుమానములచేఁ దృప్తిచేయుటయే కాని నెలవారీ జీతముల నిర్ణయము లేదు. బహుమతులు దొరుకునను ఉత్సాహముచే వారు స్వామికార్యము గావించుటకుఁ దత్పరపడుచుందురు. చారులఁ బంపునప్పుడేదో సంకేతము ఒకొకనికి ఒకొక్క విధముగాఁ బెట్టి పంపుదురు. ఆ సంకేతముల ననుసరించి వాఁడు చెప్పినదానిలో వీఁడు చెప్పినదానిలో సత్యమేదియో తెలిసికోఁ గల్గుచుండువారు. లేకున్న నిద్దఱు ముగ్గురేకమై ధనాశచే ఏకవాక్యముగాఁ బల్కిరేని సత్యమిది యని— తెలిసికొనుట కైతిగాకుండును గదా! అట్టి చారగణము—ఎట్టివారనఁగా—క్రీ. శ 959 నాఁడు సోమదేవ జైనుఁడు వ్రాసిన రాజ్యాంగ శాస్త్రము నుండి యొకొనొక ఘట్టమునకు అనువాదము నిక్కడ నుగ్గడించుచున్నాను.

కార్పటిక, ఉదాస్థితిక, గృహపతిక, వైదేహిక, తాపస, కితవ, కిరాత, అక్షశాలిక, యమపట్టిక, అహితుండిక, శౌండిక, శౌభిక, పాటచ్చర, విట, విదూషక, పీఠ, మర్దక, నర్తక, గాయక, వాదక, వాగ్జీవ, గణక, శాకునిక, భిషక్, ఐంద్రజాలిక, నైమిత్తిక, సూద, ఆరాళిక, సంవాహక, తీక్ష్ణ, రసద, క్రూర, జడ, మూక, బధిర, అంధ, ఛద్మలు—ఈ మున్నగువారు రాకపోకలు సాగించు చార వర్గములోని వారు. వీరివల్లనే శత్రు రాజ్య వృత్తాంతములు, లోక వార్తలు తెలిసెడివి. ఈ సందర్భంలో కార్పటికుడనగా బరమర్మజ్ఞుడై ప్రగల్భ శిష్యవేషముగల వాడని సోమదేవసూరి నిర్వచించినాడు. "కార్పటికః సమర్మవిత్" అని అమర శేషము శబ్దనిష్పత్తి చేసినది. రాజాశ్రయముండి స్వతంత్ర వృత్తముగలిగి కౌర్యచాతుర్య మమరినవారై తోల్లిటి, కార్పటిక, నర్తక, గాయక, విదూషకాదులలో జాలమంది దిక్కుమాలినవారుగా గాక బాగుగానే జీవనవిధానము నడిపియుండిరని యిందువల్ల విస్పష్టపడుచున్నది.

కార్పాటికు డనిపించుకొన్న మాతృగుప్తుడు ప్రాచీనకవి పుంగవులలో బొగడ్తగాంచినవాడు. అభినవగుప్త,కుంతక,బహురూపమిశ్ర,శారదాతనయ, వాసుదేవ, రంగనాథ, సర్వానందాదివ్యాఖ్యాతృ, శిరోమణు లెందరో నాట్యాలంకారసంగీతవిషయములందు ఈతని నుగ్గడించుచు వచ్చిరి.

కట్టదగినబట్ట వేళకింత తిండి లభించు వెరవు తెచ్చుకొననట్టి సదాసారస్వత సేవకుడీ మాతృగుప్తుడు హర్షవర్ధన విక్రమాదిత్యుని ప్రేరణం బడసెను. కాశ్మీర సింహాసన మధిష్ఠించి రాజ్యమేలెను. భర్తృమేంఠుడు హయగ్రీవవధయను పాకృత కావ్యమును రచించు టిమ్మహారాజు ప్రోత్సహించినందువల్లనే తటస్థించినది. ఇమ్మహాకవికి దటస్థించిన దైన్యమునుండి కార్పటికుడన్న పేరేర్పడి యుండవచ్చును. హర్ష విక్రమాదిత్య మాతృగుప్తుల పరస్పరాభిమానాభివర్ణనము క్రీ. శ. 1149 నాడు కల్హణుడు కాశ్మీర రాజతరంగిణియందు విరివిచేసినాడు. అందు "శీతేనోద్ధృషితస్య" ఉగ్గడింపబడియున్నది. ఆహ్లాదకరమైన ఘట్టము గనుక మచ్చునకు రాజతరంగిణి ఆంధ్రీకరణములోని కొన్ని బంతులనిట నుగ్గడింతును.

"ఉజ్జయినీ నగరమున జక్రవర్తియు హర్షాపరాభిధానుడునగు విక్రమార్కు డేకచ్ఛత్రముగా రాజ్యము చేయుచుండెను. అనురాగాతిశయమున లక్ష్మి చతుస్సాగరములను, హరిబాహు చతుష్టయమును గూడ వదలి యత్యద్భుత సౌభాగ్యశాలియగు నీతని జేరెను. ఇట్లు శ్రీమంతుడయ్యు గుణప్రవర్ధితుడై రాజ్యముచేసిన యీతడు మేచ్ఛోచ్ఛేదనము కొంతవరకు నిర్వర్తించి యాహరికార్యభారమును దగ్గించెను. నానాదిగంతరాఖ్యాతుండును గుణవత్సులభుడునగు నీ నృపాలోత్తముని యాస్థానమున మాతృగుప్తుండను కవిశేఖరుడుండెను. విద్వాంసులను దత్త్వజ్ఞులను వేదవిదులను నాదరించుచు వారి మానమును సుగుణ సంపత్తిని గాపాడుచు దనయందు సాభిప్రాయ ప్రకాశన మొనరించిన బుద్ధికిం గులవధువువలె వైదగ్ధ్యము గలుగకుండ దనవంశము వైభవో

జ్వలత నొందఁజేసిన గుణప్రియుఁడగు నీ రాజశేఖరుఁడు తన పుణ్యవశమున దొరికెనని తలఁచి వివిధ రాజాస్థానములను జూచిన ఈ మాతృగుప్తుఁ డీతని యాస్థానమును జేరెను....అతికష్టసాధ్యమగు నీతని సేవఁజేయు తమయం దీతనికి దాక్షిణ్యము గలుగునట్లు ప్రయత్నించుట హిమాద్రియందు మంచు నమ్ముటకై పూనుకొనుట వంటిది కాక మఱియొకటి కాదు. మిథ్యాఖ్యాన గుణోపేతులు గలహప్రియులు నసత్యాలాపులు నీతని యాస్థాన స్థితులయందును, నసోఢవ్యాశ్లీలాలాపులు మర్మభేద మొనరించునట్లు నరోత్కృష్టుల నాడువారు నన్యప్రవేశాసహనపరులు నీతని సేవకులయందును లేరు.... ఈ రాజేంద్రునితోడి సల్లాప విపులోదయము దుర్జాతులగు దుర్జనులచే విఘ్న మొనరించుట యెన్నఁడును గానరాకుండెను. ఇట్టి సద్గుణోపేతుఁడగు నీ పార్థివేంద్రునిఁ జూచి సర్వదోషరహితుఁడును గంభీరుఁడును గుణవంతుఁడును స్థిరబుద్ధియునగు నీ రాజు పుణ్యవశమున లభించెనని మాతృగుప్తుఁడు సంతోష భరితాంతరంగుఁడయి తానింక నన్యరాజాస్థానములకుం బోవలసిన యవసరము లేకయే యీతని సేవవలన నభీష్టములను బడయఁ గల్గుదునని నిశ్చయించుకొని......జాగరూకుఁడై యా నృపాలుని గుణగోష్ఠి...మధ్యమున మృదుపూర్వకముగా స్తోత్రము చేసి సేవించుచుండెను. ఒకనాఁడు మాతృగుప్తుఁడు తన యవస్థను దెలుపుటకును దనదైన్యమును మనవి చేసికొనుటకును నదియే సమయమని తలఁచి యొక క్షణములో నీ క్రింది విధమున శ్లోకము రచియించి యాతనియొద్ద జదివెను. శీతే నోద్ధృషితస్య...సత్పాత్ర ప్రతిపాదితే వ వసుధా నక్షీయతే శర్వరీ...ఉత్తమముగ కాశ్మీరమండలము...మాతృగుప్తాభిధాను పట్టముఁగట్టుఁడని యాజ్ఞ..." ఇట్లీ ఘట్టము నింతటితో ముగింపఁబడును. ఖర్పటాన్వేషణము మీఁదుగాఁ గార్పటికుఁడను మాతృగుప్తానుస్మరణము దటస్థించినది. ఐనను ఖర్పటుఁడనిపించుకొన్నవాఁడు మాతృగుప్తుఁడనియనుకొనుట సందేహాస్పదము. ఇట్లే విక్రమార్కుని యాస్థానమునుండిన సుప్రసిద్ధుఁడైన ఘటకర్పరుఁడేమో యీ చోరశాస్త్రమును రచించిన యాతఁడనుటయుఁ బొసఁగదు. కాబట్టి నిజనామధేయమింకెట్టిదయిననుండిన వ్యక్తి - ఏయొక్కరుఁడో తస్కరవృత్తప్రసిద్ధిం జేసి ఖర్పటుఁడన్న పేరున వ్యవహరింపఁబడెనేమోయని యనుకోవచ్చును.

విక్రమార్కుఁడు రాజ్యాధీశుఁడయి యున్న కాలమున మూలదేవుఁడను పేరుగల్గిన వ్యక్తి చోర ప్రక్రియలో అతినిపుణుఁడయియుండినట్లు సంస్కృత వాఙ్మయమునందు అచ్చటచ్చట కొన్ని చిహ్నములు ఉపలభ్యములగుచున్నవి. మృచ్ఛకటికయందు శర్విలక ప్రసంగ సందర్భమున ఈ మూలదేవుని చౌర్యప్రక్రియా ప్రశంసయున్నది. కథాసరిత్సాగరమందును మూలదేవ కథనమున్నది. ఇట్లే పద్మప్రాభృతకము (హాస్యప్రాధాన్యమైన భాణము), పుష్పదూషితకము (ప్రకరణము)— ఇట్టి పురాతన వాఙ్మయమం దీ మూలదేవపరమైన యితివృత్తము లెన్నెన్నో యగుపడుచున్నవి. అవంతి సుందరీ కథలో—

> "సనారాయణ దత్తా యా దేవదత్తాశ్రయా కథా,
> మూలదేవోదితా..."

అని యీతని పేరఁ బ్రమేయ మేర్పడినది. ఇందులకు సంస్కృత సాహిత్య చరిత్రమునందు సంక్షేపింపఁబడిన యంశము లిట్లున్నవి:—

"Muladeva was according to Avanti Sundari Katha Sara the founder of Ellichpur (Acalapura). There are many legends about Muladeva. Katha Sarit Sagara gives an account of him as the friend of Vicramaditya and as having won a bride at Pataliputra. Kshemendra's Kala Vilasa proceeds as if related by Muladeva. Muladeva was also known as Karni-Suta, Kalamkara, Mulabhadra and Kharpata ... ... In Kadambari Bana speaks of Vindhyatavi కర్ణీ సుతకథేవ సన్నిహిత విపులా చలా శశోపగతా చ. Vipula is Devadatta's sister in the play Padma Prabharitaka and Sasa is a friend of Muladeva . ... Matta Vilasa Prahasana alludes to a work of Maludeva on theft. In Mricchakatika where Sarvilaka the burgler dilates upon the intricacies of the art of housebreaking ... Sudraka must have had Muladeva's exploits in mind. Muladeva is also known to have been a poet. Muladeva Katha (Mitra X) says that

he was a wicked prince of Pataliputra who having been banished regained favour of the King through the good offices of a prostitute Devadatta"

ఈ యర్థమున మూలదేవుఁడు అను నొక్కఁడుండెను. అతఁడు చోరతంత్ర విశారదుఁడు. దేవదత్త యనఁబడు వేశ్యతో సాంగత్యమున్నవాఁడు. పాటలీపుత్ర నివాసి. అచలపుర నిర్మాత. ఖర్పటుఁడు అని ఈతని వ్యావహారిక నామము. విక్రమార్క సమకాలికుఁడు. కాదంబరి యందు బాణునిచే నీతఁడు కర్ణీసుతుఁడని చెప్పఁబడినాఁడు. శూద్రకుఁడు మృచ్ఛకటికలో మూలదేవుని చౌర్యచాతుర్యమును ప్రశంసించి యుండెను. కలాంకౌరుఁడని, మూలభద్రుఁడని కూడ ఇతనికి వేర్వేఱు పేరులుండినవి.

ఈ మూలదేవుఁడు శుంగవంశ్యులలోని అగ్నిమిత్రపుత్రుఁడగు సుమిత్రునిం దునిమినటుల బాణుఁడు హర్షచరితమునందు వక్కాణించెను.

"అతిదయిత లాస్యస్య చ శైలూషమధ్యస్య మూర్ధాన మసిలతయా మృణాళ మివ వాలునా అగ్నిమిత్రాత్మజస్య మిత్రస్య—మూలదేవః—"

"లాస్యదర్శన ప్రీతిచే శైలూష మధ్య ముందుండి లాస్యమును జూచుచున్న అగ్నిమిత్రతనూభవుఁడయిన సుమిత్రుని శిరస్సును మూలదేవుఁడు మృణాళమునువలె ఖడ్గముచే ద్రుంచివైచెను."

ఇప్పటికి రెండువేల యేండ్ల క్రిందటి వృత్తాంతము లందొకటి నాఁదగిన చోరశాస్త్రకర్త—ఖర్పటునింగూర్చి చారిత్రక పరమైన సందర్భము లివ్వి చాలును. ఈ ఖర్పటునికి—మూలభద్రుఁడని—కలాంకౌరుఁడని—మూలదేవుఁడని—కర్ణీసుతుఁడని ఇతర నామధేయము లుండెనని నమ్ముటకు సంస్కృత సాహిత్య చారిత్రక సాక్ష్యము బలవత్తరమైయున్నదే - అదియుం జాలును. ఇట్లీ వ్యాసమును ముగింపఁజెల్లును.

ఐనను ఇంత చెప్పి ప్రయోజనమేమి? ఎవ్వఁడో ఖర్పటుఁడఁట! చోరశాస్త్రకర్తయఁట. వానికే మూలదేవ కలాంకూర మూలభద్ర కర్ణీసుతాది నామాంతరము లుండినవఁట! శుంగవంశజుఁడగు సుమిత్రుని కడతేర్చినవాఁడఁట! మాతృగుప్తుఁడయియుండఁడఁట! అయితే మఱి—యాతఁడెవ్వఁడని—ఈ వ్రాయసమువలన—పాఠకులకు సుబోధకమయినట్లో! ఇట్లని యిప్పట్ల ఆశంకము రావచ్చును. అయ్యాశంకమునకు పూర్వపక్ష విధానము—ఇదిగో!

సీ॥ జలరుహాక్షుండు విశాలవక్షుం డురు
శ్యామల దేహుఁ డాజానుబాహుఁ
డమిత బలోద్ధతుఁ డతిబాణ కౌశలుం
డతి కౌర్యదుర్గ్య శౌర్యాన్వితుండు
హరిహరాదులకేని నలవి పడనివాఁడు
జనపాలనఖ్యాతిఁ గొనినవాఁడు
వాసవగుహ్యకేశ్వరుల మించినభోగ
భాగ్యాతిశయములఁ బరఁగువాఁడు
పుణ్యరహితుండు దుష్కృతి భూషణుండు
కపట వేషుండు నురుతరకఠినహృదయుఁ
డమిత చతురంగసేనా సమన్వితుండు
నైన యా కంసుఁ డుగ్రసేనాత్మజుండు.

—చిత్రవతీ పరిణయము.

పౌరాణిక వాఙ్మయద్వారమున సర్వజన సామాన్యముగా సుప్రసిద్ధుఁడయియున్న కంసుఁడే — కర్ణీసుతుఁడు. అట్లుగనుక నీ ఖర్పట చోరశాస్త్రసందర్భమెంతగలదో—అదియంతయుఁ గంసపరముగా నన్వయింపఁబడదగినదే!

ఉగ్రసేన నందనుఁడని కంసునిపట్ల జగత్ప్రసిద్ధియున్నను-అందుల కొక్కింత యపవాదముకూడ లేకపోలేదు. ఎట్లనఁగా—హరివంశ మందొక్క రహస్యకథానక మున్నది. ఉగ్రసేనుని భార్యలం దొక్కామె-కర్ణి. ఆకాలమున ద్రవిళుఁడను దాక్షిణాత్యుఁడు "ఉగ్రసేనుని భార్యను వలచియుండెను. గాని యామె పొందును బడయుట అసంభవమయ్యెను. ఒకనాఁడామె స్నానమునకు రాఁగా వీఁడు చూచి యుగ్రసేనుని రూపమును ధరించి యామెను డాసెను. ఆమె వానినిజూచి నిజముగఁ దనభర్తయే యనుకొని వానితో రమించెను. పిమ్మట వాఁడు దనుజుఁడనియుఁ దనను మోసగించెననియు నెఱిఁగి దనుజదుర్బీజమువలనఁ బుట్టినవాఁడు దనుజుఁడై వానివంశమున జన్మించినవానిచే మరణించు ననిపలికెను. ఈదనుజునివలనఁ బుట్టినవాఁడే కంసుఁడు." (చూడుఁడు పుట 216-పూర్వ గాథాలహరి) ఇట్టిహేతువునం గావలయుఁ గంసుఁడు కర్ణీసుతుఁడనఁ బరఁగినాఁడు. "జఘానకంసం కిలవాసుదేవః" ఈ వాక్యము పతంజలి మహాభాష్యమందలిది. "పుష్యమిత్ర సభ" ఇదియుఁ బతంజలి పలుకే. ఈ పుష్యమిత్రుని కుమారుఁడు అగ్నిమిత్రుఁడు. కాళిదాస రచ

నలకందినవాఁడు. ఈ యగ్నిమిత్రుని తనూజుఁడు సుమిత్రుఁడు కంసునిచేఁ గెడపఁబడినవాఁడు. కంసుఁడు వాసుదేవుండగు కృష్ణునిచే సంహరింపఁ బడినాఁడు. ఇప్పటి కేడువందలయేండ్ల క్రిందట కళింగ సమ్రాట్టులగు గాంగవంశ్యులకు మంత్రిగానుండిన పురుషోత్తమ సుధీమణి అమరశేషమను నుద్యమమున త్రికాండశేషమును రచియించియుండెను. అందు ఉగ్రసేన నందనుఁడగు కంసునిపట్ల వ్యవహరింపఁబడిన నామాంతరములన్నిటిని ఈ క్రిందిరీతిని వివరించియుండెను.

"కంసః- ఉగ్రసేనజః- కర్ణీసుతః- మూలదేవః- మూలభద్రః- కలాంకూరః- ఇతిషట్ ఉగ్రసేన పుత్రస్య- కంసస్య- నృపస్య."

కంసపర్యాయ పదము లీయాతింటిలో తస్కరపరమైన ఖర్పట శబ్దము తరవాయియైనది. చోరార్ధకముగా నేవ్యక్తికిఁ గాని నామధేయ మేమో సహజము కాదు. ఇంతకుఁ గంసుఁడన్న పేరున నతనిఁ జోరుఁడని చెప్పుట సంస్కృత సారస్వతమందు అగుపడకున్న సందర్భము. ఇట్లని ఆతనిపట్ల ఖర్పట వాచకము మృషయనియు ననుకో నక్కఱలేదు. ఎందువల్లనన: బౌద్ధవాఙ్మయము నందున్నట్టి మహావంశము- అవకథ- ఇట్టి ఉత్తర విహార సారస్వతమును జేపట్టి పరిశీలింపఁగా, కాలాశోకుని తరువాత ధర్మాశోక పరిపాలనము- ఆ తరువాత కాలాశోక నందనులగు పదిమంది నందులలో జ్యేష్ఠుఁడు రాజ్య పరిత్యాగ మొనర్చుట- మిగతా నవనందులలో పింజాముఖుఁ డనఁబడిన అయిదవ నందుడు పరిపాలించుచుండఁగా ఉగ్రసేనుఁడు దేశమును గొల్లగొట్టి గొప్ప ధనాఢ్యుఁడగుట ఈలాటి ఘట్టాలున్నవి. ఉగ్రసేనుఁడు (కంసుని తండ్రి) దొంగలకు నాయకుఁడై ప్రజలను గొల్లగొట్టి సేకరించిన బంగారునాణెములు 800 లక్షులని లెక్క తేల్చఁబడినది. అప్పుడు రాజ్యాధీశు లయిన వారికి నందఁరుద ముండెడిది. ఉగ్రసేనుఁడు కాలక్రమమున దిట్టపడి పింజాముఖునిమీఁద తిరుగుఁబాటు లేవఁదీసి "నేను రాజునో, నీవు రాజువో చూడు!" మన్న సవాలుతో దొరకొన్నాఁడు. నందుఁడన్న బిరుదును ధరించి ఎన్ని యాగడములు సేయఁగలిగెనో అన్నింటిని జేసినాఁడు. ఈ ఘట్టమంతయు మోక్షముల్లర్ భట్టుని 'హిస్టరీ ఆఫ్ దీ శాన్స్క్రిట్ లిటరేచర్'నందుద్ఘాటింపఁబడియున్నది. "కంసుడు — చోరార్ధకముగా ఖర్పటుఁ డనిపించుకొన్న యాతఁడు" అనుటకునుందుగా ఉగ్రసేనుఁ డెట్టి జీవితము నెఱపిన వాఁడో నిరూపించినఁ జాలదే? కంసుఁడో తండ్రినే మంచివాఁ డనిపించిన కొడుకుగాఁడే? మూలదేవుఁడను పేరున్న కంసుని చౌర్యాదికాలు అవంతి సుందరీ కథాసారము—పద్మప్రాభృతకము – పుష్పదూషితకము ఇట్టి వాఙ్మయమందుండనే యున్నవి. ఇంక ఉగ్రసేనుఁడో? చెప్పెడిదేమి?

"Pataliputra was then governed by the youngest son of Asoka, called Pinja-mukh and the robber-king who first called himself-Nanda is said to have reigned a short time under the title of Ugrasena."

XX Asiatic Researches-p 170.

చారిత్రకప్రియులగు పాఠకోత్తములకై ఒక్కింత మనవిఁ వ్రాసి నేనింక ఉపసంహారము బలుకవలయును. శకకర్త నాబడిన విక్రమార్కునుద్దేశించి—సర్ విలియం జోన్సుయొక్క బి. సి. ఘట్టాలయందున్న (శైశునాగ, నంద, శుంగవంశ్యులు) నందుడు సుమిత్రుడు ఈ పేరులం జేబట్టి—ద్వాపరాంత గాథలలోనివాఁడన్న కంసునికి ప్రాధాన్యమిచ్చి వ్రాయబడిన యీ నా వ్యాసఘట్టములను విమర్శించి విజ్ఞులు తుత్తునియలు చేయదగుదుగనియే నా ప్రార్థన. అట్టి విమర్శనలవల్ల బగోళ్లనుగా భారతాహవకాలాదులు, రామాయణ రచనాకాలాదులు, శూద్రకునప్పటి కౌతంత్ర వ్యాకరణము, నందరాజ్యమప్పటి పాణినీయము, పతంజలి భాష్యము, వరరుచి— ఇట్టివాని ఈ యాకాలాదులు సునిశ్చితములు కాగలవనియే నావిశ్వాసము మరి! అందుచే నా యీవ్యాస సందర్భమందలి ఆయాపురుషుల పరస్పర సమకాలీనతాదులు విచ్ఛిన్నములు గాబోవు సరికదా మఱింత దృఢపడునేమో కూడ.

కాలదోషం

శ్రీ కోటంరాజు జనార్దనరావు

పన్నెండున్నరయింది. అందరూ వెళ్లారన్న ఆశతో ఒళ్లు విరుచుకుంటూ లేచి చాంబర్సు తలుపు మూద్దామని గుమ్మందగ్గరకు వెళ్లాడు లాయర్ సుధాకర్. ఒళ్లో తలపాగా పెట్టుకొని బల్లమీద కునుకు పాట్లు పడుతూ, జోలపాటగా గుర్రుపెడుతున్నాడు షావుకారు.

అరె! ఈతనిమాట తాను పూర్తిగా మరిచిపోయాడు. అదిగాక ప్లీడర్లకు ఎదురుగుండా వున్నవాడు పెళ్లికొడుకు. కనుమాటుగా కూర్చుని కునికిపాట్లు పడుతున్న ఈ ఆగంతుకునిమాటే మరచిపోయాడు, పనిలో నిమగ్నుడయిన సుధాకర్.

అతని స్థితి చూస్తే జాలివేసింది. "షావుకారుగారూ!" అన్నాడు మంద్రస్థాయిలో. "అయ్యా!" అంటూ వులిక్కిపడి లేచాడు తలపాగా సర్దుకుంటూ షావుకారు.

"లోపలికి రండి." అన్నాడు సుధాకర్ బరువుగా, అలసటగా..

ఇది గమనించి షావుకారు "భోజనం చేసి రాండి. తొందరలేదు. కూర్చుంటాను." అన్నాడు. బలవంతపెట్టాడు. అతనిలోని సహనాన్ని చూస్తే సుధాకరునికి ఆశ్చర్యం వేసింది. బహుశా! ఏదో తీరని ఆపత్తులోవుండి వుంటాడు- అనుకుంటూ, లోపలకు వెళ్లాడు భోజనానికి షావుకారు బలవంతంపై. మళ్లీ క్లయింట్లు సేవకై తిరిగిఛాంబర్సులోకి వెడతాడని తెలిసిన సుధార్ భార్య రుసరుస లాడుతూ, ఆగంతుకుని అనవసరంగా నిందిస్తూ వడ్డించింది. అది వాళ్ల జీవితంలో మామూలు. తన భర్త అతని జీవితాన్ని భార్యను మరచి క్లయింట్లకు ధారాదత్తం చేస్తున్నాడని ఆమె అభియోగం. నోట్లకట్టలను తెచ్చి భర్తయిచ్చినప్పుడు మాత్రం సుధాకరుని ఆమె తాత్కాలికంగా క్షమిస్తూ వుంటుంది.

"క్రొత్త క్లయింటు. అదిగాక షావుకారు." అన్నాడు సుధార్ పెరుగు కలుపుకుంటూ.

"ఏమో! మీయిష్టం. నేను నిద్రపోతాను." అన్నది సుధార్ భార్య, మూతి విరుస్తూ.

విటమిసెట్సు మాత్రలు మింగి, వక్కపొడి నములుతూ బయటపడ్డాడు సుధాకర్.

2

సంచిలోని కాగితాలను తీస్తూ షావుకారు తన సమస్య చెప్పనారంభించాడు. సుధాకర్ బ్రీఫ్‌బుక్కు తీసుకొని కావలసిన పాయింట్సు నోటు చేసుకున్నాడు.

ఆయన పేరు భూమయ్య. పూర్వాశ్రమంలో బులియన్ వ్యాపారం చేశాడు. భాగస్థులు మోసం చేయడం కారణంగా ప్రస్తుతం చితికాడు.

తన వ్యాపారం బాగా ఝంఝామారుతంగావున్న రోజుల్లో తన మిత్రుడు కాశయ్య తనకు అవసరమైనప్పుడు వ్యాపారనిమిత్తమయి డబ్బు సాయం చేస్తుండేవాడు. తాను అప్పుడంత అప్పుడింత తిరిగి యిస్తూ వుండేవాడు. స్నేహం కారణంగా అర్థరూపాయ వడ్డీతో తాను తెచ్చుకుంటూ వుండేవాడు. ఈ లెక్క జమ కాశయ్యపుస్తకాల్లో వ్రాయబడుతూ వుండేది.

కాశయ్య కొన్నాళ్లకు మంచ మెక్కాడు. అతనికి బ్రతుకుతాననే ఆశ సన్నగిల్లింది, ఒకరోజున భూమయ్యను పిలిపించాడు. కాశయ్యభార్య ఏనాడో కాలంచేసింది. ప్రక్కదగ్గర అతన్ని కనిపెట్టుకున్న యతిరాజమ్మ కూర్చుని వుంది ఏడుస్తూ. యతిరాజమ్మ అతన్ని నమ్ముకొని ఉన్న దూరపు బంధువు. కాశయ్య, ఎందుకయినా మంచిది లెక్క చూచి కాగితం వ్రాసి యిమ్మన్నాడు.

లెక్కలు చూచుకొన్నారు. జమాఖర్చుల్లో కొంత హెచ్చుతగ్గులు వచ్చాయి! వాదించుకున్నారు. చివరకు భూమయ్య పదివేలు యివ్వతేలినట్లుగా నిర్ణయించుకున్నారు. కాశయ్య పరగత్తు వ్రాసిమ్మన్నాడు భూమయ్యను. మిత్రుని కోరికప్రకారం, భూమయ్య వ్రాసియిచ్చాడు- "లెక్కలు చూచుకోగా పదివేలు యివ్వతేలానని, అర్థరూపాయివడ్డీతో మూడు సంవత్సరాలలో తిరిగి యివ్వగలనని."

కాశయ్య కాంపౌండువడ్డీ కట్టాడు తనదగ్గర, అంటాడు భూమయ్య. స్నేహితుడు తనను యిట్లా మోసగిస్తాడని భావించలేదన్నాడు. సరే. అనుకున్న ప్రకారం మూడు సంవత్సరాలగడువులో చెల్లించాలి గనుక భూమయ్య అప్పుడప్పుడూ చెల్లిస్తూ వచ్చాడు. పరగత్తు పుస్తకం కాగితాలలో ఈ జమలు వ్రాయబడ్డాయి. కాలంచేస్తానని భయపడ్డ కాశయ్య కాలంచేయలేదు. పరగత్తు వ్రాసిన ఆరేళ్లకు కాలంచేశాడు. తాను నిలబడి మిత్రుని అంత్యక్రియలన్నీ జరిపించాడు భూమయ్య; అతని ఆత్మశాంతికై ఘనంగా దానధర్మాలు చేయించాడు.

కాశయ్యకు నా అన్నవారు ఎవరూ లేరు; తన్ను నమ్ముకున్న యతిరాజమ్మ, తమ్ముని సంతానం ఒక్కగా నొక్క కుమార్తె తప్ప. ఇరువురిని పరామర్శలుచేసి, పదిరోజులతర్వాత యింటికి చేరాడు భూమయ్య.

దినవారాలయిన వారం పది రోజులకు తనకు రెండు లాయరు నోటీసులు వచ్చాయి. ఒకటి యతిరాజమ్మ తరఫునుంచి; రెండవది కాశయ్య తమ్ముని కుమార్తె దగ్గరనుంచి "తన పేరిట కాశయ్య వీలునామా వ్రాశాడనిన్నీ, అందుమూలముగా కాశయ్య యావదాస్తికి తాను సర్వాధికారిణిననీ, అందుమూలంగా ఆ నోటీసు అందినవారంరోజులలో పరగత్తు క్రింద మిగిలిన అసలుఫాయిదాలు చెల్లించవలసిందనీ, లేనిచో తగుచర్యలు తీసుకోబడునని." యతిరాజమ్మ నోటీసులోని సారాంశము.

"కాశయ్య వీలునామా వ్రాయలేదని, అది కేవలము యతిరాజమ్మ సృష్టేనని, తాను హిందూ ధర్మశాస్త్రానుకూల్యంగా వారసురాలననీ, కాన పరగత్తు బాబతు అసలు ఫాయిదాలు తనకు వారం రోజులలో చెల్లించవలసినదనీ, లేనిచో తగుచర్యలు తీసుకోబడునని, దాని ఖర్చులపై భూమయ్యయే బాధ్యుడనిన్నీ"— కాశయ్య తమ్ముని కుమార్తె నోటీసు సారాంశము.

భూమయ్య తన అరవై యేళ్ల జీవితంలో ప్లీడరు నోటీసు అందుకోవటం యిదే ప్రప్రథమం. ఇదా కాశయ్యవారసులు తనకు చేసే ప్రత్యుపకారం! కాశయ్యశవం దహనానికే శక్తిలేని సమయంలో తాను నిలబడి, అతని ఘనతకు తగినట్లుగా ఖర్చుపెట్టాడే. ఆ మాత్రం వారసులకు కృతజ్ఞతలేదే-అనుకున్నాడు. పైగా వాళ్లు తాను ఖర్చుపెట్టిన మొత్తం జమపెట్టకుండానే రూపాయలకై నోటీసు పంపారు.

భూమయ్యకు ప్లీడరుదగ్గరకు వెళ్లక తప్పలేదు నోటీసులు రెండు చూపించాడు. ప్లీడరు విషయం అంతా విని భూమయ్య అభిప్రాయ మేమిటని అడిగాడట. తనకు ఋణశేషం వుంచుకోనుద్దేశం లేదని, యిరుపక్షాలు కాశయ్యధనానికి వారసుల మంటున్నారు గనుక, న్యాయాలయాన్నుంచి కాశయ్య వారసులమని ఎవరయితే సర్టిఫికేటు తేగలరో వారికి తాను ఋణశేషం చెల్లించడానికి సిద్ధంగా వున్నానని, తనలెక్క ప్రకారం వారు నోటీసులలో కోరినంత ఈయనక్కరలేదని, చాల తక్కువ సొమ్మే బాకీ వున్నానని తెలియబర్చాడు భూమయ్య. ప్లీడరు అదే ప్రకారం నోటీసులకు జవాబు పంపాడు.

భూమయ్యనోటీసులోని వాదనను, సదుద్దేశాన్ని లెక్కచేయకుండానే, యతిరాజమ్మ కోర్టులో దావా వేసింది. సమన్లు ముట్టిన వెంటనే భూమయ్య తిరిగి ఆ ప్లీడరును కలుసుకున్నాడు. భూమయ్య ఎల్లప్పుడు, ఏకాభిప్రాయం గలవాడని తెలుసుకొని "అనవసరంగా దావా వేశారు కనుకనూ, తానెల్లప్పుడు కోర్టు నిర్ణయించిన కాశయ్య వారసునకు ఋణశేషం చెల్లించడానికి సిద్ధంగా వున్నాను గనుకను తాను కోర్టు ఖర్చులకు బాధ్యుడనుగాను." అని ఆన్సరు పెట్టాడు ప్లీడరు.

తన ఆన్సరు విని కోర్టువారు కేసు పెండింగులో పెట్టి, యతిరాజమ్మను వారసురాలిగా సర్టిఫికేటు తెమ్మని, టైము యిచ్చారు. ఒక సంవత్సరంలో యతిరాజమ్మ తనపేరునవున్న కాశయ్య వీలునామాను రుజువు చేసుకొని కాశయ్య తమ్ముని సంతానపు హక్కులను త్రోసిపుచ్చి జిల్లా కోర్టునుంచి సర్టిఫికేటు తీసుకొనివచ్చి దాఖలు చేసింది.

ఇప్పుడు భూమయ్యకు అసలయిన సమస్య ప్రారంభమయింది. అప్పుడే కాశయ్య కాలం చేసి రెండేళ్లయింది. ఈ రెండేళ్లలో కాలగతిలోపడి భూమయ్య చితికిపోయాడు. పూర్వపు ఋణశేషాన్ని వుంచకూడదనే వుద్దేశం అదే ప్రకారం తనలో వున్నదికానీ, తన స్థితిగతులు అదే మాదిరిగా లేవు. తాను ఇప్పుడు ఆన్సరులో అన్న ప్రకారం ఋణశేషాన్ని యతిరాజమ్మకు చెల్లించలేడు. దానికల్లా ఒకటే మార్గం యతిరాజమ్మను దావాలో వోడించాలి.

తాను చాలకష్టాలలోవున్నాడు. తిరిగి ప్లీడరును కలుసుకొని చెప్పాడు. కాశయ్య వడ్డీలకు వడ్డీలు పెంచి

ఋణభారాన్ని పెద్దచేశాడు. అదిగాక కౌశయ్యకు అంత్యక్రియలు, దినవారాలు తానుఘనంగా చేశాడు. తాను మిత్రత్వంలో లెక్కలు వ్రాయలేదు. షుమారు రెండువేలు తనకు జమరావాలి. లెక్క లేదు గనుక కోర్టు నమ్మదు. అందుకని తన ఈ ప్రస్తుత క్లిష్టపరిస్థితులను చూచి, దావాను ఏకోవిధంగా గెలవాలని తనప్లీడరును బ్రతిమాలాడు. ఆయన "లాభం లేదు. ఒకసారి అన్సరులో ఋణశేషాన్ని ఒప్పుకున్న తర్వాత దావా గెలవడం కష్ట"మన్నాడు. ఈఅభిప్రాయం తనకు ఆన్సరు పెట్టిననాడే చెప్పి వుండాల్సిందన్నాడు. భూమయ్య బలవంత పెట్టాడు. ప్లీడరు ఏవిధంగాను లాభం లేదని రాజీపడమని సలహాయిచ్చాడు. ఛా! ఆ కృతఘ్నులను ఆశ్రయించి తాను రాజీపడటమా! వాళ్లు ఎక్కడ పడితే అక్కడ దుర్భాష లాడుతున్నారు, తాను కౌశయ్యను ద్రోహం చేశానని. పైగా తన్ను దావా గెలిచి సివిలు జెయిలులో పెట్టిస్తామని ప్రచారం చేస్తున్నారు. అందుకని ఆ ప్లీడరుగారి సలహానచ్చక, సుధాకర్ పేరు ప్రఖ్యాతులను విని మరీ వచ్చాననీ, తన్ను తప్పక గెలిపించవలసిందనీ అంటూ సుధార్‌కు సాష్టాంగ ప్రణామం చేశాడు భూమయ్య.

సుధాకర్ యిరకాటాన్న పడ్డాడు. పరిస్థితులు మనిషిలో ఎంతమార్పును తీసుకువస్తాయా అనుకున్నాడు. "రికార్డువుంచి రేపు రాండి. చదివిచెప్తాను." అని టైము యిచ్చాడు. ఏమయినాసరే తన్ను గట్టెక్కించాలంటూ రాత్రి రెండుగంటలకు భూమయ్య నిష్క్రమించాడు.

3

నిర్ణీతకాలానికి అరగంట ముందుగానే భూమయ్య సుధాకర్ ఛాంబర్సుకు వచ్చి "నమస్కారమండీ!" అన్నాడు. అతని కన్నుల్లో ఆశ తొంగి చూస్తోంది. పని చేసుకుంటున్న సుధాకర్ భూమయ్య వంక చూచి, చేతిగడియారం వంక చూచాడు. "యివ్వాళ మా దుకాణం బందు. అందువల్ల ముందుగానే వచ్చాను. తొందరలేదు. కూర్చుంటాను." అంటూ భూమయ్య వరండాలో వున్న నిన్నటి తన ఆసనంవైపు నడిచాడు.

సుధాకర్, అతనిలోని సహనాన్ని చూచి ఆశ్చర్యపడ్డాడు. సాధారణంగా క్లయింట్లు తమ పని అనుకున్నదానికన్నా అరగంట ముందుగానే కావాలని ఆవేశపడుతారు. తాము తొందరపడుతారు. ప్లీడరును తొందరపెడుతారు. స్థిమితంగా సమస్యను పరిష్కారం చేయనీయరు. తొందరలో తప్పటడుగు పడుతుంది. తరువాత విచారిస్తారు. భూమయ్య ప్రకృతి దానికి విరుద్ధంగా వుంది. ఏమిటి యితనిలోని గూఢమయిన ఓర్పు, సహనం? ఎందుకివన్నీ మింగి కూర్చున్నాడు—నవ్వుకున్నాడు సుధాకర్—ఏమీ లేదు, యిదంతా యతిరాజమ్మకు హుళక్కి అనడానికే!

కాలగతి, మనిషిలో ఎంత మార్పును తీసుకువస్తుంది! నిజాయితీనే కోల్పోయేటట్లు చేస్తుంది. దానికి కారణం ఏమిటి? పరిస్థితులలోని మార్పా అనిపించింది. అయితే ఈ కాలంలో నమూనాకైనా హరిశ్చంద్రులు లేరా? ఎంత విషమ పరిస్థితులలో కూడా, చివరకు నక్షత్రకుని సలహామీదనైనా హరిశ్చంద్రుడు బాకీ లేదని, ఈయలేనని అనలేదే? అటువంటి శీలం, పట్టుదల, కలియుగంలో అంతరించిందా అనిపించింది సుధార్‌కు. పైగా తన దుశ్శీలతకు, దుర్నడవడికి సుధాకర్‌ను యింధనంగా ఉపయోగిస్తున్నాడు భూమయ్య. ఎందుకనో సుధాకర్‌కు చాల బాధ అనిపించింది. తన వృత్తిపై తాత్కాలికంగా ఏహ్యభావం కలిగింది. అయినా తన వృత్తి యేం చేసింది? తన్ను యిటువంటి దుశ్శీలులకు తోడ్పడమని హెచ్చరించిందా! కేసులో బలాబలాలను మంచిచెడులను నిర్ణయించుకునే శక్తి, స్వాతంత్ర్యము తనకున్నవి. ఎవ్వరూ తనను నిర్బంధించలేరు! అవును. తాను యతిరాజమ్మకు మోసం చేయలేడు. అందుకు భూమయ్యకు అండగా నిలబడలేడు. నిలబడడు.

"భూమయ్యగారూ!" అని పిలిచాడు సుధాకర్.

"అయ్యా!" అంటూ భూమయ్య బూట్లు చప్పుడు చేసుకుంటూ లోపలకు రాబోయి, నాలిక కొరుక్కుని, బూట్లు గుమ్మందగ్గర వదలి, లోపలకు వచ్చి, టేబిలు దగ్గర వినయవిధేయతలతో నిలబడ్డాడు.

భూమయ్య వచ్చేసరికి తాను అతని రికార్డే చదువుతున్నాడు. భూమయ్యకు తనపైగల నమ్మకం, ఆశ చూస్తుంటే తనలో విపరీతమైన జాలి కలుగుతోంది. ఎక్కడినుంచో తనలో అతని విశ్వాసాన్ని వమ్ము చేయకుమని మనసు బోధిస్తోంది. మళ్ళీ ఒకప్రక్కన పాపంలో పాలుపంచుకోనవద్దనిపిస్తోంది. న్యాయానికీ, ధర్మానికి తీరని సంవాదం జరుగుతోంది. వృత్తిలో తారాపథాన్ని అందుకోవలసిన తాను యిటువంటి కేసులు తీసుకోరాదు. పేరు పాడయిపోతుంది. తన కీర్తి కాంతివంతం కాజాలదు!

"భూమయ్యగారూ! నేను ఈ కేసు చెయ్యను. క్షమించండి. రికార్డు తీసుకువెళ్ళండి." అన్నాడు సుధాకర్ రికార్డు కడుతూ.

భూమయ్య ఒక్కసారి కుప్పగా కుర్చీలో కూలబడ్డాడు. అయిదు నిమిషాలు మాట్లాడలేకపోయాడు.

"ఏమయ్యా! పాయింటు లేదా?" అన్నాడు అనుభవజ్ఞుడిలాగా.

"ఫాక్టు మీద పాయింటు లేదు." అన్నాడు సుధాకర్.

"పోనీండి. లా పాయింటు లేదా?" అన్నాడు భూమయ్య.

సుధాకర్ మాట్లాడలేదు.

"అదేమిటయ్యా! మీరు తలుచుకుంటే పాయింటు తీయలేరా. మిస్‌ప్రాప్రియేషన్ కేసులో తమకు ఎంత పేరు వచ్చింది. అది వినేకదా నేను తమ దగ్గరకు వచ్చింద. ఇవ్వాళరేపు మీ పేరు ఎంతగా చెప్పుకుంటున్నారు. మీరే అలా అంటే ఎలా?" అన్నాడు భూమయ్య.

భూమయ్య అన్న దాంట్లో వాస్తవం లేకపోలేదు. మన ప్రజ్ఞను యింకొకడు గోరంతలు కొండంతలుగా చేసి చెప్తుంటే ఎవరు కాదనగలరు. సుధాకర్ దర్పానికి కాస్త చక్కలిగింత పెట్టినట్లయింది.

"లా పాయింటు లేకేం?" అన్నాడు సుధాకర్ అదో రకంగా హుందాగా నవ్వుతూ.

"ఏ పాయింటు సార్!" అన్నాడు భూమయ్య. ముఖం విప్పారింది. గెలిచాననుకున్నాడు. సుధాకర్‌ది చల్లని చెయ్యి. దానికితోడు తన జాతకచక్రంకూడ చూపించుకున్నాడు. వ్యవహారంలో గెలుపు తనదే అని జాతకజ్ఞులు చెప్పారు.

"దావా 'కాలదోషం' (Limitation) పట్టింది. అదిగాక కాశయ్య లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేశాడు. కాన దావా చెల్లదు." అన్నాడు సుధాకర్ సిగార్ వెలిగిస్తూ.

"మరింకేం! అదీపాయింటు. నే చెప్పలా అయ్యా తమ ఆలోచన సూక్ష్మబుద్ధి! ఛా! ఆ ప్లీడరుగారికి లేందే! అందుకనేకదయ్యా తమదగ్గరకు వెతుక్కుంటూ వచ్చాను." అని ధీమాగా కుర్చీలో కూర్చున్నాడు, కాలుమీద కాలు వేసుకుని.

"అయినా, నేను ఈ కేసు పట్టను!" అన్నాడు సుధాకర్ సిగార్ అష్‌ట్రేలో నలుపుతూ. ఇది సుధాకర్ మానరిజమ్. తాను ఒక అభిప్రాయానికి, నిర్ణయానికి వచ్చిన తరువాత తన భావాలకు ద్యోతకమయ్యే సిగార్‌ను అష్‌ట్రేలో నులిమివేస్తాడు. అంతటితో ఆ అధ్యాయానికి పూర్తి అన్నమాట.

ఇది సుధాకర్ ఆఫీసుకు ఒకసారి వచ్చిన ప్రతి క్లయింటు ఇట్టే గమనిస్తాడు. బుద్ధిమంతుడు భూమయ్య దీన్ని గ్రహించాడు!

అదోవిధంగా నవ్వుతూ "ఎందుకని?" అన్నాడు, ఆర్గ్యుమెంటు ధోరణిలో, ఆఖరి తురుపుగా.

సుధాకర్‌కు జవాబు చెప్పవలసిన అవసరంలేదు. అయినా పెద్దమనిషిని అసంతృప్తుని చేయడం మంచిది కాదు.

"అన్యాయం గనుక!" అన్నాడు ముక్తసరిగా.

"ఏది అన్యాయం?" అన్నాడు భూమయ్య.

"కాలదోషం పట్టిందని, ఋణాన్ని కాదనడం." అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ సుధాకర్.

"మరి కాలదోషంపై ధర్మసూత్రాలనుకూర్చుతూ చట్టమెందుకు యేర్పడింది ప్లీడరుగారూ? మీకు నేను చెప్పాలా! కాలదోషపువాదన చట్టసమ్మతమేననికదా సూత్రకారులు దానిని నియమించింది." అన్నాడు భూమయ్య తన అరవై ఏళ్ళ ప్రాపంచికానుభవంతో. భూమయ్య వాదనలో పాయింటు కనబడుతోంది. సుధాకరుడు ఆలోచనలోపడ్డాడు.

అయిదు నిమిషాలు ఓపికపట్టాడు భూమయ్య.

"న్యాయ సమ్మతమైన కాలదోషపు వాదనను అన్యాయమనే హక్కు న్యాయవాదులైన మీకు ఎక్కడిది? చివరకు న్యాయమూర్తులు కూడ దానికి బద్ధులే. మీరు మీ కర్తవ్యాన్ని మరుస్తున్నారు. అన్నాడు భూమయ్య ఆఖరిసారిగా జరీ తలపాగా సర్దుకుంటూ.

సుధాకరుని ఎవరో తట్టి లేపినట్లయింది. అవును కేసును నిర్ణయించే బాధ్యత న్యాయవాదిఅయిన తనపని కానే కాదు. తన శక్తివంచన లేకుండా తనదగ్గరకు వచ్చిన పార్టీకి చట్టసమ్మతమైన న్యాయవాదనచేయవలసిన కర్తవ్యం తనపై వుంది. సిగార్ ముట్టించాడు.

అది సుధాకరుని అంగీకార సూచనగా భావించి, భూమయ్య సంతోషంతో అయిదు వందల రూపాయల నోట్లు పేపరు వైటుక్రింద పెట్టి, వకాల్తా సంతకం చేసేందుకు గుమాస్తాదగ్గరకు వెళ్ళాడు. ఇదంతా ఆదు

ర్దాగా కళ్ళజోడులోంచి గమనిస్తున్న గుమాస్తా రాజుగారు ఆనందంతో పిలకముడివేసుకుని భూమయ్యను వివరాలు కనుక్కుంటూ వకాల్తా పూర్తిచేశారు.

4

ద్వితీయ సంగ్రామం ప్రారంభమయింది; సుధాకర్ వకాల్తా పుచ్చుకోవడంతో అన్సరుకు అమెండ్‌మెంటు అడిగాడు—దావాకు కాలదోషం పట్టిందని, కాశయ్య లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేశాడు కనుక దావా చెల్ల నేరదని.

లా పాయింటు ఎన్నడైనను వాదించవచ్చును కనుక, కోర్టువారు ప్రత్యర్థులకు యాభై రూపాయల దిన ఖర్చులు యిచ్చి అన్సరు అమెండుమెంటుకు (సవరణకు) అనుమతియిచ్చారు.

ఖర్చులు జమచేస్తున్న భూమయ్య అదోవిధంగా నవ్వాడు. ఈ యాభై రూపాయల రుసుముతో యతిరాజమ్మ ఋణం నీటిపాలవుతోంది.

విచారణ ప్రారంభమయింది.

కేసు విచారణ అనగా దాదాపు సమవుజ్జీలయిన యిరువురు ప్లీడర్ల చదరంగపు ఆట అన్నమాట. కాకపోతే ఈ చదరంగంలో సజీవులయిన మానవులు పావులు. ఆయా ప్లీడర్ల బుద్ధికుశలతబట్టి ఈ పావులు నడుస్తాయి, పలుకుతాయి. ఆ యిరువురిలో ఒకరు అనుకోకుండా యింకొకరు ప్రత్యర్థుల ఆటను త్రోసిరాజంటాడు. ఆట కడుతుంది.

సుధాకర్‌కు ఈ ఆటలో చురుకుతనం ఎక్కువ. ప్రత్యర్థి యింకొకవైపు కాపు కాచుకుంటూవుంటే అనుకోనివైపునుంచి చొరబడి షహా అంటూవుంటాడు. తప్పుకునేందుకు వీలులేక ప్రత్యర్థి విస్తుపోయి ఓటమిని అంగీకరించవలసివస్తుంది.

సాధారణంగా సాక్షులను ప్రత్యర్థులు ఒప్పుకోని వివాదాంశాలకు మాత్రమే వినియోగిస్తారు. యతిరాజమ్మ ప్లీడరు ఒక్క సాక్షిని విచారించాడు—కాశయ్య వడ్డీ వ్యాపారి కాదని రుజువు చేసేంతవరకు మాత్రమే. క్రాసు పరీక్షలో ఆ సాక్షి చనిపోయిన కాశయ్యకు గట్టిగా స్తోమతు ఈయలేకపోయాడు. ఆ ప్లీడరు, భూమయ్య ఏవిధంగానైనా తన వాదనలను రుజువు చేసుకునే నిమిత్తమై సాక్ష్యమునకు వస్తాడు కదా; క్రాసు పరీక్షలో యతిరాజమ్మ కేసునంతా రుజువుచేసుకోనవచ్చని ఆశపడ్డాడు.

సుధాకర్ మాత్రము తెలివి తక్కువవాడా! భూమయ్యను బోనెక్కించలేదు! నలుగురు గట్టివ్యాపారస్తులను సాక్షులగాతెచ్చాడు కాశయ్య వడ్డీ వ్యాపారి అనిచెప్పేందుకు. కాశయ్య వీధిలోనే అదే వ్యాపారం చేసేవారు గనుక వారి సాక్ష్యము తొణకక, బెణకక పెట్టని కోటగా నిలబడింది.

ఇరు పక్షాల న్యాయవాదులకు వాగ్యుద్ధం జరిగింది. న్యాయమూర్తులు శ్రద్ధగావిన్నారు. మరునాడు తీర్పు వచ్చింది. భూమయ్య జమలను ఎవరూ రుజువుచేయని కారణంతో దావాకు కాలదోషం పట్టిందనీ, కాశయ్య లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేశాడని రుజువుఅయింది కనుక, కోర్టువారు యతిరాజమ్మ దావాను కొట్టివేశారు. యతిరాజమ్మ ఓడిపోయింది.

పౌరుషవంతురాలయిన యతిరాజమ్మ అప్పీళ్ళు చేసింది. వాటికి కూడ ఆ దుర్గతే పట్టింది.

భూమయ్య పట్టు నెగ్గింది. సుధాకరుని పేరు ప్రఖ్యాతులు యినుమడించాయి.

హైకోర్టు తీర్పుకూడ తనకు అనుకూలంగా వచ్చిన నాడు భూమయ్య సుధాకరుని ఛాంబర్సుకు వచ్చి, ప్లీడరుగారిని పూలదండలతో ముంచేసి, అతని వేలుకు వజ్రపుటుంగరం తొడిగాడు విజయచిహ్నంగాను, తన జ్ఞాపకార్థంగానూ. ఛాంబర్సులోని పెడస్టల్ ఫాను పూలవాసనను విజయధ్వానాలతో మేళవించి నలుదిక్కులా వెదజల్లింది.

5

అవి వేసవి శలవలు. సివిలు ప్రాక్టీసు మాత్రమే చేసే సుధాకర్‌కు కోర్టుశలవలు. అతడు ఉదయం ఆఫీసులో ఒక్కడే కూర్చుని ఆవారం వచ్చిన లా జర్నలు చదువుకుంటున్నాడు. పెడస్టల్ ఫాను నిర్మలమైన పవనాన్ని ఏకాగ్రతతో అతని ఛాంబర్సును నింపివేస్తోంది.

"నమస్కారమండి!" అన్న అభివాదమును విని తలయెత్తాడు సుధాకర్. గుమ్మంలో భూమయ్య నిలబడివున్నాడు. అదే పెద్ద జరీ తలపాగా, మోకాళ్ళ వరకు లాంగుకోటు, పంపు షూతో నిలబడివున్నాడు. అతని లాంగుకోటు ఒకానొకప్పుడు భూమయ్య దృఢకాయుడు అని సూచిస్తోంది. ప్రస్తుతం ఆ లాంగుకోటు కేవలం ఒక కర్రకు గొడుగు తగిలించినట్లుగా వుంది.

భూమయ్య బాగా చిక్కిపోయాడు. అతని పెద్ద కళ్లల్లోంచి అతని ప్రాణంతొంగి చూస్తోంది. పంపుషూ గుమ్మంలో విడుస్తూ "నేను రావచ్చునా!" అన్నాడు వినయవిధేయతలను బలహీనమైనగొంతుకతో ప్రకటిస్తూ.

భూమయ్య గెలిచిం తరువాత మళ్లీ రావడం యిది ఏడాది పిదప. ఈసారి ఏఋణభారాన్ని విముక్తి చేసుకునేందుకు వచ్చాడో అని నవ్వుకుంటూ ఆహ్వానించాడు సుధాకర్.

భూమయ్య తనకు విజయచిహ్నంగా యిచ్చిన వుంగరం కోసం చేతివంక చూచుకున్నాడు. చేతికి లేదు. బాగుందని పోరుపెట్టితే భార్యకు యిచ్చినమాట గుర్తుకు వచ్చించి.

భూమయ్యవచ్చి కుర్చీలో ఆసీనుడయ్యాడు. కుశలప్రశ్నలఅనంతరం సుధాకర్ ప్రశ్నించాడు. "ఈసారి యేమిటని?"

"అయ్యా యతిరాజమ్మ ఋణభారాన్ని తీర్చుకునేందుకు వచ్చాను." అన్నాడుభూమయ్య.

సుధాకర్‌కు అర్థం కాలేదు. అదీకాక యతిరాజమ్మ కేసు వోడిపోయిన తరువాత యింకా ఋణశేషం మిగిలిందా భూమయ్య తీర్చేందుకు- అనుకున్నాడు.

పెడస్టల్ ఫాను అవ్యాజమయిన ధ్యానాలను చేస్తూంది. భూమయ్య బరువుగా నిట్టూర్చిచెప్ప ప్రారంభించాడు:

"వకీలుగారూ మీరు కేసు పట్టనన్ననాడు నాకు అర్థంకాలేదు; నీతికి న్యాయానికి ఎంత తేడావుందో! అనుభవజ్ఞులు మీరు దాన్ని గ్రహించే కేసు పట్టనన్నారు. మూర్ఖుణ్ణి బలవంతపెట్టాను.

"కేసు గెలిచాము. యతిరాజమ్మ ఋణశేషాన్ని కాలదోషంలో పడిందని త్రోసిరాజనగలిగాము. నా మనసు వుపశమించింది. కాశయ్య వదలిన ఈ కాస్త ధనంతో జీవితశేషం గడుపుకుందామనుకున్న యతిరాజమ్మకు యిది తీరని ఘాతమయింది. వాళ్ల వాళ్ల మాటల నమ్మి వున్నసొమ్ములన్నీ ఖర్చుపెట్టి అప్పీలు చేసి హైకోర్టుదాకా వెళ్లిందికాని చట్టసమ్మతమైన కాలదోషం, కాలసర్పంలాగా యతిరాజమ్మను కాటువేసింది. కేసు గెలిస్తే వసూలు చేసుకోనవచ్చునుకొన్న అప్పులవాళ్లు యతిరాజమ్మను బాధించదొడగారు. యతిరాజమ్మ జీవితం అంధకారబంధురం అయింది. తాను చేసిన ఋణాలకు కాలదోషం అడ్డురాలేదు. మార్గం తోచలేదు. ఆత్మహత్య చేసుకుంది!

"ఇటు నేను మాత్రం బాగుపడ్డ దేముందయ్యా? కేసుగెలిచిన తరువాతనుంచీ మంచమెక్కాను; కాలవాహినితో చావు బ్రతుకులపై మాట్లాడవలసివచ్చింది. ఎప్పటికప్పుడు మీ కోసరమై ఖబురు పంపుదామనుకునే వాణ్ణి. మంచంమీద పడుకున్నప్పుడల్లా నాకిదే సమస్య. నా గెలుపెంతవరకు ధర్మసమ్మతమైనదా అని తరచి తరచి చూచాను. నాది గెలుపు కాదు. నాదే పూర్తిఓటమి. చట్టపు నీడలో నక్కి నీతిని, ధర్మాన్ని కోల్పోయాను. అందుకనే అంటారు చట్టబద్ధమైన న్యాయానికి చెవులున్నాయేగాని కళ్లులేవని. మంచంమీదవున్నంతకాలం తరచి తరచీ చూచాను. నాకు మిగిలిన యావదాస్తి యతిరాజమ్మ పేరన వ్రాస్తేనేగాని నాకు నిష్కృతి లేదనిపించింది. మీకు ఖబురు పంపుదామనుకుంటుండగా నాకు వార్త తెలిసింది యతిరాజమ్మ కాలం చేసిందని. అంత్యక్రియలు చేసేవాళ్ళెవరూ లేకపోతే కార్పోరేషన్‌వారే పూనుకోవలసివచ్చిందట. పాపం! నేనుచేసిన అవినీతిపనికి క్షమార్పణ లేదు. కనీసం యతిరాజమ్మ వారసులు కూడ ఎవరూ లేరు, పోనీ ఋణశేషాన్ని వాళ్ళకు ధారాదత్తం చేద్దామంటే!

"బాగా ఆలోచించి చూచాను. ఒక్కటే మార్గం తోచింది. భగవంతుణ్ణి ప్రార్థించాను కనీసం యిదైనా పూర్తిచేసేంతవరకు నాకు అవకాశమివ్వవలసిందని. రెండురోజులయింది పత్యం తిని. కాస్త యివ్వాళ సుళువుగా వుంది. ఉదయాన్నే మీ యింటికి వచ్చాను; మీ దర్శనంచేసుకొని ఋణవిముక్తుణ్ణవుదామని." అన్నాడు.

అర్థంకాక సుధాకర్ భూమయ్యవంక చూస్తూ సిగార్ ముట్టించాడు, ధూమపానం యేమైనా కీలకం యిస్తుందేమోనన్న ఆశతో.

భూమయ్య కోటుచాటునుంచి నోట్లకట్టలు తీసి బల్లమీద పెట్టాడు. సుధాకర్, భూమయ్య ఈ వింత ప్రవర్తనను అర్థంచేసుకో ప్రయత్నించసాగాడు.

"అయ్యా యతిరాజమ్మ బాకీ ఈనాటివరకు వడ్డీతోసహా ఏడు వేల అయిదువందలు అయింది. కాలదోషపు వాదనతో అది నీటిపాలయింది. ఈ పాపానికి నిష్కృతికై ఒకటే మార్గముంది." అన్నాడు.

"ఏమిటిది?" అన్నాడు సుధాకర్ అనుమానంగా.

"ఆనాడు మీరుకూడ పాతప్లీడరుగారి వలెనే కేసులో బలంలేదని అనిఅంటే ఋణం తీర్చుకుని విముక్తుడనయ్యేవాడిని. లాపాయింటు వుందనే సరికి నా

విద్రోహానికి, అవనీతికి దాన్ని వినియోగించుకున్నాను. ఈనాడు నాపాపం పరిహారం గావాలంటే, దానికి మార్గం చూపించ కలిగిన మీకే ఈఋణ భారాన్ని తీర్చదలచుకుంటున్నాను. కాలదోషం పట్టించ గలిగిన నైతిక బాధ్యతను, న్యాయవాదులైన మీరే ఈ భారాన్ని వహించవలసి వుంటుంది. కాన యతిరాజమ్మ పరంగా ఈ రూపాయలు మీరు తీసుకుని సద్వినియోగం చేయండి. నన్ను ఋణవిముక్తుణ్ని చేయండి." అని అంటూ భూమయ్య సుధాకర్ ముందుకు నోట్ల కట్టలను తోశాడు.

భూమయ్యలోని ఈ అనిర్వచమైన నైతిక విజ్ఞానానికి, మార్పుకు, సుధాకరునికి చాల ఆశ్చర్యం కలిగింది! అయ్యో! ఆనాడు తాను అన్యాయమైన కేసు పట్టనన్న పట్టుదలను ఎందుకు సడలాడా అని విచార పడసాగాడు. భూమయ్య అన్నట్లు తాను మార్గదర్శకుడు కానట్లయితే భూమయ్య ఈ అవినీతికి పాల్పడేవాడు కాదేమో ననిపించింది. కాలదోషపు వాదనలో నైతికపతనం పొందిన భూమయ్యకు సంస్కారం కలిగింది; నైతిక విజ్ఞానం కలిగింది. తానుమాత్రం కేవలం న్యాయవాదేనా నైతికవాది కాడా! తానుమాత్రం ధర్మానికి నీతికి బద్ధుడు కాడా! సిగార్ ఆష్ ట్రేలో నులిమాడు.

సుధాకరుని పై చెప్పిన మానిరజ మెరిగినవాడు కాన భూమయ్య సుధాకర్ తీర్పుపై ఎంతో ఆశగా చూచాడు. సుధాకర్ రొటేటింగు చైర్ వెనక్కు త్రోసి, ఛాంబర్సుకు అంటిపెట్టుకున్న గదిలోకి వెళ్లి, భార్యను పిలచాడు గట్టిగా.

వేసవి శెలవలకు తన యింటికి వచ్చిన చెల్లెలితో భార్య తమ పుట్టింటి చిన్ననాటి అనుభవాలను, కష్ట సుఖాలను సింహావలోకనం చేసుకుంటోంది. సుధాకర కేకవిని వచ్చింది. ప్రశ్నార్థకంగా భర్త వంక చూచింది. దూరంనుంచి మరదలు సుధాకరుని గంభీర వదనాన్ని గమనిస్తోంది!

"చెక్కు బుక్కు ఏదీ? అన్నాడు సుధాకర్ జేబులోంచి పెన్ను తీస్తూ.

పొదుపరి అయిన సుధాకర్ భార్య, అలమార లోంచి చెక్కు బుక్కు తీసియిస్తూ "ఎందుకూ?" అంది భయసంభ్రమాలతో. సుధాకర్ ధనం దుర్వినియోగం చేస్తాడని, సంసారం సంగతి బొత్తిగా పట్టదని, అతని భార్య గట్టి నమ్మకం. అందుకని దాన ధర్మాలు విరాళంగా, చెక్కుల రూపంగా పోకుండా, ఆమె దగ్గర వుండి ఆడిట్ చేస్తూంటుంది.

చెక్కుమీది అంకెలు చదివింది. పదిహేను వందలు. తన కళ్ళను తాను నమ్మలేకపోయింది.

"ఏదీ! భూమయ్యగారు ఇచ్చిన వుంగరం ఇయ్యి." అన్నాడు.

భయంతో తీసియిస్తూ "ఏమిటిదంతా? ఎవరికీ? ఎందుకూ?" అంది చెక్కుమీది అంకెలను మాత్రమే అర్థం చేసుకోగలిగిన సుధాకరుని భార్య!

సమాధానం చెప్పకుండానే సుధాకర్ ఛాంబర్సు లోకి వెళ్ళాడు.

"భూమయ్యగారూ! మీ ఈ నైతిక సంస్కారణకు, విజ్ఞానానికి నానమోవాకములు. మీరు నాకు కళ్లు తెరిపించారు. అవనీతికరమైన కేసులు పట్టగూడదని — తప్పు చేస్తేకాని అనుభూతి కలగదని మీకేసువాదించి కాలదోషం పట్టించడంతో నాకు ఈ అనుభూతి కలిగింది. మీరు యతిరాజమ్మ ఋణభారాన్ని నాకు యిచ్చి ఋణ విముక్తుల మవుదామనుకుంటూ నాకు చక్కని నీతిపాఠాలు నేర్పారు. ఇంకా నా కాలు జారనీయకండి. ఇదుగో మీరు నాకు మూడు కోర్టులలోను యిచ్చిన ఫీజుకు చెక్కు, విజయ చిహ్నంగా యిచ్చిన వుంగరం, ఈవిడు వేల అయిదువందలు. మీది ఋణభారం అయితే, యివి నాకు తీరని ఋణభారాలు. ప్రస్తుతం ఋణ గ్రహీతలులేరు గనుక ఈ మొత్తాన్ని అనాథ శరణాలయానికి సద్వినియోగం చేయమని, యతిరాజమ్మ పేరిట దానం చేయండి". అంటూ, బలవంతంగా బల్ల మీద వున్న భూమయ్య తలపాగాలో నోట్ల కట్టలను పదిహేనువందల చెక్కును, ఉంగరాన్ని వుంచాడు సుధాకర్.

భూమయ్య దిగ్భ్రాంతుడయ్యాడు. అయిదు నిమిషాలు ఆగాడు. సుధాకర్ యింకొక్క సిగార్ వెలిగించాడు. భూమయ్య సుధాకరుని అర్థం చేసుకో గలిగాడు.

"ప్లీడరుగారూ! మీ రందరిలాంటి న్యాయవాదులు కారు. మన యిగువురి జీవితపుమలుపులకు చిహ్నంగా మాత్రం ఈ వుంగరాన్ని మీరు వుంచుకోండి." అంటూ బలవంతంగా సుధాకరుని వ్రేలికి వుంగరం తొడిగి బూట్లు చప్పుడు చేసుకుంటూ మేడమెట్లు దిగి భూమయ్య ప్రకృతిలోనికి నిష్క్రమించాడు.

"చూడవే చెల్లెలా! వారెప్పుడూ యింతే! ఇట్లాగే అంతా నాశనం చేస్తున్నారు. పెళ్ళికెదిగిన పిల్ల వుందనయినా వారికి ఆలోచన లేదు." అంటున్న భార్య మాటలు ఛాంబర్సులోనికి పెడస్టల్ ఫాను గాలిని తోసుకుంటూ వచ్చాయి.

సుధాకర్ అదోవిధంగా నవ్వుకుంటూ సిగార్ ఆష్ ట్రేలో నులిమి, పెడస్టల్ ఫాను స్పీడు హెచ్చించాడు.

ఆర్థిక ప్రపంచములో బంగారు

శ్రీ రాచకొండ రామదాసు

మానవ సమాజములో బంగారమునకు ప్రత్యేక స్థానము కలదు. స్వర్ణదాహము బంధుప్రేమను తెగనాడిన సంఘటనలు సర్వసామాన్యములు. వ్యక్తులుమాత్రమేగాక దేశములు, రాజ్యములు కూడ బంగారునిలువలను ఇతర ప్రాంతములనుండి కొల్లగొట్టి స్వదేశములకు మోయనెంచిన సందర్భములు ప్రపంచ చరిత్రలో కొల్లలుగా గోచరించును. భారతదేశముపై దాడివెడలిన మహమ్మదు ఘజినీ, మహమ్మదు గోరీ, నాదిర్షా, తదితరులెల్ల ఈ దేశపు బంగారు కాంతిచే దురాకర్షణకు లోనైనవారే! పాశ్చాత్యదేశములందు గూడ పదునారు, పదునేడవ శతాబ్దులలో "మెర్కంటిలిస్టులు" అనుఆర్థిక సిద్ధాంతావలంబకులు బంగారము, వెండిమొదలగు దివ్యలోహములు సమృద్ధిగాగల దేశములు ఆర్థిక సంపన్నములు కాగలవని విశ్వసించుచుండిరి. ఈ "మెర్కంటిలిస్టు" సిద్ధాంతములను వ్యాపార ప్రముఖులు, రాజకీయ నిపుణులు కూడ దృఢపరచుటేగాక, ప్రభుత్వవిధానములను తదనుకూలముగా రూపొందించుచుండిరి. దక్షిణ అమెరికానుండి బంగారముతో నిండిన స్పెయినుదేశపు ఓడలను దోచిన వీరులగు హాకిన్సు, ఫ్రాన్సిసుడ్రేకులు ఇంగ్లండుదేశపు రాణియగు ఎలిజబెత్తు ప్రశంసలకు పాత్రులైరి. భారతదేశము నుండి మేలురకపు నూలువస్త్రములు, సుగంధ ద్రవ్యములు దిగుమతిచేయు తూర్పు ఇండియా కంపెనీ చర్యల వలన తనదేశపు బంగారము విదేశములకు పోవుచున్నదని వాపోవుటేగాక భారతదేశపు నేతవస్తువుల ఎగుమతులపై సుంకములను విధించి, అనేక ఆంక్షల నేర్పరచినది, ఇంగ్లండుదేశ మా నాడు! విదేశవ్యాపారములో ఎగుమతుల మొత్తముకంటె, దిగుమతుల మొత్తపు విలువ హెచ్చిన వ్యాపారప్రతికూలశేష మేర్పడు ననుటయు, బంగారమును పై దేశముల కెగుమతి చేసినచో దేశము దుర్భిక్షమగుననియు, వీలయినంతవరకు భోగ్యవస్తువుల దిగుమతి నాపివైచి, దేశపు ఎగుమతి ప్రమాణమును సంపాదించుటకు ప్రభుత్వయంత్రాంగము తోడ్పడవలెననియు సిద్ధాంతీకరింపబడెను. కాని పదునెనిమిదవ శతాబ్దపు ఆరంభదశలయందే హ్యూమ్, ఏడమ్ స్మిత్ మొదలగు ఆర్థిక విజ్ఞాన పండితులు పై వాదములో గల కొరతను, లోటుపాట్లను విమర్శించిరి. అన్ని దేశములకు దిగుమతులను కట్టడిచేసి ఎగుమతులను పెంచుటకు యత్నించుచో అంతర్జాతీయ వ్యాపారము స్తంభించును గదా! పైగా ఎంతటి లోభియైనను బంగారమును చూచుకొనుచు ఆకలి తీర్చుకొనలేనట్లే దేశములు కూడ బంగారమును కుప్పపోసికొన్నచో దేశము సిరిసంపదలతో తేలియాడుటకు మారు దేశములో ధరవరలు హెచ్చి ద్రవ్యోల్బణ పరిస్థితు లేర్పడు నవకాశము కలదు. నేటికిని వెండి, బంగారములను దేశసంపదగా నెంచు దృక్పథ మనేకులయందు కలదు. 'దేశముల సంపద' (Wealth of Nations) అను తనయుద్గ్రంథముఆరంభముననే ఏడమ్స్మిత్ దేశముల సిరిసంపదలు వానికిగలనిధినిక్షేపములందు గాని, రజత కాంచనములందు మాత్రముగాని యుండునని ఎంచుట పొరపాటని, ఆ దేశమునందు వృద్ధిచెందిన ఉత్పత్తి చర్యలందు, వాణిజ్య పరిశ్రమలయందు దేశీయసంపదమూలమును గాంచుట ముఖ్యమనియు స్పష్టీకరించెను. అతని యుద్దేశములో బంగారమును ద్రవ్యముగా మాత్రమే పరిగణింపవలెను. ద్రవ్యమునకు, సంపదకుగల భేదమును గుర్తింపకపోవుటే మెర్కంటిలిస్టులతప్పని, బంగారపు ఎగుమతివలన దేశీయార్థిక విధానమున కావశ్యకమైన ముడిసరుకులనుగాని ఇతర అవసరములనుగాని దిగుమతి చేసుకొనుట సర్వదా సమంజసమగునని విపులీకరించెను. నేటికిని ఏడమ్ స్మిత్ వాక్యములు ప్రమాణప్రాయములై యున్నవి.

ఈ చర్చవలన నవీనయుగములో బంగారము తొలినాటి తన ప్రభలను పోగొట్టుకొన్నదని తలంపరాదు. మానవుల ఆర్థికజీవితములో బంగారమునకు ప్రత్యేకస్థానము కలదు. ద్రవ్యసాధనముల వాడుక మానవ నాగరికత పురోగమనమార్గములో మైలురాయి. వినిమయప్రధానమైన నేటి ఆర్థిక విధానమునకు ద్రవ్యసాధనము కీలకప్రాయము. ద్రవ్యసాధనపు ఏర్పాట్లలో ప్రథమప్రపంచయుద్ధమునకుపూర్వము బంగారు నాయక

పాత్ర కల్గియుండెను. ప్రథమ ద్వితీయ యుద్ధ మధ్య కాలములో ప్రపంచ ఆర్థిక రంగములో కల్గిన విప్లవ సదృశమైన మార్పుల ఫలితముగా అనేకదేశములు సువర్ణ ద్రవ్యప్రమాణపద్ధతిని విడనాడినను జాతీయ అంతర్జాతీయరంగములలో ద్రవ్యసంబంధవిషయములలో బంగారమునకు గల ప్రాముఖ్యము మరుగున పడలేదు. ద్రవ్యనీతివిధానములకు, బంగారమునకు పరస్పర సాన్నిహిత్యము 1945 సం॥లో బ్రెటన్‌వుడ్స్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశము ద్వారా బలపడెను. అంతర్జాతీయ ద్రవ్యనిధి ఏర్పాటు ననుసరించి దానిలో సభ్యత్వముగల దేశముల కరెన్సీల విదేశ వినిమయపు విలువ బంగారములేదా డాలర్ల ననుసరించి నిశ్చయింపబడవలెను.

నేటి ఆర్థిక జీవితవిధానముతో బంగారమునకు గల ప్రత్యేకస్థానమును వివరించుటకు నాందిగా ద్రవ్యవిధానమును గూర్చి కొంత తెలియవలయును. అనేక శతాబ్దములకు ముందు మానవుల పరస్పర వస్తువినిమయము ప్రత్యక్షవస్తువుల మార్పిడిద్వారా జరుగుచుండెను. ఈ పద్ధతిలో పెక్కులోట్లు గల్గుచుండెను. ఇచ్చిపుచ్చుకొనుటలో ఒండొరుల ప్రత్యేకావసరములు సమ్మిళితము గావలెను. ఒకవ్యక్తివద్ద అదనపు దారు సామగ్రి యున్నను వానికివలయు నేయిగాని పాలుగాని ఇచ్చుటేగాక కలపను గోరు వేరొక వ్యక్తితో మాత్రమే వస్తువు మార్పిడి సాధ్యమగును. ఇందును ఆయా వస్తువుల విలువల నిష్పత్తి నిర్ణయము క్లేశభూయిష్ఠముగు ప్రశ్న. మానవ నాగరికతతోపాటు వ్యక్తుల కోర్కెలు అధికమై శతసహస్ర వస్తుజాలము వినిమయరంగమున కాలిడెను. ఆర్థిక క్షేత్రములో ఆయావస్తువులను సామాన్యప్రమాణముగా సర్వజన సులభముగు గో కనక ధాన్యాదులతో పరి పోల్చి ధరలను నిర్ణయించు ఆచారమువలన వ్యాపార కార్యకలాపములు సుకరమగును. నేయి నమ్మజూపువానికి కలప ఆవశ్యకము గాకుండవచ్చును. అందువలన వస్తు వినిమయమునకు తాత్కాలికాటంకము కల్గును. అట్లుగాక బంగారు నాణెములగు నిష్కములను వాడుకలోనికి తెచ్చుటచే సర్వజనసమ్మతముగు సువర్ణ లోహమునకు బదులుగా ఆయావస్తువుల క్రయవిక్రయములు జరుగును. ద్రవ్యసాధనముగా బంగారము మాత్రమే అంగీకరింపబడవలెనను నియమము లేదు. అనేక మానవసమాజములలో చిల్లిగవ్వలు, గాజు పూసలు, పశుసంపద, ధాన్యపుగింజలు, జంతుచర్మములు, రాగి, వెండి మొదలగునవి ద్రవ్యపదార్థముగా వాడబడెను. రాగి, వెండి, బంగారము, లోహమిశ్రమములను ద్రవ్యనాణెములకై వాడుటకు ముఖ్యకారణము వానిస్థిరత్వమే. వాడుకవలనను, ప్రకృతి శక్తులవలనను శీఘ్రగతిని విరుగుట, తరుగుట, తమ వస్తుధర్మమును విడనాడుట వీనియందు అత్యల్పము. వీనిని వలయు పరిమాణములో ముద్రింప సానుకూలమగును. ధాన్యము, పశుసంపదవలెగాక వీని ప్రత్యేక స్వరూపములను సులభముగా గుర్తింపగలము. ధాన్యములలో వ్యత్యాసమును తెలియుటకు పరిపక్వానుభవమువలయును. నాణెములలో వివిధమూల్యములను ప్రత్యేకించుటకు ప్రభుత్వ ముద్రలే తోడ్పడును.

ఈ సందర్భములో సందేహమొకటి గల్గును: "ప్రస్తుత ప్రపంచములో పాశ్చాత్యదేశములందేగాక, భారతాదిదేశములందుగూడ బంగారులో ఈ నాణెముల ప్రచారము కానరాకుండుటేగాక ఇతర లోహ, లోహమిశ్రిత నాణెముల మొత్తపు వంతుకంటె కాగితపు కరెన్సీనోట్లు, చెక్కులు, బిల్లులు, ప్రామిసరీ నోట్ల ప్రాముఖ్యము హెచ్చుగా కన్పట్టును. ద్రవ్యపదార్థముగా బంగారము, వెండి మున్నగు విలువగల లోహములను సంపన్నదేశములైనను వాడుకచేయవచ్చుగదా! బంగారునాణెముల ముద్రణ ప్రభుత్వసార్వభౌమాధికార గౌరవమునకు వన్నెదేగల్గునని గదా పూర్వ మనేక సామ్రాజ్యాధీశులు అశ్వమేధయాగాది విజయయాత్రలయనంతరము బంగరు మొహరులను ముద్రించుటకు ఉత్తర్వు గావించి యుండిరి? దేశప్రజల వాడుకకు బంగారునాణెము లేల ముద్రింపరాదు?" అని. మొగలు సామ్రాజ్యాధీశుడగు అక్బరు రాజ్యకాలము నాటి నుండియు ఉత్తర హిందూదేశములో బంగారు మొహరు, వెండి రూపాయ నాణెములు కరెన్సీగా వాడబడుచుండెను. రెంటి భారప్రమాణము 175 గ్రెయినులకు సరిగానుండెను. ఒండొంటిమధ్య స్థిరమగు నిర్ణీత నిష్పత్తి లేకున్నను, మొగలు సామ్రాజ్య నాణెముగు "దామ్" (Dam) అను రాగినాణెముతో ఒకొక్క నాణెపు విలువయు స్థిరీకరింపబడియుండెను. మొగలుల కెన్నడును సంపూర్తిగా వశముగాని దక్షిణ భారతమందు బంగారమే ముఖ్యమగు కరెన్సీ నాణెముగా వాడబడుచుండెను. మొగలు సామ్రాజ్యపతనానంతర మనేక స్వతంత్రసంస్థానము లేర్పడెను. అవి తమ

స్వతంత్ర ప్రతిపత్తిని చాటుటకు ప్రత్యేక నాణెములను ముద్రింపజొచ్చెను. ఈ నాణెములన్నియు మేలిమి, బరువు విషయములలో తలకొకతీరుగా నుండెను. తూర్పు ఇండియా కంపెనీ దేశీయవ్యవహారములలో జోక్యము కల్గించుకొన మొదలిడిన నాటికి బరువు, వన్నెలలో తేడాలు గల్గిన సుమారు 994 ప్రత్యేక కనక, రజత నాణెములు దేశమునందు చలామణి యగుచుండెనని పరిశోధకులు లెక్కగట్టిరి. తూర్పుఇండియా కంపెనీ క్రమముగా ఆధిక్యమును సాధించినతర్వాత క్రీ.శ. 1800 సం॥ అనంతరము దేశపు కరెన్సీ స్థితిగతులలో నేర్పడిన తికమకలను తీర్చిదిద్దుటకు ప్రథమ యత్నముగా కంపెనీముద్రతో నిర్దేశితమైన బరువు, మేలిమి కల్గి పరస్పరము నిర్ణీత నిష్పత్తిగల్గిన వెండి, బంగారు నాణెములను ఏకకాలములో జారీగావించెను. కాని సుప్రసిద్ధమగు "గ్రెషమ్స్ సూత్రము" ననుసరించి తక్కువ విలువ కట్టబడిన బంగారు నాణెములు ప్రచారమునుండి వైదొలగి వెండినాణెములుమాత్రమే మిగిలి యుండెను. ఇందువలన తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టర్లు భారతదేశమునందు ఒక లోహనాణెమును వాడుకలో నుంచుటకు, బంగారమునకు బదులుగా వెండిని మాత్రమే ద్రవ్యనాణెమునకు ఎంచుటకు నిశ్చయించిరి. 1818 వ సం॥ నాటికి మద్రాసు రాష్ట్రములో గోపురపు ముద్రగల బంగారు నాణెమునకు (Gold Pagodaకు) బదులుగా 180 గ్రెయినులుకల్గి 11/12 మేలిమిగల వెండి రూపాయ అందచేయబడెను.

ఈ కార్యక్రమములో అంతిమ చర్య 1835 వ సం॥లో భారతదేశ మెల్లెడల 1818 వ సం॥పు మద్రాస్ రూపాయ వన్నె బరువుగల వెండి రూపాయనాణెము అధికారయుతమగు ఏకైక ద్రవ్యసాధనముగా ప్రకటించబడుటతో సంపూర్తిచెంది, భారతదేశపు కరెన్సీ చరిత్రలో ప్రథమాధ్యాయము ముగిసెను. వెండినాణెములను నిరాటంకముగా ముద్రించుటకు ప్రభుత్వ టంకశాలలు స్థాపింపబడెను. వెండిరూపాయ అధికార నిర్ణీతమైన విలువ, ఆ నాణెమును కరిగించినచో వచ్చు లోహపు బజారు విలువ, సరిసమానముగా నుండెను. ద్విలోహ ప్రమాణము (Bimetallic Standard) గాక ఏకమాత్ర లోహప్రమాణముగ ద్రవ్యముద్రణ ఏర్పడెను. కాని 1873 వ సం॥నుండి రజతప్రమాణపు అచరణలో అనేక క్లిష్టపరిస్థితులు పొడచూపెను. క్రొత్త వెండిగనులను కనుగొనుటచే ప్రపంచపు వెండిఉత్పత్తి హెచ్చెను. బంగారుతో సరిపోల్చిన వెండికిగల వినిమయపు విలువ దిగజారుటచే వెండిరూపాయి నాణెమునకు విదేశములలో గల విలువ తగ్గెను. ప్రభుత్వపు బడ్జెటు పద్దులు, భారత విదేశ వ్యాపారములకు ప్రత్యాఘాతము కల్గెను. ఇందువలన ప్రభుత్వము వెండి ప్రమాణము నుండి దేశీయ ద్రవ్యవిధానమును తొలగింప సంకల్పించెను. 1893 వ సం॥లో వెండికిబదులు నాణెములను నిరాతంకముగా ముద్రణచేయు ఏర్పాటు రద్దు చేయబడెను. తత్పూర్వము వెండి రూపాయ ప్రమాణ నాణెముగా (Standard Coin)గా నుండెను. స్వేచ్ఛాముద్రణ (Free Mint) ఆపు చేయబడిన తర్వాత రూపాయ చిహ్నప్రాయనాణె (Token Coin) మారెను. ప్రజాభిప్రాయము వెండికి బదులు బంగారము ద్రవ్యప్రమాణము కావలెనని ఆందోళనను సూచించుచుండెను. 1898 వ సం॥లో భారతప్రభుత్వము బంగారు ద్రవ్యప్రమాణము దేశములో ప్రవేశపెట్టబడవలెనని సెక్రటరీ ఆఫ్ స్టేటుకు విజ్ఞప్తి చేసెను. దేశపరిస్థితుల కనుకూలమగు బంగారు ప్రమాణమును అమలుపరచు పథకమును తయారుచేయుటకు ఫౌలరుకమిటీ ఏర్పరుపబడెను. ఈ కమిటీవారి సిఫార్సుల ఫలితముగా 1899 వ సం॥లో నిర్ణీతమగు నిష్పత్తి ప్రకారము వెండి రూపాయలతోపాటు బంగారు సవరసులు, అర్థ సవరసులు అధికార ద్రవ్యముగా ప్రచారములోనికి తేబడెను. కాని 1899 లోను, 1900 లోను తపాలాఫీసులు, కాగితపు కరెన్సీ ఆఫీసులు, జిల్లా ట్రెజరీలు, రైల్వేల ద్వారా బంగారపు ముద్రికల మూలమున ఇచ్చి పుచ్చుకొను కార్యకలాపములను ప్రోత్సాహపరచుటకు ప్రభుత్వము గావించిన ప్రయత్నములు సఫలము గాలేదు. ఇట్లు జారీచేయబడిన బంగారు నాణెములు చాల భాగము ప్రభుత్వమునకే తిరిగి ఈయబడుటజూచి భారతీయులలో బంగారుకాసులను వినిమయ సాధనముగా రూపొందించు ప్రయోగము నిష్ఫలమయ్యెనని ప్రభుత్వ ముద్దేశపడుటకు నిశ్చయించెను. బంగారు నాణెముల వాడుక విషయ మిట్లుండగా 1900సం॥లో వెండి నాణెముల నదనముగా ముద్రించవలసెను. దేశీయ వ్యవహారములకు వెండిరూపాయలను, విదేశవ్యాపారమునకు బంగారు ప్రమాణముకల బ్రిటిషు స్టెర్లింగును నిర్ణీతమైన రేటునకు వ్యాపారస్థులకు, పౌరులకు లభ్యము చేయు పద్ధతి కౌన్సిలు బిల్లులు, రివర్సు కౌన్సిలు బిల్లులద్వారా ప్రయోగాత్మకముగా వాడబడెను. దీనినే బంగారు మార

కము ప్రమాణపద్ధతి (Gold exchange standard) అని వ్యవహరించుచుండిరి. నాటినుండియు బ్రిటిషు కరెన్సీకిని బంగారునకు గల పరస్పర సంబంధము మార్పుతోపాటు హిందూదేశద్రవ్యరాశి విదేశీ మారకము ఏర్పాట్లలో పెక్కు ఒడుదుడుకులు గల్గెను. 1931 వ సం॥లో ఐక్యరాజ్యము బంగారు ప్రమాణమును విడనాడుటతో మనదేశద్రవ్యపద్ధతిని స్టెర్లింగుఎక్ఛేంజిప్రమాణముగా వ్యవహరించవలసివచ్చెను. రెండవయుద్ధకాలములో వెండిధర పెచ్చు పెరుగుటచే అర్ధరూపాయ రూపాయ బిళ్ళలలో వెండి వంతు తగ్గింపబడెను.

హిందూదేశపు కరెన్సీ చరిత్రలో పై అంశములను బట్టి వెండి, బంగారములను ఒకసారి ద్రవ్యనాణెములుగా వాడుకచేయుటగాని ప్రత్యేకము ఒకే లోహముద్రలను ద్రవ్యావసరములకు వాడుటగాని చిక్కులతో కూడిన లక్ష్యమని తెలియును. ద్వైలోహ ముద్రికల ప్రచారమువలన ఆ రెండు లోహనాణెముల మధ్యను ప్రభుత్వము నిర్ణయించిన నిష్పత్తికిని, ఆ లోహముల బజారు రేట్లకును వ్యత్యాస మేర్పడినచో ప్రభుత్వ వినిమయపు ఏర్పాట్లను బట్టి అధికమూల్యము (Over valued) కట్టబడిన లోహనాణెములు ఇతర లోహనాణెములను ప్రచారములోనుండి వైదొలగించును. అట్లుగాక వెండిగాని, బంగారుగాని ఏకైక ద్రవ్యలోహముగా ఎంచుకొనబడినచో ప్రపంచధరవరలచే ద్రవ్యనాణెపు విదేశ వినిమయమూల్యము మారును. ప్రజావసరములకు వలయు ధనమును ముద్రించుటయందు ఒడుదుడుకులు కల్గును. ఈ సందర్భములో మూల్యలోహముల ధరవరలు ఆయాలోహోత్పత్తి పరిస్థితులచేతను, వానికొరకు జనుల అర్ధనము (Demand)ను బట్టియు ప్రభావితమగునని జ్ఞప్తియందుంచుకొనవలెను. వెండి, బంగారములు ఆభూషణాదులకేగాక, పళ్లుకట్టుటయందును, రసాయనిక పారిశ్రామిక చర్యలందును అక్కరకువచ్చును. ఇంతేగాక విదేశములనుండి దిగుమతులను తెచ్చుకొనునపుడు, ఎగుమతి లెక్కల ద్వారాగాని, ఇతర అదృశ్యాదాయపు పద్దుల ద్వారాగాని బాకీలు పరిష్కరింపవలెను. మిగిలిన కొరవను విదేశములనుండి మూలధనపు ఆకర్షణచేగాని, ఋణ సౌకర్యములద్వారాగాని, బంగారపు నిలువల బదిలీ ద్వారాగాని భర్తీ చేయవలెను. ఇట్లు గృహసంబంధ, పారిశ్రామిక, విదేశవ్యాపారముల కత్యంతావశ్యకమగు బంగారమును దేశములోని నిత్యకార్యకలాపములకు ద్రవ్యనాణెముగా ఉపయోగించుట నిరుపయోగమని తోచును. ద్రవ్యవస్తువుగా ప్రజలందరి యంగీకారము పొందిన ఏ పదార్థము నైనను వాడవచ్చును. ప్రజాంగీకారము ద్రవ్యనాణె మే పదార్థముచే తయారు గాబడినదను అంశముపైకంటె, ఆ ద్రవ్యమునకు అధికారముద్ర కల్పించిన ప్రభుత్వముపై పౌరులకు గల భక్తిశ్రద్ధా విశ్వాసములపై నాధారపడియుండును. సమర్థమగుప్రభుత్వము ప్రజామోదముపై కాగితపుముక్కలపై ప్రత్యేక ముద్రణ ఏర్పరచి, వెండి, బంగారు నాణెములకు సరితూగు విలువ నిర్ణయించినను ప్రభుత్వముపై వ్యాపార పారిశ్రామిక ప్రతినిధివర్గములకు, సామాన్యజనులకు అవిశ్వాసము పొడసూపనంతవరకు ఆ కాగితపు కరెన్సీయే చలామణియగును. ఈ రహస్య మెరిగియే యుద్ధకాలమందు కాగితపు కరెన్సీకి హామీ ప్రాయముగా కేంద్ర బ్యాంకులచే ప్రత్యేకింపబడు వెండి, బంగారు నిల్వలను పార్లమెంటు సమ్మతిపై బ్రిటిషు ప్రభుత్వము సడలించెను. కొన్ని దేశములలో నోట్ల భద్రతకై ప్రభుత్వపు ప్రత్యేకముగు ఉత్తర్వు మాత్రమే చాలును; బంగారు వెండి నిలవలతో పనిలేదు. ఇట్టి సందర్భములో ప్రచారములో నున్న ద్రవ్యమంతయు మేలిరకపు లోహనాణెములలోగాని, లోహమిశ్రమ నాణెములతోగాని కూడియుండవలెననుట ఖర్చుతోకూడినపని. పైగా ప్రజలకు సౌకర్యకారికాదు. హెచ్చుమొత్తములను గొనిపోవలెనన్న భారమధికమై వృథావ్యయ ప్రయాసలు కల్గును. నేటి పాశ్చాత్య దేశములందు ప్రభుత్వముచే కల్పింపబడిన లోహముద్రితనాణెములు, కాగితపు ద్రవ్యము రెండింటి మొత్తముకంటె బిల్లులు చెక్కులు ప్రామిసరునోట్లు మొదలగు పరపతి సాధనముల మొత్తము అత్యధికము. దీనికిగల కారణము ఆదేశములలో బ్యాంకింగు సంస్థల అభివృద్ధి, వానియందు ప్రజలకుగల భక్తివిశ్వాసములు. బ్యాంకులు ప్రజలనుండి రొక్కపు డిపాజిట్ల ద్వారా రు. 1000 ధనమును సముపార్జించినచో వీనిపై రూ. 10,000 వరకు పరపతి ద్రవ్యమును సృష్టించుచున్నవి. లోహనాణెములకంటె, కాగితపుకరెన్సీకంటె కూడ బ్యాంకు ద్రవ్యము ప్రచారమగుటకు బ్యాంకింగు వ్యవస్థలందు ప్రజలకు గల నమ్మకమే ముఖ్యవ్యాఖ్య. చెక్కులు, బిల్లులు మొదలగు పరుల హస్తగతమైనను కరెన్సీ నోట్లవలె నష్టభయములేకుండ ఏర్పాట్లు గలవు.

దేశీయ వ్యాపార, వాణిజ్యకార్యకలాపములకు వెండి, బంగారు నాణెముల ఆవశ్యకత లేదని నిర్ధారణ చేయుచున్న సందర్భములో నేటికిని వివిధ దేశముల అంతర్గత ద్రవ్యప్రచారపు ఏర్పాట్లలో వెండి, బంగారములకు గల ప్రాముఖ్యమును గుర్తెరుగుట అత్యావశ్యకము. ఇంగ్లండులో అత్యధికవిశ్వాసయుతమగు ఏర్పాటు (Maximum Fiduciary Issue) ననుసరించి నిర్దేశితమైన ఒక హద్దును మీరినతర్వాత కాగితపు నోట్లను ఇంగ్లండుదేశపు బ్యాంకు ముద్రించినచో ఆపై మేరకు వెండి, బంగారు నిలువలు ఆవశ్యముండవలెను. కాని దేశీయావసరముల ననుసరించి ఈ హద్దు ప్రత్యేక పరిస్థితులలో సర్దుబాటు చేయబడుటేగాక, బంగారపు ప్రపంచధర పెరిగినచో ప్రత్యేక శాసనాధికారము ద్వారా కేంద్రబ్యాంకులో నిలువగా యుంచిన బంగారు విలువ పునర్నిర్ణయము ఆమోదింపబడుటచే ఇంగ్లాండుదేశపు కరెన్సీ వెండి, బంగారములందు గల మూఢభక్తిచే బంధీకృతముగాక పరిస్థితుల కనుగుణముగా అమరగలియున్నది. అమెరికా సంయుక్తరాష్ట్రములు, భారతదేశములలో అనుబంధపు నిలువపద్ధతి (Proportional Reserve System) అనుసరింపబడును. 1934 వ సంIIలో శాసనరూపము ధరించిన ఇండియా రిజర్వుబ్యాంకుచట్టము ననుసరించి రిజర్వు బ్యాంకు నోట్ల జారీ(ఇష్యూ) విభాగమునందలి వ్యాపారాస్తుల ఆస్తుల (Assets) లో ఐదింట రెండు వంతులు (2/5 వంతు లేక 40%) బంగారము, బంగారు నాణెములు, విదేశీ సెక్యూరిటీల రూపములో నుండవలెను. బంగారులోహము, బంగారు నాణెముల విలువ రూ. 40 కోట్లకు ఎన్నడును తగ్గకూడదు. 8.475 గ్రెయినుల మేలిమి బంగారము ఒక రూపాయకు సమానముగా వెల కట్టబడును. పై వివరములవలన రిజర్వు బ్యాంకు నోట్లను జారీచేయనపుడు నూటికి నూరు వరకు బంగారు నిలువలు రిజర్వుబ్యాంకు వద్దనుండుట జరుగదని తెలియును. అందువలన బంగారము నిష్కారణముగా రిజర్వుబ్యాంకు ఇనుప పెట్టెలలో పడి యుండును. నోట్ల వాడకమువలన ప్రయోజనముండదు. బంగారు సర్టిఫికేట్లుగా మాత్రమే కాగితపు కరెన్సీ ఉపకరించును. అట్లుగాక రిజర్వుబ్యాంకు చేతులలో నున్న మూసబంగారము, బంగారు నాణెములు, స్టెర్లింగు తదితర ఆమోదిత విదేశీ సెక్యూరిటీల మొత్తపు విలువకు $2\frac{1}{2}$ రెట్లు కరెన్సీనోట్లు అచ్చువేయవచ్చునను సూత్రముచే దేశపు ఆర్థిక స్థితిగతుల కనుగుణముగా ద్రవ్యరాశిని పెంచుటకు, తగ్గించుటకు కేంద్ర బ్యాంకునకు సానుకూలత కల్గుచున్నది. నోట్లముద్రణవలన రిజర్వు బ్యాంకునకు లాభమును కల్గుచున్నది. రెండవ యుద్ధకాలములో మిత్రరాజ్యముల యుద్ధకార్యక్రమములకు సహాయమునకై భారతదేశమునుండి ఇతోధిక ప్రమాణములో ఎగుమతులు చేయబడెను. ఇందువలన దేశమునకు విదేశీ వినిమయమును పెంపొందించుకొను అవకాశము కల్గెను. అందరును వినియున్న స్టెర్లింగు నిలువ లానాటివే. ఒకవంక రిజర్వుబ్యాంకు వద్దనున్న స్టెర్లింగు సెక్యూరిటీలు నానాటికి వృద్ధిచెందుచుండెను. యుద్ధకాలములో బంగారమునకు గల ఆవశ్యకత మెండు. రిజర్వుబ్యాంకు నోటుజారీ విభాగములో బంగారపు నిలువలు రూ. 40 కోట్లకు ఏనాడును తగ్గక పోయినను, యుద్ధకాలములో భారతదేశమునందు ప్రచారములో నున్న నోట్లసంఖ్య మిక్కిలిగా పెరిగెను. ఆగస్టు 1939 లో 216.78 కోట్ల నుండి మార్చి 1944 లో రు 871.78 కోట్లవరకు నోట్లసంఖ్య పెరిగెను. బ్యాంకు డిపాజిట్ల మొత్తము రూ. 249.45 కోట్ల నుండి రూ. 688.65 కోట్లవరకు వృద్ధిచెందెను. ఇట్లు ద్రవ్యప్రమాణము హెచ్చుటచే ధరలు నభోమండలమునంటజొచ్చెను. రిజర్వుబాంకు జారీ శాఖలో నున్న బంగారము అంతగా పెరుగకున్నను ఈవిధముగా, నోట్ల మొత్తము హెచ్చుటకు, తత్ఫలితముగా ధరలు పెరుగుటకు 1934 వ సంవత్సరపు రిజర్వుబ్యాంకు చట్టములో నేర్పరుపబడిన పద్ధతులే ముఖ్యహేతువు. కాగితపు కరెన్సీ వాడుకపై ప్రత్యేక నియమములున్నను, బంగారపుపునాది కొంతవరకైనను శాసనమునుబట్టి యుండవలసియున్నను ఇట్టి ద్రవ్యోల్బణ పరిస్థితి ఏర్పడెనన్నచో, ద్రవ్య విషయములలో బంగారమున కెట్టి సంబంధము లేకుండచేయుటవలన నెదుర్కొనవలసిన క్లిష్ట సమస్యలు విదితముగుచున్నవి. ఇట్లయినను ద్రవ్య విషయములను సరిచూచు అధికార సంస్థలు సమర్థతకల్గి, క్రమశిక్షణతో వ్యవహరింపగల్గినచో ద్రవ్య నియంత్రణవలన కరెన్సీయొక్క అంతర్దేశ మూల్యము దిగజారకుండ నిర్వహింపవచ్చునని సిద్ధాంతరీత్యా ఆర్థికశాస్త్రజ్ఞుల యభిప్రాయము.

ఇట్టి ఆర్థిక ప్రణాళికలద్వారా పురోవృద్ధికి జరుగు దరిమిలా ప్రయత్నములలో రిజర్వుబ్యాంకు

చట్టములో నిలువలకు సంబంధించిన ఏర్పాట్లలో ముఖ్యముగు మార్పులు 1956 వ సం॥పు రిజర్వుబ్యాంకు సవరణ చట్టము ద్వారా తేబడెను. ఇందుచే బంగారము యొక్క ప్రపంచధర పెరుగుటచే రిజర్వుబ్యాంకు బంగారు నిలువలను ముందువలె రూపాయకు 8.475 గ్రెయినులు (తులము బంగారము రూ. 21-3-10 పైలు) గాక రూపాయకు 2.88 గ్రెయినులు (తులము రూ. 62-8-0) చొప్పున మూల్యము చేయవలెనని నిర్దేశింపబడెను. ఫలితముగా రిజర్వుబ్యాంకు వద్దనున్న బంగారపు విలువ రూ. 40 కోట్లనుండి రూ. 115 కోట్ల వరకు హెచ్చెను. రిజర్వుబ్యాంకు బంగారు నిలువల కనీసపు మూల్యము కూడ రూ. 40 కోట్లు గాక రూ. 115 కోట్లుండవలెనని నిబంధన ఏర్పాటయ్యెను. రిజర్వు బ్యాంకు వద్దనున్న ప్రతి ఒక్క రూపాయ విలువగల బంగారు విదేశ వినిమయ పత్రములకు ప్రతిగా రూ. 2.5 అదనపు నోట్లు ముద్రింప వీలగునని ఎరుగుదుముగదా! రెండవ పంచవర్ష ప్రణాళికకు వలయు ధనము ఈ యుపాయమూలముగా కల్పింపబడుచున్నది. 1956 వ సం॥పు సవరణచట్టమే ఎట్టి పరిస్థితులలోనైనను రిజర్వు బ్యాంకు విదేశ వినిమయపు సెక్యూరిటీల నిలువ రూ. 300 కోట్లకు దిగజారకూడదని విధించెను. కాని ప్రణాళిక కాలపరిమితిలోనే దేశపు విదేశ వినిమయ పరిస్థితి ఆందోళనకు కారణమయ్యెను. ఇందువలన 1956 అక్టోబరు 31, లో జారీచేయబడిన అధ్యక్షుని ఆదేశప్రకటన మూలముగా రిజర్వుబ్యాంకు కాగితపు కరెన్సీకి వెనుకదన్నుగా ఉండవలసిన మొత్తము కనీసపునిలువ రూ. 200 కోట్లని, అందు రూ. 115 కోట్లు బంగారు నిలువ రూపమున నుండవలెనని నిర్దేశితమయ్యెను. ఇంతకు పూర్వము 1956 వ సం॥పు రిజర్వుబ్యాంకు సవరణ చట్టము 4 వ నియమము ననుసరించి బంగారమునకు విదేశ వినిమయపు సెక్యూరిటీలను ప్రత్యేకము కనీసపు హద్దులుండెను. ప్రస్తుత ఆదేశమువలన మొత్తము రూ. 200 కోట్ల కనీసపు నిలువలో రూ. 115 కోట్ల వరకైనను బంగారు నిలువలుండుట నియమబద్ధమగుటచే, ఆచరణయందు విదేశవినిమయపు సెక్యూరిటీల కనీసపు హద్దు రూ. 85 కోట్లని మనము భావింపవచ్చును. యుద్ధకాలమందును, ఆర్థిక ప్రణాళికల ఆధ్వర్యమునను భారత దేశ ద్రవ్యవిధానమునకు ప్రభుత్వముపై ప్రజలకుగల భక్తివిశ్వాసమే ముఖ్యాధారమనియు, బంగారు, విదేశ ద్రవ్యముల వెనుక బలము తగ్గింపవలసెననియు తెలియును. ప్రభుత్వ ద్రవ్యముతోపాటు బ్యాంకుల పరపతి సృష్టి (Credit reation) అధికమగుటచేతను, వ్యవసాయ పారిశ్రామికోత్పత్తి శీఘ్రగతిని పెరుగకుండుటచేతను దేశములో ప్రణాళికా సంవత్సరములలో ధరలు పెరిగి, ద్రవ్యోల్బణ పరిస్థితు లేర్పడియున్నవి. ద్రవ్యనాణెపు దేశీయ, వైదేశిక మూల్యములు క్షీణింపకుండ అరికట్టుబాధ్యత శాసనరీత్యా రిజర్వుబ్యాంకుపై మోపబడియున్నది. కాని ప్రభుత్వ విధానములపై ద్రవ్య సృష్టి యాధారపడియుండుటచే ప్రభుత్వ వర్గములలో కూడ పరిపాలనదక్షత, క్రమశిక్షణ ఆవశ్యకమైయున్నది. జూన్ 1952 నాటికే ప్రజల చేతిలో నున్న కరెన్సీ రూ. 1199.1 కోట్లు, మార్చి 1956 నాటికే రూ. 1505.1 కోట్ల వరకు పెరిగెను. మార్చి 1957 నాటికి రూ. 1556.5 కోట్లు. ఇట్లే ప్రజలవద్దగల బ్యాంకు డిపాజిట్లు జూన్ 1952 లో రూ. 589.4 కోట్ల నుండి మార్చి 1957 నాటికి రూ. 1556.5 కోట్ల వరకు వృద్ధిచెందెను. ఆగస్టు 1939 ప్రమాణ సంవత్సరముగా నెంచినచో (1939=100) టోకు ధరల సామాన్య సూచిక (General Index) 1951-52 లో 434.6. 1955-56 సం॥లో 360.4 వరకు తగ్గెను. కాని మార్చి 1957 నాటికి తిరిగి 421.3 వరకు హెచ్చెను. గత రెండు సంవత్సరములలో కూడ పెరుగుదల కన్పట్టెను.

దేశపు ద్రవ్యవిధానమునకు బంగారమునకు గల సన్నిహితసంబంధమును చర్చించితిమి. బంగారు ప్రమాణమును గూర్చియు, అంతర్జాతీయార్థిక సంబంధములలో ఈ లోహమునకు గల ప్రాముఖ్యమును గూర్చియు విపులీకరింపవలసియున్నది.

మంచి మేల్కొన్నది!

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

ఆది గ్రామమండలమ్ముగాం దలఁచు పల్లె; అందుఁ జిన్నజమీన్దారు నాటపట్టు;
వచ్చెనట కెంతశాంతసంబాధ కోర్చి పేదకై బిచ్చమెత్తు భావేశకమ్ము.

ఆదరాదరమున్ గని భూదానము నడుగ మనసుపుట్టిన తన్స
ర్వోదయ సమాజసభ్యులు కాదట నిట్లనిరి సూరిగుండలి మిత్రుల్.

"ఈ తేఁడు తులువతనమున నీరేడుజగాల గెల్చు; నిఁక వీని కెవి!
మైరేయమె యాహారము! వారనిజాదంబె నివి వంపై నడచున్.

మీరు కాదెవ్వరైన నీక్రూరునకుఁ దన మార్గమునఁ జనుగు నిఁకొక మనిషి కాఁడు
రిత్తగని యేల వీని దర్శించు టనఁగ తరలుఁడీ వేగ వేఱొక దారిఁ బట్టి."

కార్యకర్తలనేతలు కాళ్ళు చల్లపడియె నాసామికొంచగా నిబదుకు వినఁగ;
నాత్మబలమేది యున్న యుదాత్తచరిత విమల యొక్కర్తుకయె పట్టు విడువదాయె.

ఆయమ్మ దరహాస మలర నెయ్యుగను గని పల్కె "నన్నలు! కనుఁడు సత్యమ్ము;
బడుగు మానవులో భగవానుఁ జూడఁ దలఁచి ప్రయత్నించు సాధకులము మనము.
పరమేశ్వర ప్రేమ ప్రాప్తించు ననుక జగదీశు పుణ్యాదర్శన మబ్బుదనుక
గుడి విడి వెలికి పోగుట వడియాని? మహమాలి విస్సృహా మరగుట గనుని?
మనసునోబాయు గ్యనుము నవ్వులాట వంటిదా? యలఁతుమవంటిదా? చెప్పఁడు
తులలేని లోఁతులోఁతులఁ బాదుకొన్న మానవతానిష్ఠ మనముఁబంధ;
మీనిష్ఠ గల్గ ప్రజ నీక్షింపకున్న నీ నిష్ఠ గల్ల క్రాంతి నీక్షింపకున్న
మన కేమి ఫలము మా? మన కేమి బలము? మనజన్మమున కబ్బుమాన్యత యేమి?"

ఎంత చెప్పిన నేమి యాయింతిమాట మెచ్చలేక మిత్రులు పొలిమేర దాఁటి;
రొక్కఁ డిమయె రవి సెగల్ గ్రక్కువేళ రాజభవనమ్ము చేరె ధీరత వెలుంగ.

పంచలోఁ గూర్చున్నాఁడు ప్రభువు; గెలుపు నటునిటున్ గదలించె నాయతిపయిన్న
యదరిపడి రాయఁ "డెవరవు?" రనుచు నార్చె; "నేను మీ చెల్లెలి" నటంచు నెలఁత నుడివె.

చెల్లెలను మాట వినుటనె ఝల్లుమనెన్ రాజు వెఱ్ఱితో నవ్వాయే
నిల్లుం ద్రొక్కెనని యని మది కల్లోలముపోలెఁ గదలఁ గాటియు చెందెన్.

మంచి మేల్కొన్నది!

అంత శిశువులను జూచి యా యింతి యిచటి కెట్లు రానేర్చెఁ గారణమేమి దీని
రాకడ కటంచు గొంకి యా రామ నవ్వు హెచ్చరించుచు నీరీతి నుచ్చరించె:

"ఏను దుష్టుఁడ నారెల్ల నెఱుఁగ నన్ను నొక్కఁడును జెప్పలేదె నా యోజ నీకు
మంచివారికి నావంటి క్రూరుతోడ సేయుపని యెచ్చు నీవు రానేల యిటకు?

అకటా నీవు చక్కని సుదతివి జవ్వనపుఁ బెంపుసొంపులు నీలోఁ
గుదురుకొని యుండె నీవీ సదనము వేవేగ విడిచి చను టొప్పుఁ జుమీ!"

"అపుడు విమల పల్కె నన్నయా! నా కీ దుష్టమైనవృత్తితోఁ బనేమి?
ఒక్కమాట కొసఁగు ముత్తరమును నీకుఁ దల్లిలేదె? పుట్టిచెల్లి లేదె?

ఆతల్లికి నా చెల్లికి నీతావు స్పృశింపరాని దెట్లగు? భక్తిన్
బ్రోచిన వారలఁ గనవా? నీ తులువతనమ్ము వారి నెట్టులనె వలికెన్?

ఏను నొకస్త్రోత్త చెలియలనై నినుఁ గనుఁగొన్నదాన; నా భాగ్యమినో
బా నెఱుఁగుదువు గదా! యతఁ డీనేలకు వచ్చినట్టి యాశ్వగుఁడు గదా!

ఆతని సందేశముతో నీతలుపుం దట్టికట్టి నిద్ర దొంగిలిచిన్
నా తప్పు లున్న సైపుము నీతప్పుఁగ నే నెఱుంగనేరను రాజా!

ఏ నూరక చనుచెల్లెని గాను; మహీదానయజ్ఞకంకణ మిది నీ
పాణిం గట్టినవెన్కనె పైనము సాగింతు నొంటుపల్లి యుదెసకున్."

రాజునోట మాట రాదాయె; నతఁ డెంత నిందుఁ డైన నేమి? నేఁడు వాని
మనసు గుట్టువిప్పి మంచి మేల్కొన్నది బ్రదుకు మాఱె నతనిభవము మాఱె.

అతని పునర్జన్మమునకు జగపడి యేర్పడిన పురుటిస్నానం బన నా
తతధారలఁ గోష్ణోదక తతు లాతనుండి వెడలి తడిపెన్ నృపతిన్.

నేఁడు విమల నాదరించెను తొలిగాఁ జేయిమోడ్చి నా సుశీలముందు
రమ్మ తల్లి! కృపను రమ్మ లోపలి కని పెద్దచేసి చెలికిఁ బీట వైచె.

"నన్నుద్ధరింపఁగా శ్రీమన్నారాయణుఁడు పంపె మిము వా! నిను నేఁ
డన్నన్న! నన్నుఁ దేర్చిన పున్నెము నీపాలి" యనుచు బొగడెను సాధ్విన్.

ఊరినెల్లఁ బిలిచె నొకసభ గావించెఁ దనచరిత్రమెల్ల వినిచి క్రుంగి
సొంతనిమ్మతమున మంతుగన్నపొలంబు పెల్లుగా నొసంగెఁ బేదవాఱకు.

ఒక్కతటి దెబ్బదిని డాఁగియుండుఁగాక మానవునిహృదయమ్ములో మంచి కలదు;
పాత్రుఁగువార లర్థించునట్టునందు నుబుకు నువ్వెత్తుగా నది యొసుఁగలేక.

ఆర్యుల, ద్రావిడుల జన్మస్థలం భారతదేశమే

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

భారతీయులను ఆర్యులని, ద్రావిడులని విభజించటం పరిపాటి ఐనది. వీరుభయులు ఎక్కడనుంచో వలసవచ్చిన వారని కూడా అంటారు. ఈ సందర్భంలో ద్రావిడులనబడేవారిని గూర్చి కొంత విచారించటం అవసరము.

ఆర్యులు శతపథ బ్రాహ్మణములోను, సెమెటిక్ జాతులు బైబిలులోను ప్రళయాన్ని గురించి చెప్పినారు. ఒకానొకప్పుడు మహాప్రళయం వచ్చిందని, అప్పుడు నోవా ప్రజలను కాపాడినాడని మధ్యప్రాచ్య సంప్రదాయము. మత్స్యరూపంలో ప్రజలను కాపాడటం శతపథంలో కన్పిస్తుంది. దక్షిణదేశంలో పాలించిన పాండ్యరాజుల చిహ్నము చేప. మెసొపొటేమియా దేశపు సంప్రదాయంలో కూడా ఈ ప్రళయగాథ ఉన్నది. పైగా ఆదేశపుభాషలో వారు చెప్పిన ఈ కథలో మీన్, నీర్ అనే రెండుశబ్దాలు కూడా కన్పిస్తున్నవి. మన మీపదాలను వారినుంచి గ్రహించినామని రుజువుచేసిన భాషావేత్తలు లేరు.

మలయపర్వతము చుట్టునుఉన్న ద్రవిడదేశ భాగమే ఆ ప్రళయములో మునిగిపోకుండా నిలచినదని భాగవతము కూడా అన్నది. సుమేరియా దేశానికి నాగరకతను తెచ్చిన ఒవన్నెస్ అనువాడు ఆగ్నేయ దిశనుంచి సముద్రాన్ని ఈదుకుంటూ వచ్చినాడని ఆదేశపు సంప్రదాయము. ఆగ్నేయాన ఉన్న దక్షిణ భారతంనుంచే ఇతడు వచ్చిఉండాలి.

ఉత్తర అమెరికాలో కన్పించే ఎర్రఇండియనులు, ప్రాచీన ఈజిప్టు దేశీయులు తాము వలస వచ్చినవారమని సంప్రదాయాన్ని స్మరించారు. పుంట్ దేశమునుంచి వచ్చినవారు ఈజిప్టుదేశస్థులు. ఈ పుంట్ దేశమే పాండ్యదేశమన వీలున్నది. అదిచనల్లూర్‌లో దొరికిన మానవుని పుర్రెకు ప్రాచీన ఈజిప్టుదేశములో కన్పించిన పుర్రెకు ఎలాంటి భేదములేదని ఎలియట్ స్మిత్ నిర్ణయించినాడుకూడా. దక్షిణభారతీయుని పుర్రెకు ఆర్మీనియావాసుని పుర్రెకు భేదమేమీ లేదని థర్స్టన్ నిర్ణయము. సుమేరియాలో లభించిన శిల్పాలు, చిత్రాలు దక్షిణభారతంలో కన్పించే ఆకారాలకు సరిపోతున్నవి. క్రీట్ దేశస్థులలో ఒక తెగవారైన లైసియనులు అంత్యక్రియలైన తర్వాత, ఆ స్థలములలో తాము త్రెమ్మిలులమని వ్రాసికొనేవారు. ఈ త్రెమ్మిలి తెగవారే ట్రాయ్‌నగర వాసులైన ట్రోజనులు. త్రెమ్మిలి, ద్రమిళ, ద్రవిడ పదాలు పర్యాయపదాలు. ఈ ఆధారాలనుబట్టి దక్షిణ భారతమునుంచి మన పూర్వులే చాలా దేశాలకు వలసపోయినట్లు తెలుస్తుంది.

ట్రాయ్ గ్రీసుల యుద్ధాలలోను, క్రీట్ గ్రీసుల యుద్ధాలలోను రెండు జంతువులు కన్పిస్తున్నవి. ట్రాయ్, క్రీట్‌లకు వృషభము ముఖ్యమైన జంతువు. గ్రీకులకు ఒకానొకప్పుడు అశ్వము ప్రధానమైనది. క్రీట్‌లో వృషభము పవిత్రమైన జంతువుకూడా. మినోవా సంస్కృతిలో కన్పించే వృషభము దక్షిణ భారతంలో శివునివద్ద కన్పించే నందీశ్వరుడే అనటంలో సందేహములేదు. ఆర్య సంస్కృతిలో సహితము వృషభమే ప్రధాన జంతువుగా మారినట్లు, తర్వాతి గ్రీకు సంప్రదాయాలలోకూడా వృషభానికే పవిత్రస్థానము లభించినది.

దక్షిణ భారతానికి తెగలు తెగలుగా విదేశీయులు వలస వచ్చినారని చెప్పటానికి చాలా ప్రతిబంధకాలున్నవి. పాత రాతియుగంనుంచి నేటిదాకా అనవచ్ఛిన్నమైన జీవిత పద్ధతులు, సంప్రదాయాలు దక్షిణ భారతంలోనే కన్పిస్తున్నవి. కుమ్మరి పనులలోను, అంత్యక్రియలలోను ఈ అనవచ్ఛిన్నత బాగా గోచరిస్తుంది. దక్షిణ భారతంలో లభించిన మట్టిపాత్రలు కొన్ని ఈజిప్టు, గ్రీసులలో దొరకినవాటితో సరిగా పోలి ఉన్నవి. కొత్త రాతియుగంలోనివైన కొన్ని పాత్రలకు చాలా కాళ్లు ఉన్నవి. ఇవే ట్రాయిలో కూడా దొరికినవి. శివాలనుంచిన ప్రదేశాలలో ఒకటగు పల్లవరంలో లభించిన పాత్రలను పోలినవి బాగ్దాదులో దొరికినవి.

ఆర్యుల, ద్రావిడుల జన్మస్థలం భారతదేశమే

సంగం కాలానికి చెందిన పుఱనానూర్ అనే గ్రంథంలో పెద్ద జాడీలలోను, కుండలలోను శవాలనుంచటం పేర్కొనబడినది. ఇలాంటివి వైనాడ్, అదిచనల్లూర్‌లలో దొరికినవి. మూడు నాలుగు కాళ్లు గల కుండలలో శవాలనుంచటం ఆర్కాట్ జిల్లాలో కన్పించినది. గొడుగు ఆకారంలో రాతితో గుహలాగా నిర్మించిన శవాగారాలు కొన్ని దక్షిణ భారతంలో ఉన్నవి. తొళై అనబడిన గుంటలలో శవాలను పూడ్చటము మలబారులో ఉండేది. ఇలాంటి శవాగారాలను క్రీట్ దేశంలోకూడా థొలోయ్ అనేవారు: తొళై అంటే అరవంలో గుంట, రంధ్రము అని భావము. రాతితో గదిలాగా కట్టబడిన శవాగారాలు దక్కనులో ఉండేవి.

మణిమేకలైలో శవాలను ఐదు రకాలుగా ఉంచటం చెప్పబడినది. వీటిలో కొన్ని విధాలు చోళుల కాలందాకా ఆచారంలో ఉంటూవచ్చినవి. అందుచేత శవ విషయంలో కూడా దక్షిణభారత దేశంలో ఆచారాలు అనవచ్ఛిన్నముగా ఉంటూవచ్చినవి. విదేశాల నుంచీ ఎవరన్నా వలసవచ్చిఉంటే ఈ ఆచారాలలో మార్పులు బాగా కనిపించేవి. అలాంటివి జరగలేదు.

దక్షిణభారతంలో అక్కడక్కడ కన్పించే నీగ్రోజాతి రూపురేఖలు వ్యాపారవశమున వచ్చినవి కావచ్చును. పసిఫిక్ సముద్రపు దీవులలో కన్పించే మలనేషియాల భాషలలో దక్షిణభారతంలోని భాషల పదాలు చాలా ఉన్నవికూడా. కాని మనభాషలలో వారిపదాలు చాలా కొద్దిమాత్రమే. బలూచిస్థానులోని కాలాత్‌లో కన్పించే బ్రాహ్వీల సంప్రదాయంలో వారు అలెప్పోనుంచి వలస వచ్చినవారని ఉన్నది. ఈ అలెప్పో సిరియాప్రాంతంనుంచి వచ్చినది కాదు. సిరియాలోని అలెప్పోకూడా దక్షిణ భారతంనుంచి వచ్చినదే. రాజస్థానులో కన్పించే విల్లీ, శాంటాల్ భాషలు, యూఫ్రిటిస్ తీరంలోని ముటన్నీలోని ఖరియాభాష కూడా ద్రావిడభాష లనబడే వాటికి సన్నిహితమైనవి. మెసొపొటేమియా, ఇరాక్‌లలో ద్రావిడదేశపు స్థల నామములను పాయ్నోర్ అనే పండితుడు చూపించి వాడుకూడా. మెంఫిస్‌లో భారతీయులు వలసవచ్చి నిర్మించుకొన్న నగరమొకటి బయటపడ్డది. నీలగిరిలోనే లభించే పగడమొకటి ఇరాక్ దేశంలోని ఊర్ అనే స్థలంలో దొరికింది.

ఇనుమును కరగటం దక్షిణభారతంలోనే ప్రప్రథమంగా కనుగొన్నారని గొలాండ్ అభిప్రాయము. దీనితో అడవులనుకూడా వాసయోగ్యమైన ప్రదేశాలుగా మార్చటం ప్రారంభమైంది. దక్షిణ భారతీయులు విదేశాలకు వలసపోవటానికి ఇది నాందిగా వచ్చినదని చెప్పటం అతిశయోక్తి కాదు.

అంతర్జాతీయ వర్తకానికి కేంద్రంగా క్రీ. పూ. పదవ శతాబ్దంలో అరేబియాదేశమున నైరుతిదిక్కుగా శబఅనే నగరముండేది. ఇదే బైబిల్‌లో షెబగా మారింది. ఇలాంటివే ఒఫిర్, టైర్ నగరాలు. ఈ నగరాలతో దక్షిణ భారతానికి వాణిజ్య సంబంధాలుండేవి అందుకనే నీలగిరికి చెందిన పగడము ఇరాన్‌లో దొరికింది. ఆ ప్రాంతాలలో గాజులు, మధుకలశాలు, హోమపాత్రలు లభించినవి. ఇవన్నీ దక్షిణభారత దేశంలోనే దొరికే మట్టితో నిర్మింపబడినవే. దక్షిణ భారతంలో ఉన్న కలపతో చేయబడ్డ కట్టడాలు ఊర్, నిమ్రోద్ లలో దొరికినవి. క్రీ. పూ. నాల్గవ శతాబ్దంలోకూడా దక్షిణ భారతంనుంచి గ్రీసుకు నెమళ్లు వెళ్లేవి. బవేరు జాతకం ప్రకారము మనదేశానికి బేబిలోనుకు వర్తక సంబంధాలుండేవని స్పష్టము. సుగంధద్రవ్యాలు, ముత్యాలు మొదలైనవి దక్షిణభారతంనుంచి రోము నగరానికి పోయేవని ప్లినీకూడా చెప్పినాడు.

నావశబ్దము భారతదేశ భాషలకు చెందినది. సంస్కృతముతో సన్నిహిత సంబంధముగల ఇతరభాషలలో కూడా ఈశబ్దమే కన్పిస్తుంది. ఆంగ్లంలో 'నేవీ' ఉన్నది. సెమిటిక్‌లు ఆర్యతెగకు చెందినవారు కారు.

కాని సెమిటిక్ భాషకుచెందిన బైబిల్‌లో ప్రళయ కాలమున జీవరాశిని కాపాడినవాడు నోవాఅనిఉన్నది. ఈనోవాయే మననావ. సెమిటిక్ దేశాలలో వ్యాపించిన ప్రళయగాథ ఆర్యులతెగలదని తాత్పర్యము. ఇచ్చట ఆర్యశబ్దము భాషాపరముగా వ్యవహరించితిమేకాని జాతిపరంగాకాదు. ఆర్యజాతి అనికాని, ద్రావిడజాతి అనికాని లేనేలేవు. ఆర్యభాషలు, ద్రావిడభాషలు అని వచ్చును. ఈ సందర్భంలో భవిష్యపురాణమున (3-4) కన్పించే ఈ క్రిందిశ్లోకాలను గమనించితే కొన్ని విచిత్రసిద్ధాంతాలు రాగలవు.

ఆదమో నామ పురుషః పత్నీ హవ్యవతీ తథా 18
విష్ణుకర్దమతో జాతా మ్లేచ్ఛవంశ ప్రవర్ధనా. 18½

....

ఇంద్రియాణి దమిత్వా యో హ్యాత్మజ్ఞాన పరాయణః,
తస్మా దాదమనామాసౌ పత్నీ హవ్యవతీస్మృతా. 29

ప్రదాన నగరస్యైవ
పూర్వభాగే మహావనమ్,
ఈశ్వరేణ కృతం రమ్యం
చతుఃక్రోశాయతం స్మృతమ్. 30
కలి స్తత్రాగత స్తూర్ణం
సర్పరూపం హి తత్కృతమ్,
వంచితా తేన ధూర్తేన
విష్ణ్వాజ్ఞా భంగతాం గతా. 31
ఖాదిత్వా తత్ఫలం రమ్యం
లోకమార్గ ప్రదం పతిః, 23
సుతాః పుత్రా స్తతో జాతాః
సర్వే మ్లేచ్ఛా బభూవిరే. 33

మ్లానమైన ఇచ్ఛగలవారు మ్లేచ్ఛులైనారట. ఇంద్రియ దమనము కలవాడు కావటముచేత ఆదముడని పిలువబడ్డ పురుషునిభార్య హవ్యవతి. ఈమెను మోసగించదలచి కలిపురుషుడే సర్పరూపంలో ప్రదాన నగరం ప్రవేశించాడు. క్రైస్తవ మతం మన దేశం ప్రవేశించినతర్వాత ఈ శ్లోకాలను అల్లినా రనే మహాపండితు లుండవచ్చును. కాని వారు మహా భారతంలోఉన్న అణిమాండవ్యుని కథను, కృష్ణుని గాథలను, బౌద్ధ జాతకకథలనుకూడా ఈ సందర్భంలో గమనిస్తే సత్యము భాసించకపోదు.

ఇరాన్, మధ్యప్రాచ్యదేశాలలో మాగి అనేతెగకు చెందిన మతప్రచారకులు కన్పిస్తారు. వీరి విషయం విచారించినాకూడా భారతదేశమే ప్రాచ్య, పాశ్చాత్య దేశాలలోని మత, సాంస్కృతిక సంప్రదాయాలకు జన్మస్థానమని తేలుతుంది. మగ, మంగ అని పిలువబడే వారు శకద్వీప బ్రాహ్మణులని కూర్మపురాణము చెబుతున్నది. (48-36)

మిథునం జాయతే కాలే
సమం తచ్చ ప్రవర్ధతే,
భారుండా నామ శకునాః
తీక్ష్ణతుండా మహాబలాః.
తా న్నిహరంతీ హ మృతాన్
దరీషు ప్రక్షిపంతి చ.

అని భీష్మపర్వంలో వీరినిగురించి ఉన్నది. భారత దేశంలో మేదస్ అనే ప్రాంతమున్నదని బృహత్సంహిత. ఈ ప్రాంతీయులే మీదులని, మీడులని ప్రసిద్ధి కెక్కినారు. శాకద్వీపీయ మగబ్రాహ్మణులే ఆచార్యబ్రాహ్మణులని, గృహబ్రాహ్మణులని పిలువబడినారు. వీరికి మృచ్ఛకటికలో కన్పించే కానేలీ మాతతో సంబంధమున్నది. కానేలీ అంటే కన్నడ దేశము. కన్నడస్త్రీలకు బ్రాహ్మణులకు జన్మించిన వారు మగబ్రాహ్మణులైనారు. కన్నడంలో మగ శబ్దానికి పుత్రులని అర్థము. శకద్వీపములో గల ఏడు ప్రాంతాలలో కౌమారమొకటని మత్స్య పురాణము (122-22). ఇది టాలెమీలో కొమరోయ్ అని కన్పిస్తుంది. ఈ ప్రాంతపు మతప్రచారకులు మగలని, వీరులు మశకులని భీష్మపర్వము (11-36,37).

ఈ ఆధారాలనిబట్టి కూడా భారతదేశమే ఆర్య ద్రావిడులని వ్యవహరింబడే నేటివారి పూర్వుల జన్మస్థలమని నిర్ధారణచేయ వీలున్నది.

సువ్రతము

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

బ్రదుకుట యొక్కటే యిహపరంబుల ముఖ్యమటంచు నెంచి యె
య్యదనుననైనఁ బ్రాణము రవంతయు జాఱనిరీతి సంచరిం
చెదరొక కొంద ఱట్టిదె విశిష్టపథంబని ధర్మశాస్త్రముల్
కొదుకక చెప్పుచుండు మఱికొందఱ కియ్యది గిట్ట దిమ్మహిన్.

మానపువేసముం గొని, విభుండగు కర్ణుని దివ్యశక్తికిన్
గాసి యొనర్పఁగాఁ దివిరి కావరుఁడైన మహేంద్రుఁ డర్థియై
చేసిన ప్రార్థనంబునకు ధీయనఁ డాతఁడు దానికెట్టి సం
త్రాసము చూపఁ డా మహిత ధార్మిక తత్త్వ మహత్త్వ మెట్టిదో!

ముందుగఁ దండ్రి భాస్కరుఁడు పుత్త్రుని జేరి సురేంద్రువర్తనం
బందు స్ఫురించు మోసమది యంతయు నొక్కి వచింప దానికిం
గొందలమందఁ డా కొడుకుఁగుఱ్ఱ; తదీయ మనః ప్రవృత్తికిం
జెందిన ధర్మనిర్ణయ విశిష్టత యెట్టిదొ చూడఁగావలెన్!!

తగదు కుమార! యిట్టులు వృథా యొనరింపకు జీవితంబు మే
ల్పగ గుఱుతించి యేది శుభమున్ గలిగించునొ దానిమాత్రమే
జగమునఁ జేయఁగా వలయు; సర్వము భంగము నొందువేళ న
న్వగ సమకూర్పు త్యాగమది వ్యర్థముగాదె తలంప నేగతిన్?

చచ్చుట నిశ్చయంబని నిజంబుగఁ దెలిసినవాఁడు కీర్తియే
వచ్చిన లాభమేమి? గుణవంతుఁడు పిఁడని లోకు లెవ్వరో
నిచ్చలు మెచ్చుకొందురని నీవు తలంచియు లాఁతివానికై
ముచ్చట తీర్తువా! వెనుకముందఱ యారసి సంచరింపవా?

అని బతిమాలినన్ దనప్రయత్నము మానని! కర్ణుఁ డాతనిం
గని యిటు పల్కెఁ బైగ — జనకా! భవదీయ హితోక్తి యుక్తితిన్
వినజని యన్యథా పరిగణింపకుమయ్యా! మదీయ సువ్రతం
బును వినవయ్య! యిందుఁ బొరపొచ్చము లున్నను సైపవే ననున్.

ప్రాణము లిచ్చియైనను శుభంబగు కీర్తి మూటగట్టి య
ద్దాన మునంబు నొంగటయె ధర్మము సుమ్ము మహాత్మ! విత్త నా
ద్ధనిక వేడియుండును గదా! యిది నాదు ప్రమాణము; నీవు కే
డేసియు విఘ్నముం బొరయుచేని సహింపను లేశమేనియున్.

అనిగో కర్ణుఁడు పట్టుబట్టెను గదా! త్యాగంబు గావించుప
ట్టినఁ బ్రాణంబులు నైన మానఁ జోరనాఁడుఁగాని ముఖ్యంబులం
చును భావింపఁడు; వాని ధర్మమది యాంగ్యం గొంద అగ్రింప వ
న్నను గాంచోలు! రహస్య మేమొ, యదియే చూపెట్టఁ బోంగే

ప్రదనుడయే ప్రధాన మన రాగ జగంబునఁ గనే మాఁగెలుగ్
బ్రదుకచునుండు నెల్లరులు భక్తిని సేయుచు బెద్దగఁ; న
య్యది యొక లక్ష్యమే? యెనకైనను బ్రా మొనంగి సహ్యనా
పద గడఁగూర్చు భాగ్య మది భాగ్యను గాన నతియుంపఁ జెల్లనే!

అరయఁగ నర్వాంబుయున స్థాయు మాట యెంతి గి కా నుగ్
జగమున సత్ప్రవర్తన మొసంగఁ దేహానుకస్థమిన్నమై
పరఁగుచు సత్వమేఁగలుగు భవ్యపదంబు గడింపఁగోరి నం
బరముగ లంతిన రేకుఁ బ్రాణము లైన-మహాత్మ! యరే!

అది నన విగ్రహంబుయున యన్నముగాఁ బరిన సమంది యూ
పద యొదలంచినన్ శిబి-స్వభావము మాత్ర! శివ శాధన్
బెదరిన వాఁడు! భావ్యనిపుంజన ధర్మము జోలిమాని యు
య్యదనన సెలుల్లోన తనయాత్క అదిఱఁగఁ ద్రొక్కి చూచెనా?

నకల పురాణశాస్త్రముల సారము ప్రత్యగ సత్యమస్థదా
నికి మహిమంబు లెన్నఁగ గణింపఁగవచ్చును దానిఁ బల్కు వా
నికి నెనలేని యాపనలు నిచ్చలు వచ్చుట సత్య; మైనఁ బూ
నికి విడనంగఁ బోరు మహాస్థితులు నిత్యము పల్కు పట్టునన్.

ఒకధర్మంబును నిర్ణయించు గతి నీయుక్తి ప్రయుక్తుల్ విను
ర్వైదృష్టిన్ బెనుపొంద సత్యగను సంశోంబున్ వెలార్పంగ ను
త్పన్నంబైన జూపుట మేలు? దానికొఱకే సుమ్మీటి శాస్త్రీలు సా
ధకవర్గంబులుగా గ్రహింపవలె దత్వాంబు గుర్తించుమున్.

సాహితీ సుగతుని స్వాగతం

వాఙ్మయ ప్రపంచం అతి విస్తృతమైందన్నారు పెద్దలు. దానిలోని ప్రతిపదమూ మనకు అవసరాన్నిబట్టి గ్రాహ్యమే అవుతుంది. కాని సామాన్య మానవునికి రెండుమూడువందల పదాలతో జీవయాత్ర గడుస్తుంది. అతనికి భాషలో మార్పులు, చేర్పులు ఎలా కలిగాయన్న ప్రసక్తి లేదు. ఆ లోతుపాతులను తరచడం పండితుల, అందులోను నిఘంటుకారుల పని. కనుక వారి కర్తవ్యం ఎంతో గురుతరం. (1) దేశ్యాన్యదేశ్య పదనిర్వచనం, (2) వ్యుత్పత్తి, (3) అర్థపరిణామ వివరణం, (4) సార్థక నానార్థ నిరూపణం, (5) పర్యాయాల, రూపాంతరాల చేర్పు, (6) తెలుగు సాహిత్యంలోని సంస్కృతపదాల, సంస్కృత, ప్రాకృతభవాల విశదీకరణం, (7) వెనుకటి కోశకారులు వదలిన పదాల క్రోడీకరణం ఇంకా ఎంతటిదో కోశకరుల బాధ్యత !

ఈ దృష్టితో పరిశీలిస్తే పాశ్చాత్య భాషలలో ప్రతి ప్రాచీన కావ్యానికీ విపులమైన 'గ్లాసరీ' ఉంటుంది. మనదేశంలో తమిళ కన్నడులు మనకంటే ఎంతో మేలు. మనకు నన్నయ భారతానికే తగినపదకోశం లేదు.

నన్నయ పదకోశ నిర్మాతల బాధ్యత గురుతమమని చెప్ప నక్కరలేదు. మనకది ఆదికావ్యం. వేద నిర్విశేషంగా ప్రామాణికం. నన్నయ ప్రయోగించిన ప్రతి పదమూ ఈ కోశంలో చేరాలి. ఏపదం ఎన్నిసార్లు ప్రయుక్తమైందో వివరించాలి. వాడు, అది అనే సర్వనామాలు సహా తు. చ. తప్పక చేరాలి.

(1) ఈ కోశంలో దేశిపదాలుమాత్రమే చాలదా, సంస్కృత పదాలు ఎందుకు చేర్చాలి ?— అన్న వాదం ఉంది. సంస్కృత పదాలు మన దేశంలోని వివిధ భాషలలో విపరీతుల అర్థాలలో ఉన్నాయి. మన ఉపన్యాసం హిందీ, బెంగాలీవారికి నవల. మన అవసరం తమిళుల తొందర. మన కాదంబరి కన్నడులకు నవల. మన నిబంధం హిందీవారికి వ్యాసం. మన ప్రబంధం హిందీ వారికి ఏర్పాటు. మన నిమంత్రణం హిందీవారికి కేవలం ఆహ్వానం. నేడే కాక ఈ భేదం అనూచానంగాను ఉన్నట్టు ఉంది. నన్నయ రక్తం అనే అర్థంలో అరుణవారి (మాంసపంకారుణవారి. ఆది. 6-305) అని, యమగృహం అనే అర్థంలో అంతకక్షయము (హంసుండు నా డిభకుండు నంతకక్షయగతులైన. సభా. 1-161) అని, అనిశ్చయం అనే అర్థంలో అనేకాగ్రత (అనేకాగ్రత బొందనేల యే నుండగ. సభా 2_93) అని, కట్టుట అనడానికి రచియించు (ఇమ్మెగ విశ్వకర్మ రచియించిన. ఆది 8_71) అని ప్రయోగించాడు. ఇలాటివి ఇంతవరకు నిఘంటువులకు ఎక్కలేదు. (శ్రీ వేదము వేంకటరాయ గారు శబ్దరత్నాకరం అనుబంధంలో వీటిని చేర్చారు.) ప్రయోగవైశిష్ట్యం, అర్థభేదం ఉండడాన్నిబట్టి ప్రతిసంస్కృత పదమూ ఈ కోశంలో చేరకతప్పదు.

(2) ప్రతిపదం పద్దు (entry) లోను దానికి సంబంధించిన వివరాలన్నీ అకారాదిలో ఉండాలి. ప్రతిదానికీ ఉదాహరణం, అర్థభేదం చూపాలి. ప్రతి తిఙంతరూపమూ, సుబంతరూపమూ ఉండాలి. సాధారణ నిఘంటువులలో ఒక క్రియకు అన్ని రూపాలూ ఇవ్వరు. కాని, నన్నయ ప్రయోగాలవిషయంలో సందేహం కలుగకుండా స్పష్టతకోసం ప్రతిక్రియా రూపమూ ఇవ్వాలి. ఈ వరుస సంస్కృతలకారాల వరుసను ఉండడం ఉచితం. శబ్దపల్లవాలని మన వ్యాకర్తలు చెప్పిన అనుప్రయుక్తక్రియల అర్థభేదం వివరించాలి. ఉదాహరణకు తెంచు అనుబంధం ప్రయోగించబడిన తీరునే చూద్దాం. "వినేను లయదెంచె నర్జునుండేగి యింతకే తెంచు బూని దివ్యాస్త్రముల్ వడసి" (అరణ్య4-3), "మునిశాపదినమ్ములు పొవుదెంచె" (ఆది 4_35), "అరుగుదెంచె" (ఆది 3-40), ఎగయదెంచె, పుత్తెంచె అని నన్నయ తెంచుధాతువును విశిష్టార్థంలో అను ప్రయోగించాడు. ఇలాటి వాటి వివరణ అవసరం కదా!

(3) ఈ పదకోశనిర్మాణంద్వారా మనకు నన్నయ కాలపు, ప్రాఙ్నన్నయ కాలపు భాషా సాహిత్యాల సంపూర్ణ స్వరూపం ప్రత్యక్షం కావాలి. ఈ లక్ష్యసాధనకు ప్రతిపద వివేచనమూ అవసరం. వ్యుత్పత్తి, సజాతీయ భాషాపదాలతోను, సమకాలిక, ప్రాక్కాలిక శాసనపదాల

తోను తులనాత్మక చర్చజరపాలి. వెల్వడు, కీడ్వడు, మన్మడువంటి శ్లిష్టాక్షరమధ్య పదాలలో పూర్వపదం ఉకారాంతమా, అకారాంతమా అన్న నిర్ణయం జరుగాలి. నన్నయ కాలానికి గసడదవాదేశం నిత్యమే. (దీనికి నేటి తెలంగాణా ప్రజాసామాన్య వ్యవహారం తార్కాణం.) ఉభయరేఫలసాంకర్యం, పూర్ణార్ధబిందు సాంకర్యం కవిత్రయం చేయలేదన్నది పండితులమతం ("ఎసగు - పొసగు", వ్యాసం—యువసంవత్సర మార్గశిర భారతి, "ఆంధ్రఛ్ఛందో విశేషములు"-యువ సంవత్సరం భారతి.) కొందరు సాంకర్యం కలదంటారు. ఇలాగే పవప్రాసం—వీటినిర్ణయం కావాలి. విభక్తి ప్రత్యయాల నిర్ణయం జరగాలి. ఉదాహరణకు: నన్నయ తో తోడలను తృతీయా విభక్తి వాచకాలుగాను, కైను చతుర్థీవాచకంగాను స్పష్టంగా ప్రయోగించినట్టు కనబడదు. అతని ప్రయోగాలలో యొక్క కనిపించదు. గల అనుబంధం కనిపించదు. వీటిపై చర్చజరగాలి.

(4) నన్నయ భారతభాగంపై కన్నడ ప్రభావం-ముఖ్యంగా పంప భారతప్రభావం - ఎంతవరకుగలదో తూర్ణంగా పరిశీలించాలి.

(5) ఇంత వివేచన జరగడానికి నన్నయ భారతం పాఠాల నిర్ణయం కావాలి. ఇప్పటి ముద్రితప్రతులను 104 సంవత్సరాలక్రితం కరాలపాటి వెంకటరంగయ్యగారు సంస్కరించి ప్రకటించిన భారత ప్రతులతో పోల్చిచూస్తే తర్వాతి పండితులు తమ వ్యాకరణ దృష్టితో ఎలా తిద్దివేశారో స్పష్టమౌతుంది. ఉదా:

పోలగ ధర్మశీలుడయి
భూరి బలాధికుడైన ధారుణీ
పాలకు రక్షముస్ బడసి
భార్యను బుత్రుల నర్థయుక్తితో
నోలిన మేలుగా బడసి
యూళ్లను నున్నది యట్లుగానినా
జేల గృహస్థవృత్తి! సుఖ
మేగి వనంబున నునికి కష్టమే?

(ఆది. 6–270)

ఇది వావిళ్లవారిప్రతి పాఠం. మూడవపాదం అర్థం కుదరలేదు. రంగయ్యగారి ప్రతిలో "మేలుగా బడయు నూళ్లను నున్నది యునికి-కానినా జేల?" అనే సరైన పాఠంచూస్తేగాని అర్థం కుదరదు.

"చింతించుచున్నచో నిప్పు డెద్దియేని" (ఆది, 6–248) వావిళ్లవారి ప్రతి. "చింతించు చుండుదు ఇప్పుడె" రంగయ్యగారి ప్రతి.

"ఇంద్రుడై పరిగన నిద్ధతేజు" (ఆది, 2-83) వావిళ్ళవారి ప్రతిలో దీనికి సాంద్ర,ఇంద్ర అని పాఠాంతరాలివ్వబడ్డాయి. వ్రాత ప్రతులలో "రుంద్రతేజు" అనేపాఠం ఉంది. నన్నయ ఈసీసం ప్రతిపాదం రెండవ దళంలో ప్రాసయతి పాటించినాడు. ఇద్ధతేజుడనే పాఠంలో ఈ నియమం భగ్నమౌతుంది. సాంద్రతేజుడనే పాఠమైనా బాగుండును. చూడండి:

బ్రహ్మణ్యుడగు కశ్యపబ్రహ్మవరమున
వినతకు బుట్టిన యనఘమూర్తి
వాలఖిల్యులదయ వరపక్షి కులమున
కింద్రుడై పరగిన రుంద్రతేజు
డుదధిలో నున్న యత్యుగ్రనిషాదుల
నారంగ మింగిన ఘోరవీరు
డిభకచ్ఛపముల రోహిణశాఖతో నెత్తి
కొని దివి బఱచిన యనిలవేగి.

"ఒడలు తెల్లని తురగోత్తము వాలంబు నల్లసేసితి రేని నాకు దాని" (ఆది 2-35) ముద్రిత ప్రతి. "ఉల్ల తెల్లని" అని వ్రాత ప్రతి. ఉల్ల నిర్దేశ వాచకం.

"వంట లమరునంతకు" (అరణ్య 2-196) ముద్రిత ప్రతి. "అమయునంతకు"అని వ్రాతప్రతులు. (అమయు ప్రయోగం హరివంశంలో ప్రాసస్థానంలో ప్రయుక్తమైంది.)

నన్నయ భారతం ప్రామాణిక పాఠాలతో పరిష్కరించి ప్రకటించవలసిన అవసరం గూర్చి కీర్తిశేషులు శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు ఇప్పటికి 37 ఏళ్ళ క్రితమే రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచికలో "రాజరాజు కాలమందున్న తెలుగుభాష" అనే వ్యాసంలో ఉద్ఘాటించారు. తర్వాత 1937లో వారిశిష్యప్రధానులు డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు ఆంధ్ర భాషా చరిత్ర ద్వితీయ సంపుటంలో నన్నయ భాషనుగురించి పరిశ్రమించి పరిష్కరణ విధానం సూచిస్తూ, ఉదాహరణ ప్రాయంగా సౌపర్ణోపాఖ్యానం ప్రకటించారు. 1940 లో త్రిలింగ రజతోత్సవ సంపుటిలో డాక్టర్ సీతాపతిగారు నన్నయ్య భారత పరిష్కరణావశ్యకతను చక్కగా నిరూపించారు. మన సాహిత్య సంప్రదాయాలకు మూలమైన నన్నయ

సాహితీ సుగతుని స్వగతం

భారతభాగం వివిధ తాళపత్ర ప్రతులతో తైనారుచేసి, ప్రామాణిక పాఠాలతోను, కూలంకష వ్యాఖ్యానలతోను ప్రకటించే అవకాశం కలిగితే ఎంత బాగుండును! అప్పటికిగాని సుష్ఠువైన నన్నయ పదకోశం నిర్మించడం సాధ్యం కాదు. ఏ కవి కావ్యపదకోశ నిర్మాణానికైనా పరిష్కృతప్రతులు అవసరం.

అయితే, దీనివల్ల పదకోశ నిర్మాణంలో విలంబన జరగవచ్చుననితోస్తే, పదకోశాన్ని ఇప్పుడు ఉపలబ్ధమైన సమీచీన ముద్రితప్రతులు ఆధారంగానే సిద్ధపరచి ముద్రణావసరంలో తాళపత్ర ప్రతులతో తైనారుచేసుకోవచ్చు. ఏమైనా పాఠనిర్ణయం అత్యావశ్యకం.

తెనుగులో కావ్యపదకోశాలనదగినవి రెండే ఉన్నవి. ఒక్కటి: డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు పండితారాధ్యచరిత్ర తుదిని ఇచ్చినది. రెండు: మద్రాసు విశ్వవిద్యాలయంవారు ప్రకటించిన నన్నిచోడ కుమారసంభవం చివరఉన్నది. ఈరెండింటిలోను వాటి సంపాదకులకు ముఖ్యనుని తోచినపదాలే సంగృహీతాలు.

ఇక సంస్కృతంలో ప్రామాణికంగా ఉన్నవి మూడు: 1. మారిస్ బ్లూంఫీల్డ్ సిద్ధపరచగా, హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఓరియంటల్ సిరీస్‌వారు ప్రచురించిన "వేదిక్ కంకార్డెన్స్" (1906). ఇది వేద మంత్రాల పాదాలసూచి. కనుక మనకంతగా తోడ్పడదు. 2. శ్రీ హంసరాజ్ సిద్ధపరచిక "వేదిక్ కోశ్". ఇది బ్రాహ్మణాంతర్గత వైదికపదాలకోశం. లాహోర్‌లో 1926 లో ముద్రితం. అర్థనిర్వచనం మొదలయిన వివరాలతో ఉన్నందున మనకు కొంత తోడ్పడుతుంది. 3. "మహాభాష్య శబ్దకోశః". పూనా భండార్కార్ ఓరియంటల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్‌వారు దీనిని 1927 లో ముద్రించారు. మనదేశంలో సిద్ధపరచిన సమగ్రమైన పదకోశం ఇదే అనవచ్చు. దీని నిర్మాణపద్ధతి నన్నయ పదకోశ నిర్మాణంలో చాల తోడ్పడుతుంది. దీనిలో సామాసికమైన శబ్దాలలో ద్వంద్వఘటితమైన శబ్దాలు మాత్రమే విభజించి ఇవ్వబడినవి. తక్కిన సమాసగతపదాలు పూర్తిగా, ఉన్నవున్నట్టుగా చూపబడినవి. ఒకపదం సమాసం మొదటవస్తే దానికి మొదట"ం" గుర్తు, మధ్యనవస్తే పదానికి ఇరువైపులా ఆగుర్తు, ఆఖరునవస్తే పదం చివరన ఆగుర్తూ పెట్టబడింది. అన్ని శబ్దాలకూ ప్రాతిపదిక స్వీకరించబడింది. సర్వనామ శబ్దాలుమాత్రం సవిభక్తికంగా విభక్తిక్రమంలో సూచితమైనవి. ధాతురూపాలన్నీ ఆయాధాతువులకింద చూపబడినవి- మొదట నిరుపసర్గాలు, తర్వాత సోపసర్గాలు. ఒకపదం ఎన్నిసార్లు ప్రయుక్తమైందీ సూచితమైంది. ఇది చాల సహాయకారి కాగలదు.

పూర్వం కోశకారులకు పరిశీలన నిమిత్తం తగినన్ని ప్రతులు దొరకలేదు. ఇప్పుడు కావలసినంత ఈసాధన సామగ్రి ఉన్నది. ఇదివరకే ఈ విషయమై పలువురు పరిశోధనలు జరిపారు. ఈ కారణాలవల్ల ఇప్పుడు నన్నయపదకోశం సర్వాంగీణ సుందరంగా సిద్ధం కావచ్చు.

ఈ పదకోశాలు ఒక్క నన్నయ భారతానికే కాదు. ప్రతి ప్రాచీన కావ్యానికీ ఉండాలి. క్రీడాభిరామం చిన్న గ్రంథం. దానికే సమగ్రమైన పదసూచిక లేదు. దానిలోని పదాలు నిఘంటువుకు ఎక్కనివి ఎన్నో ఉన్నాయి. అది జాతీయాలతో నిండిన జాతిరత్నం. మరి దానివంటిదానికైనా సూచిక వద్దా?

ఇలా ప్రతి ఉత్తమరచనకూ గ్లాసరీలు సిద్ధమైనప్పుడే, పెక్కు అపూర్వశబ్దాలు మనకు తెలిసి, మహానిఘంటు నిర్మాణానికి, తద్వారా వాఙ్మయ విస్తృతికీ తోడ్పాటు కలుగగలదు.

—రామచంద్ర

కలగూరగంప

నక్కా? పంది కొక్కా?

శ్రీ జి. ఆర్. వర్మ


కడచిన డిసెంబరు భారతి సంచికలో శ్రీపాద గోపాల కృష్ణమూర్తి గారు "కాకతి శక్తి ఎవరు?" ప్రకటించారు. నా ఎల్లారమ్మ ఛాయాచిత్రం కూడా వేశారు.

"క్రీడాభిరామం" లో చముడేశ్వరీ నగరు పేరుగా చెప్పారు. ఒకే పద్యంలో 'కాకతమ్మకు సైదోడు ఏకవీర' అనటం నాకది ఒకే దేవి రూపభేదం అనిపిస్తుంది. ఏకవీర, కాకతి చరిత్ర మనకు చేరువ—పోలీ—వేరు భాషారాష్ట్రాల్లో వెదుక్కోవలసివుంటుం దనుకొంటున్నాను.


ఆదిలాబాదు జిల్లా కొవలనున్న సాంస్కృతికమైన సరిహద్దు రాష్ట్రంలో గిరిజనులుగా ముద్ర వేయబడిన వారు ఒకే అమ్మవారిని ఒకశాఖ రేణుకాదేవి అంటే, మరోశాఖ ఏకవీర అని పూజిస్తున్నారు.

"క్రీడాభిరామం" మండపాక ఎల్లారమ్మకూ గొండ వాను కొకతమ్మకు గల సంబంధం వివరించదు. కాని పొరుగు రాష్ట్రాల్లో ఎల్లరమ్మ, ఎల్లమ్మ, రేణుక, యల్లోఆయి, మనరాష్ట్రంలో అంకమ్మ మొదలగు వారి రూపాలకు చేరువే. ఒకూరి రేణుకమ్మ "క్రీడాభిరామం" వర్ణనకు సరి—ఫణిరాజమండన—గ్రీకుల మెడుసావలె సర్పకేశిని.

ఈ భూదేవి—మహామాత సంబంధాల్లో మూర్తి పోలికలు ఇండియానుండి—ఈజిప్టుదాటి—ఆసియా



సప్తమాతృకలు - ఆచంట.



సప్తమాతృకలు - దాక్షారామ భీమేశ్వరాలయం.

మైనరు అన్ని ప్రాంతాల—జగదంబపూజలు, రూపాలు ఇచట స్వీకరించలేను.


శ్రీపాదవారు ఏకవీర—కాకతమ్మల దిగువ నక్కనూహించి చాముండిగా నిర్ణయించారు. ఏకీభవించలేను. ఇతర ప్రాంతాల విగ్రహాలెలావున్నా మండపాక దొండపాడు అమ్మవార్ల రూపాల్లో చాముండ అనుకుంటే ఆ భయంకరత్వం కాన్పించదే!

చేతిలో డమరుకమున్న విగ్రహాలన్నీ శైవపరంగా చెప్పలేము. కారణం డమరుకం రాజరికాన్ని గూడా సూచిస్తుంది. ఖడ్గపాణులంతా సంహారక్రియాపరులు కాదనడానికి చీనావరకున్న బుద్ధవిగ్రహాలే సాక్ష్యం. భయంకరం గాకున్నా మగో ప్రాంతాన ఎల్లరమ్మ విగ్రహం—కండ్లలో ఏదో ప్రత్యేకత—తీక్ష్ణత వుంది.

గడ్డిరాజుల కులదైవం మూలఘూరమ్మ ఒకూరి గ్రామదేవత—గెడ్డ మూలస్థాన దైవం అనుకుంటున్నట్లే, కాకతి విషయం గావచ్చు. కాని ఆ గ్రామం బహుశా ఆంధ్రప్రదేశ్‌దై యుండదు.

'కాకతీయ కుల దుర్గాదేవి'యే కాకతమ్మ. శ్రీ—లక్ష్మి—ఆమె రూపకల్పన దుర్గగా మారిన చరిత్ర కాదనలేను. కావాలిస్తే గుప్తరాజులనుండీ చూడవచ్చును. కాకతీయుల దుర్గ రక్షణదైవం—ఆ విధంగా కాకతి దుర్గయే. అనుమకొండ గుట్టమీద పద్మాక్షి—పద్మావతి నేను శైవం అయినా జైనం అని ఏనాడో స్మరించారు. కాగా కాకతి బేతరాజు జైన మతావలంబి.

చాముండిది భయంకర రూపం. పిశితాశిని, ఖట్వాంగపాణి యని వర్ణితమైనట్లు జ్ఞాపకం. ముంజేతి ఎముకపై బోర్లించిన కపాలం—అదే ఖట్వాంగం. ఇవేవీ మండపాక, దొండపాడు అమ్మవార్ల చేతనే గాదు ఏ ప్రాంతం ఎల్లరమ్మ చేతా కన్పించదు. ఈ భయంకరరూపం శివదూతిక (శివశక్తి) చాముండిలో చూడవచ్చును. చాముండుని (పురుష) రూపం కూడా అంతే. 'హారర్' అమెరికా దినమతి సారస్వతం చదివే వారయినా చాముండీ చాముండుల విగ్రహాలను చూస్తే భయం—జుగుప్సల్లో పడతారు. చాముండుని దిగువ అస్పష్టంగా జంతువుంది. రౌతున్నాడు. మరి యిద్ద రున్నారు.



దేవీమూర్తి - గోల్కొండ మ్యూజియం.

శివదూతిక బక్కచిక్కిన శరీరం, బహుబాహు, భుజగపరివేష్టిత, కపాలమాలిని, భీమాకారం, ఖట్వాంగ ధారిణి, సృగాల వదన. ఈ 'సృగాల' సంబంధమే చాముండికి సృగాల వాహనంగా మారివుండాలి. వదనం వాహనం కావడం, వాహనం పతాకం కావడం మార్పులు కొల్లలున్నాయి. ఉదాహరణకు కార్తికేయుడు చాలు.

అయితే మండపాక-దొండపాడు అమ్మవార్లవద్ద సృగాల సంబంధం 'మైక్రాస్కోప్' తో కూడా కనిపించదు.

'ఆలీఢాసన సంస్థానా
తథా రాజా కృతుర్భుజా,
అసృక్పాత్రధరా దేవీ
ఖడ్గ శూల, ధరా తథా.'

అనే వర్ణన మండపాక దొండపాడు అమ్మవార్ల కతి సామీప్యం.

కాకతీయులకు కాకతి వలె వారి పూర్వులు చాళుక్యులకు సప్త మాతృకలు రక్షణాదైవాలు. కృష్ణా వంశధారా నదీ మధ్యప్రాంతాల్లో కొన్నిచోట్ల సప్త మాతృకల జాడాను—హైదరాబాదు మ్యూజియం లోనూ వున్నారు. అందులో నక్కలున్నట్లు తోచదు. ఈ సప్తమాతృకలే తెలంగాణా రాయలసీమల్లో ఏడుగురక్కల కథనుకుంటాను. ఇందుతో ఆచంట దాక్షారామం ఆలయాల్లో సప్తమాతృకల ఛాయా చిత్రాలు ప్రకటించాను.

దొండపాడు కాకతమ్మ, మండపాక ఎల్లారమ్మ పాదాలచెంత నున్నది నక్క అంటారు శ్రీపాదవారు. అందు కావిగ్రహం చాముండి దంటారు. శివదూతిక సృగాలవదన. చాముండి సృగాలవాహన: ఉత్కళంలో నున్న చాముండుడూ, తెలంగాణా (గోల్కొండ మ్యూజియం)లో చాముండీ వుక్కదేహులే—కాని వారివద్ద నక్కల్లేవు—ఓ భయంకర శీర్షం వుంది.

వేటూరివారు దొండపాడు కాకతమ్మ దిగువ నున్నది. వరాహం అన్నారు. కాని మరే వివరం ఇవ్వ లేదు. అది వరాహం కావచ్చని సరిపెట్టుకున్న కారణం - కాకతమ్మ ఏలాగుంటుందో నాకు తెలీదు కాని—కాకతీయులు కర్షకులుగానుండి తర్వాతరాజులైనారుగదా. చాళుక్యులకు సామంతులు—స్వతంత్రులైనారు. అన్నిటా కాకతీయులు చాళుక్యుల ననుకరించారు. చాళుక్యుల వరాహలాంఛనులు, కాకతీయులు తమ కులదైవం పాదాలచెంత చాళుక్యుల లాంఛన ముంచడంలో ఆశ్చర్యంలేదు. పోతే-అనుకరించడంలో—తెలంగాణాలో నిల్చియున్న శిథిల దేవాలయ శిల్పాలేగాదు. క్రీ. శ. 12వ శతాబ్దపు తెలంగాణా శాసనాల్లో కాకతి రుద్రదేవుడు మంత్రకూటం గుండ రాజు తల గుండుకొయించి రొమ్మున వరాహముద్ర వేయించి విడచినట్లుంది. పోతే వరాహ వ్యవసాయాల అవినాభావ సంబంధ కల్పనామూర్తులు, కథలు సహ ప్రాచ్యాలనుండి వున్నట్లు వేరు వివరిస్తాను.

శ్రీపాదవారు గోల్కొండ మ్యూజియంలోగల విగ్రహాలగూర్చి చెప్పారు. ఆ మ్యూజియంలోగల రెండు విగ్రహాల ఛాయాచిత్రా లివట ప్రకటించాము.



స్పగాలవాహన అయిన చాముండ (?) - గోల్కొండ మ్యూజియం.

ఒకటి: కుంభస్తని—అర్థం పోషకదైవం—మహామాత కావచ్చు—దిగువ శిరం. రెండు: శ్రీపాదవారు చెప్పిన స్పగాలవాహన.

ఈ గోల్కొండ చాముండి (?) దిగువ నక్కపాత్రలో నున్నదేమో (రక్తంకావచ్చు) నాకుతుంది. కాబట్టి ఈ దేవిలో భయం—మారణక్రియ ఊహించవచ్చు—లేదా పితృలోకానికి సంబంధించి నావిడ అనుకోవచ్చును. స్పగాల వరాహాలు రెండూ పవిత్రమైనవిగనే బహుపూర్వకాలంనుండీ నమ్మకాలు నడుస్తున్నాయి. ప్రకటితమైన ఛాయాచిత్రాలన్నిటా ఆయుధాలు ఆసీన భంగిమలు పోలిక జూడవచ్చును. మొదటి రెండువిగ్రహాల పాదాలవద్ద నున్న జంతువులు పందికొక్కు (ఎలుక), అడవిపందిపోలిక. గోల్కొండ మ్యూజియంలో శ్రీపాదవారు చాముండిగా గుర్తించిన విగ్రహంవద్ద నున్నది నక్క-స్పష్టంగా తెలుస్తుంది. కాబట్టి మొదటి రెంటికీ మూడవ విగ్రహానికీ సంబంధం చాలాదూరం. పాదాలచెంత మృగాలున్న విగ్రహాలు, ఎల్లారమ్మవంటి చిరువిగ్రహాలు వరంగల్లు కోట శిథిలాల్లో చాలా వున్నాయి. శతాబ్దాలనుండీ మావాళ్ళ జనాభా కోటలో ఎక్కువగా వుంది. వీరంతా ఆ విగ్రహాలను ఎల్లమ్మ అంటారు. ఇదే కోటలో స్వయంభూ శివాలయంగా చెప్పబడే గుడి ప్రాకారం గోడలో ఇరికివుందొక విగ్రహం-త్రవ్వి బైటకు తీయించ దగినది. ఇదీ ఇంతే కావచ్చును.

కేవలం సంస్కృతం, ఆర్యధర్మం ప్రామాణికమైపోయింది ప్రతీ పరిశోధనకు. కాని మన ప్రాంతాల్లో దేశీ విషయాలు కొలబద్దగా చూడవలసివుంది. కాక తమ్మ కాటకనివారిణీదేవి అయితే కావచ్చును. కాని ఏకవీరలో మంత్రాలు మాయలూ సూచితం. "క్రీడాభిరామం" ఏకవీరను 'పల్లి కదే బెలఁ గన్న తల్లి' అనడంలో దేశీయత, జక్కులవాళ్ళకన, సోది చెప్పేవాళ్ళ అమ్మవారు అనే సంగతులూ ఆలోచించాలి.

పాదాలవద్ద పౌరాణికం అనిపించని జంతువులుండడం తెలంగాణా శిల్పంలోగూడా వుంది. ఇప్పట్లో ఇదమిత్థమని చెప్పలేను. హైదరాబాదు మ్యూజియంలో ఆసిఫ్‌నగర్ పార్వతి చిత్రం చూడండి. తొండ (ఊసరవిల్లి) ఉడుముజాతి-దగ్గరపులి, సింహం, వృషభం వుంటే పార్వతి అని ప్రజాభిప్రాయం-ఈ ఆసిఫ్‌నగర్ దేవి ఎవరు?

కన్నడిగల మూషికామావాస్య - ఎలుకపూజ ఆ సంబంధంలో ఎల్లరమ్మ(రేణుక) పరిశోధించవలసివుంది. గణపతికివలె పంట సంబంధం, భూమిక సందర్భాలు ఎల్లరమ్మలో లభ్యంగావచ్చు - ఎల్లారమ్మ చాముండి కాదనీ తేలవచ్చును.

రేణుక చాముండి కాదనడానికి మరో ప్రజాభిప్రాయం, కర్ణాటక కురుబల్లోకూడా వుందొక కథ. రేణుక ఒక రాజు కూతురు. అడవిలో జమదగ్ని-ఇద్దరి పోరాటం - వారి వివాహం. ఈ రేణుక సఖిగా చెప్పబడింది చాముండి. కురుబలు (గొల్ల, యాదవ, ధన్గర్ మొ.) పురాతనజాతి - పశుపాలకులు. పాతవాహనులు కురుబలేమో అనే సందేహాలున్నాయి.



ఎల్లమ్మ-వరంగల్ కోట

శ్రీపాదవారు, పాఠకులు ఇది విమర్శగా భావించక ఆంధ్ర కర్ణాటక, మహారాష్ట్రాలు దాటిపోయిన ఏకవీర చరిత్ర అత్యవసర పరిశోధనావశ్యకత గుర్తింప గోరడమైనను.

"కాకతమ్మకు సైదోడు ఏకవీర"

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

డిసెంబరు నెల భారతిలో కాకతమ్మ అనగా యముని శక్తియైన చాముండి అని చెప్పినాను. 'కాకతమ్మ' అన్నది ఆ చాముండేశ్వరికి ఒక పేరు. వూరు వూరుకీ ఈమె పేరు మారుతూ వచ్చింది. ఈమె మృత్యువున కధిదేవత. ఏకవీర అనగా రేణుకాదేవి. విష్ణువు అవతారమైన పరశురాముని కన్నతల్లి యగుటచేత ఈమె జగదంబయైనది. పామరజనానికి ఈమె సృష్టికి అధిదేవతగానూ ఆమె నాశమునకు అధిదేవతగానూ వెలసినారు.

కాకతీయుల కాలములో కాకతమ్మ 'చతుర్భుజా, ప్రేతాసన సమాయుక్తా'గా రాజ్యమందంతటా వెలసినది. అన్నిచోట్లలోనూ కాకపోయినా కొన్నిచోట్లలో కాకతమ్మకు ఏకవీరమ్మను సైదోడుగా నిలిపినారు. రాజధానిలోనే మొగిలిచెర్లలో ఏకవీరమ్మను నిలిపినారుగాని చేరువలో కాకతమ్మను నిలిపినట్లు కానరాదు. ఓరుగల్లు కోటలో అక్కడా అక్కడా కాకతమ్మ విగ్రహాలు మాత్రము కానవస్తున్నాయి. మంథపాకలోని విగ్రహము — ఏకారమ్మ అన్న పేరుతో అర్చించబడుతూన్నట్టిది — కాకతమ్మ విగ్రహమే కాని ఏకవీరమ్మది కాదన్నాను. ఈ విగ్రహము కుడివైపు దిగువన రాతి తల—అర్చనలో ఉన్నదే — చిన్నది కలదు. ఈమే ఏకవీరమ్మ; ఏకారమ్మ! ఆకృతి పెద్దదైన కారణముచేత కాబోలు, కాకతమ్మకే ఏకారమ్మపేరు వాడుకైనది. మంథపాకలో కాకతమ్మకు సైదోడు ఏకవీర! మరివూహారములోనూ పెనుమాకలోనూ ఎట్లున్నదో? గుడిమల్లములో తల మాత్రంగానే వున్న ఏకారమ్మకు గుడి — చిన్న అమ్మవారి గుడి — కలదు. ఈ గుడికి ముప్ఫయి గజాలలో కాకతమ్మ శిలావిగ్రహము — చిహ్నము లోపించినట్టిది — కలదు. అక్కడ కూడా కాకతమ్మకు సైదోడు ఏకవీర! రాజమహేంద్రవరానికి తూర్పునగల వేమగిరి గుట్టమీద గంటాలమ్మ గుడీ, దానిపక్కన రెండు విరిగిన కాకతమ్మ శిలావిగ్రహాలూ ఉన్నాయి. ఇక్కడ ఏకవీరమ్మ రూపము లోపించిపోయి కాకతమ్మ రూపమే గుడిలో కూడా తీరినదేమో ననిపిస్తున్నది. నెల్లూరి ఇరుకాళమ్మ అసలు విగ్రహము పోగా సప్తమాతృకలలోని మాహేశ్వరిని ఆమెస్థానే నిలిపి అర్చిస్తున్నారు ఈనాడు.

నావాడ బీహారులోదికాదా?

శ్రీ ఎస్. ఎస్. మూర్తి

నిరుడు అక్టోబరు నెల సంచికలో డాక్టరు నేలటూరు వెంకటరమణయ్యగారు కృష్ణదేవరాయల గయశాసనమును గురించి వ్రాసిన అమూల్యమైన వ్యాసమునందు ఇట్లు వ్రాసియుండిరి :—

"నావాడపతి యెవ్వరైనదియు నింతవరకు తేలలేదు. ఇతనిని గుర్తించుటకు సాధ్యము కాక యున్నది. వసుచరిత్ర కారకుడైన రామరాజు భూషణుడు గూడ నావాడ పతిని పేర్కొని యున్నాడు."

ఈ సందర్భమున నీ క్రింది విషయము నిటబొందుపరచుచున్నాను. హిందూదేశపు పోస్టుఆఫీసుల గైడులో 'నావాడ' అను స్థలములు ఈ క్రింది ప్రదేశములలో నున్నట్లు వ్రాయబడి యున్నది:—

(1) "నావాడ", చంపారన్, మోతీహారి, బిహారు; (2) జౌనపురము, ఉత్తర ప్రదేశము. (3) సారన్, చాప్రా, బిహారు. (4) గయ, బిహారు. (5) "నావాడ బజారు", భాగల్పురము, బిహారు. (6) "నావాడపర్భగ" లక్కీ సరాయి, బిహారు.

మొత్తముమీద, "నావాడ" అను పేరుగల ప్రదేశము లన్నియు బిహారు రాష్ట్రములో నున్నట్లు తెలియుచున్నది. మద్రాసు రాష్ట్రమునందువలెనే, బిహారు రాష్ట్రమునందు గూడ పూర్వము జిల్లా గెజిటియర్లను ప్రకటించి యుండిరి. వాటి సాహాయ్యము వలనగాని, పాట్నా యూనివర్శిటీ చారిత్రకశాఖ వారి సాహాయ్యమునగాని పూర్వపు "నావాడ" రాజ్యవృత్తాంతమును, "నావాడపతి"ని గురించి తెలియనగునేమో!

చిరకాలమునుండి ఆంధ్రులు ఉత్తర హిందూస్థానమునుండి వచ్చిన దండయాత్రలకును దెబ్బలకు అలవాటుపడి యున్నారు. అందుచేత "దక్షిణమునుండి ఉత్తరమునకు దండు నెడలుటకు యే తెలుగు రాజైన సాహసించి యుండునా?" అని ఊహించు శక్తిగూడ మనకు నశించినది.

కాని ఈ రాచబాట కేవలము ఉత్తరమునుండి దక్షిణమునకు మాత్రమే కాదనీ, అదే రాచబాటను

దక్షిణమునుండి ఉత్తరమునకు కూడ దండయాత్రలు వెడల వచ్చుననీ పూర్వపు మహారాష్ట్రులు రుజువుచేసి యున్నారు.

లెక్కకు ఒక్క తెలుగు రాజైన అత సాహసించినాడేమో! జీర్ణకర్ణాట సామ్రాజ్య చరిత్ర యందు ఒక భాగ మింకను జీర్ణించియే యున్నదేమో!

ఉత్తర హిందూదేశమునందు లభించు ఆంధ్రదేశ చరిత్ర పరికరములకు మన చరిత్రకారుల దృష్టి ఇంకను పూర్తిగా పోయి నట్లగపడదు. కాశీ, ప్రయాగ, హరిద్వారము మొదలగు పుణ్యస్థలములందు ఇంకేమైన శాసనములు బయల్పడు నేమో! ఇవిగాక తదితర పరికరములేమైన ఇతరచోట్ల లభించునేమో!

నావాడ

శ్రీ టి. వి. రమణయ్య

నిరుడు భారతి సంచికలలో దుమారము రేపిన గయ శాసనము చర్చలలో నావాడపతి ఎవరని తేల లేదని డాక్టర్ వేంకటరమణయ్యగారు తెలిపియుండిరి. గయజిల్లాలో నవాదా (NAWADAH) అనునొక సబ్ డివిజను హెడ్ క్వార్టర్సు కలదు. రాయలకాలమున ఈనవాదా రాజును రాయలు జయించి యుండవచ్చును. అప్పటి గయ ఈ నవాదా (నావాడ) రాజ్యమున కలిసియుండెనోపు. కావున ఈ విషయముగా అనగా నవాదా పాలించిన రాజు రాయలకాలమున ఎవరైనది విజ్ఞులు పరిశీలింప ప్రార్థన.

విక్టోరియా యుగంలో కళల అభ్యున్నతి

శ్రీ జార్జ్ ఎడ్వర్డ్స్

(బర్మింగ్‌హామ్ ఆర్ట్ గ్యాలరీ అధికారి)

పంధొమ్మిదవ శతాబ్దం మొదటి 70 సంవత్సరాలలో ఇంగ్లండ్‌లో కళల సంగతి — శిల్పం తప్పితే—ఎవరూ అంతగా పరిశీలించలేరు. విక్టోరియా రాణి కాలంలో ఇంగ్లండ్‌లో అభివృద్ధి చెందిన కళలు కొన్ని సంవత్సరాలపాటు మరుగు పడినవి. ఆ తరువాతి సంవత్సరాలలో వాటిని పునరుద్ధరించాలనే ఉత్సాహం సర్వే సర్వత్రా వెల్లివిరిసింది. దైనందిన జీవితానుభూతులనూ, సన్నివేశాలనూ హుందాగా చిత్రించిన బొమ్మలు విశేషాకర్షణ పొందినవి. విక్టోరియా కాలంలోని అలంకరణలకూ, అలంకరణ వస్తువులకూ ప్రాముఖ్యం వచ్చింది.

రాఫెల్‌కి (ఇటాలియన్ చిత్రకారుడు (1483—1520) పూర్వం వచ్చిన కళాఖండాలన్నీ—ఆయా దేశకాలాలలోంచి స్వతస్సిద్ధంగా వచ్చినవేనని భావించారు. పొగడనూలేదు; నిర్లక్ష్యం చెయ్యనూలేదు. ఆ రోజులలో కళల అభివృద్ధికి పబ్లిక్ గ్యాలరీల డైరెక్టర్లు సహాయమేమీ చెయ్యలేదు. టర్నర్ వ్రాసిన చిత్రాలు తప్పితే ప్రదర్శనయోగ్యమైన చిత్రాలే లేవని భావించారు. ఈ పరిస్థితులను సరిదిద్దడానికి చాలా తోడ్పడింది లండన్‌లోని విక్టోరియా, ఆల్బర్ట్ మ్యూజియమ్‌లో ఇటీవల యేర్పాటుచేసిన తైలవర్ణచిత్రాల గ్యాలరీ, రాయల్ అకాడెమీ ఇదివరకే ఒక ప్రదర్శన యేర్పాటుచేసింది—సర్ డేవిడ్ విల్కీ బొమ్మలను ప్రదర్శించారు. సర్ ఎడ్విన్ లాండ్సీర్, సర్ జె. ఇ. మిలేస్‌ల బొమ్మల ప్రదర్శనలనుకూడా యేర్పాటు చేయిస్తానని వాగ్దానం చేసింది రాయల్ అకాడెమీ.

దురదృష్టవశాత్తు పంధొమ్మిదవ శతాబ్దం చిత్రలేఖనంగురించి వచ్చిన విమర్శలన్నీ పాక్షికంగా ఉన్నవి. ఇరవయ్యవ శతాబ్దం భావాలకు అనుగుణమైన ఒకరిద్దరు కళాకారుల కళాఖండాలను గురించే వ్యాసాలు వచ్చినవి. ఈ విమర్శకులందరికీ ఆధారం బ్లేక్. బ్లేక్ అభిప్రాయాలు నిష్పాక్షికమైనవి కావు. తమకు అభిమానపాత్రులైన కళాకారులను 19 వ శతాబ్దం జాబితాలో చేర్చడానికి వీరు నిరాకరించారు. ప్రత్యేకంగా ఒక కాలంలోని కళాకృషిని పరిశీలించగోరేవారికి యీ దృష్టి తగదు. ఆ నాటి పరిస్థితులను ఆకళింపు జేసుకుని నేటి అభిరుచులదృష్ట్యా జరగాలికదా విమర్శ.

అంతగొప్ప కళాఖండాలు కాక ఓ మాదిరి బొమ్మలలోని కళానైపుణ్యం కాలం గడచినకొద్దీ తగ్గిపోతుంది. ఇటువంటి దాగుడుమూతల కారణంగానే విక్టోరియాకాలంలో అంత ప్రశంస పొందని ఓ అజ్ఞాత కళాకారుని కళాఖండాలకు ఈనాడు దేశం జోహారులర్పించినా ఆశ్చర్యమేమీ ఉండదు. అంత మాత్రాననే ఆరోజులలో 'అతడే' మొనగాడైన కళాకారుడని

అనడం చరిత్రకు అపచారం చేయడమే అవుతుంది. శామ్యూల్ పామర్ సంగతి సరిగ్గా ఇల్లాగే ఉన్నది. అతని కవితాదృష్టి, కల్పనాశక్తి—19 వ శతాబ్దపు ఇంగ్లండ్‌లోని కళాకారులందరిలో గొప్పవాణ్ణి చేసినవి. ఇప్పుడు జరుగుతున్న రొమాంటిక్ మూవ్‌మెంట్ ఎగ్జిబిషన్‌లో శామ్యూల్ బొమ్మలు చాలా అందంగానే కనిపిస్తున్నా, ఇంగ్లండ్ చిత్రలేఖనం గొప్పతనాన్ని విశదం చేయగలవారు మాత్రం—టర్నర్, జోసఫ్‌రైట్, ఫ్రాన్సిస్ డాన్‌బీ.

లారెన్స్ రోజులనుంచి 1830 దాకా ఇంగ్లండ్‌లో కళల అభ్యున్నతిని వివరిస్తూ "ది ఆక్స్‌ఫర్డ్ హిస్టరీ ఆఫ్ ఇంగ్లీష్ ఆర్ట్" అనే గ్రంథం డాక్టర్ బోస్ వ్రాసేవరకూ "ఆర్ట్ జర్నల్" వంటివే ఆధారమైనవి. వాస్తవానికి అంతకుపూర్వం యుగంలోని గొప్ప కళాకారులంతటివారు విక్టోరియా కాలంలో వచ్చి ఉండకపోవచ్చు. అంత మాత్రాన సర్ జార్జి హేటర్, సర్ డేవిడ్ విల్కీ వ్రాసిన నిలువెత్తు చిత్రాలు తక్కువ రకమేమీ కాదు.

చారిత్రకమైన దర్పంగల చిత్రాలను హుందాగా చిత్రించే పద్ధతి 1840 నాటికి అంతరించనారంభించింది. రాయల్ అకాడెమీకి వచ్చేవారిలో ఎక్కువమంది విద్యావంతులు సాయంకాలం వేళల చరిత్ర గ్రంథాల వంటివి చదివేవారు. కనుక కళాకారులు వేసేబొమ్మలను నిశితంగా విమర్శించగలవారు.

సాహిత్యంనుంచో, చరిత్రనుంచో సన్నివేశాలను తీసుకుని వేసే బొమ్మలను రెండు తరగతులుగా చెప్పుకొనవచ్చు. కళాకారుడు గ్రంథాలు చదువగా కలిగిన ఉద్దీపనంతో వేసే బొమ్మలు ఒకరకం. ఇక రెండవ రకం బొమ్మలు కళాకారుడు తన స్టుడియోకి వచ్చేపోయే వ్యక్తులను చూచి, కొందరు కొందరు వ్యక్తుల పోలికలతో వేసే బొమ్మలు. ఈ రెండోపద్ధతివల్ల ఈ చిత్రలేఖనానికి కొంత అపచారమే జరిగింది.

వాస్తవికదృష్టి : విక్టోరియా కాలంలో, వాస్తవిక జీవిత సన్నివేశాలను వివరించే బొమ్మలు విశేషాదరణ పొందిన వనకుంటూ. ఈనాడు కూడా యీ బొమ్మలు ఆనందం కలిగిస్తవి. మనకు విక్టోరియా కాలంలోని జీవిత విధానాన్ని వివరించుతవి. ఆలోచనలు మేల్కొల్పుతవి. ఉద్రేకాన్ని మాలిమి చేసుకున్న కళాకారులు థామస్ వెబ్‌స్టర్, విలియమ్ ముల్‌రెడీ, అంతకంటే కొంచెం తక్కువ కళాకారులు కథలను చిత్రించారు. వీరి బొమ్మలలో సముద్రం, జాలరులూ ఎక్కువ.

1850 నుంచీ చిత్రకళా ప్రదర్శనలు మానేశాడు టర్నర్. అకస్మాత్తుగా 1837 లో మరణించాడు కాన్‌స్టేబుల్. అంతటి నిష్ణాతులు ఇక ఆ తరువాత తరంనుంచి తయారు కాలేదు. తరువాత వచ్చిన కళాకారులలో పై ఇద్దరినిష్ణాతుల అడుగుజాడలలో పోయిన వారిలో విలియమ్ కోలిన్స్, ఫోర్డ్‌మాడక్స్ బ్రౌన్ ప్రశంసనీయులు, పెద్ద పెద్ద తైల వర్ణచిత్రాలను తయారుచేసి చట్రాలలో బిగించడమంటే ఎక్కువ ఇష్టం విక్టోరియా యుగంలోని కళాకారులకు.

(బ్రిటిష్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ సౌజన్యంతో)

గ్రంథ విమర్శనము

పైరు పాట

[నృత్య సంగీత గేయరూపకము. రచయిత: శ్రీ బోయి భీమన్న. ప్రచురణ: సంస్కృతి సంవర్ధకసమితి, హైదరాబాదు. ప్రతులకు: ఆంధ్రా బుక్ హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాదు. (ఆం. ప్ర.). 10+101 పుటలు. వెల. రు. 1-50]

ఈమధ్య తరచుగా వస్తూన్న నృత్య సంగీతరూపకాలవంటిదే ఇదిన్నీ. కులీనుడూ అభ్యుదయభావాలు గలవాడూ అయిన శ్రీవత్స అనే చదువుకొన్న యువకుడు ఒక గడ్డిపిల్ల అచ్చుపుస్నేహానికి వశుడై ఆమెను వివాహం చేసుకోడం ఇందులో ఇతివృత్తం. నిరాటంకంగా వివాహం జరగడం యథార్థదృష్టికి కొంత అసహజంగా కనబడినా అసలు కథలోనే కవిత్వపుపాలు ఎక్కువ గనుక చదివినంతసేపూ మనసుకు సహజంగానే ఉంటుంది. పల్లెపట్టున పొలాలగట్లమీద సోయగాన్ని పుష్కలంగా గుమ్మరించారు రచయిత.

"చిరుగడ్డిపూలు నీ చిరునవ్వులేనోయి
కానిచో వాటికా కరుణ యెక్కడిది?
మానసము రంజించు మాధుర్య మెక్కడిది
ఆత్మనే కరగించు అమృత మెక్కడిది?
  దేవ ని న్నెరుగరా
  దేవతలు గూడ.
శ్రమ యెల్ల నీ క్రియా సంకల్పమేనోయి
కానిచో దాని కా కాంతి యెక్కడిది?
భూమినే పెకలించు భుజశక్తి యెక్కడిది?
ఉడు లోకములు గెల్చు ఊహ యెక్కడిది?
  ఓ దేవ నిను గనవు
  వేదాలు కూడ."

నాయకునితో ఈమాట లనిపించిన రచయిత దృష్టి ఈ కావ్యానికి చోదకశక్తి అనవచ్చు.

"పచ్చగడ్డి కొయ్యడమూ
పరిపాలన చెయ్యడమూ
దారులు వేరే గాని
దూరం ఒక్కటె శివునికి"-అనే తాత్పర్యదృష్టి,
"చిత్తంలో ప్రతి దెబ్బా
సుత్తిదెబ్బగా మలచిన
మానవమూర్తిని మించి
మహిత శిల్ప మే మున్నది" అనే అచ్చపు కవితాదృష్టి ఈ కావ్యానికి ప్రాణంపోసినవి. భీమన్నగారు సహజంగా భావించగల ఊహాశాలి. శాకుంతలం చతుర్థాంకాన్ని తలచుకొని వ్రాసిన ఇందలి ఆరవ అంకం హృదయాన్ని స్పృశిస్తుంది. కాల్పనిక కవితాధోరణికి చెందిన కావ్యమైనా కృతకత్వంలేదు. నృత్య సంగీతాలకు అమరివుండటం ఈ కోవకు చెందిన ఇతర కావ్యాలెట్లో ఇదీ అట్లే. సుకుమారపు టూహాలతో సాగయించే రచన.

తిరుప్పావు

[అనువాదకులు: శ్రీ దామెర రాజగోపాల రావు. ప్రతులకు: దామెర రాజగోపాల రావు, చిత్రాడ, (వయా) పిఠాపురం. 10+30 పుటలు. వెల రు. 3-]

తమిళంలో 'తిరుప్పావై' చాల ప్రసిద్ధము. ఇది గోదాదేవి కృతి. ఈ గోదాదేవినే 'ఆండాళ్' అనీ, శూడి కుడుత్తమ్మ (ఆముక్తమాల్యద) అనీ అంటారు. 'తిరుప్పావై' అంటే 'మంచి నోము' అని అర్థం. మార్గశిర్ష మాసంలో—ధనుర్మాస వ్రతం పూని రంగనాథుని భర్తగా కోరి పాడిన ముప్పై పాటలే 'తిరుప్పావై'. విశిష్టాద్వైతుల కుటుంబాల్లో ఈ కావ్యం సాధారణంగా స్త్రీలకూ బాలికలకూ పురుషులకూ కంఠస్థంగా ఉంటుంది. కల్యాణ సమయాల్లో వధూవరులను కూర్చోబెట్టి సదస్యులైన పురుషులే ఈ 'తిరుప్పావై' గానం చెయ్యడం ఒక సంప్రదాయం. ప్రేమలో కాని భక్తిలో గాని స్త్రీ హృదయం స్త్రీ హృదయమే. గోదాదేవి కృతమైన ఈ రచనలో

గ్రంథ విమర్శనము

భక్తి శృంగార వేదాంతపరమైన అర్థాలు పొంగులు వారినట్లే ఆమె హృదయ సౌకుమార్యంకూడా ధ్వనిస్తుంది. తమిళంలో దీనికి అనేక వ్యాఖ్యానాలున్నాయి. ఈ కావ్యాన్ని మంత్రశాస్త్రంగా పాటించే ఆచారంకూడా ఉంది.

ఈ గోదాదేవికృతి ముద్దుపళని మొదలు పలువురిచే అనూదితం. సరికొత్తగా వచ్చిన శ్రీ రాజగోపాలరావుగారి ఈ అనువాదం మధురంగా ఉంది. అనువాదాన్ని చూచినప్పుడు స్వతంత్రరచనగా భాసించడమే కష్టం. అది సాధించి కావ్యంలోని సొగసులు కూడా చూపినప్పుడు తృప్తిగా చదువుకోవచ్చు. ఈ కావ్యం చక్కని అనువాదం. ఈ క్రింది ఇరవైయేడవ పాట చూడండి :

"అల్లకూడనివారి నెల్లరను నోడించు
నల్లాగు ముద్దుకల్యాణగుణములవాడ!
గోవిందుడా! మిమ్ము కైవారములు సేసి
మీవలన నందుకొని మేము పరవాద్యంబు
లోకంబు కొనియాడు జోకఁగడు లెస్సగా
మాకు దేవరవారు సేకూర్పు బహుమతులు—
'సూడిగము, బాహుపురి, జుమికీలు, చెవ్వాకు,
పాడగం' బని చెప్పబడు పెక్కుతొడవులను
బెట్టుకొందుము మేము; విలువగల వలువలను
గట్టుకొందుము మేము; నెట్టుకొని యాపైనఁ
బాలుసన్నము మునుగులిల నేతివిగూర్చి,
పోల మోచేయివఱకోలి నెయి జాఱంగ,
నారగించెదమయ్య! హాయిగా మిముఁగూడి
క్షీరాన్నమును మేము, చిత్తములు రంజిల్ల."

గోపికల పరంగా గోదాదేవి చెప్పిన ఈకృతి పరతత్వాన్ని సాధించటానికి అందరికి అక్కరకు వచ్చేదే. రాజగోపాలరావుగారు ముందు ముందు పెరియాళ్వారు వ్రాసిన 'తిరుమాలై' భక్తి గీతాన్ని, గోదాదేవి వ్రాసిన 'నాచ్చియార్ తిరుమొళి', అనే భక్తి శృంగార కావ్యాన్నికూడా అనువదించి ఆమెత చేయించగలరని ఆశిస్తాను.

కాంతి చక్రాలు

[కాంతి చక్రాలు : ఖండ కావ్యము. కర్త శ్రీ ఉండేల మాలకొండారెడ్డి, బి. ఇ. ప్రచురణ : క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ–2. ప్రతులకు : రచయిత, 3-8-863. బరకత్ పురా, హైదరాబాద్ 16 + 104 పుటలు. వెల. రు 1-50 న.పై.]

శ్రీ ఉండేల మాలకొండారెడ్డిగారు వివేకానందాది కావ్యరచనతో ఈవరకే పాఠకులకు పరిచితులు. ఈ గ్రంథం మహాంధ్రావతరణమైనతర్వాత కాలంలో వ్రాసిన ఇరవైయారు ఖండికల సంపుటము. ఇటువంటి గ్రంథాలకు వస్తువైవిధ్యము ప్రధాన లక్షణంగా ఉంటుంది. ఆ లక్షణం ఇందులోనూ పుష్కలంగా ఉంది. సరోజినీ నాయుడు వ్రాసిన The Bangle Sellers అనే ఆంగ్ల పద్యఖండిక చాలామంది చదివే ఉంటారు. మాలకొండారెడ్డిగారి 'కాంతిచక్రాలు' అట్టిమనోహర ఖండిక. ఈ క్రింది పద్యం మచ్చు చూడండి.

'సీతమ్మ ముంజేయి చెందమ్మి మొగ్గకు
గింజలక్కముల నతికించినాడ
తరుణ విద్యార్థినీ కరశాఖికాశిఖల్
వంచి, క్రొంజిరాకు లుంచినాడ
తెరమీద చిత్రాంగి మెఱుగుఁగైతీవలు
నిమిరి పూజొంపముల్ నింపినాడ
కార్మిక సుందరి కరకార్ముకమునకు
గజ్జెలశింజిని కట్టినాడ
చిరునగవె పరిచయముగఁ జిగురుబోండ్ల
కరములు గ్రహింపఁగల కళాపరిణతుండ
కాచకంకణ విక్రయక్రయచణుండ
కాంతివలయోజ్జ్వలద్భుజార్గళయుతుండ!'

వస్త్రశిల్పి, హిమము మొదలైన కొన్ని ఖండికలు బాగున్నాయి. 'ధ్రువభల్లుకము' (Great Bear), 'లవణాధరము' వంటి క్రొత్తకూర్పులు కనబడతాయి. చూడతగిన గ్రంథం. —ఎస్. కె.

సంధ్యాగీతము

[ఖండకావ్యము కర్త: శ్రీ వజ్ఝల వెంకటేశ్వర్లు. ప్రకాశకులు: ఆంధ్రవిజ్ఞానసమితి, జమ్‌షెడ్‌పూర్. ప్రతులకు: ప్రవాసి ప్రచురణలు, ఆంధ్రవిజ్ఞానసమితి, విర్ధినివాస్—ఎమ్‌రోడ్, జమ్‌షెడ్‌పూర్. 20+78 పుటలు. వెల. రు 1—75]

సంధ్యాగీతమనే ఈ ఖండకావ్యం కచదేవయానుల ప్రణయకథ. కర్త మునుపు వెంకట కాళిదాస కవులను పేర కవిత్వము చెప్పిన జంటలో నొకరైన వజ్ఝల వెంకటేశ్వర్లు. వీరి 'అమరవీణ'కు 1954–55 లో తెలుగుభాషాసమితి బహుమతి నిచ్చిగౌరవించింది. రవీంద్ర కవీంద్రుడు వ్రాసిన 'కచదేవయాని' నాటకమాధారముగా నీ మధుర కావ్యం వ్రాయబడింది. ఈ కావ్యంలో ఈ కథ తొలి సంజమలి సంజలుగా మలచబడింది. తొలి సంజయంతయు కవిస్వతంత్రభావనయే. రవీంద్రుని రచన ఆధారముగనున్నను స్వతంత్రతా స్ఫూర్తితో భావిస్తుంది మలిసంజ. దేవకార్యమునందు కచుని భక్తి, కచునియందు దేవయానిరక్తి ఈ కావ్యంలో సంఘర్షణకు మూలములు. సొగసైన భావాలను శిల్పమార్గంలో మలచిన ఈ కావ్యంలో భావప్రపంచం హేమపుంజ సమాకృతిగా పేర్చి దర్శనమిస్తుంది. ప్రాచీనాధునాతన రచనామార్గాల నీ కవి సవ్యసాచిలాగ సాధించారు. కావ్యాదిలోని శుక్రాశ్రమవర్ణనపరమైన ఈ పద్యం చిత్తగించండి:

'ప్రథమాగతస్నేహరస మహావేశమా
　　గాలిముత్తపు కెరటాలయుబుకు
వ్రీడాసమాశ్లిష్ట దృక్స్రుత ప్రేమమా
　　మొయిలులో తొలిచుక్క ముద్దువెలుగు
చిరహృదంతర బద్ధ నిరుపమప్రణయమా
　　పరువంపు మొగ్గల విరియువలపు
విరహాతిరేక విస్ఫురితానురాగమా
　　పసిమటిరాగ సంపదలసొగసు
ప్రియతిరస్కార విదళిత హృదయశోక
రసమును, ధునీ ప్రవాహాతరంగశీక
రాశ్రుసేచన; మచటి దివసావసాన
కాలము విషాద శృంగార కావ్యమగును.'

దేవయాని సౌందర్యాన్ని వర్ణిస్తూ 'అనుభవింపని వలపులానని మధువులు' అన్న పద్యంలో కాళిదాసు, 'అత్తగుణాంగి స్నానసమయంబున సన్నని వల్వ చక్కగానొత్తిన మేన' అన్నచోట శ్రీ విశ్వనాథ సత్యనారాయణ తొంగిచూస్తున్నారు. అవశ్యం చదువవలసిన మధురమైన కావ్యం. ఇందులో కొన్ని చిన్న ఖండికలుకూడా విడిగాఉన్నవి.

శకునిరహస్యము

[కర్త: శ్రీ మామిడివజ్ఝల వేంకటకృష్ణశర్మ. ప్రతులకు. గ్రంథకర్త, సుబ్బాగెడ్డిపాళెము. వల్లూరు పోస్టు, పొన్నేరితాలూకా, చెంగల్పట్టు జిల్లా. 40 పుటలు. వెల 50 న. పై.]

దుష్టచతుష్టయంలో ఒకడైన శకుని తాను రేపు మరణింపుననగా ముందురోజు ధర్మరాజుకు లేఖ వ్రాసినట్లుగా తీర్పబడిందీకావ్యం. శకుని తాను కౌరవులతో చేరి అన్ని పాపకార్యాలు చేయించటం కౌరవులను నశింపజెయ్యవలెనన్న శ్రద్ధితోనె అని చెప్పుతాడిందులో. నూర్గురైన బాబులజూచి ఓర్వలేక సుయోధనుడు వారిని వంచించిన కారణంగా శకుని—మామయై అల్లుని మట్టుపెట్టు నుపాయ మాలోచించినాడు. కథాసంవిధానంలోను, మనస్తత్వ చిత్రణలోను శ్రద్ధగల ఈ కావ్యం ఆహ్లాదకరంగా ఉంది. శర్మగారి కవిత చక్కని ప్రాచీనఫక్కిగలది. ఉదాహరణకీ పద్యం చాలు:

"గర్వము'గల్గ'జేసి ప్రభు
　　గౌరవహీనులుగా జనావళిన్
బర్వగజేసి యా పిదప
　　బంధు విరోధము పొందజేసి—యే
పర్వునులేని నీచతకుఁ
　　బాల్పడఁజేసి, బుధాళిచిత్తముల్
విర్వగజేసి కౌరవుల
　　వేలిమిసేయ ప్రతిజ్ఞ పూనితిన్."

గ్రంథ విమర్శనము

ఆత్మవేదన

[కర్త: శ్రీ సామవేదం జానకిరామశర్మ. ప్రతులకు. గ్రంథకర్త; అశోక్‌నగర్, ఏలూరు. వెల. 50 న. పై.]

శ్రీ జానకిరామశర్మగారు ఇదివరకే కవిగా లబ్ధప్రతిష్ఠులు. ఆత్మవేదనఅన్న ఈ రచన మృత్యుంజయ శతకము. శర్మగారు అంతర్ముఖులై తమ ఆత్మవేదనను పరమేశ్వరు నుద్దేశించి వెళ్ళబోసుకొన్న ఈ శతకం చక్కని ధారాశుద్ధిగలది. మచ్చుకీపద్యం చాలు:

"ఎరుగన్నేర్తుగ శాస్త్రముల్, కళలలో
నెంతేని పాండిత్యముం
బఱగున్; యజ్ఞములాది కర్మముల లా
భం బెంతయుం గాంత్రుు; వే
ఱు దైవమ్ముల గొల్చుచుందురు; శివా!
మందాత్ములై, ఆత్మ ని
న్నెఱుగన్నేర్వక ముక్తి నొందగలరే
ఎన్నైన మృత్యుంజయా!"

కథాకదంబము

[కర్త. శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు. ప్రతులకు: గ్రంథకర్త, 44, జీరా, సికింద్రాబాదు. 140 పుటలు. వెల రు 1-50 న. పై.]

శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు జగమెఱిగిన బ్రాహ్మణులు. విద్యార్థిలోకంలో, విద్వల్లోకంలో ఆయన పేరు విననివారు లేరు. శాస్త్రిగారు అనేక గ్రంథాలు వ్రాశారు. ఆయన చేతిమీదుగా వచ్చిన ఈ కథాకదంబంలో శ్రీ రామకృష్ణ పరమహంస, శివానందులు, రామదాసస్వామి చెప్పిన చిన్న చిన్న కథలు పద్యరూపంగా మలచబడినవి. ఈకథలు సాధకుల నుద్దేశింపబడినవైనా విద్యార్థుల కుపయోగపడేంత సులభంగా ఆకర్షణీయంగా ఉన్నాయి. మొత్తం దాదాపు అరవై చిన్న కథలు. తెలుగులో చిన్న కథాకావ్యాలు — ఆంగ్లంలోని Story poems వంటివి-తక్కువగా ఉన్నలోటు శాస్త్రిగారి చేతిలోనే తీరడం ముదావహం. ఆబాలవృద్ధమూ చదువతగిన గ్రంథం.

తరంగిణి

[కర్త: శ్రీ భమిడిపాటి రామసోమయాజి. ప్రతులకు గ్రంథకర్త, వకీలు, చోడవరం, విశాఖపట్నంజిల్లా. 47 పుటలు. వెల రూ 1-25 న. పై.]

భావకవిత్వపు తొలిరోజుల్లో సముచితస్థానాన్ని ఆర్జించుకొన్న శ్రీ రామసోమయాజిగారి అలనాటి ఖండికల కూర్పు ఈ గ్రంథం. స్వరాజ్య వైజయంతి, ఆంధ్ర రాష్ట్రాభ్యుదయము అనే చివరి రెండుఖండికలు తప్ప తక్కినవి పూర్వపు రచనలే. సోమయాజిగారి రచన సుమాళమైనది. ఇతరులలో కొన వచ్చేదోషాలు ఎన్నో తప్పించుకొన్నది. ఆనాడు ప్రధానంగా పాలించిన విషయాలే ఇందులో కావ్యవస్తువులుగా కనబడతాయి. ఈయన అచ్చపు మనస్సు, రచన — మచ్చుగా ఈక్రింది చరణాల్లో చూడవచ్చు:

'చిగురాకుపైన పూసిన మల్లెనవ్వు!
నీలంపునింగి వెన్నెలసామి నవ్వు!
పాలబుగ్గల మధ్య పసిపాప నవ్వు!
ప్రియుని కౌగిటిలోని ప్రియురాలు నవ్వు!
అన్ని నవ్వులకంటె అందమౌ నవ్వు!
యెల్లతావుల నున్న దీక్షింపుదేని
ఆనవ్వు జూడ నా కాశ జన్మించె
అది చూడనిదె జన్మ వ్యర్థమనిపించె.'

చివరి ఖండికల్లోని ప్రౌఢి చూస్తే ఈయన సమగ్రకావ్యమొకటి ఎందుకు వ్రాయలేదా అనిపిస్తుంది. రామసోమయాజిగారందుకు పూనుకుంటారని ఆశిద్దాం.

పూలదండ

[ఖండకావ్యములు కర్త: భాషాభూషణ శ్రీ బూదూరు రామానుజులురెడ్డి. ప్రతులకు, గ్రంథకర్త, తిరుత్తని. 59 పుటలు వెల: 75 న. పై.]

ఇందులో రెడ్డిగారు రవ్వరవ్వకు వ్రాసిన ముప్పది రెండు ఖండకావ్యము లున్నవి. రెడ్డిగారు సుప్రసిద్ధులు, చాల కావ్యములు వ్రాసినవారు. కవిత్వముపై నెంత పక్షపాత మున్నదో దేశసేవలో నంత దీక్షగలవారు. ధారాశుద్ధిగల రెడ్డిగారి కవిత దేశసేవ కంకితంకావడం

ప్రయోజనాత్మకమైన పద్ధతి. ఇందులోని శబరి, చంద్రగిరికోట అనేఖండికలు రమణీయంగా ఉన్నాయి. 'తెలుగునాయకులు' అన్నది వేడివేడిగా వడ్డించిన రచన. ప్రార్థనలోని కవిహృదయం చూస్తే ఈ గ్రంథ స్వభావం చక్కగా తెలుస్తుంది. చూడండి :

"తల్లీ భారత భాగ్యలక్ష్మి! బహు సం
ధ్యాకాంత సంతాన మ
త్యుల్లాసంబుగ నెల్ల సంఘములు నై
క్యోద్బోధ పెంపొంది సం
పల్లాభంబున కాంగ్రసీయ విధులం
బాటించి యశ్రాంతముల్
మొల్లంబైన శుభంబులం బడయు నా
మోదంబు గూర్పంగదే."

నీతి గీతమాల

[కర్త : విద్వాన్ జి. వి. శర్మ. ప్రతులకు గ్రంథకర్త, 24 శేషాద్రిపురము, బెంగళూరు-20. 32 పుటలు వెల : 25 న.పై]

గ్రంథకర్త తామప్పుడప్పుడు ఆటవెలదుల్లో వ్రాసిన నీతిపద్యాల సంకలన మీ గ్రంథం. హిత ప్రవృత్తి అహితనివృత్తి సాధించడాని కుపకరించేదీ గ్రంథం.

"ఇంటనున్నవాటి కెల్లరు బాధ్యులే
ఇంటలేనివాటి నెవరు తేరు.
జంటబ్రతుకులోన జగడాలు మెండయ్య
అధ్యు డొక్క డింట నమరకున్న."

వంటిపద్యాలు 115 దాకా ఉన్నా యిందులో.

శ్రీ స్తుతి

[కర్త : శ్రీ కొలకల నారాయణరావు. బి. ఏ. బి. ఎల్., యఫ్. ఆర్. ఈ. ఎస్ (లండన్). దొరకు చోటు-తెలియదు. వెల : 75 న.పై.]

ఇదివరకే భజగోవిందము, కనకధారాస్తవము, లక్ష్మీనృసింహ స్తోత్రము, ఆదిత్యహృదయము - అనే స్తోత్రములను తెలుగుచేసిన శ్రీ కొలకల నారాయణ రావుగారీ గ్రంథంలో విష్ణుపురాణాంతర్గతమగు శ్రీస్తుతి నాంధ్రీకరించినారు. మూలశ్లోకము, తెలుగుపద్యము, ప్రతిపదార్థము, తాత్పర్యము క్రమంగా వ్రాయబడిన ఈ గ్రంథం. అందరూ చదువుకోవచ్చు.

విషయ

[పౌరాణిక నవల: కర్త : శ్రీ బిట్రా భావనారాయణ, ఆంధ్రోపన్యాసకులు, సర్ త్యాగరాయ కళాశాల, మద్రాసు-21 పుటలు : 140 వెల : 1-50. ప్రాప్తిస్థానం: గ్రంథకర్త.]

"విషము నిచ్చునది" అని లేఖలో ఉన్నమాటను "విషయనిచ్చునది" అని దిద్దివేసి, చంద్రహాసునకు విషయతో వివాహము జరిపించిన విచిత్ర పురాణగాథను తెలిసిన వారు పలువు రుంటారు. ఈ గాథ జైమిని భారతంలోనిది. దీనిని ధర్మవరము రామకృష్ణమాచార్యులును, శ్రీ చిలకమర్తి నరసింహంగారును నాటకంగా వ్రాశారు. వారుకూడా కొన్నిమార్పులు చేశారు.

శ్రీ భావనారాయణగారు జైమిని భారతంలోని కథను, ప్రధాన పాత్రలను గ్రహించి, కథలో ఎంతో మార్పుచేసి నవలగా అల్లారు. రచన గ్రాంథికంలో సరళంగా సాగింది. విద్యార్థులు చదువవలసిన నవల.

వ్యాస మంజూష

[రచయిత : శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ. పుటలు 115. వెల: రూ1-25 ప్రాప్తిస్థానం : లక్ష్మీనారాయణ గ్రంథమాల, 24, తాండవరాయగ్రామణి వీధి, తండియార్పేట, మదరాసు-21]

ఈ వ్యాసమంజూషలో చరిత్రపరిశోధన-కొవలి సోదరులు, బౌద్ధము - ఆంధ్రులు, సంపదలకోటారము తంజపురము, మధుర నేలిన తెలుగురాణి, నాయకరాజుల నాటి మధుర, సింహళము జయించిన తెలుగుమన్నీడు అనే ఆరు వ్యాసా లున్నాయి.

మొదటివ్యాసంలో దక్షిణాపథ చరిత్రరచనకు కావలసిన సాధన సంపత్తిని మనకు సేకరించిపోయిన కర్నల్ కాలిన్ మెకంజీవద్ద గుమస్తాలుగావుండి "మొదటి యాంధ్ర పరిశోధకులు" అని తర్వాత చరిత్రకారులతో పొగడ్తలుపొందిన కావలి సోదరులు-వెంకటబుర్రయ్య, వేంకట లక్ష్మయ్య వేంకట రామస్వామి - దినచర్యలు వ్రాయడం, శాసనాలు సేకరించడం సర్వే చేయడం వంటి పనులతో చరిత్రకు, తద్వారా వాఙ్మయానికీ చేసినసేవ వివరించబడింది. తృతీయ, చతుర్థ, పంచమవ్యాసాలలో దక్షిణంలో తెలుగునాయకరాజుల సత్పరిపాలన వివరించబడింది. ఆరవ వ్యాసంలో మధుర నాయకరాజులలో రెండవ వాడైన పెదకృష్ణప్ప

నాయకుడు సింహాళం జయించి తన బావమరది విజయ గోపాల నాయనికి అప్పటి సింహాళ రాజధాని అయిన కండీలో పట్టంకట్టిన వీరగాథ చెప్పబడింది. మధుర నాయకులే కాదు. తంజావూరు నాయకరాజులు కూడా సింహాళం జయించి మరల అక్కడివారినే రాజులుగా ప్రతిష్ఠించిన వారే. రఘునాథ నాయకునికి నేపాల రాజ్య స్థాపనాచార్య బిరుదు వుంది. నేపాళ మన గా యాప్పాణం (జాఫ్నా).

తమిళంలోను తమిళదేశ చరిత్రలోను ఎంతో కృషిచేసిన శ్రీ శర్మగారి ఈ వ్యాసమంజూష తెలుగు వారికి పెక్కు క్రొత్తవిషయాలు తెలుపగలద నే నమ్మవచ్చు.

తెలంగాణా శాసనములు

[సంపాదకులు: శ్రీ గడియారం రామకృష్ణశర్మ, ప్రకాశకులు: లక్ష్మణరాయ పరిశోధకమండలి, హైదరాబాదు. పుటలు: 1/8 క్రౌను 216. వెల: పది రూపాయలు. ప్రాప్తిస్థానం: లక్ష్మణరాయ పరిశోధక మండలి, ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనములు, తిలక్ రోడ్డు, హైదరాబాదు.]

"ఆంధ్రదేశమును గురించియు, ఆంధ్రరాజులను గురించియు, నాంధ్రవాఙ్మయమును గురించియు నెక్కుడు పరిశోధనలు చేసి, క్రొత్తవింతలను గనుగొన దలచిన వారికి హైదరాబాదు రాజ్యమందలి తెలుగుభాగ మొక బంగారపు గనివంటిది" అని సుప్రసిద్ధ పరిశోధకులు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారు అర్ధశతాబ్దం క్రితం అన్నారు. ఈ మాటలు నేటికీ యథార్థాలే. ప్రాచీన చరిత్రకు ఆధారాలైన శాసనాల పరిశోధన, ప్రకటన తెలంగాణాలో చాల వెనుకబడి ఉండేది. అప్పటి హైదరాబాద్ ప్రభుత్వం కొన్ని శాసనాలనుమాత్రమే ప్రకటించింది. అలాటి సమయంలో ప్రజల ప్రోత్సాహంతో నెలకొన్న లక్ష్మణరాయ పరిశోధకమండలి 1935 లో "తెలంగాణా శాసనములు" మొదటి సంపుటి ప్రకటించింది. ఇది రెండవ సంపుటి. వినయాదిత్యుని పల్లెపాడు శాసనం ప్రకటించి శాసన పరిశోధకులలో పెద్దపీట వేసుకొన్న శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు ఈ సంపుటికి సంపాదకులు కావడం ప్రశంసనీయం.

ఈ సంపుటిలో 85 శాసనాలు, సంస్కృతాంధ్ర కర్నాటక భాషలలోనివి ముద్రించబడ్డాయి. వీటిలో బాదామీచాళుక్య శాసనాలు-3, రాష్ట్రకూట శాసనాలు—5, కల్యాణి చాళుక్య శాసనాలు—41, కాలచుర్య శాసనాలు—2, కాకతీయ శాసనాలు-14, విజయనగరరాజ్య శాసనాలు—6, ఇతర శాసనాలు 14 ఉన్నాయి. శాసనాల తర్వాత 'శాసనముల వివరములు' అనే శీర్షికకింద శాసనమున్నస్థలం, శాసనంలోని లిపి, శాసనం వేయించినరాజు, శాసనకాలం, శాసనభాష, శాసనంలోని సారాంశం - ఈ ఐదు విషయాలూ క్లుప్తంగా చెప్పబడ్డాయి. అనుబంధంలో ఇంగ్లీషులోను ఈ అంశాలు సంగ్రహంగా తెలుపబడ్డాయి. చివర ఐదుశాసనాల ప్రతిబింబాలు (14 ప్లేట్లు) ముద్రించబడ్డాయి.

ప్రతిశాసన మొక కావ్య మన్నారు కర్నాటక కవిచరిత్రకారులు కీర్తిశేషులు ఆర్. నరసింహాచార్యులు గారు. ప్రాచీన శాసనాలలో ఈ లక్షణం పూర్తిగా ఉంటుంది. ఈ సంపుటిలోని మొదటి రెండు శాసనాలనే- విక్రమాదిత్య సత్యాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ మహారాజు (659) ఆమిదేలపాడు శాసనం, వినయాదిత్యుని (682) పల్లెపాడు శాసనం - తీసుకుందాం. "శ్రీమతాం సకలభువన సంస్తూయమాన మానవ్యసగోత్రాణాం హారితీ పుత్రాణాం సప్తలోక మాతృభిస్సప్త మాతృభి రభివర్ధితానాం కార్తికేయ పరిరక్షణ ప్రాప్త కల్యాణ పరంపరాణాం" అని మొదటి శాసనంలోను; "మతి సహాయ సాహస మాత్ర సమధిగత నిజవంశ సముచిత చితరాజ్య విభవస్య వివిధరసిత సితసమర ముఖగతరిపునరపతి విజయ సముపలబ్ధకీర్తి పతాకావభాసిత దిగంతరస్య హిమకరకర విమలకుల పరిభవనిలయ హేతు పల్లవపతి పరాజయానంతర పరిగృహీత కాంచీపురస్య...సూనుః పితురాజ్ఞయా బాలేందు శేఖరస్యేవ సేనానీ ర్దైత్యబల మతిసముద్ధతం త్రైరాజ్య పల్లవబల మవష్టభ్య సమస్తవిషయ ప్రశమనా ద్విహితతన్మనోనురంజినః అత్యంత వత్సలత్వా ద్యుధిష్ఠిరఇవ శ్రీ రామత్వాద్వాసుదేవఇవ నృపాంకుశత్వా త్పరసురామఇవ రాజాశ్రయత్వా ద్భరత ఇవ వినయాదిత్య సత్యాశ్రయ శ్రీ పృథివీ వల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర భట్టారక స్సర్వా నేవ మాజ్ఞాపయతి విదిత మస్తు వో స్మాభిః" అని రెండవ శాసనంలోను సంస్కృతశైలి ఎంత రాజసంతో పంచకల్యాణి కదం తొక్కుతూ నడుస్తుందో చెప్ప నక్కరలేదు. కనుక చారిత్రిక దృష్టితో [illegible] సాహిత్య దృష్టితోను జ్ఞానదాయకమైనవి శాసనాలు.

లక్ష్మణరాయ పరిశోధకమండలి గౌరవ కార్యదర్శి శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు పీఠికలో ఆశించినట్లు ఈ సంపుటి "దక్షిణాపథ మధ్యయుగ చరిత్ర పునర్నిర్మాణమున కాధారభూతములగు చారిత్రకోదంత సంకలితమై మహత్తర ప్రయోజనకారియై తనరారగలదని" మన మాశించవచ్చు.

శాసన ప్రతిబింబాలున్నప్పుడే శాసనాల విలువ అతిశయిస్తుంది. ఇలాటి గ్రంథాలు వ్యాపారదృష్టితో ప్రచురించబడేవి కావు గనుక శాసన ప్రతిబింబాలన్నీ ప్రకటించిఉంటే బాగుండేది. వినయాదిత్యుని పల్లెవాడు శాసనం- అపూర్వమైంది- శ్రీ రామకృష్ణ శర్మగారు రెండేండ్ల క్రితమే ప్రకటించారు. ఆ శాసన ప్రతిబింబమైనా దీనిలో చేర్చవలసింది.

దీనికి డాక్టర్ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు ఆంగ్లంలో మున్నుడి వ్రాశారు.

రా మ ప్ప

[సంగీత రూపకము. రచయిత : శ్రీ సి. నారాయణ రెడ్డి. వెల : 0-12-0. ప్రతులకు : ఆంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాదు.]

ఆంధ్రదేశంలో శిల్పసంపద కొటపట్టయిన ప్రదేశాలలో రామప్పదేవాలయం ఒకటి. ఈ దేవాలయ ముఖమండపంమీది నాగినీమూర్తి ఆధారంగా తీసుకొని శ్రీ సి. నారాయణరెడ్డిగారీ సంగీతరూపకం రచించారు.

గణపతిదేవ చక్రవర్తికాలంలో జాయప సేనానికి నృత్తరత్నావళికి లక్ష్యభూతంగా అపూర్వ శిల్ప సంపదతో రామలింగేశ్వర దేవాలయం నిర్మించాలని ఒక సత్సంకల్పం కలుగుతుంది. ఆ సేనాధిపతి చంద్రభూషణుడనే శిల్పిని ఆ దేవళం మనోహర శిల్పభంగిమలతో అలంకరించవలసినదని ఆదేశిస్తాడు. చంద్రభూషణుడు ఆ వ్యవహారం నిర్వహించే సమయంలో నాగిని అనే పాములుపట్టేవారి పడుచుతో పరిచయం కలుగుతుంది. క్రమ క్రమంగా అది వారిద్దరిమధ్య ప్రగాఢ ప్రేమగా పరిణమిస్తుంది. చంద్రభూషణుడు తన పని పాటలు ఒకమూలకునెట్టి ఆ సుందరి వ్యామోహపాశాల్లో చిక్కుకొంటాడు.

జాయపసేనాని అది గమనించి శిల్పిని హెచ్చరిస్తాడు. కాని శిల్పిధోరణి మారదు. నాగిని ప్రతిమూర్తితోనే దేవాలయ ముఖద్వారం అలంకరిస్తాడు. ప్రాణం విసిగి జాయపసేనాని శిల్పికి ఆజన్మ కారాగార శిక్ష, నాగినికి మరణదండన విధిస్తాడు. అయితే జాయపసేనానికి నందికేశ్వరుని హెచ్చరికతో దుఃఖాంతంగా మారబోతున్న రూపకం సుఖాంతంగా ముగిసిపోతుంది.

ఇది సంగీత రూపకం. ఆపైన దీనికి ఆకాశవాణి ప్రసారాని కనుగుణంగా మలుచుకొన్నారు శ్రీ నారాయణ రెడ్డిగారు. కథాశిల్పంలో అంతగా నాటకీయత లేకపోయినా ఆకాశవాణి రూపక శిల్పదృష్ట్యా పరిశీలిస్తే ఇది శ్రోతలమన్నన లందుకోగలదు.

అందుకొన్నదని రచయిత పీఠికలో తెలియజేస్తున్నారు. ఢిల్లీ కేంద్రంవారు దీనిని హిందీభాషలోకి అనువదింపజేయించారు. ఆతరువాత భారతీయభాషలన్నిటిలోకి ఇది తర్జుమా చేయించారు. మనదేశంలో అన్ని కేంద్రాలనించి ప్రసారం చేయించారు.

రచయిత ఈ చిన్నరూపకంలో అక్కడక్కడ పాటలు, పద్యాలు చేర్చారు. గేయాలలో ఇది ఎన్నదగిన రచన.

"ఈ నల్లని రాలలో
ఏ కన్నులు దాగెనో
ఈ బండలమాటున
ఏ గుండెలు మ్రోగెనో
పాపాలకు, తాపాలకు
బహుదూరములో నున్నవి
మునులవోలె కొరడవుల
మూలలందు పడియున్నవి.
కదలలేవు, మెదలలేవు
పెదవి విప్పి పలుకలేవు
ఉలియలికిడి విన్నంతనె
గల గల మని పొంగి పొరలు
పైన కఠిన మనిపించును
లోన వెన్న కనిపించును
జీవమున్న మనిషికన్న
శిలలే నయ మనిపించును."

న తి శ తి

[రచయిత : శ్రీ మంగళంపల్లి సూర్యనారాయణ. పుటలు : 44. వెల : 0-75. ప్రతులకు : రచయిత, భీమవరం కళాశాల, భీమవరం.]

గ్రంథ విమర్శనము

మల్లికార్జున పండితుడు ఏ శుభముహూర్తాన తెనుగులో శతక రచనకు శ్రీకారం చుట్టాడో కాని, వెయ్యేండ్లు గడిచినా, అది వేనవేలు పాయలుగ ప్రవహిస్తూనే వుంది. తెనుగువారు దీనిని సంస్కృతంనుంచే గ్రహించినా, తెనుగుతనం నింపి స్వంతం చేసుకున్నారు. ఒక చిత్తవృత్తిని చిత్రించడానికి శతకాన్ని మించిన సాహిత్య ప్రక్రియ లేదు. శతకంలో పెల్లుబికినంతగా ఏరసమూ పెల్లుబుకదు. మరి జాతిపిత అయిన గాంధీజీఎడ భక్తి ఈ 'నతిశతి' రూపంలో భాసించిందంటే ఆశ్చర్యమేమీ లేదు.

శ్రీ మంగళంపల్లి సూర్యనారాయణగారు 'గణ్య శాంతిదూత గాంధితాత' అనే మకుటంతో వంద పద్యాలతో గాంధీజీకి వందనం చేశారు. కేవలం భావావేశమే కాక, రచనాదృష్టితోను సహృదయులను సంతోషపెట్టే పద్యాలూ చాల ఉన్నవి దీనిలో :

"మంటినుండి నీవు మనుజుల సృష్టించి
శాంతి సహనములను సాధనముల
నిచ్చి దొరలపైకి ఏడ్తెఱ కంపితి
గణ్య శాంతిదూత గాంధితాత!"

"ఏడ నేర్చితయ్య ఈ చిత్ర సమరమ్ము?
అన్నమెల్లకుంట, పన్ను కట్ట
కుంట–ఇవియ పగఱ నోర్తు సాధనములు"

ఈ పద్యాలలో గాంధీజీ అసామాన్యత్వం చాల సరళంగా సుందరంగా వర్ణితమైంది.

"నీ ఎడంద చింది నేలపాలైన రక్త
రక్తిమంబు మాయరాని మచ్చ!
యుగయుగాల చరితనుండి పోదు గదోయి!"

ఈ ఆవేదన సబబే. 'అనయాసేన మరణం.' అన్నది సుఖాలలో ఒక్కటిగా పూర్వులు చెప్పారు. కాని అది సామాన్య మానవులకు. కారణ జన్ములు ఎప్పుడూ విపరీతంగానే మరణిస్తారేమో! కృష్ణ నిర్యాణం, బుద్ధుని అంత్యదశ, క్రీస్తుసిలువ ఇలాటివి తలచుకుంటే పైమాట నిజమనిపిస్తుంది.

ఈ శతకంలోని శైలిని, పరిపాకాన్ని బట్టి శ్రీ సూర్యనారాయణగారు ఇంకా ఉత్తమమైన రచనలు కొనసాగిస్తారని నమ్మవచ్చు.

సామరస్యం

[ఆరు రంగాల నాటిక : రచయిత : శ్రీ అంతటి నరసింహం. పుటలు : 56. వెల : 0-50. ప్రాప్తిస్థానం : భేరి సీతారాఘవమ్మ, 19/5, విప్పర్తి వారివీధి. విశాఖపట్నం.

అస్పృశ్యతా నివారణ పరమార్థంగా రచించిన ఈ నాటిక గాంధీ మతానుయాయి అయిన మంగపతి అనే భూస్వామి కుమారుడు మహేశ్వరరావుకు కులవాడి, కరణం అయిన కామేశ్వరరావు కుమార్తె కల్యాణికి, ఒక ఎం. ఎల్. ఎ. రంగారెడ్డి కుమారుడు రాజారెడ్డికి, మంగపతి పెంపుడుకూతురు, హరిజన బాలిక మహాలక్ష్మికి వివాహం చేస్తుంది. ప్రచార ధోరణిగల నాటిక గనుక కళాదృష్టి కొరవడడం సహజం.

సాహిత్యం అనూచానంగా ఉన్నత భావాలకు వాహికగా ఉండడం ఎవరూ కాదనరు. రామాయణం, అన్న భార్యను అన్న మరణించిన తర్వాత పెండ్లాడే అప్పటి దురాచారాన్ని నిర్మూలించడానికే అనుకున్నా వాచ్యంగా ప్రచారంగా ఉందా? శాకుంతలం వైదిక ధర్మ ప్రతిష్ఠాపకమే అయినా, వాచ్యంగా ఉందా? కనుక ఎంత ఉన్నతాశయమైనా కళలో పొదగనిదే ప్రజల మనస్సుల్లో పాతుకోదనడం గ్రహించిన మన ఆలంకారికులు "కాంతాసమ్మితతయోపదేశయుజే." అన్నారు.

విద్యార్థి వ్యాసమంజూష

[రచయిత : విద్వాన్ కె. సంజీవరాయశర్మ. పుటలు : 64. వెల : రు 0-85. ప్రతులకు : ఉదయ రంజని పబ్లిషర్స్, 90 శ్రీ వి. బి. కే. శర్మ, 66 స్వామిపిళ్ళవీధి, చూళై, మద్రాసు 7.]

విద్యార్థులకు వ్యాసరచనకు తోడ్పడే ఉద్దేశంతో పొదుపు విధానం, వన మహోత్సవంవంటి ముఖ్య విషయాలపై వ్యాసాలు దీనిలో పొందుపరచబడ్డాయి. విద్యార్థుల కిది చాల ప్రయోజనకరం.

మనవి మాటలు

ద్వేషం పెచ్చుపెరిగి రెండు స్కంధావారాలుగా విడిపోతున్న నేటి విశ్వమానవాళిలో తొల్లింటి స్నేహసద్భావాలు సమకూర్చే పరమసాధనాలు భాషా సాహిత్యాలు. ద్రష్టృశ్రోతృ హృదయాలను ఆకట్టి వేసి వారిని ఏ లోకాలకో తీసుకొనిపోయే విశ్వజనీనత, అతిలోకత భాషాసాహిత్యాలలో వెల్లివిరిసి ఆత్మగుణ వ్యాప్తికి అవి పరమోపకరణాలు కాగలవన్న రహస్యం గుర్తించిన మన విద్వత్కవులు, శాంతిదూతలు నేల నాలుగు చెరగులా శాంతి సందేశంతో పాటు మనభాషా సాహిత్యాల, అమరకళల ముద్రవేశారు.

అట్లని వారు ఇతర సంప్రదాయాలను స్వీకరించి సొంతం చేసుకోకపోలేదు. ఆదాన ప్రదానాల కిటుకెరిగిన సహృదయులువారు. ప్రాగైతిహాసిక కాలం నుంచి ఇతర దేశాల సంప్రదాయాలను గ్రహించి, మన పద్ధతులతో మేళవించి దేశమంతటా నూతనరీతులకు దారి తీసినారు. కొన్నిచోట్ల ఎంతో ఇచ్చి కొంత పుచ్చుకున్నారు; మరికొన్నిచోట్ల కొంత యిచ్చి ఎంతో పుచ్చుకున్నారు.

కొన్ని సహస్రాబ్దాలుగా విదేశాలతో కలిగిన సాన్నిహిత్యంతో యవనశక సంప్రదాయాలు మొదలు నేటి పెక్కు పాశ్చాత్య "ఇజంల" వరకు మన సాహిత్యంలో పీటలు వేసుకున్నాయి. ఈ విధంగా కళా సాహిత్య రంగాలలో ఆదాన ప్రదానాలు, వినిమయ వినియోగాలు అనాదిగా సాగివస్తున్న సంప్రదాయం.

కాని, స్వాతంత్ర్యానంతరం ఈ సంప్రదాయానికి విరుద్ధంగా పర భాషా సాహిత్యాలపై పగ సెగలు వారుతుండడం విచారకరం. గుజరాత్ విశ్వ విద్యాలయం ఇంగ్లీషుకు ఉద్వాసన చెప్పాలని ఇటీవల నిర్ణయించింది. మద్రాసు విశ్వ విద్యాలయంలో ఇంగ్లీషును తొలగించి, తత్స్థానే తమిళును నెలకొల్పడానికి ఒత్తిడి చేయాలని తమిళ్ వళర్చి సంగం తీర్మానించింది. మదురలో ఒక కళాశాలలో తమిళ్ లోనే అన్ని విషయాల అధ్యయనాధ్యాపనాలు ప్రారంభమయాయి. ఉత్తరభారతంలోను మరొకచోట ఇల్లె ఆంగ్లాన్ని హిందీ తోసి రాజన్నది. ఇదంతా 1960 తర్వాతకూడా ఇంగ్లీషుకు అధికారభాషా గౌరవాన్ని ఇచ్చిన భారత ప్రభుత్వం దూరాలోచనను గుర్తించలేనితనం.

విజ్ఞాన శాస్త్రం వేయిరేకులుగా విడుగుతున్న నేడు ప్రపంచలో ఏమారుమూలమానిసులూ ఇంగ్లీషును కాదనరు. "ఇది విజ్ఞానశాస్త్రభాషా" అన్నంతగా ఇంగ్లీషు అభివృద్ధిపొందింది. అంతర్జాతీయ సభలలో మొదటిభాషగా ఇంగ్లీషును సోవియట్ యూనియన్ కూడా గుర్తించింది. ఇంగ్లీషును వలదనేవారు అనువాదాలతో సంపాదించుకొనే జ్ఞానం "సెకెండ్ హాండ్ జ్ఞానం"వంటిదని రాజాజీచేసిన హెచ్చరికను మరువరాదు. భాషా రాష్ట్రోద్యమం ప్రారంభంలోనే గాంధీజీ "ఆధునికి జ్ఞానోపార్జనకు, నవీన సాహిత్యాన్వయనానికి, ప్రపంచ విజ్ఞానావబోధకు ఇంగ్లీషుభాషా పరిచయం అవసరం. నేటి పరిస్థితినిబట్టి మనకు ఇష్టమున్నా, లేకపోయినా, ఇంగ్లీషు నేర్వకతప్పదు. ఇంగ్లీషు అంతర్జాతీయభాష." అని చెప్పిన హితవును మన్నించడం అభ్యుదయకాముకులకు తగవు.

నేడు చదువరులంటే పలుభాషల నెరనెరిగి, విజ్ఞానం విస్తరింప జేసుకొన్నవారే. అలాంటప్పుడు కొన్నిభావాలపై మనకు నెగటుదనం ఉండవచ్చునేమో కాని, భాషలపైకాదు; దోషాలపైనే కాని, మనిషిపై ద్వేషం లేనట్టు.

ముఖ్యంగా మనలక్ష్యం నవసమాజ నిర్మాణం; వసుధైక కుటుంబస్థాపన. రాజకీయంగా ఇది ఎప్పుడు సాధ్యమైనా, కళాసాహిత్య రంగాలలో దీనిని సాధించడం సులభం.

కళాసాహిత్యాలు దేశకాలదోషం పట్టని కమనీయ పదార్థాలు. ప్రపంచంలో అవి ఏమూల ఆవిర్భవించినా మనకు ఉష ఉదయమే.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.